
17, 19

ఆగస్టు'64 - 60 పై

08-1964




అతి త్వరలో ఆంధ్రదేశమంతటా
విడుదల!!!
శ్రీ సాహితి ఫిలిమ్స్
నవరత్న ఖడ్గ రహస్యం
దర్శకత్వం: G విశ్వనాథం
SUVARNA
ఇంటర్నేషనల్ రిలీజ్...

దీపావళి కథ

అది 1963 వ సంవత్సరం. ఆనాడు దీపావళి. పిల్లలు, పెద్దలు అంతా పొద్దున్నే లేచి తలంటిపోసుకున్నారు. వరహాలు కూడా తలంటిపోసుకుని, తలార బెట్టుకుని, వదులొదులుగా జడేసుకుని, ఒక్కటంటే ఒక్క చామంతిపువ్వు తురుముకుంది. వాళ్ళ నాన్నగారు పెట్టిన టెరిలిన్ చీర కట్టుకుంది. తియ్యటి కలలోంచి కలలోకి నడుస్తున్నట్టు హాల్లోంచి వరండాలోకీ, వరండాలోంచి మేడమీదికి నడుస్తోంది, ఎక్కుతోంది, దిగుతోంది. ఏదన్నా స్తంభం కనబడితే దాన్నానుకుని, సినీ హీరోయిన్‌లా, "నిరీక్షణ" అనే రైటప్‌కి వేసిన బొమ్మలా పోజుపెట్టి చూస్తోంది.

ఇంతలో సుబ్బారావు తానేవచ్చాడు రిక్షాదిగి. మామగారు ఎదురేగి సూటుకేసందుకున్నారు. అత్తగారు కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిచ్చింది. బావమరదులు, మరదళ్లు టపాకాయల రణగొణలతో చుట్టుముట్టేశారు.

అంతా సద్దుమణిగాక వరహాలు తీసుకొచ్చిన కాఫీ ఫలహారం సేవిస్తూ సుబ్బారావు "అచ్చు టెర్లిన్ మన్రోలా వున్నా"వన్నాడు.

"జోకు దోకులావుందిగాని నాకేం తెచ్చారు బెజవాడనించి ?" అని అడిగింది వరహాలు.

"చెప్పుకో."

"అగరొత్తుల వాసనేస్తోంది."

"అలాంటిదే."

"చెబుదురూ చంపక"

సుబ్బారావు పెట్టెతీశాడు. గదంతా గుప్పుమంది "జ్యోతి"ని వరహాలు కిచ్చాడు.

"సరె. ఇదేనా మీరు తెచ్చింది ? ఎప్పుడో చదివేశా," అని వరహాలు మూతి మూడు వంకర్లు తిప్పింది.

(మిగతా 6 వ పేజీలో)

తొలిమాట

పన్నెండు నెలలుగా "జ్యోతి"లో ధారావాహికంగా వెలువడి పాఠకలోకాన్ని రసప్లుతం చేసిన "స్వరలహరి" ఈ సంచికతో ఆగిపోతున్నది. పన్నెండుగురు ప్రముఖ సంగీత దర్శకుల ప్రతిభా విశేషాలను పరిచయంచేసిన ఈకొత్తరకం శీర్షికను కొత్తపక్కిలో నిర్వహించిన పి. బి. శ్రీనివాస్ – ఆయన శైలినే అనుకరిస్తూ చెప్పాలంటే – గానసముద్రుడు, నిత్యమందహాససముద్రుడు, మధురగాత్రుడు, స్నేహపాత్రుడు. సినీ గంధర్వలోకంలో 'బిజీబీ'. ఎప్పుడూ ఏవో పనిపాటలతో ఉక్కిరిబిక్కిరవుతున్నా "జ్యోతి"పై అనురాగాతిశయం కొద్దీ, తీరికచేసుకుని ఆ యా సంగీత దర్శకులను కలుసుకొని, ఇంటర్వ్యూలుచేసి, ఎన్నో విశేషాలు సేకరించి ఆ శీర్షికను నడిపారు. ఇందుకు వారికి "జ్యోతి" కృతజ్ఞత తెలుపుతోంది.

• • •

కృతజ్ఞత అనేమాట రానేవచ్చింది కనుక – దాన్ని పలికే పద్ధతిపై – అదేకాదు, ఇంకా ఎన్నో మాటల "ఉచ్చారణ" విధానంపై కవిత్రయం రచించిన వ్యాసం (66 వ పేజీ) చదవండి.

• • •

ఈసారి చిత్రరథుని చైత్ర యాత్రా విశేషాలలో అగ్రనటుడు అక్కినేని నాగేశ్వరరావు అమెరికన్ యాత్రా విశేషాలు చూడవచ్చు (106 వ పేజీ)

జ్యోతి
సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 పైసలు — ఏడాది చందా : ఏడు రూపాయలే
సంపుటి 2 ఆగస్టు 1964 సంచిక 8


పాఠక మహాశయా! ఈ నెల

ఇదో వరస....

ఉత్తరాయణం ... 7
రాజకీయ వార్తావరణం ... 10
నీ పద్ధతి మార్చుకో – భమిడిపాటి రామగోపాలం ... 17
సెక్రటరీ – యద్దనపూడి సులోచనారాణి ... 31
ఛలోకోక్తులు ... 55
ఉచ్చారణ – ముళ్ళపూడి వెంకటరమణ, కొడవటిగంటి కుటుంబరావు, రావి కొండలరావు ... 56
నీవన్నది నిజం – శ్రీ సుభా ... 64
పఠాభి పన్‌చాంగము ... 76
బ్రతుకుబాటలో – అరవింద ... 78
కథాసంగ్రహమ్ – స్వామి చిత్రానంద ... 89
ఉత్తరాయణం – పి. రామగోపాల్ ... 94
స్వరలహరి – పి. బి. శ్రీనివాస్ ... 97
చైత్రయాత్ర ... 106

ముఖచిత్రం : డి. బి. ఎన్. వారి "దాగుడుమూతలు" నుంచి.

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2



(2 వ పేజీ తరువాయి)

సుబ్బారావు చిన్నబుచ్చుకున్నాడు.... కుంటే కున్నాడుగాని, పండక్కి అత్తారింటి కెడుతూ భార్యారత్నాని కివ్వడానికి ''జ్యోతి'' దీపావళి సంచికకంటె "మంచిదేమీ దొరకని" సుబ్బారావును, ఆది ఇదివరకే చదివేసిన వరహాలును అభినందించకుండా వుండలేక పోతున్నాం,

మళ్ళీ దీపావళి, దానితోపాటు ''జ్యోతి'' ప్రత్యేక సంచిక మరింత శోభాయమానంగా, వరహాలు మూతి ముడిచినప్పటి అంత అందంగా వచ్చేస్తున్నాయి. ఈసారైనా సుబ్బారావు ముందే జాగ్రత్త పడి దీపావళి సంచిక వచ్చీరాగానే కొనేసి వరహాలుకు బహూకరిస్తాడని ఆశిస్తున్నాము,

మరి ''జ్యోతి'' దీపావళిసంచికను అందంగా అలంకరించడానికి రచయితలు కథలు, వ్యాసాలు, గేయాలు పెందరాళే మాకు పంపిస్తారని కూడా ఆశిస్తున్నాము.

ఉత్తరాయణం

'సెక్రటరీ' సీరియల్ చాలారసవత్తరంగా వుంది. రాబోయే సంచిక కొరకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నాము. అరవిందగారి 'అందాలు - అసూయలు' నన్నెంతో ఆకర్షించింది. "తేనెమనసులు" ఫొటో శీర్షిక చాలా అందంగా వుంది. అనంతంగారి 'రాజకీయ వార్తావరణం పరవాలేదు.

గిరి, నల్లగొండ.

జూలై నెల సంచిక నూతన నటీనటుల "చతుర్ముఖ చిత్రం"తో, నూతన శోభతో వెలువడింది. ఈ సంచికలో కథలన్నీ బాగున్నాయి. అర్థం చేసుకోగలిగితే దానవులను సైతం మానవులుగా చెయ్యగల కథ_ "దేముడిలాంటి మనిషి" కథ. ఈసారి విట్లూ, కార్టూన్లూ ఎక్కువగానూ, నైస్‌గానూ వేసినందుకు చాలాథాంక్సు. ఆ పెసరట్టు విట్టు (పంపిన మహాశయు డెవరోగానీ) తలేగా వుందండీ! ఇప్పుడు తలుచుకున్నా నవ్వాగటంలేదు. "సెక్రటరీ" రసవత్తరమైన సన్నివేశాలతో జోరుగా నడుస్తోంది. ఇకపోతే కష్టజీవుల కొంపలు కాల్చిబూడిద చేసినవారికి ఆరుద్రగారు (కూనలమ్మ పదాల్లో) చక్కగా బుద్ధిచెప్పారు. వాటికి కార్టూన్లు లేకపోవడం ఏదో వెలితనిపిస్తుంది. నిత్యానందంగారిని కలుసుకొని మూడునెల్లయింది. వారి దర్శనభాగ్యం మళ్ళా ఎప్పటికో....

యు. రంగాచార్యులు, నెల్లూరు.

జ్యోతి మాసపత్రిక రాను రాను పాఠకులకు ఉత్సాహాన్ని సంతోషాన్ని కలిగించుచున్నది. చిత్రరథుని చైత్రయాత్ర ఎంతో ఆనందం కలిగించుచున్నది. అరవిందగారు రచించిన "అందాలు - అసూయలు", శ్రీ. వి. ఎస్. అచ్యుతవల్లిగారు రచించిన "ఊసరవెల్లి" కథలు చదువుటకు ఎంతో ఇంపుగా ఉన్నవి.

ఉప్పులూరి రజనీకాంతరావు,
హైద్రాబాద్.

"సెక్రటరీ" కథ నన్నెంతో ఆకర్షించింది. కొడవటిగంటి కృష్ణమూర్తిగారి "అన్యాయం" ఎంతోబాగుంది. జోక్సు ఇంకా ఎక్కువవేస్తారని ఆశిస్తున్నాను.

వి. మోహనరావు, రాజమండ్రి_2.

నూతన నటీనటుల ముఖచిత్రాలతో అందంగా అలంకరించుకొని వచ్చిన "జ్యోతి" ఆకర్షణీయంగా ఉంది. ముఖ్యంగా సీరియల్‌గా ప్రచురిస్తున్న "సెక్రటరీ" నన్ను ముగ్ధుణ్ణిచేస్తోంది. తక్కిన కథల్లో అరవిందగారి "అందాలు - అసూయలూ" చెప్పుకోదగ్గట్టుగా ఉంది.

ఢిల్లీ కృష్ణారావు, శ్రీకాకుళం.

అట్టమీద బొమ్మలో కొత్త నటుల పరిచయము బాగుంది. కాని ఇందులోని కథలు ఏమంత బాగులేవు. ఒక సీరియల్ "సెక్రటరీ" మాత్రము బాగున్నది. రచయిత్రికి నా ధన్యవాదాలు. మరియు మీ "జ్యోతి" "రాజకీయ వార్తావరణం" అన్ని పత్రికలకన్న బాగుండును. ముఖ్యముగా ఈ నెలలో "శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ" వ్రాసిన వీలునామా "తుదికోర్కె" మీ పత్రికలో చదివి చాల సంతోషించితిని.

డి. సాయన్న, లక్సెట్టిపేట.

ఈ నెల మీ పత్రికలో "అరవింద" గారి రచనచూసి నే నీ లేఖకు పూనుకున్నాను. నిజంగా ఆమె స్వర్గీయ గోపీచందుగారిని గుర్తుకు తెచ్చారంటే ఆశ్చర్యంలేదు. అంతే గోపీచందుగారు మరచిపోబడ్డారని నా ఉద్దేశ్యంకాదు-అంతేకాక, కథకు పేరు పెట్టడంలోనూ, రచనలోనూ ఇంకా కొన్ని మెట్లెక్కితే గోపీచందుగారినిసాక్షాత్కరింపజేస్తారని నా భావన....

సత్తెనపల్లి కేశవచంద్రసేన్,
గుండిమెడ.

ముఖచిత్రంలో కొత్త మనుసులు అత్యంతాకర్షకంగా యున్నారు. ఈ నెల కథలన్ని చాలా బాగున్నవి. "తుది కోర్కె"లో శ్రీ నెహ్రూ చిత్రం చూడగానే మా కళ్ళవెంట కన్నీళ్ళు ప్రవహించాయి.

వి. ముత్తయ్యా, లక్సెట్టిపేట.

జూలై సంచికలో ప్రచురింపబడిన అరవిందగారి "అందాలూ అసూయలూ" కథ వాస్తవానికి దగ్గరగా వుంది.

కానీ ఆ కథలో రెండు పొరపాట్లు జరిగాయి. మొదటిది: విజయ ప్రసాద్‌తో తాము ఒక మంచి చిత్రము చూశామని చెప్పి, శ్రీమతిమిశ్రాను అమ్మాయిగారితోను, తనను (విజయ) గౌరిగాను పోల్చి ఆ చిత్రంలో కొన్ని సంఘటనలు చెప్తుంది. ఇది 'మూగ మనసులు' చిత్రాన్ని గురించి చెప్పబడింది. కథాస్థలం అయిన కలకత్తాలో ఇంతవరకూ 'మూగమనసులు' చిత్రం ప్రదర్శింపబడలేదు. రెండవది: పైన చెప్పబడిన చిత్రాన్ని విజయా, సావిత్రి చూసేనాటికి విజయకు రెండునెలల గర్భం. కథలో ఆ తరువాత రెండు సంవత్సరాలకు జరిగే సంఘటనలు చెప్పబడ్డాయి. కానీ 'మూగ మనసులు' చిత్రం 1964 జనవరి ఆఖరి వారంలో విడుదలయింది. అంటే ఇప్పటికీ దాదాపు 7 నెలలయింది. కాబట్టి విజయా వాళ్ళు రెండు సంవత్సరాల క్రితమే ఆ సినిమా చూసినట్లు కథలో చెప్పబడటంలో అర్థంలేదు.

ముందుముందు 'అరవింద' గారు తమ రచనలో ఇటువంటి చిన్న పొరపాట్లు జరగకుండా చూడగలరని ఆశిస్తున్నాను.

కాకర్ల దశరథరామిరెడ్డి, నెల్లూరు.

జూలై నెల జ్యోతి "కొని" చదివాను. చాలాబాగుంది. ముఖ్యంగా ముఖచిత్రం "ది బెస్టు". "తేనెమనసులు" ప్రివ్యూ ఇంకా చాలాబాగున్నది. కథలలో కల్లా "అన్యాయం" కథ ఉత్తమంగా నాకు తోచింది. "జోక్సు"కు ప్రసిద్ధిచెందిన "జ్యోతి"లో అవి తగ్గించేస్తున్నారు. ఇకనుండైనా కొంచెం ఎక్కువచేయమని కోరుతున్నాను.

జె. వి. మోహనరావు, గుంటూరు.

మీ పత్రికలోని మిగతా విషయాలన్నీ అలా వుంచి ఉత్తరాయణం గురించి ఒక మాట. "ముఖచిత్రం బావుంది; ఫలానాకథ బావుంది. అది రాసినవారికి నా ధన్యవాదాలు. ఫలానా కథ బాగులేదు; ఇంకా మంచి కథలు వేయగోర్తాను" వగైరా లేఖలు తప్పితే. ఎవరూ చక్కని విమర్శనాత్మకమైనవి రాయడంలేదు. అందుచేత అవి చప్పగా వుంటున్నాయి. ఉత్తరం రాయడం కూడా ఒక కళకాదా? ఇతరదేశాల మేగజైన్లలో పడే ప్రతి ఉత్తరంలోను ఏదో కొత్తదనం. ఏదో చమత్కారమో, గంభీర విషయమో ఉండి చదవడానికి బావుంటాయి. ఏదో ఉత్తరంరాసిపడేశామని తృప్తిపడక మీ పాఠకులు ఇంకా చక్కనివిశ్రాయాలని అటువంటివాటినే మీరుప్రచురించాలని నాకోరిక.

అల్లం వెంకటేశ్వరరావు, మద్రాసు.

మన పత్రికలో ప్రచురితమవుతున్న "సెక్రటరీ" సీరియల్ అత్యద్భుతంగాఉంది. అవివాహిత అయిన స్త్రీలకుండే మనోభావాలను 'జయంతి' పాత్రద్వారా రచయిత్రిగారు చక్కగా చిత్రించారు చివర కేమవుతుందో నని సస్పెన్స్‌గాఉంది ఇంతచక్కని నవల వ్రాస్తున్నందుకు సులోచనారాణిగారి కివే మా అభినందనలు....

ఇ. హేమచందర్, హనుమకొండ.

ఈనెల ముఖచిత్రం క్రొత్త జంటల కిలకిలలతో కళకళలాడుతూ ఎంతో ఆకర్షణీయముగా నున్నది.

సులోచనారాణిగారి "సెక్రటరీ" సీరియల్ ఈనెల చాలా బాగున్నది అరవిందగారి "అందాలూ, అసూయలూ" కథ చాలా బాగున్నది రచయిత్రిగారు భార్యాభర్తలు యెదుర్కొనే విషమ సమస్యను కథా వస్తువుగా తీసుకొని చక్కని శైలిలో మనోజ్ఞముగా రచించారు అరవిందగారికి, ప్రచురించిన మీకు మా అభినందనలు

యస్. కె. ప్రసాదరావు,
నౌరోజాబాద్ (మ.ప్ర)

జూలై నెల "చతుర్ముఖ చిత్రం" చాలా బాగుంది. "అందాలు-అసూయలూ" రచయిత్రి 'అరవింద'గార్కి నా అభివందనాలు. అచ్యుతవల్లిగారి "ఊసరవెల్లి" నిజంగా కథకుతగినపేరు. "సెక్రటరీ" సీరియల్‌కథ చదువుతున్నకొలది ఇంకా చదవాలనే ఉత్సుకతను కలిగిస్తుంది. రచయిత్రి వర్తమాన వాస్తవ పరిస్థితులను చక్కని విమర్శనాత్మక దృక్పథంతో చిత్రీకరిస్తున్నారు. వారికి జ్యోతి ద్వారా నా హృదయపూర్వక ధన్యవాదాలు అందజేయుచున్నాను. "దేముడిలాంటి మనిషి", "నా కోసం", "అన్యాయం" పెద్దగా రాణించలేదు. ఈ నెల "రాజకీయ వార్తావరణం" చాలా బాగుంది.

వావిలపల్లె కృష్ణమూర్తి, పారాపురం.
(శ్రీకాకుళంజిల్లా).

రాజకీయ వార్తావరణం చాలా బాగుంది. "అందాలూ - అసూయలూ" అనే కథ బాగుందనుటలో అతిశయోక్తి లేదు. జ్యోతిలో ప్రతి పేజీకూడా అమూల్యమైనదే. జ్యోతిలో వేసే జోక్సు చాలా బాగుంటాయి "సెక్రటరీ" సీరియల్ చక్కని విమర్శనాత్మక దృక్పథంతో చిత్రీకరిస్తున్నారు వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

మిస్. వాసంతి, గజపతినగరం.

"సెక్రటరీ" ముందు సంచికల కంటె ఈ సంచికలో మోస్టు బ్యూటిఫుల్‌గా ఉందండి జోక్సు. కథలు అనుకున్నంత ఆకర్షించలేదండి కాని పర్వాలేదు. మొత్తం మీద మీ కృషి ఫలిస్తోందనే చెప్పొచ్చు.

అబ్దుల్ నబీ, మచిలీపట్నం.

000

● *ఆసుపత్రివున్న ఒక రోడ్డుమీద, ఇక్కడ కార్లు, బస్సులూ "హారన్" చెయ్యకూడదనే హెచ్చరిక ఆంగ్లంలో రాసివుంది. దానికింద ఓ కుర్రవాడు వచ్చీతెలుగులో ఇలారాశాడు: "మీ కారుకూతలు ఇక్కడ కట్టిపెట్టండి".*

రాజకీయ వాతావరణం

కొత్త విదేశాంగమంత్రి

నెహ్రూ దారి వేరు. ఆయన పదిహేడేళ్ళపాటు ప్రధానమంత్రి పదవిని అవిచ్ఛిన్నంగా నిర్వహించారు. అంతకు ముందు ఆయన జీవితంలోపడిన బాధలు, శ్రమలు ఒక ఎత్తు, ప్రధాని అయ్యాక ఆయన వహించిన కార్యభారం మరొకఎత్తు. రోజుకు పద్దెనిమిది గంటలో, ఇరవైగంటలో సంవత్సరాల తరబడి ఆయన ప్రభుత్వ వ్యవహారాలు నడిపారు. పట్టుమని వారం రోజులపాటు రాజధానిలో కదలకుండావున్న సందర్భాలు తక్కువ. ఎప్పుడూ ఏవో పర్యటనలు, సమావేశాలు, ఉపన్యాసాలు, చర్చలు. అంత బహుముఖంగా వ్యాపకాలు, వ్యాసంగాలు, అభిరుచులు, అభినివేశాలు వున్న ప్రధాని ప్రపంచంలో మరొకరు లేరేమో.

అందరూ నెహ్రూలు కారు; కాలేరు; అది ఆయనకే చెల్లింది. అనే విషయం ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి అస్వస్థులు కావడంతో మరీ కొట్టొచ్చినట్టు కనబడింది. నెహ్రూ నిర్యాణంతరవాత శ్రీ శాస్త్రి వహించిన కార్యభారం సామాన్యమైందికాదు; ఆయనను ఎదుర్కొన్నవి ఒకటి రెండు సమస్యలుకావు; దాదాపు నలభైఅయిదుకోట్ల సమస్యలు. ఈదేశంలో ప్రతిఒక వ్యక్తి ఒక సమస్యే. అయినా, శ్రీ శాస్త్రి త్వరలో కోలుకొని తిరిగి ప్రభుత్వ కార్యకలాపాలను స్వయంగా చూసుకొంటూ వుండడం ఎంతైనా సంతోషించదగిన సంగతి.

ముఖ్యంగా, ఒకందుకు సంతోషించాలి. పదిహేడేళ్ళపాటు మనకు ఒకే ప్రధాని వున్నట్టు, విదేశాంగమంత్రికూడా ఒకరే. ఆ రెండు పదవులను నెహ్రూయే నిర్వహించారు. ఆయన తరవాత శ్రీ లాల్‌బహదూర్ తాత్కాలికంగా ఆ రెండిటిని స్వీకరించినా, విదేశాంగ శాఖకు మరొకర్ని నియమిస్తారని అనుకుంటున్నదే. ప్రధానమంత్రిపై పడే పెద్దబాధ్యత మొత్తం ప్రభుత్వశాఖలన్నిటి పనుల్ని సమన్వయంచేయడం, దేశానికంతటికి సంబంధించిన సమస్యలను పరిశీలించి, సూచనలిచ్చి పనిచేయించడం. దానికీ, విదేశాంగ వ్యవహారాలకు సంబంధంలేదు. న్యాయంగా దానికి వేరే వ్యక్తిని నియమించవచ్చు.

ప్రధాని శాస్త్రి అదేపని చేశారు. సర్దార్ స్వర్ణసింగ్‌ను విదేశాంగ మంత్రిగా నియమించారు. శ్రీ స్వర్ణసింగ్ ఈ మధ్య కొంతకాలంగా కొన్ని దౌత్య బాధ్యతలు ప్రశంస



లండన్, కామన్వెల్తు ఇన్‌స్టిట్యూట్‌లో ప్రదర్శింపబడిన "ఎ పాసేజ్ టు ఇండియా" (ఇ. ఎమ్. ఫార్‌స్టర్ నవలపై ఆధారపడి శ్రీమతి శాంతా రామారావు రచించిన) నాటకాన్ని భారత ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి చూసిన తరవాత నటులను అభినందిస్తున్న దృశ్యం.

నీయంగా నిర్వహించిన వ్యక్తి. క్రిందటేడు పాకిస్తాన్‌తో చర్చల సందర్భంలోనేమి, ఈమధ్య జకార్తాలో ఆఫ్రో - ఆసియన్ రాజ్యాల ప్రాథమిక సమావేశంలో నేమి ఆయన ప్రతిభా విశేషాలు బాగా వెల్లడయ్యాయి. అందుచేత ఈ కొత్త పదవిలో ఆయన చక్కగా రాణిస్తారనే ఆశించవచ్చు.

కామన్వెల్తు మహాసభ

అప్పటికింకా శ్రీ స్వర్ణసింగ్‌ను విదేశాంగ మంత్రిగా నియమించలేదు. గాని లేకపోతే లండన్‌లో కామన్వెల్త్ సమావేశానికి ప్రధానికి ప్రతినిధిగా ఆయనే వెళ్ళివుండేవారు. అసలు శ్రీ శాస్త్రి స్వయంగా వెళ్ళవలసి వున్నప్పటికీ, అందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నప్పటికీ, అస్వస్థత కారణంగా శ్రీ టి. టి. కృష్ణమాచారి, శ్రీమతి ఇందిరా గాంధిగార్లను పంపవలసి వచ్చింది.

కామన్వెల్తు సమావేశం సాధారణంగా ఏడాదికొకసారో, రెండేళ్ళ కొకసారో అనువాయితీగా జరగాల్సిన తతంగం. ప్రపంచాన్ని కదిలించివేసే అద్భుతనిర్ణయాలేమీ ఆ సమావేశంలో జరగవు. కాకపోతే ఒకప్పటి బ్రిటిష్ సామ్రాజ్యంలో వలసలుగా వున్న కారణాన కామన్వెల్త్ దేశాల మధ్య ఒక విధమైన అనుబంధం వున్నది. కొత్తగా స్వతంత్రమైన మలావి (న్యాసాలాండ్)తో కలిపి మొత్తం 18 సభ్యదేశాలు.

ఇందులో అయిదు శ్వేతజాతులవి; ఏడు ఆఫ్రికాలోనివి; నాలుగు ఆసియన్ రాజ్యాలు; రెండు పశ్చిమార్థగోళంలోనివి. వీటి భౌగోళిక. రాజకీయ. ఆర్థిక దృక్పథాలలో ఎన్నో భేదాలున్నాయి; ఆర్థిక పరిస్థితులలో ఎన్నో భేదాలున్నాయి. అయినా. వాటిని పరస్పర విరుద్ధప్రయోజనాలు కలిగిన దేశాలనడానికి వీల్లేదు. అవి కలిసికట్టుగా వుండడంవల్ల లాభాలు పెద్దగా లేకపోయినా. నష్టంకూడా ఏమీలేదు. ఈ కారణం చేతనే అవి ఇంకా ఒక యూనిట్‌గా వుంటున్నాయి.


ఈ యేడాది అవి చేసిన ముఖ్య నిర్ణయాలలో ఒకటి–ఇంకా బ్రిటిష్ వలసగా. స్థానిక శ్వేతజాతి ప్రభుత్వంచేత పరిపాలింపబడుతున్న ఆఫ్రికన్‌దేశం దక్షిణరొడీషియాకు స్వాతంత్ర్యమిచ్చేట్టు. ఆ దేశంలో మెజారిటీగావున్న ఆఫ్రికన్‌లకే అధికారం బదిలీచేసేట్టు బ్రిటన్‌ను ఒప్పించడం. ఇందుకు బ్రిటన్ మొహమాటపడి కాదనలేక ఒప్పుకున్నదో ఏమోగాని. దక్షిణ రొడీషియాలో స్థిరనివాసా లేర్పరచుకుని పెత్తనం చెలాయిస్తున్న తెల్లవాళ్ళు ఎప్పటికీ ఒప్పుకోరు. బ్రిటన్‌మీద తిరగబడి తమకు తామే స్వాతంత్ర్యం ప్రకటించుకోవడానికి కూడా వాళ్ళు సిద్ధంగావున్నారు. అంతపనీ జరిగితే అక్కడ అంతర్యుద్ధం తప్పదు. ఈ సమస్యను బ్రిటన్ ఎలాపరిష్కరిస్తుందో చూడాల్సివుంది. అది దాన్ని సవ్యంగా పరిష్కరించగలిగితేనే కామన్వెల్త్ ఒక యూనిట్‌గా నిలవగలుగుతుందని, లేకపోతే ఆఫ్రికన్ సభ్యదేశాలు కామన్వెల్తు నుంచి తప్పుకోవచ్చునని కూడా పరిశీలకులు భావిస్తున్నారు.

ఆఫ్రికన్ మహాసభ

ప్రపంచంలో ఈసారి రానున్న మహా నాగరికత ఆఫ్రికానుంచే రాగలదని బెర్నార్డ్ షా ఒకసారి అన్నాడు. ఇది హాస్యంకోసం చెప్పిన జోస్యంగా కొట్టిపారవేయడం సులభమేగాని. ఇప్పటివరకు చరిత్రలో ఒక వెలుగువెలిగి ఆరిపోయిన నాగరికతల తీరుతెన్నులను పరిశీలిస్తే .ఇది అంత అసంభవమైనదికాదనే అనిపిస్తుంది. ఏమో ఎవరు చెప్పగలరు ? ఒకప్పుడు ప్రపంచానికి ఆసియాదేశాలే నాగరికతను ప్రసాదించాయి' కేవలం బర్బర స్థితిలో ఒకప్పుడున్న యూరపియన్ దేశాలు ఈనాడు లోకానికి నాగరికతా భిక్ష పెడుతున్నాయి అలాగే. మ రెప్పుడో ఆఫ్రికన్ దేశాలది కాలచక్రభ్రమణంలో పైచెయ్యి కాబోదని ఎవ్వరు అనగలరు? ఎక్కడుంది ?

ఏమైనా. ఆఫ్రికాదేశాలలో ఈనాడు ఒక అపూర్వ సంచలనం కలిగింది. ఇతర ఖండాలకంటె వేగంగా ఇవి పురోగమనం సాగిస్తున్నాయి. నిన్నటి మొన్నటిదాకా ఆఫ్రికా ఒక చీకటి ఖండం. పాశ్చాత్యుల పాలనలో నలిగిపోయిన బానిసల ఖండం. ఒక దశాబ్దం తిరక్కుండా ఈ ఖండంలోని వలసలు పారతంత్ర్యంనుంచి విముక్తమయ్యాయి. ఆర్థిక ప్రగతికోసం ఇప్పుడు కృషిసాగిస్తున్నాయి.

అంతేకాదు; ఆఫ్రికాను రాజకీయంగా. ఆర్థికంగా సమైక్యం చేయడానికి ఈ స్వతంత్ర రాజ్యాలు యత్నిస్తున్నాయి. ఈ యత్నంలో ఒక భాగంగానే 34 దేశాలు ఈమధ్య కైరోలో సమావేశమయ్యాయి. తాము ఏదోవిధంగా. వీలైనంత త్వరలో సమైక్యం సాధించాలనే ఉత్సాహం ఈఅన్ని రాజ్యాలలోను కనిపిస్తుంది. అయితే. దాని కనుసరించవలసిన మార్గాల విషయంలోనే భేదాభిప్రాయాలు వచ్చాయి. ఘనా అధ్యక్షుడు ఎన్ క్రుమా కొంచెంతీవ్రవాది. వెంటనే ఫెడరల్ ప్రభుత్వం ఏర్పడాలని ఆయన ప్రతిపాదన. కాని. దానికి కొన్ని అడ్డంకులున్నాయి. తొందరపడితే ఇదివరలో ఈజిప్టు - సిరియాల సమాఖ్యకు జరిగినట్టు భంగపాటు జరగచ్చు. అందుకే ముందు వివిధదేశాలు భావసమైక్యం పొంది. ఆతరవాత రాజకీయైక్యం కోసం యత్నించాలని నాసర్‌వంటి వారు సూచించారు. చివరకు ఈ సూచననే కైరో మహాసభ అంగీకరించింది.



అఖిలభారత సమాజాభివృద్ధి. పంచాయతీరాజ్ వార్షిక మహాసభను ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు శ్రీ అశోకమెహతా ఇటీవల ప్రారంభిస్తున్న దృశ్యం.

ఇంకా వలసలుగా మిగిలివున్న దక్షిణ రొడీషియా. మొజాంబిక్. అంగోలావంటి దేశాల విముక్తికి తీవ్రంగా పోరాటం సాగించాలని. దక్షిణాఫ్రికాలో జాతి వివక్షను నిర్మూలించడానికి ఆ దేశం పై ఆర్థిక ఆంక్షలు అమలు జరపాలని కూడా కొన్ని ముఖ్య నిర్ణయాలను కైరో సభ చేసింది.

ఆఫ్రికన్ జాతీయతను. ఆఫ్రికన్ వ్యక్తిత్వాన్ని. సమష్టి పురోగతిని సాధించడానికి ఈ రాజ్యాలు చేస్తున్న కృషి మిగతా ప్రపంచం హర్షించదగింది; ప్రోత్సహించదగింది.

గోల్డ్ వాటర్

ఈ యేడాది నవంబరులో అమెరికా అధ్యక్షపదవికి జరగనున్న ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా సెనెటర్ గోల్డ్‌వాటర్ నామినేట్ కావడం అమెరికన్లలో అధికసంఖ్యాకులకు. ప్రపంచప్రజలకు కూడా ఆశాభంగం కలిగించింది. అమెరికా అధ్యక్షుడికి ప్రపంచ వ్యవహారాలలోగల కీలకస్థానం దృష్ట్యా ఈ నామినేషన్ ఎంతైనా విచారకరమైనది. గోల్డ్‌వాటర్ తాను అధ్యక్షుడుగా ఎన్నికైతే ఏమేమి చెయ్యబోతాడో దాచుకోకుండా చెప్పేశాడు.

ఆయనకు ప్రచ్ఛన్నయుద్ధం తొలగిపోవడం ఇష్టంలేదు. దాన్ని తీవ్రతరం చేస్తాడు. రష్యాతో రాజకీయ సంబంధాలు తెగత్రెంపులు చేసుకుంటాడు. అవసరమైతే

అమెరికా ప్రయోజనాల కోసం అణ్వస్త్రాలు ప్రయోగించడానికైనా వెనుదీయదు పైగా వాటిని ప్రయోగించాలో అక్కర్లేదో నిర్ణయించే అధికారాన్ని సేనాధిపతులకే వదలివేస్తాడు. ఇతరదేశాలకు ఆర్థికసహాయాన్ని నిలిపివేస్తాడు. తమ మిత్రదేశాలు కొన్నిటికి మాత్రం సైనిక సహాయంచేస్తాడు. ఇక స్వదేశంలో ఆయన నీగ్రోల సమాన హక్కులను గుర్తించడు. మొన్న కాంగ్రెసు ఉభయ సభలు ఆమోదించగా శాసనమైన నీగ్రో పౌరహక్కుల బిల్లును ఆయన సెనెట్‌లో వ్యతిరేకించాడుకూడా

ఇతర ప్రతిపక్ష భావాలుకల గోల్డ్‌వాటర్ అధ్యక్షుడుగా ఎన్నికైతే అమెరికా ఈమధ్య అవలంబిస్తున్న లిబరల్ వైఖరికి ఇక స్వస్తి చెప్పినట్టే.

• • •

పరిష్కారమైన పంజాబ్ సమస్య


పంజాబ్ సమస్యను చాకచక్యంతో, ప్రశాంతంగా పరిష్కరించడం ప్రధాని శాస్త్రి, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌గార్ల రాజనీతి చాతుర్యానికి మరొక ఉదాహరణ. కొన్నేళ్ళుగా నెహ్రూవంటి వారికికూడా కొరకరాని కొయ్యగా అయింది ఈ సమస్య. సర్దార్ ప్రతాప్‌సింగ్ కైరాన్ పాలన అవినీతి భూయిష్ఠంగా వుందని ప్రతిపక్షాలవారు చేసిన ఆరోపణలపై విచారణ జరిపిన దాస్ కమిషన్ కైరాన్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఆయన తన కుమారులు, బంధువులు, ఆశ్రితులు అక్రమంగా ఆస్తులార్జించుకొనడానికి తోడ్పడ్డాడనే ఆరోపణను కమిషన్ ధ్రువపరచింది. దీనితో కైరాన్ రాజీనామా ఇవ్వక తప్పలేదు. కమిషన్ తీర్పు దృష్ట్యా కైరాన్ చేత రాజీనామా ఇప్పించడమైతే సులభంగానే జరిగింది. ఆయన తర్వాత ముఖ్యమంత్రి ఎవరనే సమస్య మాత్రం అంత సులభంగా తేలలేదు. పంజాబ్ శాసనసభ కాంగ్రెసు సభ్యులలో ఎక్కువమంది కైరాన్ అభిమానులు. వీరిని కాదని మరొకరిని ముఖ్యమంత్రిని చేయడమెలా? చివరికి లెజిస్లేచర్ పార్టీ అంతిమ నిర్ణయాన్ని ప్రధానికి, కాంగ్రెసు అధ్యక్షునికి వదిలిపెట్టింది. కొన్ని రోజుల చర్చల తతంగం తర్వాత శ్రీ రామ్ కిషన్‌ను పార్టీ నాయకుడుగా నిర్ణయించడం, ఆయన్ని ముఖ్యంగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇది కాంగ్రెసు పార్టీలో క్రమశిక్షణవల్లనే సాధ్యపడింది.

కాంగ్రెసు అధ్యక్షుడుగా శ్రీ కామరాజ్ వచ్చిన తర్వాత కాంగ్రెసు అధిష్ఠానవర్గం పలుకుబడి క్రమంగా హెచ్చుతున్నదనడానికిది మరొక నిదర్శనం. నెహ్రూ వారసుని ఎన్నిక పద్ధతిలోనే ఇకముందు వ్యవహారాలన్నీ జరిగితే ఒక పార్టీగా కాంగ్రెసు పూర్వ ప్రతిష్ఠను పుంజుకోగలదనే ఆశించవచ్చు.

ఇప్పుడు కాంగ్రెసు అధ్యక్షుడిని ఎదుర్కొంటున్న మరొక సమస్య ఉత్తరప్రదేశ్ కాంగ్రెసులో విభేదాలు వీటిని ఆయన ఎలా పరిష్కరిస్తారో చూడాలి.

ఆంధ్రుల నోట్లో శని

అంగట్లో అన్నీవున్నాయిగాని ఆంధ్రుల నోట్లో శని అన్నట్టుగా వుంది. ఎన్నో ఏళ్ళుగా పోరాడగా పోరాడగా కొత్తరైల్వే మండలమైతే వచ్చేట్టుందిగాని, మిగతా కోరికలన్నీ వెనకపట్టేట్టున్నాయి. మొన్నటిదాకా విశాఖపట్టణంవద్ద ఉక్కుఫ్యాక్టరీని స్థాపించడం ఖాయమేనని ఆంధ్రులు సంబర



సిక్కింలో నెహ్రూ చితాభస్మాన్ని హెలికాప్టర్‌నుంచి వెదజల్లడానికి ముందు గాంగ్‌టక్ రాజభవనంలోనికి ఊరేగింపుగా తీసుకువెడుతున్న దృశ్యం.

పడ్డారు. ఇప్పుడిది రాజకీయాల సుడిగుండంలో చిక్కుకుంది. టెక్నికల్ నిపుణులు "ఓకే" చేసిన తరవాతకూడా, విశాఖపట్టణందగ్గర ఫ్యాక్టరీని కట్టడం ప్రయోజనకరం కాదని భారతప్రభుత్వం భావిస్తోంది. అంతకంటె గోవా - హాస్పేటల మధ్య యెక్కడో నిర్మించడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్టు - ఇంకా నిర్ణయం జరక్కపోయినా - వదంతులున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో హెవీ ఎలక్ట్రికల్స్ లాంటివి ఒకటి రెండు తప్పిస్తే కేంద్రం స్థాపించిన పెద్ద పరిశ్రమలను కొన్నిరాష్ట్రాలలోను స్థాపించి ప్రాంతానికి ప్రాంతానికి మధ్య అసమానతలను తొలగించడం తన లక్ష్యమని భారతప్రభుత్వం చెబుతోందిగాని వాస్తవంలో పరిశ్రమల కేంద్రీకరణ జరుగుతోంది. లేకపోతే, ఇప్పటికే ఎనిమిది భారీ పరిశ్రమలకు నిలయమైన మైసూరుకేమరొక ఉక్కు ఫ్యాక్టరీనికూడా ఇవ్వబూనడం దేనికి? ఆంధ్రప్రదేశ్‌లో మరీ పరిశ్రమలు ఎక్కువైపోతున్నాయనా? ఇక్కడ నిరుద్యోగం సమస్య లేదనా?

మాజీ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి కేంద్రంలో ఉక్కుశాఖకు మంత్రి అయిన తర్వాత స్వరాష్ట్రానికివ్వబోతున్న కానుక ఉక్కుఫ్యాక్టరీకి తిలోదకాలేనా?

కేంద్రం చిన్నచూపుకు గురిఅవుతున్న మరొకటి గోదావరిపై రాజమంత్రివద్ద రైలురోడ్డు వంతెన. రైల్వేశాఖ నిర్మించదలచిన రైలువంతెనతోపాటు రోడ్డునుకూడా

నిర్మించితే ఖర్చు కలిసివస్తుందని, త్వరగా పూర్తవుతుందని, మద్రాసు-కలకత్తాలమధ్య దగ్గిరదారి ఏర్పడుతుందని ఆంధ్రులు రోడ్డు వంతెనను కోరుతున్నారు. ఇందుకు అయ్యే వ్యయం రెండుకోట్ల 15 లక్షలుకాగా, సగం ఖర్చును భరించడానికి ఆంధ్రప్రభుత్వం నిశ్చయించింది. మిగతా సగాన్ని కేంద్రం భరించాలని కోరింది. అయితే ధనాభావం సాకుతో కేంద్ర ఆర్థికశాఖ మన కోరికను పెడచెవిని పెట్టింది. కేవలం కోటి రూపాయల ఖర్చుకు వెనకాడుతున్నది. రాజమండ్రివద్ద రెండవ రైలువంతెన నిర్మాణం మొత్తం దేశానికెంత ప్రయోజనకరమో రోడ్డు వంతెనకూడా అంతే ప్రయోజనకరం. ఈ సంగతి కేంద్రం గుర్తించడం అవసరం.

అసలు పార్టీ

భారత కమ్యూనిస్టుపార్టీలో ఇక ఐకమత్యం సాధించడం అసంభవమని ఖరారై పోయింది. మితవాదులు, అతివాదులుగా పార్టీ విడిపోయింది. ఐకమత్యానికి వీరు చేసిన సూచనలనువారు, వారి సూచనలను వీరు తిరస్కరించారు. అతివాదులు తెనాలిలో సమావేశమై కొత్త పార్టీని స్థాపించడానికి నిర్ణయించారు. తాము స్థాపించబోయే పార్టియే అసలైన కమ్యూనిస్టుపార్టీ అని ప్రకటించారు. తెనాలి సదస్సులో వీరు ప్రదర్శించిన ఫొటోలు మార్క్సు, ఎంగెల్సు లెనిన్, మావోలవి. మితవాదుల సదస్సును జరిపితే బహుశా మార్క్సు, ఎంగెల్సు, లెనిన్, కృశ్చేవ్‌ల ఫొటోలు ప్రదర్శిస్తారు. కనక తేడా అంతా చైనా, రష్యాల విభేదాల నుంచి దిగుమతి అయిందే తప్ప మరేమీ కాదన్నమాట. ఈ మాటను ఉభయవర్గాలూ తిరస్కరిస్తాయి. కాని తమదే అసలు సిసలు కమ్యూనిజం అని వారూ వీరూ కూడా వాదిస్తున్నారు. ఇందులో ఏది అసలు పార్టీ ?

□□□



నీ పద్ధతి మార్చుకో



భమిడిపాటి రామగోపాలం

శ్రీశానాం జగతోస్య వేంకట పతే-
ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షస్థల నిత్య వాస రసికామ్
తత్ క్షాంతి సంవర్ధినీమ్
పద్మాలంకృత పాణి పల్లవ యుగామ్
పద్మాసన స్థాంశ్రియమ్
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం
వందే జగన్మాతరమ్

అని మంచి శ్రుతిలో వినబడుతున్నాది కలెక్టర్ రమణకి. ఒక్కొక్క అడుగూ లోపలికి వేస్తూ ఉంటేను పొద్దుటే ఆరున్నరకి స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ పేరేడ్ చూడ్డానికి వెళ్ళేడు. అక్కణ్ణించి డి. యస్పి.టికి రమ్మని ఆహ్వానిస్తే ఒక అరగంట గడిపి వస్తున్నాడు. ఇంతసేపూ ఒకవిధంగా ఉండిన మనస్సు ఈ ప్రార్థన వింటూనే యింకో లోకంలోకి అడుగుపెట్టవలసి వచ్చింది.

డఫేదారు ఎదురుగా వొచ్చి సీ. సీ గారూ హెడ్‌క్వార్టర్సు తాసిల్దారూ వచ్చి కూర్చున్నారని చెప్పేడు. అంటే లోపలికి వెళ్ళి త్వరగా టిఫిన్ ముగించుకుని క్యాంప్‌కు సిద్ధం కావాలన్నమాట.

'ఈశేషు యిప్పుడప్పుడే పూజ ముగించేటట్టు లేదు.. నెమ్మదిగా, హుందాగా అడుగులు వేసుకుంటూ పూజామందిరం వేపు వెళ్ళేడు రమణ. ఇంకా శేషు ధారాళంగా శ్లోకాలు వల్లిస్తూనే ఉంది. కాంపౌండ్ వరకూ వినబడుతోంది. మంచి కంఠస్వరం. అయితేమాత్రం, ఎంతతప్పు అది ! సభ్యతకి ఎంత అపశ్రుతి ! కలెక్టరు సతీమణి అయ్యుండీ పురోహిత దుహితలా ప్రవర్తిస్తోంది శేషు

బూట్ల చప్పుడు విని, శేషు యిటు తిరిగింది "ఒక్క నిమిషం !" అని చనువుగా, మధురంగా నిర్బంధించింది. రమణ అనుకోకుండా ద్వారం దగ్గిరే నిలబడిపోయాడు. బూట్ల కాళ్ళతో లోపలికి వెళ్ళాలన్నంత కసిపుడుతుంది శేషు చాదస్తం చూస్తే జిల్లా అందరి మీదా నిరాఘాటంగా పనిచేసే కాఠిన్యం, నిర్మొహమాటం, ఎందుకో శేషు దగ్గర మెత్తబడిపోతాయి.

"ప్రసాదం పుచ్చుకోండే టిఫిన్ ఊసెత్త డానికి వీల్లేదు." నిలబడవలసిందే!

"ఒక్క నిమిషం" అయిపోయింది. శేషు ఒచ్చేస్తోంది. పళ్ళెంలో ఆరని కర్పూర జ్యోతీ, కోసినకొబ్బరి ముక్కలూ, తీర్థంతో నిండిన వెండి గ్లాసూ, పళ్ళెన్ని పట్టుకున్న పసుపురాసుకున్న చేతులూ, ఆ చేతుల మీదుగా వ్రేలాడుతున్న తడి ఆరని జుట్టూ కనబడుతున్నాయి రమణకి. కంగారుపడి సిగరెట్టు పారేశాడు.

హారతి అందుకోమన్నట్టు పళ్ళెం మొహం దగ్గరికి తెచ్చింది శేషు. "థేంక్యూ" అంటూ కర్మకాండ ముగించేడు రమణ. ప్రసాదం చేతులో వేస్తూ "బూట్లు విడిచేస్తే యేం?" అనకుండా వుండలేకపోయింది శేషు.

కళ్ళు కద్దుకోకుండానే ప్రసాదం నోట్లో వేసుకున్నాడు రమణ.

—"నాకు టైమవుతున్నాది. ఆవతల వాళ్ళు ఎదురుచూస్తున్నారు" అన్నాడు.

శేషు చిరునవ్వుతో "వాళ్ళే కాదు. మేం కూడా" అనేసి, తనో యింత ప్రసాదం తీసుకుని, కళ్ళకద్దుకొని నోట్లో వేసుకుంది. సంజ్ఞకోసం పక్కన ఎడంగా నిలబడ్డ వంటావిడతో "ఇదక్కడ పెట్టి, ముందు టిఫిన్ ఏర్పాట్లుచెయ్యి. బాబుగారు క్యాంప్ వెళతారు" అని పళ్ళెం అందించేసింది.

వంటావిడ పళ్ళెం అందుకుంటూ "ఏర్పాట్లన్నీ చేసీసే నమ్మగారూ. మీరు భోంచెయ్యటమే తరవాయి" అని అక్కణ్ణించి వెళ్ళింది.

టేబిలుమీద స్టీలుగిన్నెలో ఇడ్లీ, కొబ్బరి చెట్నీ వున్నాయి. కారప్పొడి సీసా, నేతి గిన్నె పక్కనే పెట్టివున్నాయి రెండు కుర్చీల్లోనూ ఇద్దరూ కూర్చున్నారు.

గిన్నెలో ఇడ్లెన్లుతీసి ప్లేట్లో వెయ్యబోయింది శేషు

చెయ్యిపట్టుకొని ఆపేశాడు రమణ.

• • •

"ఏం?" అన్నట్టు చూసింది శేషు.

"నాకేం నచ్చలేదు."

"రుచి చూడకుండానే?"

"టిఫిన్ కాదు....నీవిధానం."

శేషు నవ్వింది. "నా విధానం—?"

"ఓ యస్. నీ విధానం, కట్టూ, బొట్టూ వేషం, భాషా అన్నీని..........నువ్వు మారాలి."

శేషు మాట్లాడలేక, మాట్లాడక, చూస్తూ ఊరుకుంది


"ఫర్ గాడ్స్ సేక్;. నువ్వీ వేషం మానేద్దూ శేషూ!—నిన్నుచూస్తే అమ్మమ్మ జ్ఞాపకాని కొస్తోంది"

శేషు దొంగతనంగా అతనివేపుచూస్తూ "నేను బామ్మపోలికేగా!" అంది.

"జోక్స్ వెయ్యకు శేషూ. నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను....నీ కిప్పుడు ఇరవైనాలుగేళ్ళు. పెళ్ళయి మూడేళ్ళు కూడా కాలేదు. ఈ పూజలూ, పునస్కారాలూ, ఆచారాలూ, అమ్మమ్మ రూల్సూ నాకు పనికిరావు. నువ్వు నా భార్యగా ఉన్నంతకాలం—నువ్వు కలెక్టరు భార్యలా వుండాలి."

"తరవాత మాట్లాడుకుందాంలెండి. వాళ్లు ఎదురుచూస్తున్నారేమో అవతల!"

"ఫరవాలేదు. ఎదురుచూడనీ. వాళ్ళకి జీతమిచ్చేది అందుకే. ఈ వ్యవహారం వాయిదా వెయ్యడానికి వీల్లేదు. క్యాంపును రద్దుచేస్తున్నానని చెప్పేస్తాను. నీ కిక్కడ మాట్లాడ్డానికి ఇష్టంలేకపోతే మేడమీదికి వెళదాం పద."



"మాట్లాడానికి ఏముంది?" బిక్క మొహంవేసింది శేషు.

"ఏదైనా ఉంటుందేమోనని."

"నాకు నచ్చచెబుదామనా?"

"సారీ శేషూ!—నువ్వలా మాట్లాడొద్దు. నీకు నచ్చచెప్పే శక్తి నాకేసారిలేదు. అయినా నీతో చెప్పవలసింది చాలాఉందనే ఉద్దేశ్యం."

"ఏం పోంటుంది లెండీ. టిఫిన్ తినండి"

సిగరెట్ వెలిగించుకుని, రమణ లేచి వెళ్ళాడు. డఫేదార్ని కేకేసి ఏదో చెప్పేసి పంపేశాడు. చకచకా మేడ మీదికి వెళ్ళిపోయాడు.

వంటావిడ ప్రసాదం అందరికీ పంచి పెట్టేసి వచ్చేవరకూ శేషు అలాగే కుర్చీలో కూర్చుని ఉండిపోయింది. ఖాళీ ప్లేట్లు తియ్యబోతూ వంటావిడ ఉలిక్కిపడింది. అవి ఖాళీ చెయ్యబడ్డ ప్లేట్లు కావు; ఖాళీగానే ఉండిపోయినవి!......"ఏం, అమ్మా. ఇడ్డెన్లు ఖోంచెయ్యలా?"

శేషు జవాబు చెప్పకుండా లేచి వెళ్ళింది.

• • •

శేషు మేడమీద తన గదిలోకి వెళ్ళింది. నిలువుటద్దం ముందు కుర్చీలో కూర్చుంది. జుట్టు ఆరబెట్టుకోడానికి ఫేన్ పెట్టుకుంది. ఫేన్‌గాలికి జుట్టు అటూ యిటూ చిందర వందరగా ఎగురుతూ ముఖం మీద పడుతోంది. కళ్ళకి అడ్డం పడుతూ అద్దంలో ప్రతిబింబం కనిపించకుండా ఉంది. జుట్టు పక్కకి తోసుకుంటూ, చిక్కుదువ్వెన అటూ యిటూ నడిపిస్తూ, చిందర వందరౌతున్న ఆలోచనల్ని పాత అనుభవాల వేపు మళ్ళిస్తోంది శేషు.

చిన్నప్పటి చిలిపితనం, చెలాకీతనం, పెంకెతనం, ఏవీ, ఇప్పుడు? కాలేజీలో, ఆడపిల్లల దగ్గిర్నుంచీ కళ్ళు తిప్పుకోలేని ఆకర్షణ - ఈవిడ జోలికి పోకూడదురా నాయనా, చంపేస్తుందనుకునేటంత విసురూ, అవన్నీ ఏవీ? తను అమ్మమ్మ అయిపోయిందా, అప్పుడే? ఎందుకో!

ఎందుకా? ఈ రమణ ఉన్నాడే - ఇతనికి తనంటే భయం ఎప్పటికేనా తనని పెళ్లాడవలసి వస్తుందని భయం - అలా పెళ్ళాడిం తరవాత కూడా పెంకెతనం మిగిలిపోతే ఏమయిపోతుందో సంసారం అని భయం. అందుకని, ఉచ్చులు పన్ని, ఊబులు పన్ని తనని పట్టుకుని బోనులో పెట్టేశాడు, ముందుగానే.

అయితే, భయమని ఒక్కసారైనా చెప్పేడా? ఏమిటేమిటో అనేవాడు. ఏమిటేమిటో జరిగిపోయేవి. అవన్నీ జ్ఞాపకం వస్తే మొన్నమొన్న పది సంవత్సరాల క్రితం జరిగినవేనా, లేకపోతే యేదైనా అభూతకల్పనా అనిపిస్తోంది ఇప్పుడు!

2

"శేషూ, నీకోసం ఎవరో వచ్చినట్టుందే!" అంటూ హాల్లో అడుగుపెట్టాడు రమణ. తన కళ్ళపడిన దృశ్యంచూసి చాలా ఆశ్చర్యపడి, నొచ్చుకుని "సారీ శేషూ" అన్నాడు. వెనక్కి వెళ్ళిపోడానికి ప్రయత్నించాడు.

ఇంతలోనే శేషు ఒంటినిండా పైట కప్పేసుకుంది. "ఫరవాలేదు" అంది యాంత్రికంగా.

తన గదిలోకి వెళ్ళడానికి మేడమీది హాల్లోంచి ఒకత్రోవ. వసారా చుట్టివాస్తే అక్కడో త్రోవా ఉన్నాయి. హాల్లోంచి ఇక వెళ్ళడానికి బుద్ధిపుట్టక వసారాచుట్టి వెళిపోయాడు రమణ.

తనకళ్ళపడిన దృశ్యం అతన్ని బాధ పెడుతోంది ...

బజార్లోకి కొత్తగా వస్తున్న బ్రేషియర్స్ తొడుక్కొని, తన శరీరం అందులో ఎలా ఉందా అని మేడమీది హాల్లో నిలువుటద్దం దగ్గర నిలబడి చూసుకుంటోంది శేషు.

వాళ్ళనాన్న సంపాదిస్తున్నాడని, దానికంత మదం! డబ్బు ఎలాగైతే బాగా ఖర్చవుతుందా అని ఆలోచిస్తుంది, ఎంతసేపూ! నవనాగరీకతకి ఆ అండర్వేరు ప్రతినిధే కావచ్చు ...కాని మనలాంటి సంసార్లా, అవి తొడుక్కోడం? అని రమణ బాధపడి పోతున్నాడు.

"అంతేకాదు ...ఇంకాచాలా వున్నాయి" అనుకొని బాధపడ్డాడు.

ఎదురుగా వచ్చింది, శేషు స్నేహితురాలు రజని "శేషు ఉంటట కదండీ, మేడమీద!" అంది.

"హాల్లో ఉంది వెళ్ళవచ్చు!" అని ఎవరో శత్రువుకి చెప్పినంత తీక్ష్ణంగా సమాధానం చెప్పేడు.

హాలు తలుపు దాకా వచ్చింది, శేషు. "రా, రజనీ!" అంది రమణ వెనక్కి తిరక్కూడదనుకుంటూనే తిరిగిచూశాడు. "రా, బావా! ఇలావెళ్ళిపో, నీ గదిలోక్కాబోలు!" అంది చిరునవ్వుతో.

"థేంక్స్!" అని మరింత కోపంగా అనేసి వాళ్ళిద్దర్నీ దాటుకుంటూ, తనగది వేపు వెళ్ళిపోయాడు, రమణ.

రజని పలకరించింది "ఏమిటే, కథ? పెళ్ళికొడుకు అలిగినట్టున్నాడు!"

"మా బావకి ఆడవాళ్ళు బట్టలుకట్టుకుంటూ వుంటే చూడ్డానికి సిగ్గు!" అంది శేషు.

అయినా నువ్వు మరీనే—హాల్లోనేనా, ఏమిటి, నీముస్తాబు?" అంటూ బుగ్గ పొడిచింది రజని.

"మరేం చెయ్యనే, కొంపలో మరెక్కడా నిలువుటద్దంలేదు, అసలు వేళగాని వేళ ఈయనగారు ఇల్లా ఇంటికి ఊడిపడతాడనుకున్నానా ఏమిటి!" అంది శేషు సగం సిగ్గుపడుతూ, సగం గర్వపడుతూ.

• • •

బి ఎస్సీ ఫలితాలు తెలిశాయి. రమణ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. మార్కులు తీసుకోడానికి తత్సంబంధమైన యితరపన్లు పూర్తిచేసుకోడానికీ కాకినాడ ప్రయాణమైనాడు. "నేనూ వస్తాను; కోడల్ని చూడాలనుం"దంటూ సుభద్రమ్మకూడా బయల్దేరింది.

ఇంటికి చేరగానే గుమ్మంలో ఎదురైంది శేషు. "నీ పరీక్షేమైందే?" అని పలకరించింది సుభద్రమ్మ.

● *మధ్యప్రదేశ్ రాజధానిలో బార్‌లో బీర్ సేవిస్తున్న బోర్:*

"గెలీలియోగారు మహానుభావుడయ్యా."

"ఏం!"

"భూమి తిరుగుతోందని మొదట కనిపెట్టింది ఆయనేగా!"

"పోయిందత్తా!" అనికూడా వికృ-
మొహం పెయ్యలేదు శేషు.

"నిజంగానే పోయిందా?" అన్నాడు రమణ; "నా కెంత అవమానం!" అన్న కసితో.

"అయ్యబాబోయ్! శపిస్తావా యేమిటీ!– అరె! ఏమిటా చూడ్డం? పద పద బావా! ఇంటరు ఫస్టియర్ ఫేలయ్యేటంత మొద్దుపిల్లాన్నే–అసలు సంగతి. ముందుంది ముసళ్ళ పండగ; ఈయేడాది! మూడుపార్ట్లకీ మూడు ఛాన్సులు రిజర్వ్‌చేసిఉంచేను. మొదట తెలుగూ. సెప్టెంబర్లో యింగ్లీషూ. మళ్ళీ మార్చిలో పార్టు త్రీ–"అంటూ మేనత్త చేతులో సంచీ అందుకుని చెంగు చెంగున గెంతుకుంటూ ఇంట్లోకి పారిపోయింది శేషు.

మెల్లిగా నడుస్తూ సుభద్రమ్మ "దీని పెంకితనం తగ్గలేదొరే!" అంది కొడుకుతో.

"దానివూసు నా దగ్గిరెత్తకు" అన్నట్టు మొహం ముడుచుకుని అటు తిప్పేశాడు రమణ.

● ● ●

"నాకు మెడ్రాస్ యూనివర్సిటీలో ఆనర్సుకి సీటొచ్చింది. నే నెల్లుండి వెళ్ళిపోతున్నా" నన్నాడు రమణ.

ఆ సాయంత్రం అందరూ యిటిదగ్గిరుండడం తటస్థించింది.

"మెడ్రాస్‌లో హాస్టల్లో ఉంటావా?" అన్నాడు రామయ్యగారు.

"లేదు; మా ఫ్రెండు నవరత్నం అని ఉన్నాడు. అతనికూడా వచ్చింది సీటు. మేం యిద్దరం కలిసి ఓ రూం తీసుకుని ఉందామనుకుంటున్నాం."

"నవరత్నం–అంటే ఆ నల్లగా మెరిసిపోతూ ఉంటాడే అతనేనా?" అని పకపకా నవ్వింది శేషు.

"ఏమిటది శేషూ; మేనర్స్ లేకుండాను! నీ ఫ్రెండ్సుని గాని, నిన్నుగాని నే నెప్పుడైనా అలా వేళాకోళం చేసేనా?" అన్నాడు రమణ.

"అదేకదా, నీతో వచ్చిన చిక్కు! నువ్వు ఎవర్నీ ఏమీ అనవు; ఎవరూ నిన్నేమీ అనడానికి వీల్లేదు!" అని మళ్ళీ నవ్వింది శేషు.

"అబ్బా, ఉండవే ..!....అదికాదయ్యా, మరి భోజనంమాట?"

"ఇద్దరం కేరియర్ తెప్పించుకుంటాం!"


"ఛీఛీ. ఎవరి చేతో కేరియర్ తెప్పించుకోడం. పైగా అతనెవరో, అతన్తో సాపంక్తి కూడానా?" అంది కమలమ్మగారు.

"నాకో ఫ్రెండున్నాడోయి, మెడ్రాసులోను, వైద్యనాథన్ అని. ఇక్కడ డీ. సీ. టీ. ఓ. గా రిటైరై మెడ్రాసులో సెటిలైపోయాడు. అంటే వాళ్ళకక్కడ యిల్లూ వాకిలీ ఉందిలే. అక్కడుంటే నీకు సదుపాయంగా ఉంటుంది. నామాట నెత్తిమీద పెట్టుకుంటాడు. పైగా అతనికి నిన్ను తెలుసు కూడాను!" అన్నాడు రామయ్యగారు.

"మేం అప్పుడే నో మాట అనుకోడం జరిగిపోయింది మామయ్యా........నా మూలంగా అతనికినష్టం కలగడం నా కిష్టం లేదు."

"ఇందులో నష్టమేముంది? వాళ్ళింటో ఎలాగా నీకు రూం యిస్తారు గనా, అందులోనే అతన్నీ ఉండమనూ! ఎటొచ్చీ భోజనానికి మాత్రం అతను వేరే ఏర్పాటు చేసుకోవాలిసొస్తుంది."

"ఏమిటి మామయ్యా, నువ్వనేది? రెండేళ్ళ ఆ అరవాయనింట్లో నేను భోంచెయ్యాలా! మై గాడ్!"



శేషు మళ్ళీ నవ్వింది "అయితే మెడ్రాసులో హోటల్‌వాళ్ళంతా తెలుగువాళ్ళనా నీ ఉద్దేశం? మైగాడ్!"

"అదిగాదుశేషూ నే నన్నది; నాలుగేళ్ళు కాకినాడ్లో మీ యింట్లో భోంచేసినంత సుళువుగాదని! రెండేళ్ళు కాదుగదా, రెండు పూటలుంతలేను. ఆయ నెవరు? నేనెవరు?"

"పోనీ, నోపని చెయ్యకూడదూ?" అంది కమలమ్మగారు వెడల్పుగా నవ్వేస్తూ. ఆవిడ మెదడులో ఏదో ఐడియా మెరిసిందన్న సంగతి అందరికీ తెలిసిపోయింది. అందరూ అటు తిరిగారు.

"అప్పు డనుకున్నట్టుగా పెళ్ళిచేసేస్తే ఇద్దరూ కలిసే వెళ్ళిపోవచ్చుగా!"

"పెళ్ళా!" అని వెనక్కి తిరిగిపోయాడు రమణ.

చెల్లెలు ఏమంటుందో నని అటుచూస్తూ మాట్లాడ్డం మానేశాడు రామయ్యగారు.

పైటకొంగు అడ్డంపెట్టుకుని నవ్వితే యేమంటారో అన్నభయం పొడచూపగా, చెమట తుడుచుకున్నట్టు నటించసాగింది శేషు.

సుభద్రమ్మ "అవును. అలాచేస్తే?" అన్న ప్రశ్న కళ్ళల్లోకి తెచ్చుకుని కొడుకు వేపుచూసింది.

తను యిప్పుడు పెళ్ళిచేసుకోవడం అందరికీ యిష్టమేననీ, యిహ తన్నుతాను రక్షించుకోక తప్పదనీ తెలిసిపోయింది రమణకి. "అబ్బే యిప్పుడు పెళ్ళేమిటత్తా." అనేశాడు తల అడ్డంగా ఊపుతూ.

కమలమ్మగారు "కుర్రవాడివి నీతో నాకేమిటన్నట్టు సమాధానం చెప్పడం మానేసి సుభద్రమ్మకేసి తిరిగింది. "అప్పు డనుకున్నారు కాదొదినా, బి. యస్సీ పేసైనాక పెళ్ళిచేద్దాం అనీ!"

"అదేం లాభంలే దత్తయ్యా. నేనిప్పుడు బాగా చదువుకోవాలి. ఇంతోటి అనర్ప చదువుకి నాకొక గార్డియన్ ఉంటేగాని సాగదా ఏమిటి? ఇప్పుడు పెళ్ళిచేసుకుని అక్కడికి వెళ్ళేకంటె చదువుకి యిన్ని నీళ్ళు ఒదిలి ఏ తాలూకాఫీసులోనో గుమాస్తాగా చేరిపోడం ఉత్తమం."

● అందరి మొహాలూ చూసేడు రమణ. ఎవరూ పెద్దగా హర్షించలేదని స్పష్టంగా తెలిసిపోయింది. బ్రహ్మాస్త్రం ప్రయోగించక తప్పదు.

"అయినా నామనస్సులో మాట చెప్పేస్తున్నాను. శేషకి ఇప్పుడు పద్దెనిమిదేళ్ళు. నా ఊసెందుకుగాని. ఒకవేళ నేతిరిగివొచ్చేదాకా ఆగినా ఇరవై వెళతాయి. అంతవరకు ఆగడం అనవసరం; అది మంచిది కాదు కూడానూ."

"అంటే. నువ్విరెండేళ్ళు శలవులకైనా రాకుండా మెద్రాస్‌లోనే ఉండిపోతావా!"

"ఒస్తానుగాని. పెళ్ళిచేసుకోడాని కొస్తానా?.... ఈ రెండేళ్ళు ఆగేకంటె తగిన సంబంధంచూసి శేషకిపెళ్ళిచేసేయడం మంచిది మామయ్యా!" రమణ కుర్చీలో వెనక్కి చేరబడి పోయాడు.

రామయ్యగారు నవ్వేస్తూ "ఇదేమిటి. ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావు? తగిన సంబంధం చూడాలా — అంటే?" అన్నాడు.

"అంటే — నాకంటే కొంచెం యెదైన వాడన్న మాట ."

'ఏదైనవాడు?'

'—అంటే కొంచెం సహనం, సంస్కారం ఉన్నవాడన్నమాట.... ...నీకు తెలీదు మామయ్యా - మొదట్నించీ దాని చేస్తు పెరు నాది వేయిస్నూ - ఎవడేనా ఫారిన్ రిటర్న్‌డ్‌ని చూసి చేసెయ్యండి.......నా మాట నిజం - కావాలంటే శేషనే అడగండి నాకోపానికి అది తట్టుకోలేదు. నాతో వేగలేదు. క్షణానికోమాటు నేను దాన్ని ఇంగ్లీషు మాట్లాడొద్దంటాను .. పాపం కష్టపడి బాబ్ చేయించుకున్న జుట్టుని మామూలుగా దువ్వేసుకోమంటాను. అంగారు బొట్టూ, కళ్ళకి కాటుకా - చేతికి గాజులూ మామూలు దేశవాళీ చీరలూ. ఒక్కటే జెడా: మహిళా సమాజాలూ మీటింగులూ పనికి రావు - ఎందుకొచ్చింది ఇదంతా? - నా కోసం శేష తన ఫేషన్లన్నీ వొదులుకుని యిన్ని మార్పులకి గురికావాలి. అలా ఏదో నాకోసం చేస్తు మార్చుకుని తయారైనా దాని ఆత్మ ఎంతో క్షోభిస్తుంది - నేను దాని కేవిధంగానూ తగను. నాకన్నా సంస్కారం ఉన్నవాళ్ళు, శేష చేస్తుని గౌరవించేవాళ్ళూ లక్షోప లక్షలు! - ఎవడేనా ఫారిన్ రిటర్న్‌డ్‌ని చూసి -'

శేష చటుక్కునలేచి అవతలికి వెళ్ళిపోయింది.

ఒక్కనిమిషం అందరూ మౌనంగా కూర్చున్నారు.

రామయ్యగారే ముందుగా గొంతుసర్దుకున్నాడు 'నువ్వు చెప్పింది రైటు కాదల్లుడూ.... - నువ్వు శేష మనస్సు సరిగా తెలుసుకోలేకపోయావని నా ఉద్దేశ..'

"నాకూ అలాగే అనిపిస్తోంది. నీ కిష్టం లేదనితోస్తే అవన్నీ మానేసుకుని అంచక్కావుండదుట్రా? ఇవన్నీ కుర్రతనపు సరదాలేగాని మరోటా? నువ్వు చెప్పినట్టు చెయ్యడంకూడా ఓ పెద్దబాధేనా?" అంది సుభద్రమ్మగారు

"నీకు బాధ కాకపోవచ్చునమ్మా. చదువూ, సభ్యతా, స్నేహబృందం-యివన్నీ ఉన్నవాళ్ళ దారివేరు మనం పంథాలు మార్చుకోవాలనుకున్నా అవి పూడుకోవుగా అంచేత. పద్ధతులు మార్చుకోడం నువ్వనుకున్నంత సులువుకాదు ......అసలలా మార్పులుతేవడం నాకే యిష్టంలేదు. హింస పెట్టి, అందులో పెళ్ళిచేసుకునేవాడికోసం తెచ్చే మార్పులు చాలా ప్రమాదం అలా చేస్తే దానికి నామీదున్న గౌరవాభిమానాలు పోయి అసహ్యం. శత్రుత్వం ఏర్పడతాయి కూడానూ. నా మాటవిని నే చెప్పినట్టు చెయ్యండి. ఏమీ పెద్దబాధవుండదు. దానికేం కన్నువంకరా? కాలువంకరా? ఎవరేనా ఇష్టే ఎగరేసుకుపోతారు."

● ● ●

"అరెరెరె! ఏమిటీ వేషం, శేషేనా? సారీ శేషూ, నిన్ను పోల్చుకోలేక పోయాను....క్వైటనెక్స్పెక్టెడ్!"

"ఆ మాట అనవలసింది నేను! ఒక్కసారి పద. నిలువుటద్దంలో చూపిస్తాను నువ్వెలా ఉన్నావోను! చొక్కా, ప్యాంటులో టకప్ అయినా చెయ్యకుండా బి. యస్సీ పాసైపోయావు. ఇంతలో ఏం వొచ్చిందో ఇంతాచేసి మెడ్రాస్ వెళ్ళొచ్చావోలేదో గాని లండనో పారిసో వెళ్ళొచ్చినట్టు వేసేవు, ఈ వేషం?-" శేష పకపకా నవ్వేసింది. "పైగా సిగరెట్టొకటి నేర్చుకొచ్చినట్టున్నావు?"

"వేషం అయితే మార్చేశావుగాని, శేషూ నీ నవ్వు మార్చలేదు!"

"అలా అని నువ్వు చెప్పలేదుగా!" అని నాలిక్కరుచుకుంది శేష. "అలా అన్నీ మార్చేసుకుంటే స్వభావం మొత్తం మారిపోయి మనస్సే మారిపోతుంది — అప్పుడు నీ పని బెబ్బెబ్బే!" అంటూ, సరదాకే అన్నాను సుమా అన్నట్టు, నవ్వుకుంటూ పారిపోయింది.

"టెరిబుల్!" అనుకున్నాడు రమణ.

● ● ●

"సారీ మామయ్యా నా మాటలుమీరంతా యింత సీరియస్‌గా తీసుకుంటారనుకోలేదు. ఇంతలామార్చేశారేమిటి. శేషని! ఇదిచాలా పొరపాటు మామయ్యా. దాన్ని చూస్తే నాకు కష్టంగా వుంది — పైగా ఇదంతా నామాట మీద చేసేరు. కదా అని చాలా బాధగా వుంది!"

● *మధ్యాహ్నమైంది. ఇద్దరు బిచ్చగాళ్ళు అడుక్కు తెచ్చుకున్నది తిని చెట్టుకింద నీడలో హాయిగా కాళ్ళు బారజాపుకుని పడుకున్నారు. చల్లని గాలి వీస్తోంది. చెట్టుపై కోయిలలు కూస్తున్నాయి.*

"ఈ జీవితం బావుందోయ్. ఇప్పుడు లక్షరూపాయిల ఆస్తి కలిసొచ్చినా అక్కర్లేదు పొమ్మంటాను." అన్నాడొకడు.

"పదిలక్షల రూపాయలొస్తే?" అన్నాడు రెండోవాడు.

"ఊహు."

"కోటిరూపాయలొస్తే?"

మొదటివాడు లేచి కూచ్చుని "కోటిరూపాయలైతే కాస్త ఆలోచించాల్సిందే." అన్నాడు.

"అబ్బే, అదేం లేదల్లుడూ........పెద్ద ప్రయత్నం లేకుండానే మార్పు ఒచ్చేసింది. అసలు దాని ఫ్రెండ్సూ, ఊళ్లో వాళ్ళూ వాళ్ళూ అందరూ, అది ఇలాగే బావుందంటున్నారు కూడాను."

కమలమ్మగారు అందుకుంది "అసలింకా నువ్వు చూళ్ళేదు ఓనాడు పసుపు రాసుకుని తలంటి పోసుకుని, ఎప్పుడో నా పెళ్ళినాటి కంచి పట్టుచీరకట్టుకొనివుండగా మీ అమ్మగారు ఏదో పనిమీద ఈవూరొచ్చేరు. దాన్నిచూసి గుమ్మంలో మనిషి గుమ్మంలోనే ఆశ్చర్యపడి నుంచుండిపోయారు.... పోల్చుకున్న తరవాత ఆవిడ ఆనందం చూడాలిహ. ఎంత హంగామా చేసేరో చెప్పలేం. ఆపళంగా కూడా తీసుకుపోయి నెల్లాళ్ళుంచుకుని మరీ పంపేరు. పల్లెటూరిగాలి బాగానే వంటబట్టింది. అత్తగారి సమక్షంలో లక్ష్మీస్తోత్రం అన్నపూర్ణాస్తవం అన్నీ నేర్చుకుని చక్కావొచ్చింది. నాకే ఆశ్చర్యం వేసిందనుకో!"

"అలాగా!" అని ఆశ్చర్యపడ్డాడు రమణ, "అయితే మరి పొలాలు అవీ చూసొచ్చేవా, ఇంతకీ!" అని పలకరించేడు శేషుని.

"ఆఁ, ఆఁ, చూసొచ్చేను రేపు నువ్వు కోతలకో నూర్పులకో వెళ్ళి అక్కడ కూచుంటే అన్నంతేవద్దూ పాపం!"

రమణ మాట్లాడలేదు. అతని మనస్సు ఆనందంతో నిండిపోయింది. ఎక్కడిశేషు- ఎక్కడి వేషం, ఎక్కడిభాష!

• • •

"పెళ్ళికి ఇప్పుడేం తొందర మామయ్యా, ఇది ఐ. ఏ. యస్ ట్రైనింగ్. ఇదయిపోయాక మళ్ళీ ఎక్కడో జిల్లాలో పనినేర్చుకుండికివేస్తారు. అంతాకలిపి రెండు సంవత్సరాల చిల్లర అవుతుంది. చాలా బిజీగా ఉంటాను. ఏమాత్రం డిస్టర్బెన్స్ ఉండకూడదు. పెళ్ళి వీటన్నిటికీ వొక ప్రతిబంధకం అసలు దేనికీ ఎటాచ్‌మెంటు ఉండకూడదు. పెళ్ళిచేసుకుని దాన్ని యాతన పెట్టేకంటే అనక చేసుకోడమే హాయి కదా!"

"యాతన కేంవుంది. నీకంతడిస్టర్బెన్స్ అనిపిస్తే యిక్కడేవుంటుంది పోనీ—?"

"అదికాదు మామయ్యా....నీకు సరిగ్గా చెప్పలేక పోతున్నానేమో. పెళ్ళి అనే తతంగం అయివుంటే, ఆ బంధం పట్టిలాగుతూనే ఉంటుంది — దేనికి తోచదు — ఒకస్టెప్ ముందుకు వెయ్యాలంటే అడ్డం."

రామయ్యగారు ధారాళంగా నవ్వేశాడు. "కరెక్ట్— నా ఉద్దేశంకూడా అదే అల్లుడూ నువ్వు చటుక్కున ఒక అడుగు వేసీకుండా ఒక ప్రతిబంధకం వుండాలనే." అనియింకా పెంకెతనంగా నవ్వుతున్నాడు.

రమణ ఎర్రగా అయిపోయాడు "సర్లే మామయ్యా. అర్థమైంది. కాని అలాంటి తప్పటడుగులు వేసే మనిషిని కాదులే. ఆ మాత్రం బాధ్యత లేదనుకుంటున్నావా నాకు"

"అది కాదోయ్, నువ్వూ పెద్దవాడి వవుతున్నావు కద. అందులో ఐ. ఏ. యస్. కూడా అయ్యావు. పెద్దవాళ్ళ వేసే అడుగులు పెద్ద అడుగులుగా వుంటాయి — నీకు మా మీదా శేషుమీగా ఎంత అభిమానం ఉన్నప్పటికీ పెళ్ళి అంటూ కానంత కాలం — ఏదోకుర్రాడు. వెనకాల యింత ఉంది; ఐ. ఏ. యస్ ప్యాసైనాడు; అని ఎవరికైనా నీ మీద ఆశపుట్టిన్నాడు సరాసరి నీతోనే సంప్రతిస్తారు కదా!"

రమణ నవ్వాడు "అప్పుడు చిక్కొస్తుంది — నిజమే....ఎంత గడుసువాడివి మామయ్యా!- కాని వొక్కటి గమనించటం మానేశావు....వెనక నేను అనర్సు చదువుకుండికి వెళుతూ, శేషుకి ఏదేనా సంబంధం చూసెయ్యమన్నాను. ఇప్పుడలా అనడం లేదుగదా!"

• • •

3

మధ్యాన్నం పన్నెండైంది. దఫేదారూ వంటలక్కా గుసగుస లాడుకుంటున్నారు. వాళ్ళకి ఇంత కష్టం ఎప్పుడూ రాలేదు. అంతకు ముందల్లా ఆదర్శ దాంపత్యం అనుకునే వాళ్ళు. హఠాత్తుగా, పొద్దుట, అదేం కారణమో - అతగపుకూడా అంత స్వల్ప వ్యవధిలో అలా ఎలా వచ్చిందో -........ ఎవరి గదిలో వారు!- బైట పెద్ద పెద్ద వాళ్ళకి ఆశాభంగం జరుగుతూనే ఉంది.... భోజనాలూ లేవూ, బొట్లూలేవు. లోకం గమనమే స్తంభించిపోయింది. నౌకర్లు ఇంటికి వెళ్ళడానికి అనుమతి లేదు. ఉండడానికి అవసరమూలేదు. ఆర్డర్సు పడని కొయితాలూ, మనుష్యులూ, ఎక్కడ చూసినా!

ఇంతకీ ఎవరిమీద ఎవరు అలిగారా అన్నది తేలలేదు. బ్రేక్ ఫాస్టు టేబిల్ దగ్గర్నుంచి ముందుగా లేచిపోయింది బాబుగారే. కాని అంతకుముందే అమ్మగారు అలిగి ఆయన్నేదైనా అన్నారేమో - ఎవరు చెప్పగలరు?- వాళ్ళ గురించి వీళ్ళ వ్యూహాలు ఏమీ పని చెయ్యకపోయింది ఇదే మొదటి సారి!

హఠాత్తుగా మేడమీద చిన్న చప్పుడు వినిపించింది. అయ్యగారు అమ్మగారు గదిలోకి వెళ్ళిన అడుగుల చప్పుడు అది. బూట్లకాళ్ళ చేసిన చప్పుడు; పైగా పడమట్నుంచి తూర్పుకి కదా వచ్చింది! సందేహంలేదు.

• • •

"లే శేషూ. భోజనాలు చేద్దాం."

"నాకు భోంచెయ్యాలని లేదు."

"ఏం?"

"ఆకలిగా లేదు. ఏమిటేమిటో జ్ఞాపకాలొస్తున్నాయి. వాట్లతో ఏమీ తోచడంలేదు."

"అదంతేలే. నాకూ అల్లాగే. మనిద్దరికీ కామన్ థింగ్స్ చాలా ఉన్నాయి; వాటి జ్ఞాపకాలు మన్ని బాధిస్తూనే ఉంటాయి. మనం ఎక్కడా పారేసుకోలేం వాటిని. లే భోంచేద్దాం."

"ప్లీజ్ ఈపూటకి నన్నువదిలేసి మీరు భోంచేద్దురూ."

"డోంట్ బి సిల్లీ. మనకా ఫ్రీడమ్ లేదు. మన ప్రవర్తనగురించి యిప్పటికే గుసగుసలు బైల్దేరి వుంటాయి. వాళ్ళేవరూ ఇంతకన్నా ఏమీ సృష్టించి ప్రచారంచెయ్యకుండా జాగ్రత్తపడ్డం చాలాఅవసరం పద."

కాలింగ్ బెల్ నొక్కాడు రమణ. "వస్తున్నా!"నని మూడుకంఠాలు వొక్కసారిగా జవాబిచ్చాయి కంగారుగా.

● రెండోక్లాసు చదువుతున్న లలిత, కమల స్కూలుకు పోతున్నారు.

లలిత: "మా అమ్మతో బొత్తిగా వేగలేకుండా వున్నానోయ్. కాల్చుకు తినేస్తోందనుకో."

కమల; "ఏం?"

లలిత: "నిద్రరావటం లేదు మొర్రో అంటుంటే రాత్రిపది కాకుండా పడుకోమంటుంది. ఇంకా నిద్రొస్తోందని మొత్తుకుంటున్నాసరే, ఏడింటికల్లా లేపుతుంది."

"లే" అన్నాడు రమణ.

శేషు లేచివొచ్చింది; నవ్వుతెచ్చేసుకుంది.

● ● ●

"నువ్వలా మౌనంగాఉంటే నాకు బావుండదు శేషూ. నే చెప్పిందానిగురించి ఆలోచించు. ఈ జిల్లాలో కలెక్టరు సతీమణి మహిళాసంఘానికి అధ్యక్షురాలుగా వుండడం ఆచారంట. నీ మౌనం చాలా విమర్శకు అవకాశం యిచ్చింది. నే నేమీ బదులు చెప్పలేకపోయాను."

"నా కలాటివాటిమీద నమ్మకంలేదు."

"ఒకప్పుడు ఉండేదేకద."

"ఇప్పుడులేదు."

"లేకపోతే. ఎల్లా ? అంతమందిని నిరుత్సాహపర్చడానికి మనకి హక్కులేదేమో!"

"అవును. మనకి హక్కులేదు. పొద్దున్నే చెప్పారుగా."

"నువ్వలా పొడిపొడిగా మాట్లాడి ప్రయోజనంలేదు. తేల్చేసెయ్యి అటో యిటో!"

"అంటే! నాకు ఛాయిస్ ఉంటిటా ?"

"అఫ్‌కోర్స్ లేదు!"

"ఇప్పుడే కాదు. ఎప్పుడూ నాకు ఛాయిస్ లేదు. మంచి అవనీ. చెడ్డ అవనీ. నేను నమ్మనీ. నమ్మకపోనీ. నాకు నచ్చనీ. నచ్చకపోనీ - నువ్వు చెప్పినటు మారిపోవడమే నా కర్తవ్యం!.... స్టూడెంట్‌గాఉండి మా నాన్నకి కాబోయే అల్లుడిగా ఉన్నప్పటినుంచీ కూడా అధికారం నువ్వే చెలాయిస్తున్నావు. నే నెలా ఉంటే నీకు భార్యగా ఉండడానికి తగుదునో - కాకపోతే యెలా వుంటే నీకు తగనో - అన్నీ గీతలు గీసి పెట్టేవు. నీ కోసం పుట్టింటి వాళ్ళూ అత్తింటి వాళ్ళూకూడా సమర్థులైనప్పటికీ ఫేషన్లన్నీ వొదిలేశాను. పాతకాలపు నగలు మోస్తున్నాను. ఇంగ్లీషులో నాకు నచ్చే సాహిత్యం అంతా వుండగా కృష్ణ కర్ణామృతం, శివానంద లహరీ లక్ష్మీస్తుతి, అన్నపూర్ణాస్తవం, అఖరికి వేంకటేశ్వర సుప్రభాతం - నేర్చేసుకున్నాను."

"అయామ్ సారీ శేషూ. టెరిబ్లీ సారీ.... అప్పట్లో నేనల్లా పెద్ద వుద్యోగంలోకి వస్తానని అనుకోలేదు. ఎక్కడో సంసారపక్షంగా, గుట్టుగా కాలక్షేపం చేసేస్తాం అనే అప్పటి వూహ. అలాంటప్పుడు నువ్వుకూడా సాధారణంగానే ఉంటే మంచిది కదా - ఇంతకీ మూలం పెద్దవాళ్ళు. మనిద్దర్నీ వాళ్ళు పెళ్ళి అనే పదం వాడకుండా ఎప్పుడూ వుదహరించలేదు. అంచేత నేనుకూడా నిన్ను వరాయివ్యక్తి కింద భావించడం మానేసి నాలో ఒక భాగంగా ఎంచుకున్నాను అందుకే మనకి ఏ మార్గం, ఏ పద్ధతిసేఫ్‌గా ఉంటుందీ అనే ప్రశ్నమీద అలా మాట్లాడేవాణ్ణి—"

"కరెక్ట్. కాని ఇందులో చిక్కు ఏమిటంటే, నేను మొదటిసారి నీకోసం మారిపోయినప్పుడు చాలా సంతోషంగా, హృదయపూర్వకంగా మారేను. అదో సాహసం క్రింద, ఎవరికీ జరగని అనుభవంక్రింద ఒక ఆదర్శంలా తోచింది. బి. ఏ. చదువుకునీ, కొన్నాళ్ళు నవనాగరీకంగా ఉండడం అలవాటైన నాకు-సామాన్యంగా ఉండడం, మన పాతఆచారాలను పాటించడం కష్టమనీ, కష్టమైనదాన్ని ఆచరించడ మనే సాహసం చేస్తున్నాననీ, నాకు గర్వంగాఉండేది. నాకు ఆదారి చూపించిన నిన్ను ఆ రోజుల్లో చాలా అభినందించేదాన్ని."

"నిజంగా ? థేంక్యూ."

"డోన్ట్ మెన్షన్. అయితే నా కొక చిత్రమైన అనుభవం జరిగింది........నువ్వు ఫైనలియర్‌లో ఉండగా ఐ ఏ. ఎస్‌కి వెడుతున్నానని వ్రాశావుకదా. ఆ ఉత్తరం మీ అమ్మకి అందినప్పటికి నేను మీఊళ్ళో ఉన్నాను. మీ అమ్మకి ఆ ఉత్తరం చదివి వినిపించింది నేనే. ఐ ఏ. యస్. అంటే ఆవిడకి అర్థంకాలేదు. అది పాసవుతే కలెక్టర్ అవుతావని నే చెప్పేను. సంతోషం పట్టలేక నన్ను ముద్దులాడింది మీ అమ్మ. అప్పటికి నువ్వింకా ఆ పరీక్ష ప్యాసూ కాలేదు; నేను నీ భార్యనీకాలేదు. వెంటనే వేంకటేశ్వరస్వామికి నాచేత మ్రొక్కించింది ఆ పరీక్ష పాసైతే పెళ్ళిబట్టల్తో నీ దర్శనం చేయిస్తానని! నా కింకా నమ్మకంకలగని రోజులవి. నమ్మకంలేని వాళ్ళు మొక్కుకుంటే తప్పకుండా పని జరుగుతుందని; పోవి చూడమని; ఆ మొక్కినంతసేపూమాత్రం స్వామివారి అధికృతని శంకించకుండా మనస్సుని దిటవు చేసుకోమని బోధపరిచి, నాచేతే మొక్కించింది మీ అమ్మ. అఫ్‌కోర్స్-నీ శక్తివల్లనే ఏ దేవుడి అనుగ్రహం లేకుండానే నువ్వు గొప్పవాడివి కావాలని నా కెప్పుడూ కోరిక. కాని, నేను నువ్వు చెప్పినదారిలో సగం పడి ఇలా యిలా అలవాటువల్ల దైవభక్తి పెంచుకున్నాను. ఒక్క దైవభక్తేకాదు; నువ్వు గీసిన గీట్లన్నిట్లోనూ, ఏదో మంచి అర్థం కల్పించుకొని ఆచరిస్తున్నాను........ నన్ను అడుగడుగునా మార్చగల అధికారం నీ కుండికదా అని ఇంతలా దాన్ని వినియోగించడం న్యాయంకాదు బావా."

"ఛా. అదేమిటి శేషూ అలా అంటావు! జిల్లాకి కలెక్టరైనా పెళ్ళానికి మొగుడేగా! ఆ అధికారం నీకుమాత్రం లేదూ ?"

"లేదు! కలానీ భార్యైనా, కలెక్టర్ భార్యైనా భార్య భార్యే! అధికారం లేనే లేదు!!"

"అలా జెనరలైజ్ చెయ్యడం దారుణం నేను ఉందంటున్నానుగా! ఎవరి ఊసో నీకెందుకు ?"

"ఎవరి ఊసో నాకెందుకు. నా ఊసే! నాకు నీ పంథాలూ అలవాట్లూ మార్చే అధికారం ఎక్కడిది ?- నిన్ను పంచెలూ కళ్ళాల్చీలూ కట్టుకోమని అడిగాననుకో - ఇట్‌లుక్స్ సో ఫన్నీ!"

"నేనుగాని మా వూళ్ళో ఉండిపోయి వ్యవసాయం చేసుకుంటే తప్పకుండా కట్టుకుందును!- పరిస్థితుల కనుగుణంగా."

"పరిస్థితులే మరి!- కాని నాకంటూ వేరే వుండవు. నీ పరిస్థితులే నావి; నీ అభిరుచులే నావిగా ఉండాలి. నీ పంథాలన్నిటికీ ఒక రాచకీయ కారణం ఉండాలి. దాన్ని కాదనడానికి నాకు అవకాశం ఉండదు. భార్య ఎంత తెలివిగలదీ అనే దానిమీద ఆధారపడి ఉండవు. భార్య హక్కులు. రాజానికి భార్య అధికారాలే పరిమితం.అంతే. అంతదాకా ఎందుకు ?- మనిద్దరికీ పెళ్ళి అయిననాడు, ఆ మొదటిరోజు - నువ్వు నా దగ్గిరిసా ఒస్తే నేను నిన్ను ఏమన్నానో జ్ఞాపకం ఉందా ?"

'.... ....'

"ఉండదు నాకు తెలుసు, వేళాకోళం చేస్తున్నానని ఏమీ అనుకోకు. ఏదేనా ప్రయోజనం కోసంకాదు; ఊరికే చర్చ ఒచ్చింది గనక చెబుతున్నాను. - .... ఆరోజు, నువ్వు నాదగ్గిరసా ఒస్తే, నీనోరు సిగరెట్ వాసన వేస్తోందని, కిస్ చెయ్యనివ్వలేదు నిన్ను. ఆవేళ నిన్ను నేకోరిందే నామొదటి కోరిక - సిగరెట్లు మానెయ్యమని. వెంటనే మానేస్తావని చాలా గర్వంగా అనుకున్నాను. ఎందుకంటే, నీకొక్కవల్సిన విధంగా నన్ను నువ్వు

మూసలో పోసి తయారు చేసుకున్నావు కదా, ఆమాత్రం సరదాగా అర్థం చేసుకో లేక పోతావా అని ! - నువ్వు నవ్వేసి, ఒక్కసారిగా ఎలామానెయ్యడం, క్రమంగా మానేస్తానని చెప్పేవు .... పదే పదే పిలిచి పెట్టకుండా అడగడానికి నాకు చాలా మొహమాటం వేసింది. దానిక్కూడా చాలా కారణాలు వుంటాయి. ఏదో నలుగురిమధ్య ఉండే మనిషివి, నువ్వు సిగరెట్స్ మానేశా వని ఎవరు గుర్తుపట్టినా సిల్లీ రిమార్క్స్ పడతాయి .... నేను కొన్నిసార్లు సిల్లీగానే జ్ఞాపకం చేసేను. నీ సిగరెట్ కేస్ దాచేసి, లైటర్ దాచేసిన్నీ. అది నువ్వు పట్టించుకో లేదు.

ఓసారి మనం మైసూర్ వెళ్ళేం. అక్కడ సినీమాహాల్లో నిన్ను సిగరెట్ కాలుస్తున్నావని పట్టుకున్నారు....నువ్వి క్కడ కలెక్టరని వాళ్ళకి తెలీదు. అందు కని నీకు అవమానం అనిపించలేదు. నాకు చాలా కష్టమనిపించి సిగరెట్లు మానెయ్య రాదా అన్నాను. "ఫర్వాలేదులే" అన్నావు- పోనీలే వెధవ సొద. నీకు బాధకలిగించడం నా కిష్టంలేదు."


"నోనో. బాధలేదు చెప్పు."

"అంతేనండీ - మొదటిసారి పూర్తిగా పద్ధతి మార్చుకోమంటే సహజంగా తీసు కున్నాను: ఇప్పుడు మళ్ళీ మారమంటూ వుంటే ఏదో నటనచెయ్యమంటున్నారన్నట్టు బాధగా వుంది. అంతకిమించి కష్టం ఏమీ లేదు. మీరెలా చెయ్యమంటే అలాగే చేస్తాను. నాదేంలేదు !"

రమణ లేచి నుంచున్నాడు. టిన్‌లోవి కేస్‌లోవి సిగరెట్లు అన్నీ న్యూస్ పేపర్లో పోశాడు. లైటర్ వెలిగించి పెద్ద మంట చేసేడు. బాత్‌రూమ్‌లోకి వెళ్ళి, లైటర్ అందులోవేసేసి, బాల్చెడు నీళ్ళు పోసేశాడు ఇవతలికి వొచ్చాడు. శేషూ మొహంవేపు చూడలేకపోయాడు.

"నన్ను క్షమించు శేషూ" అన్నాడు తన రెండుచేతుల్లోనూ ఆమె రెండుచేతులూ పట్టుకొని.

శేషు మాట్లాడే ధోరణిలోవుంది. "ఈ పాతివ్రత్యం ఎన్నాళ్ళులే!" అనే చవకబారు వెక్కిరింపు ఆమె నోటిదాకా వచ్చింది. కాని రమణ నిర్ణయంలో బలం ఆమెకి తెలును. నోరు జారకుండా ఆ చేతుల్ని పైకెత్తి ముద్దుపెట్టుకుంది. □□□



(గత సంచిక తరువాయి)

సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

ఆ రోజు జయంతి వెళ్ళేసరికి రోజూ కంటె ఆలస్యం అయింది. రాయవలసిన వుత్తరాలు చాలావున్నాయి. నిన్న టపా అసలు విప్పనే విప్పలేదు. రాజశేఖరం టైప్‌చెయ్యమని యిచ్చిన కాగితాలుగూడా అలాగే వుండిపోయాయి. గబగబావచ్చిన జయంతి కర్టెన్ తొలగించుకుని గదిలోకి రాబోతూనే నిర్ఘాంతపోయి ఆగిపోయింది జయంతి చేతివేళ్ళు కర్టన్‌ని గట్టిగాపట్టు కున్నాయి. గదిలో మామూలుగా తను కూర్చునే కుర్చీలో యెర్రగా, సన్నగావున్న ఒకతను కూర్చుని కాగితాలు చూస్తున్నాడు జయంతి కేం చెప్పాలో తోచలేదు. అత నెవరో తెలియదు. ఇంతకుముందు చూడ లేదు. ఇంతలో అతనే తలెత్తి "హల్లో" అని క్షణంసేపు జయంతిని పరీక్షగాచూసి "లోపలికిరండి" అన్నాడు. జయంతి యీసారి యింకొంచెం ఆశ్చర్యపోయి కళ్ళు పెద్దవి చేసుకుని చూడసాగింది.

"ఓ ! ఆ ! యిప్పుడు గుర్తుకొచ్చింది నాకు. మీరు వనితావిహార్ సెక్రటరీగాదూ! లోపలికిరండి." చనువుగా పిల్చాడు అతను జయంతి మెల్లిగా లోపలికివచ్చింది.

"యేం పనిమీద వచ్చారు? ఇన్విటేషన్ యివ్వటానికా? చందాలు వసూలు చెయ్య టానికా?" జయంతి వైపుచూస్తూ హేళనగా అడిగాడు అతను., జయంతి రెప్పవాల్చ కుండా చూడటంతప్ప మరేం మాట్లాడలేదు. ఆ చూపులకి అతను కొంచెం ఇబ్బందిగా కుర్చీలో కదిలి, "ఇలా అడుగుతున్నావేం అని కోపం తెచ్చుకుంటున్నారా? తెచ్చు కోండి. నాకభ్యంతంలేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే మీరువచ్చినవేళ మంచిదిగాదు. అతని సెక్రటరీ శివరామ్ యీ గదిలో వుండగా మీరు రాజశేఖరం దగ్గరనుంచి ఒక్క నయాపైసాకూడా తీసుకెళ్ళలేరు."

"నేను - నేను -" జయంతి మాటకోసం తడుముకోసాగింది.

"సారీ ? ఇందులో మిమ్మల్ని నేను వ్యక్తిగతంగా యేమీ అనటంలేదని మీరు గ్రహించాలి. మీరు కావాలంటే వెళ్ళి డైరె క్టుగా మీ సుమిత్రాదేవితో శివరామ్ నన్ను ఇన్‌సల్ట్ చేశాడని చెప్పండి చెప్పినా నేను భయపడను. ఆ చెప్పేటప్పుడు వనితా విహార్ అంటేనూ, అందులో వాళ్ళిలా చందాల రూపంలో పోగుచేసి డబ్బు ఖర్చు పెట్టే విషయంలోను మాకెవ్వరికీ సదభి ప్రాయం లేదని గూడా చెప్పండి.

"నేను - నేనిప్పుడు వాళ్ళకి సెక్రటరీగా లేను."

మధ్యలో అతన్ని ఆపి కొంచెం బిగ్గరగా అంది జయంతి.

"నిజంగా! అయితే వెరీ సారీ! ఎట్ ది సేమ్ టైమ్ కంగ్రాచ్యులేషన్స్ గూడా. యెందుకు మానేశారు? మీరు మానేశారా? లేక వాళ్ళు తీసేశారా?"

కొంచెం ముందుకువంగి ఆసక్తిగా అడిగాడు.

"నేను - నేనే మానేశాను" జయంతికి కొంచెం ధైర్యం వచ్చింది

అయితే యితనేనన్నమాట సెలవులో వెళ్ళిన రాజశేఖరం సెక్రటరీ.

"గుడ్! అయితే మీ ధైర్యానికి మెచ్చుకోవాల్సిందే. బై ది బై. మరి అయితే వనితావిహార్ సెక్రటరీగా కాకపోతే మీరిక్కడికెందుకు వచ్చినట్టు?" కనుబొమలు ప్రశ్నార్థకంగా పెట్టిన అతను వెంటనే మళ్లీ అర్థం అయినట్లు భావం మార్చేస్తూ "ఓ! అర్థం అయిందిలెండి. యేదయినా మరో వుద్యోగం చూపించమని. అంతేనా?"

తన మాటలు వినిపించుకోకుండా, తన మొహంలో భావాలు గమనించకుండా సూటిగా మాట్లాడేస్తున్న అతన్ని చూస్తుంటే జయంతికి కోపం, నవ్వు రెండూవచ్చాయి. ప్రశ్నవేసిన అతను జవాబుకోసం ఆగితేనా? అరసెకనుసేపుచూసి జయంతి మాట్లాడటానికి నోరుతెరిచేలోపల మళ్ళీ అతనే మాట్లాడటం మొదలుపెట్టాడు. "యే జాబ్‌కోసం ట్రైచెయ్యాలని? యేదో ఒకటిలెండి. ఆయన తప్పకుండా చేస్తారు. అలాగని ముందు మీకు వాగ్దానంచెయ్యరు. అసలేపనైనా అంతే. ఆయన చేస్తాననరు. చూస్తానంటారు. ఆ చూస్తాననటమే గట్టిగా చేస్తాననటం అయినా నాకు తెలియక అడుగుతాను. వనితావిహార్ సెక్రటరీగా ఓసారి మీరు కొన్నాళ్ళు చేసింతర్వాత మీకు మరో వుద్యోగం దొరకాలంటే సామాన్యం కాదనుకుంటాను. ఒకవేళ యెక్కడన్నా దొరికినా వాళ్ళు మిమ్మల్ని బ్రతకనివ్వరు."

జయంతి యిహ ఆగలేకపోయింది. "నేను మీరు సెలవులో వెళ్ళారని ప్రస్తుతం మీ వుద్యోగంలో జాయినయాను."

"వాట్! మీరు మీరు...." అరనిమిషంపాటు కురుస్తున్న వర్షం హఠాత్తుగా ఆగిపోయింది. అతని వాక్ప్రవాహానికి అడ్డుకట్ట తగిలినట్టయింది.

"అవును. ప్రస్తుతం - టెంపరరీగా అంటే మీరు వచ్చేవరకూ ఆయన సెక్రటరీగా చేస్తున్నాను." చెప్పిన సంగతి ఇంకోసారి దృఢంగా చెప్పింది జయంతి.

"వాట్! గుడ్‌గాడ్! జన్మలో ఎప్పుడూ ఆడపురుగైనా యీ యింట్లో వుండటానికి ఒప్పుకోని - రాజశేఖరంగారు" ఆశ్చర్యపోయి పైకి అనేస్తున్న అతను అంతలోనే సర్దుకుంటూ "ఐ యామ్ సారీ! రియల్లీ వెరీ వెరీ సారీ! రండి. మీ సీట్లో వచ్చి కూర్చోండి" అన్నాడు కుర్చీలోంచి లేచి యివతలకు వచ్చేస్తూ. అతని మొహంలో ఆశ్చర్యం యింకా స్పష్టంగా కన్పిస్తూ అలాగేవుంది. అది గమనించిన జయంతి వద్దని వారిస్తూ "లేదు. మీరువచ్చేంత వరకే నేను. మీరెలాగా వచ్చేశారు కాబట్టి ఆ స్థానం మీదే" అంది అక్కడే ప్రక్కగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

మరి అంతేగనా! శివరామ్ తిరిగి వచ్చే వరకూ తనని వుద్యోగంలో వుండమన్నాడు. ఈ లోపల తనింకో ఉద్యోగం చూసుకోవచ్చుననుకుంది. తనకి వుద్యోగం దొరకనే లేదు. శివరామ్ వచ్చేశాడు. శివరామ్ వచ్చేరోజు దగ్గరకొస్తోందని రాజశేఖరం తనకెందుకో ఒక్కసారిగూడా గుర్తుచెయ్య

లేదు. ఇప్పుడేంచెయ్యాలి తను? తనసలు యిక్కడికి అతని సెక్రటరీగా వచ్చిన తరువాత సీరియస్‌గా వుద్యోగంకోసం చూసిందెక్కడ? జయంతి గుండెల్ని యెవరో బలంగా నొక్కినట్టయింది.

"నేను తిరిగి వచ్చినమాట వాస్తవమే. కాని ఆయన సెక్రటరీగావుండబోవటంలేదు. ఒక రకంగా నేనిది రిజైన్ చెయ్యటానికే వచ్చాను." అన్నాడు శివరామ్.

"అంటే?"

"నేను మూడు నెలలుగా ప్రయత్నం చేస్తున్న వుద్యోగం ఒకటి యిప్పుడు వచ్చింది సెంట్రల్ గవర్నమెంటులో ఆఫీసర్ పోస్ట్ ఒకటి. దానికి రాజశేఖరంగారే నాచేత అప్లైచేయించారు. ప్రయత్నం చేశారు గూడా! డైరెక్టు రిక్రూట్‌మెంట్. ముందుముందు మంచి మంచి ప్రమోషన్స్ గూడా వుంటాయి. అది నాకు రావటం కేవలం వారి దయే. ప్రపంచంలో చాలా ఎమ్. ఎ. ఫస్ట్‌క్లాసులో పాసయిన వాళ్ళెంత మందిలేరు?" జయంతికి కాస్త ధైర్యం వచ్చింది. అయితే - శివరామ్ మళ్ళీ మంచి వుద్యోగంలోకి వెళ్ళిపోతాడన్నమాట!

"చెబితే ఆయన్ని స్తుతించినట్టుంటుంది. అసలు నన్నడిగితే మనకి మంచి చేసిన వాళ్ళని గురించి మాట్లాడకపోతే చెడుచేసిన వాళ్ళని గురించి మాట్లాడతామా?" శివరామ్ వాగ్ధోరణి మళ్ళీ వేగం పుంజుకుంది. "చాలా వుదార బుద్ధిగల మనిషిలెండి. నా జీవితంలో నేను చూసినంతవరకూ అంత పరోపకారిని యెక్కడా చూడలేదు. నాకసలు ఆయన సెక్రటరీగా యీ వుద్యోగం వదిలి వెళ్ళాలంటే చాలా బాధగావుంది. ఆ వచ్చే వుద్యోగంలో నాకు గౌరవం వుండచ్చు. హోదా లభించవచ్చు. కాని యీయన సెక్రటరీగా చూడగలిగినంత ప్రపంచం చూడలేం. ఆ పరిధికంటె యీ పరిధి చాలా విశాలం" కొంచెం ఆగి "ఒకే ఒక విధంగామటుకు నాకిక్కడ నుంచి వెళ్ళిపోతున్నందుకు సంతోషంగా వుంది" అన్నాడు.

"యేమిటది?" జయంతి తలెత్తి అడక్కుండా వుండలేకపోయింది.

"మా బామ్మతోపేచీ. బెజవాడ దగ్గర ఓ పల్లెటూళ్ళో - అక్కడ మాకో చిన్న పూరిపాక. కృష్ణ ఒడ్డున ఓ యెకరం పొలం వుందిలెండి. అదో వెధవ పల్లెటూరు. అక్కడ బ్రతకాలంటే గంట యుగంలా అనిపిస్తుంది. ఎలాగో కష్టపడి చదివి. గాలివాటుగా రాజశేఖరంగారి దగ్గరకి కొట్టుకొచ్చాననుకోండి. మా బామ్మ వూరికే యేదో పండగని. తద్దినంఅని. పుట్టినరోజని వంకలు

● ఏడుపుమొహం వేసుకుని ఒకమూల కూర్చున్న కొడుకుతో అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన తండ్రి: "ఏమోయ్, ఏమిటి కథ?"

కొడుకు: "ఏముంది, మామూలేగా! మీ ఆవిడకీ నాకూ మళ్ళీ పెద్ద దెబ్బలాటైంది."

పెట్టుకుంటూ రమ్మనమని వుత్తరాలు రాస్తుంది. వుత్తరాలు నాకుఅందితే చించి ప్రక్కనపారేసి నాయిష్టం వచ్చినప్పుడెళ్ళి అసలు వుత్తరాలు అందలేదు పొమ్మనే వాణ్ణి. ఒకటిరెండుసార్లు చూసి, ఆవిడా కనిపెట్టిందిలా వుంది. ఇదిగాదు పనిలాఅని ఒంట్లో బాగాలేదని, లేవటంలేదని, ఓ నాలుగురోజులపాటు పంపించమని సరాసరి ఆయనకే ఓ కార్డుముక్క రాసిపడేస్తుంది. ఈయనేమో ఆవుత్తరం రావటం ఆలస్యం. బట్టలుసర్దుకో, బట్టలుసర్దుకో అని ఊపిరాడనివ్వరు. రానూ పోనూ రైలుఛార్జీలిచ్చి, సెలవిచ్చి తీసుకెళ్ళి రైల్లో కూలేస్తారు."

"మరి మీ బామ్మగారి ఆరోగ్యం -" వస్తున్న నవ్వు ఆపుకుంటూ అంది జయంతి.

"భలేవారే. మీరు ఆవిడని చూశారంటే యీ జన్మలో కాదుకదా, మరో పది జన్మలెత్తినా ఆవిడకు సుస్తీకాదు. కనీసం తలనొప్పిగూడా రాదని గ్రహిస్తారు. అంత మంచి ఆరోగ్యం ఆవిడది."

"మరి అప్పుడేంచేసేవారు ?"

"యేం చేసేవాడిని ? ఆ చుట్టుప్రక్కల వూళ్ళన్నీ గాలించి ఓ డాక్టర్ని వెతికి పట్టుకుని బామ్మకి ఆయన డాక్టరని తెలియకుండా ఆయనకి యీవిడని చూపించి ఆవిడకేం జబ్బులేదని కులాసాగా తిరుగుతోందని డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చి రాజశేఖరంగారికి సమర్పించుకునేవాణ్ణి. ఈసారి కొంచెం డాక్టరు దొరకడం ఆలస్యం అయింది ప్రతిసారీ సర్టిఫికెట్ యిమ్మంటే వాళ్ళు నన్ను పిచ్చాడులా చూస్తున్నారు. అసలీలోపలే రాజశేఖరంగారు వెంటనే బైలుదేరి రమ్మనమని రాశారులెండి."

చివరి మాటలతో జయంతి ఆలోచనలు శివరామ్ మాటలు వదిలేసి మరోవైపుకి తిరిగాయి. అయితే రాజశేఖరానికి విషయం తెలుసునన్నమాట. తెలిసిగూడా శివరామ్‌కి పెద్ద ఉద్యోగం వస్తోందని యెందుకు చెప్పలేదు. అలా చెబితే తనెప్పటికీ యిక్కడే వుండిపోతుందని భయమా?

పరధ్యానంగా ఆలోచిస్తున్న జయంతి మళ్ళీ శివరామ్ మాటలవైపు తిరిగింది. అతనంటున్నాడు. "మీరు అదృష్టవంతులు. యెలాగంటారా? కానీఖర్చులేకుండా వూళ్ళో జరిగే ప్రతిప్రోగ్రాం ముందు వరసల్లో కాలుమీద కాలు వేసుకొని హాయిగా చూడవచ్చు. ఒకటేమిటి అన్నీ. క్రికెట్ మాచ్‌లు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్, పార్టీలు అన్నీ. ఆయన హైద్రాబాద్‌లో పేరుపొందిన పెద్ద పెద్ద క్లబ్‌లన్నింటిలోనూ మెంబరే. నిజంగా నన్నడిగితే ప్రపంచంలో ఆయన సెక్రటరీగా వున్నంత అదృష్టం యెవరికీ లేదంటాను అందులో మీరు ఆడవాళ్ళు. నిజంగా అదృష్టవంతులే మీరు."

ఏకబిగిన చెప్పుకపోతున్న శివరామ్ ఇంతలో బైటనుంచి "శివరామ్ ! యెవరితో నువ్వు మాట్లాడేది?" అన్న పిలుపు వినిపించటంతో మీట నొక్కినట్టు ఆగిపోయాడు. జయంతివులిక్కిపడి కర్టెన్‌వైపు చూసింది. బైటనాయర్‌కేదో పనిపురమాయించిన శేఖరం లోపలికి వస్తూ "యెవర్ని అదృష్టవంతుల్ని చేస్తున్నావు ?" అంటూ జయంతిని చూసి "అరె మీరువచ్చారా ?" అన్నాడు.

శివరామ్ యేం జవాబు చెప్పలేదు. నిటారుగా నిలబడి శేఖరం మాటకోసం చూస్తున్నాడు.

"మంత్రిగారికి యిస్తానని చెప్పిన ద్రాక్షతోట తాలూకు స్కీమ్స్ వున్న పేపర్స్ ఎక్కడున్నాయి. ఇందులో లేవా?" శేఖరం వెళ్ళి రాక్‌లోవున్న పేపర్లని చూస్తూ అడిగాడు.

"నే నిస్తాను" శివరామ్ వెళ్ళి రెండు నిమిషాల్లో పేపర్లు తీసి యిచ్చాడు. శేఖరం వాటిని తిరగేస్తూ కిటికీ దగ్గర నిలబడిపోయాడు. అంతసేపు కామాలు, ఫుల్‌స్టాపులు లేకుండా గడగడ మాట్లాడేస్తున్న శివరామ్ అసలు మాటనేది లేకుండా అంత నిశ్శబ్దంగా యెలా వుండగలిగాడో ఆశ్చర్యం అనిపించింది. వంటరిగా తనతోవుండే శేఖరానికి యింకెవరైనా వుంటే వాళ్ళెదుటవుండే శేఖరానికి యెంతతేడా !

కాగితాలు చూడటం పూర్తయిన శేఖరం వాటిని మడతపెట్టి తీసుకుంటూ శివరామ్ వైపు తిరిగి

"నేను చెప్పానే అనంతాచారిగారని. ఆయన్ను నువ్వెళ్ళి కలుసుకో. ఎంత త్వరగా కలుసుకుంటే అంతమంచిది. కావాలంటే కారుతీసుకెళ్ళు. అవసరం. అతనింటిదగ్గర లేకన్నా ఒకగంట - అటుయిటయినా అతనికోసం ఆగిచూసి మరీ రా" అన్నాడు.

"యస్ సర్ !" పిల్లిలా ముడుచుకుపోయి అన్నాడు శివరామ్. వెళ్ళబోతున్న శేఖరం ఆగి జయంతివైపు చూస్తూ "మీరు ఆ కాగితాలు టైప్‌చేశారా ? చెయ్యకపోతే చేసివుంచండి ఈ సాయంత్రంలోగా నాకు అవి కావాలి" అని వెళ్ళిపోయాడు. అతని వెనకే శివరామ్ గూడా వెళ్ళిపోయాడు

జయంతికి నిన్న సినిమాలో కన్పించిన శేఖరం, యితను ఒకడేనా అనే అనుమానం వచ్చింది.

టైప్ చెయ్యటం పూర్తిచేసిన తర్వాత టపాతీసి చూస్తుండగా గదిలోకి శేఖరం వస్తూ "మీరుకొంచెం త్వరగా తయారయితే నేను క్లబ్‌కి వెడుతూ మిమ్మల్ని యింటిదగ్గర దించేసి వెడతాను. కారులేదు శివరామ్ తీసుకెళ్ళాడు" అన్నాడు.

అతను ఆదేశించిన ప్రకారం జయంతి అతను లోపలికి వెళ్ళి బట్టలు వేసుకొచ్చే లోపల అన్నీ సర్దేసి రెడీగావుంది.

ఇంటికొస్తుండగా శేఖరం తనే "శివరామ్ యేమన్నాడు ?" అని అడిగాడు.

"మీ సెక్రటరీగా చేసినంత అదృష్టం - అందులో సుఖం యింకెందులోనూ లేదట" అంది జయంతి బైటకుచూస్తూ. శేఖరం నవ్వి వూరుకున్నాడు. నవ్వినప్పుడు అతనెంత బాగుంటాడు ! ఎంత దగ్గరగా అనిపిస్తాడు అనుకుంది జయంతి.

"కాని ఒకటిమటుకు తమాషా. ఇదివరకు మీకు ఉద్యోగం దొరికేవరకూ అతన్ని తిరిగి రానివ్వకూడదనిపించేది. ఇప్పుడు నాకు మళ్ళీ శివరామ్ అంతటి మంచి సెక్రటరీ దొరికేవరకూ మిమ్మల్ని వెళ్ళనివ్వకూడదనిపిస్తోంది. వెళ్ళనివ్వను గూడా." అన్నాడు స్థిరంగా. జయంతి తలతిప్పి చూడాలనుకుని బలవంతాన ఆ కోర్కెని ఆపుకుంది. కొద్దిసేపటిక్రిందటే శివరామ్ వచ్చేశాడు, తనింక ఏమిచెయ్యాలి అని భయపడిన మనసే యిప్పుడు శేఖరం యింకో సెక్రటరీ దొరికిందాకా వెళ్ళనివ్వను అంటే మళ్ళీ ఖంగారు పడుతోంది.

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంపవ గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతోపాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని. అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.

"నా సెక్రటరీగా వుండటంలో అతను యేం లాభాలు చూశాడుట?" శేఖరం తనే అడిగాడు

"మొట్టమొదటిది. ఊళ్ళోజరిగే మంచి మంచి ప్రోగ్రామ్స్ అన్నీ కానీఖర్చులేకుండా ముందువరసలో వెళ్ళికూర్చునిచూడచ్చుట."

ఈ సారి గూడా శేఖరం నవ్వాడు, నవ్వుతూ.

"అవును నిజమే ఆపని నువ్వుగూడా యెందుకు చెయ్యగూడదు?" అన్నాడు.

"నేను చేస్తున్నాను. మీ యిన్విటేషన్స్ మీద నేను, సునంద మంచి మంచి ప్రోగ్రామ్స్ చూస్తున్నాం" అని జయంతికి చెప్పాలనిపించింది. కాని పైకి చెప్పలేక పోయింది

"ఇప్పుడింటికి వెళ్ళి యేంచేస్తావు?" శేఖరం అడిగాడు.

"నేనా?" పరధ్యాసగా పలుకుతూ "ఇంటి కెళ్ళగానే స్నానంచేసి బట్టలు మార్చుకొని బామ్మ యిచ్చిన కాఫీతాగి మంచంమీద పడుకుని యేదయినా ఆలోచిస్తాను"

"యేమాలోచిస్తావు?"

"యేదయినాసరే! మనసుకేదతోస్తేఅది."

జయంతికి హఠాత్తుగా గుర్తుకొచ్చింది. శేఖరం మళ్ళీ నిన్నటిలా మాట్లాడుతున్నాడని. నవ్వుతున్నాడని.

కారు ఇంటిదగ్గరకొచ్చేసింది దిగబోయే ముందు ఆగి జయంతి హఠాత్తుగా "క్లబ్ కెళ్ళి మరి మీరేంచేస్తారు" అంది. అడిగిన వెంటనే తనకి తనే అదెంత అర్థంలేని ప్రశ్నో తెలుసుకుంది. కళ్ళు క్రిందికి వాలిపోయినాయి.

"వెళ్ళగానే ఓ మూల వెతుక్కుని కూర్చుని పేపరో, పుస్తకమో చదువుతున్నట్టు నటిస్తూ నిన్ను గురించి ఆలోచిస్తాను." జయంతి చురుగ్గా కళ్ళెత్తి చూసింది. ఈసారి శేఖరం పెదవులమీదకే గాదు కళ్ళలోగూడా చిరునవ్వు కదుల్తోంది.

జయంతి చప్పున డోరుతెరుచుకుని దిగేసింది. ఎందుకో తెలియదుగాని శేఖరం నవ్వు జయంతిని గిలిగింతలుపెట్టి బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరివచ్చేలా చేసింది. జయంతికి చూడాలనిపించినా వెనక్కు తిరిగిచూడ లేదు. బాగా ముందుకి వచ్చేసింతర్వాత శేఖరం కారుస్టార్ట్‌చేసిన చప్పుడైంది. మెల్లగా జయంతి వెనక్కుతిరిగి చూసే లోపలే కారు వెళ్ళిపోయింది.

● ● ●

రవీంద్ర భారతిలో అఖిల భారత నాట్య ప్రదర్శనల వారం జరుగుతోంది. దేశంలో వివిధ రాష్ట్రాలనుంచి పేరు ప్రఖ్యాతులున్న నాట్యకారులు వస్తున్నారు. ఇలా ఒకేసారి అనేక రకాల నాట్యాలు చూడటం ఎప్పుడో గాని పడదు. శేఖరం చూసి ప్రక్కన పడేసిన యిన్విటేషన్‌ని భద్రంగా తీసి దాచుకున్న జయంతి సునందని తీసుకుని ప్రోగ్రాంకి బైలుదేరింది. మొదటి రెండు రోజులు సునంద, జయంతి చూసేటట్టు. ఆ పైన రెండురోజులు సునంద భర్త, స్నేహితులు చూసేటట్టు. ఆ పైన మళ్ళా సునంద, జయంతి, ఇలా ప్రోగ్రాంని పంచుకున్నారు.

మొదటిరోజు కమలాలక్ష్మణ్ డాన్సు. ఆలస్యం అయిపోతుందేమో, ఆఖరి వరసల్లో కూర్చోవలసి వస్తుందేమోనని భయపడ్డ జయంతి సునంద యెంతో ముందుగా బైలుదేరి క్యూలో నిలబడి బస్సులుమారి రవీంద్ర భారతి చేరుకునేసరికి సరిగ్గా ప్రోగ్రాం ప్రారంభం అయేందుకు పట్టుమని పది నిమిషాలుగూడా లేదు.



"అబ్బ! కళ్ళు చెదుర్తున్నాయి యెన్ని కార్లో!" అంది సునంద ఆవరణలో నడుస్తూ చుట్టూ కిక్కిరిసిపోయి తళతళ లాడుతున్న కారులను చూసి.

"కార్లనేంచూస్తావు. మనుష్యుల్ని చూడు. యెన్నిరకాలో" అంది జయంతి.

"యేమోబాబూ! యిలాటిచోట్లకు వస్తే సముద్రంలో నీటి బొట్టులా అన్పిస్తుంది. మనకి మనం చాలా అల్పులం అనే భావం వస్తుందంటుకే" అంది సునంద.

"నిజం. సరిగ్గా నాకుకూడాఅలాగే అన్పిస్తుంది. ఇలాటిచోట్ల తిరగాలంటే యేదైనా

నలుగురిలో గుర్తింపబడే ప్రత్యేకత వుంటే బాగుంటుంది."

"హలో జయంతిగారు" వెనకనుంచి యెవరో పేరుపెట్టి పిలవటంతో జయంతి చివ్వున వెనక్కి తిరిగింది. సునందగూడా తలతిప్పి చూసింది. ఎదురుగుండా నీట్‌గా వున్న బట్టల్తో, కొత్తగా దొరికిన ఉద్యోగం తాలూకు హోదాతో హుందాగా నిలబడిన శివరామ్ 'నమస్తే' అంటూ చేతులు జోడించాడు.

"ఓ! మీరా!" క్షణంసేపు తడబడిన జయంతి ప్రక్కనున్న సునందని చూపిస్తూ "మా స్నేహితురాలు సునంద. సునందా! శివరామ్ అని నాముందు రాజశేఖరంగారి దగ్గర సెక్రటరీగా చేశారు."

సునంద శివరామ్‌లు ప్రతినమస్కారాలు చేసుకున్నారు. "నేనుగూడా ఓ ఫ్రెండ్‌ని పరిచయం చేస్తాను ఇతను పేరు ప్రకాశం. హోదా; మాజీమంత్రిగారి బావమరిది." శివరామ్ తన ప్రక్కనున్న వ్యక్తిని పరిచయం చేశాడు. చామనచాయగా. కొద్దిగా పొట్టిగా దానికి తగ్గ లావులోవున్న ఆవ్యక్తి కళ్ళు అప్పటికే జయంతి మొహంమీద నిలబడిపోయినాయి. జయంతి సునంద యిద్దరూ నమస్కారం చేశారు.

"నేను వుత్త ప్రకాశాన్నేనండి. మాజీ మంత్రిగారి చుట్టరికంగురించి నేను మర్చిపోయినా శివరామ్ మర్చిపోలేదు అంతే" అన్నాడు నవ్వుతూ.

"టైమయినట్టుంది. లోపలికి వెడదామా!" అన్నాడు శివరామ్.

అందరూ లోపలికి వెళ్లారు. సునంద. జయంతి వాళ్ళ ప్రక్కనే కూర్చున్న శివరామ్ ఒక్కక్షణం వూరుకోవటంలేదు. వస్తున్నవాళ్ళలో యెవరెవర్నో లేచి పలకరిస్తూనేవున్నాడు. ఏవేవో మాట్లాడేస్తూనే వున్నాడు.

"అబ్బబ్బ! శివరామ్. నువ్వు ఒక్క నిమిషం ఆగు. ఆ వచ్చేవాళ్ళు వాళ్ళంతట వాళ్ళు నిన్ను పలకరిస్తారో లేదో చూడాలి" అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

జయంతి సునంద గూడా ఫక్కుమని నవ్వారు.


"అతిగా మాట్లాడేస్తున్నా నంటావా, వెధవది. ఆ వుద్యోగంలో చేరిన తర్వాత బొత్తిగామాట్లాడటమేమర్చిపోయినట్టయింది. అక్కడికీ ఆపుకోలేక గుమాస్తాలని పిలిచి యేదో తప్పుచూపిస్తూ దానిమీద లెక్చర్లిస్తా ననుకో! వెధవది మాట్లాడకపోతే యెలాగో వుంటుంది. అందరూ అలామూగి దెయ్యాల్లా యెలా వుంటారో తెలియదు."

"అదుగో! నువ్వు మాట్లాడటం ఎక్కడ మానావ్! వాళ్ళని వదిలేసి మాతో మాట్లాతున్నావు మళ్ళా" ఈసారి ప్రకాశం కొద్దిగా సీరియస్‌నెస్ తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు.

"ఆల్‌రైట్. కాసేపు ఆఫీసులో వున్నాననుకుంటాను. అమ్మయ్య. అవసరంలేదు. అదుగో కర్టెన్ తీస్తున్నారు" అన్నాడు.

ప్రోగ్రాం మొదలైంది. జయంతి కిలాటి నాట్యాలన్నా. నాటకాలన్నా. సినిమాలన్నా ప్రాణం. మనసంతా కేంద్రీకరించి వాటిలో లీనమైపోయి చూస్తుంది. పుస్తకాలు చదివినా అంతే.

ప్రోగ్రాం అయిపోయి నలుగురూ ప్రవాహంలా వస్తున్న జనాన్ని తప్పించుకుంటూ బైట కొస్తుంటేగా శివరామ్ వున్నట్టుండి రెండడుగులు ముందుకు పరుగెత్తి నిదానంగా నడిచివెడుతున్న ఒక నడివెయసు దాటిపోయిన బట్టతలాయన చెయ్యి గట్టిగా పట్టుకుంటూ



"నమస్కారం డాక్టరుగారూ" అన్నాడు ఆత్రంగా. ఆయన, ఆయనతోపాటు ఎర్రగా లావుగావున్న ఒకావిడా ఆగిపోయారు. "శివరామ్! నువ్వా" అంటూ వెనకనుంచి తోసుకువస్తున్న జనానికి దారియిస్తూ పక్కకి నిలబడి ఆదరంగా చూస్తూ "కులాసాగా వున్నావా? యేదో పెద్దవుద్యోగం వచ్చిందన్నారు" అన్నారు.

"అవునండీ! మీదగ్గరకువచ్చి కన్పించాలని యెన్నిరోజులనుంచో ప్రయత్నం" పసిపిల్లాడిలా అన్నాడు. జయంతి, సునంద, ప్రకాశం వాళ్ళ దగ్గరగావచ్చి ఆగారు.

"నా స్నేహితులు వాళ్ళు. పరిచయం చెయ్యనా!" అంటూ ప్రకాశంవైపు తిరిగి "ప్రకాశం! నీకు తెలుసా? వీరు సుబ్రహ్మణ్యంగారని."

"తెలుసు. కాని పరిచయంలేదు." అన్నాడు ప్రకాశం.

"ఈ అమ్మాయి జయంతి. మన రాజశేఖరంగారికి సెక్రటరీగా పనిచేస్తోంది. ఆమె జయంతి స్నేహితురాలు."

"ఎవరు, రాజశేఖరం సెక్రటరీనా?"

డాక్టరుగారు నమ్మలేనట్టు అడిగారు. క్షణంసేపు ఆయన చూపులు కళ్ళజోడులోంచి జయంతిని నిశితంగా పరిశీలించినాయి.

"అవునండీ! నేను ఆమె చేరిన తర్వాతనే కొత్త జాబ్‌లోకి వెళ్ళాను."

జయంతిని చూస్తూనే డాక్టరుగారి కళ్ళు యెందుకో కుంచించుకుని మళ్ళీ వెడల్పాయినాయి ప్రక్కగా నిలబడి భార్య భుజం తాకుతూ "కావుడూ! ఈ అమ్మాయిలో నాకు గీత పోలికలు కన్పిస్తాయేమిటీ?" అన్నారు.

"పోలికలు కాదండీ. గీతే. మనమ్మాయిలానే వుంది."

కామేశ్వరమ్మగారు హఠాత్తుగా జయంతిని భుజాలుపట్టి దగ్గిరకు లాక్కుంటూ "నీ పేరేమిటన్నావు?" అన్నారు. అప్పటికే ఆవిడ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

అనుకోకుండా జరిగిన యీ సంఘటనని మిగతా ముగ్గురూ సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు.

క్షణంసేపు తెల్లబోయిన జయంతి ఆవిడ కౌగిలిలో అలాగేవుండి అస్పష్టంగా "జయంతి" అంది.

"రాజశేఖరం సెక్రటరీగా చేస్తున్నావా? ఒక్కనాడన్నా మాకు చెప్పలేదే అతను" అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"అందరూ వెళ్ళిపోయారు మనం నడుద్దామా" చుట్టూ చూస్తూ అన్నాడు శివరామ్.

అందరూ బైటకొచ్చారు. డాక్టరుగారి భార్య జయంతి చేతిని అలాగట్టిగా పట్టుకునే బైటకు వచ్చింది.

"మీ రంతా యెలావెడతారు?" అన్నాడు శివరామ్.

"నా కారులో డ్రాప్‌చేద్దాంలే. కాని కొంచెం యిరుకవుతుందేమో" సందేహంగా చూస్తూ అన్నాడు ప్రకాశం.

"ఫర్వాలేదు. సర్దుకుందాం" అన్నారు డాక్టరుగారు.

అందరూ ప్రకాశం కారులో యెక్కారు. ముందు సుబ్రహ్మణ్యంగారిని దించేశారు. వాళ్ళు దిగిపోయేముందు జయంతిని, సునందని మళ్ళీ రమ్మని మరీమరీ చెప్పి జయంతి వాళ్ళు వచ్చినట్టయితే తాముగూడా వాళ్ళ యిళ్ళకి వస్తామనిచెప్పారు. జయంతిని డాక్టరుగారి భార్య వదల్లేక వదల్లేక వదిలింది.

వాళ్ళని దింపేసి వస్తుండగా "చిత్రంగా వుందే!" అంది సునంద.

"లేదు. వాళ్ళకి ఒకే ఒకకూతురు. అదే గీత అన్న అమ్మాయివుండేదిట. ఆ అమ్మాయి రెండు సంవత్సరాలక్రితం గుండెజబ్బుతో చనిపోయింది. ఆ దెబ్బ నుంచి వాళ్ళింకా కోలుకోలేదంటారు. ఆ అమ్మాయి జయంతిలా వుంటుందికాబోలు. నాకూ తెలియదు." ముందు సీటులో కూర్చున్న శివరామ్ చెప్పాడు.

"పెంచుకుంటారేమో అడగకూడదూ! కొత్త యిల్లు వాకిలి వున్నవాళ్ళలావున్నారు" డ్రైవ్ చేస్తున్న ప్రకాశం నవ్వుతూ అన్నాడు. సునంద, శివరామ్ గూడా నవ్వారు.

జయంతి కెందుకో ఆవిడ మాటల్లో ఆ ఆదరణా, అప్యాయతా చాలనిపించింది.

సునందతోపాటు జయంతి గూడా వాళ్ళింటిదగ్గరే దిగేసింది

"యెందుకు! మీ యింటిదగ్గర డ్రాప్ చేసేస్తాం. మళ్ళీ మీ రెలా వెడతారు?" అన్నాడు శివరామ్.

"ఫర్వాలేదు. ఈరోజు సునంద అతిథిని. భోజనాలు అయింతర్వాత భార్యాభర్తలిద్దరూ వచ్చి నన్ను యింటిదగ్గర దించేస్తారు" అంది జయంతి చేతులుజోడించి శలవుతీసుకుంటూ

"మళ్ళీ కన్పిస్తాం. మర్చిపోకండి" అన్నాడు ప్రకాశం కారు స్టార్టుచేస్తూ.

"అలా అబద్ధం యెందుకు చెప్పావు?" అంది సునంద యింటిగడప యెక్కుతుండగా.

"ఎందుకో వాళ్ళతో వెళ్ళటం నాకు ఇష్టంలేదు. అంతే భయం అనిగాదు. వాళ్ళు రాజశేఖరంలా సందుచివర ఆపేలా లేరు. ఆపమని అడగటంకూడా అంత బాగా అన్పించలేదు" అందుకనివద్దన్నాను" అంది.

తర్వాత సునంద, భర్తా కలిసి జయంతిని యింటికి తీసుకొచ్చి దించి వెళ్ళారు.

● ● ●

పై సంఘటన జరిగిపోయిన దాదాపు వారంరోజులకి ఓ రోజు ఉదయం జయంతి టైప్‌చేసిన కాగితాలు సరిచూస్తుండగా శేఖరం "డాక్టర్ సుబ్రహ్మణ్యంగారిని కలిశావా" అని అడిగాడు.

"యే డాక్టరు?" తలెత్తుతూ అర్థంకానట్టు అడిగింది.

"ఆరోజు రవీంద్రభారతిలో శివరామ్ పరిచయంచేసిన ఆయన."

"ఓ! అవును" జయంతికి గుర్తొచ్చింది. ఆవిడంతగా ఆరోజు మరీమరీ చెప్పినా జయంతి మళ్ళీ వెళ్ళనేలేదు. శేఖరం తర్వాత యేమనలేదు. కాగితాలు చూస్తూండిపోయాడు.

కొద్దిసేపయినతర్వాత తనే "యేం" అని అడిగింది.

"ఏం లేదు. నిన్న వాళ్ళింటికివెడితే నీవిషయం వచ్చింది. నువ్వు వాళ్ళమ్మాయి గీతలా వుంటావని ఆరోజు మొట్టమొదట నిన్ను చూసినప్పుడే అనుకున్నాను. నువ్వు నా సెక్రటరీగా చేరినతర్వాత ఒకసారి రెండుసార్లు చెప్పాలి అన్పించినా వాళ్ళిప్పుడిప్పుడే కొత్త మర్చిపోతున్న విషయాన్ని మళ్ళీ గుర్తుచేసి పాతగాయాన్ని రేపినట్టవుతుందని వూరుకున్నాను."

"వాళ్ళని నేనెప్పుడూ వనితావిహార్‌లో వుండగా చూడలేదు."

"చూసే అవకాశంలేదు. వాళ్ళుచాలా పాతకాలం మనుష్యులు. ఏదయినా నీకెప్పుడైనా వీలయితే అలా వాళ్ళింటికి వెడుతూండు. చాలా మంచివాళ్ళు. నిజమైన ఆత్మీయత నిచ్చే మనుష్యులు."

జయంతి వింటుండి పోయింది. వీళ్ళసరే! వనితావిహార్ వాళ్ళకి తన సంగతి తెలియలేదా! తెలిసే వూరుకున్నారా? తనమీద వాళ్ళు విసరబోయే బాణాల్నిగురించి, అనబోయే మాటల గురించి రకరకాలుగా వూహించుకుంది, కాని ఆశించింది యేం జరగలేదు.

ఆరోజు సినిమాలో చూసిగూడా రేఖారాణి పట్టనట్టు వూరుకుందే! జయంతి నోరుతెరిచి వాళ్ళసంగతి అడగబోతుండగా కాగితాలు చూడటం పూర్తిచేసిన శేఖరం వాటిని తీసుకుని గదిలోంచి వెళ్ళిపోయాడు. జయంతి ప్రశ్న నోటిలోనే ఆగిపోయింది. రాజశేఖరంతో అంతపరిచయం వున్నవాళ్ళంతా యింటికెందుకురారో జయంతికి అర్థంగావటంలేదు. తను వచ్చిన యిన్నిరోజుల్లో యే ఒక్కరూ యింటికి వచ్చినట్టు కన్పించలేదు. ఎందుకోమరి బైట అంత చనువుగావుండే మనిషి-ఒంటరివాడు-అతనింటికివస్తే యెవర్ని యెవరు కాదంటారు?

కంపెనీవాళ్ళుగూడా యింటికి యెక్కువ రారు. వచ్చినా రాజశేఖరం హాల్లో మాట్లాడి వంపేస్తాడు. ఎప్పుడు చూసినా యిల్లు నిశ్శబ్దంగానే వుంటుంది. ఆ నిశ్శబ్దంలో

● మేష్టారు : "ఏమోయ్ రామూ! ఎప్పుడూ అలా ఒక్కడివే కూచ్చుంటావ్, స్నేహితులెవరూ లేరా నీకు?"

రాము : "ఒకడున్నాడుగానండి, వాడికీ నాకూ పడదండి."

రాజశేఖరం వుందీ లేందిగూడా తెలియదు. తను చాలా అనవసరమైన విషయాన్ని గురించి ఆలోచిస్తోందన్న సంగతి గుర్తొచ్చిన జయంతి టైప్‌చెయ్యసాగింది.

● ● ●


ఆరోజు జయంతి వెళ్ళేసరికి రోజూ కంటె ఆలస్యం అయింది. కంపెనీ మీటింగ్స్ ఏవో జరుగుతుండటం వల్ల మామూలుగా జయంతి వచ్చే పోయే కారు గూడా ఆఫీసుదగ్గరే వుండిపోయింది.

"ఒక్క నాలుగురోజులు మీరు కొంచెం యిబ్బంది పడాల్సి వస్తుంది" అన్నాడు శేఖరం.

"ఫర్వాలేదు" అంది జయంతి.

ఈరోజు జయంతి వచ్చేసరికే అప్పటికే తయారై వున్న శేఖరం హడావుడిగా గదిలోకి వచ్చి "అవిగో - ఆపేపర్లుచూడండి. రాత్రంతా కూర్చునిరాశాను. అవి చాలా వున్నాయనుకోండి. ఎలాగైనా సరే సాయంత్రం మీరు వెళ్ళేలోపల టైప్‌చేసి పెట్టి వెళ్ళిపోండి" అని వెళ్ళిపోయాడు.

జయంతి కాగితాలు తీసుకుని చూసింది. చాలా వున్నాయి. జాగ్రత్తగా తప్పులు చెయ్యకుండా రిపీట్ లేకుండా చేస్తే తప్ప అవవు ఈరోజువుదయం లేచినప్పటినుంచి యెందుకో అసలు విసుగ్గావుంది. ఉద్యోగం దొరికేవరకూ దొరికితే చాలని బాధపడింది. దొరికిన తర్వాత అది కొంచెం అలవాటయిపోయింతర్వాత మళ్ళీ యేదో కొత్తదనం కావాలంటే యెక్కడనుంచి వస్తుంది! ప్రపంచంలో ప్రతిమనిషికీ జీవితం ఎక్కడో అక్కడ ఆగిపోక తప్పదు. ఆస్కార్‌వైల్డ్ అన్నట్టు ప్రపంచంలో రెండే రెండు గొప్ప విషాదాలు. ఒకటి: అనుకున్నది కాక



పోవటం. రెండోది అనుకున్నవి అయిపోవటం. ఆమాట యెంత నిజం! యెంత అనుభవంతో చెప్పింది. పరధ్యాసగా ఆలోచిస్తున్న జయంతి టైప్‌చేసిన కాగితాలు తీసేసి మళ్ళీ తెల్లకాగితాలు టైప్‌రైటర్‌కి బిగించబోతూ ఆగి టైప్ చేసిన మేటర్ ఒకసారి చూసుకుంది. అన్నీ తప్పులే. మాటలకి చివర అక్షరాలులేవు. మాటకి మాటకి మధ్యలో వుండవలసిన స్థలం సరీగ్గా వదల్లేదు. ఫుల్‌స్టాప్‌లకి క్వశ్చన్ మార్కులు. పెద్దక్షరాలకి చిన్నక్షరాలు వున్నాయి.

జయంతి గబగబా ఆ కాగితాలన్నీ తీసి చించి క్రింద బుట్టలోపారేసి మళ్ళీ మొదటినుంచీ టైప్‌చెయ్యసాగింది. మనసు ఒకోసారి కోతిలా మారుతుంది. ఎంతపట్టుకుని ఆపినా ఆగకుండా మెల్లిగా తప్పించుకుని పారిపోయి తనిష్టం వచ్చినట్టు గంతులేస్తుంది. ప్రస్తుతం జయంతి పరిస్థితి అలాగేవుంది.

సాయంత్రం అయ్యేసరికి శేఖరం కావాలని చెప్పినదాంట్లో సగంకూడా పూర్తికాలేదు. అక్కడికీ మామూలుగా వుండేటైమ్ కంటే రెండు గంటలు యెక్కువుందిగూడా. ఎన్నడూ లేంది ఈరోజు అందులో శేఖరం అవసరంగా కావాలని ప్రత్యేకంగా కోరిన రోజున యిలా తప్పులెందుకొస్తున్నాయో, తనెందుకు టైప్ చెయ్యలేకపోతోందో జయంతికి అర్ధంగాలేదు.

ఓచెంప చీకటి పడిపోతోంది. రెండు బస్సులు మారి నాలుగు ఫర్లాంగులు నడిస్తేగాని యిల్లనేది కన్పించదు రెండుబుగ్గల్ని గుప్పెట్లో అన్చుకుని దిగులుగా రాజశేఖరం రాసిన కాగితాలవైపు, తను టైప్‌చేసిన కాగితాల వైపు చూస్తూ కూర్చుండి పోయింది. ఏం చెయ్యటం! ఏం పాలుపోవటంలేదు. ఉండటమా! వెళ్ళిపోవటమా! ఉంటే చాలా ఆలస్యం అవుతుంది. ఆలస్యం అవుతుందనేంగూడా ప్రశ్నగాదు, తనివాళ అసలు టైప్ చెయ్యలేదు. బలవంతంగా కూర్చుని చేసినా అన్నీ తప్పులే వస్తాయి. కళ్ళు వాల్చుకుని కాగితాలవైపు చూస్తున్న జయంతి 'హలో! మీరున్నారే" అని యెవరో అనటంతో వులిక్కిపడి తలెత్తింది "ఇంకా యింటికి వెళ్ళిపోలేదూ!"

చేతివాచీ చూసుకుంటూ శివరామ్ లోపలికి వచ్చాడు.

"ఓ! మీరా" సర్దుకుంటూ అంది జయంతి.

"ఆఫీసునుంచి యింటికెడుతూ ఓసారి బాస్‌ని కలిసి వెడదామని వచ్చాను. కొద్దిగా వుద్యోగరీత్యా చిన్న పనుంది" అంటూ జయంతి కెదురుగుండావున్న కుర్చీలో కూర్చున్నాడు.

"లేరు యిప్పుడు రారనుకుంటాగూడా" టేబిల్‌మీద కాగితాలు సరిచేస్తూ అంది జయంతి.

"సహజంగా యిప్పుడు యింట్లో వుండే సమయమేనే."

"అవుననుకోండి" జయంతి ప్రస్తుతం జరుగుతున్న మీటింగ్స్‌ని గురించి చెప్పింది.

● తండ్రి: "ఒరేయ్. ఎందుకురా ఆవుక్కని తోకపట్టుకుని లాగుతావ్?"

కొడుకు: "నేను వూరికే తోక పట్టుకున్నాను నాన్నా. అదే నన్ను లాగుతోంది."

"ఓ ! అయితే రెండుమూడు రోజుల వరకూ మనం ఆగటం మంచిది ఆల్‌రైట్ వస్తాను" అంటూ లేచి వెళ్ళిపోయి గుమ్మందగ్గిర హఠాత్తుగా ఆగిపోతూ చటుక్కున యేదో గుర్తువచ్చినవాడిలా వెనక్కి తిరిగి "బైదిబై-మీరూ యింటికెళ్ళే ప్రయత్నంలోనే వున్నట్టున్నారు. మీ కభ్యంతరం లేకపోతే నా కారులో లిఫ్ట్ యిస్తాను గవర్నమెంట్ నిన్ననే నాకు కారుయిచ్చింది. అందులో మొట్టమొదట లిఫ్ట్ మీకేయిచ్చే భాగ్యం నాకు కలుగుతుంది" అన్నాడు.

కాగితాలు సర్దుకుంటున్న జయంతి తలెత్తి కిటికీలోంచి బైటకుచూసింది బైట బాగా చీకటిపడిపోయింది. తనెలాగూ యింటికెళ్ళటానికే నిశ్చయించుకుంది. పోనీ వెళ్ళిపోతే ?

"యేమంటారు ?" శివరామ్ గుమ్మంలో నిలబడి సమాధానంకోసం యెదురుచూస్తున్నాడు.

"వస్తాను. ఒక్కనిమిషం వుండండి" అంది, కాగితాలు బొత్తిపెడుతూ.

"ఒక నిమిషంగాదు ఒక గంట అయినా ఆగటానికి నాకభ్యంతరంలేదు. నాకవతల పనేంలేదు" అన్నాడు మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుంటూ.

ఇద్దరూ బైటకొచ్చేశారు. దారి పొడుగునా శివరామ్ ఆఫీసు సంగతులు ఆ సంగతులు యీ సంగతులు అన్నీ యేకరువు పెడుతూనే వున్నాడు. మధ్యమధ్య అతను చెప్పిన తమాషాలకి, ఆ చెప్పే విధానానికి జయంతి ఫక్కుమని నవ్వకుండా వుండలేకపోయింది.

"మీ నవ్వెంత బాగుంటుంది. ఏదీ యింకోసారి నవ్వండి" అన్నాడు శివరామ్. జయంతి బుగ్గ లెర్రబడినాయి.

కోడ్డు చివరే ఆపేయమంటున్న జయంతివైపు ప్రశ్నార్థకంగా చూశాడు శివరామ్.

"సారీ ! యింకోసారి తప్పకుండా యింటికి ఆహ్వానిస్తాను" అంది జయంతి యెలాగో.

"పర్వాలేదులెండి. ఇంకోసారి మీరు పిలవకపోయినా యింట్లోకి వచ్చి అందర్నీ పరిచయం చేసుకునేది ఖాయం. వస్తాను. మర్చిపోకండి." అంటూ వెళ్ళిపోయాడు.


ఇంటికొస్తున్న జయంతి కెందుకో అలసట పోయినట్టు హాయిగా హుషారుగా వున్నట్టు అన్పించింది. శివరామ్ మాటల్తో యెలాటి మనిషిగూడా తనని తను మర్చిపోయి హాయిగా నవ్వేయ్యగలడేమో అన్పిస్తుంది. జయంతి యింటికొచ్చిన తర్వాత గూడా కారులో వస్తుండగా చెప్పిన తమాషాలే గుర్తు రాసాగినాయి.

"ఏవిటే నీలో నువ్వేనవ్వుకుంటున్నావు. సునంద వచ్చి వెళ్ళింది" అంది బామ్మగారు.

"అలాగా." జయంతి యింకా నవ్వుతూనే అంది.

● ● ●

మర్నాడు జయంతి రోజూకంటె గంట ముందే వచ్చింది. వస్తుంటే నిన్న తను టైప్ చెయ్యకుండా వదిలేసి వచ్చిన కాగితాలు చూసి ఈరోజు శేఖరం యేమంటాడో అనిపించింది. తను చేరిన తర్వాత యిన్నిరోజులలో అతను విసుక్కోవటంగాని, కసురుకోవటంగాని యేం చెయ్యలేదు. అసలు తను అవకాశం యివ్వలేదు కూడా ! ఈరోజు తప్పకుండా యేదయినా అనచ్చు అనుకుంటూ గది గుమ్మంలో అడుగుపెట్టింది ; గది కర్టెన్ తొలగిస్తూనే లోపల కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారి పోయింది.



గదిలో శేఖరం తను కూర్చునే కుర్చీలో కూర్చుని టైప్ చేస్తున్నాడు. ఓ ప్రక్క తెల్లకాగితాలు రాసిన మేటర్ వుంది. ఇంకో ప్రక్క టైప్ చేసేసిన కాగితాలు పడి వున్నాయి. అతన్ని చూస్తుంటే చాలాసేపటి నుంచి టైప్ చేస్తున్నట్లుగా జుట్టు చెదరిపోయి, మొహం అలిసిపోయినట్టుంది.

బొమ్మలా గుమ్మంలో కర్టెన్ని గట్టిగా పట్టుకుని నిలబడిపోయిన జయంతిని తలెత్తి చూస్తూ "రండి" అన్నాడు మామూలుగా. అతని కళ్ళుగూడా నిద్రమత్తుగా వున్నాయి.

జయంతికి ఒకడుగు ముందుకువేసి గదిలోకి రావటంకంటే రెండడుగులు వెనక్కివేసి పారిపోవటం వుచితం అన్పించింది.

"మీరు చేసిపెట్టివెళ్ళిన ఆ కొద్ది మేటర్‌లోగూడా అక్కడక్కడా తప్పులున్నాయి. అందుకని మొదటినుంచి చేస్తున్నాను. కూర్చోండి అలా. అయిపోవచ్చింది" అన్నాడు.

టకటక అంత స్పీడుగా టైప్‌చేస్తున్న అతన్ని చూస్తుంటే జయంతికి మతిపోయింది. రాజశేఖరానికి టైప్‌వచ్చివుంటుందన్న సంగతి తను కల్లోగూడా వూహించలేదు.

జయంతిని అలా కూర్చోపెట్టి, అతను మిగతాది అంతా టైప్ చేసేశాడు. మధ్యలో అతన్ని ఆపి లెమ్మని తను చెయ్యగలనని చెప్పాలని నరనరంలోనూ అన్పించినా జయంతి చెప్పలేకపోయింది.

టైప్ చెయ్యటం పూర్తయిపోయిం తర్వాత అతనే గబగబా కాగితాలు సరీగ్గా పెట్టుకున్నాడు. వెళ్ళిపోయేముందు ఆగి వాచీ చూసుకుంటూ" నాకు టైమైపోయింది వెడతాను. ఈరోజు మీకెక్కువ పనిలేకపోతే త్వరగా వెళ్ళిపొండి. నేను వెళ్ళగానే కారు మీకు పంపించేస్తాను' అని చెప్పి వెళ్ళిపొయ్యాడు.

కూర్చున్నచోటనే అలాగే వుండిపోయిన జయంతికి పదినిమిషాలు పోయిం తర్వాత నాయర్ టిఫిన్, కాఫీ తెచ్చి యిచ్చాడు. జయంతి కెందుకో ఈరోజు సిగ్గుతో ప్రాణం పోతున్నట్టుగా వుంది. తనిక్కడికి ఉద్యోగం చెయ్యటానికి వస్తోంది - కాఫీ టిఫిన్లకోసం వస్తోందా!

"నాయర్! రాత్రి అయ్యగారెన్నిగంటలకి వచ్చారు?" నాయర్ దగ్గర సంగతి తెలుసుకోవటంకోసం టిఫిన్ప్లేటు చేతిలోకి తీసుకుంది.

"11.30 దాటిపోయింది."

"ఈ గదిలో ఎన్నింటివరకూ వున్నారు."

"రెండు గంటలవరకూ."

"రెండు అని నీకెలాతెలుసు?"

"ఒంటిగంటకి టీ కలిపి యిమ్మంటే లేచి కలిపి యిచ్చాను." జయంతి కాఫీ కప్పు చేతులోకి తీసుకుంటుండగా ఈసారి నాయరే చెప్పాడు "రాగానే మిమ్మల్ని గురించి అడిగారు."

"యేమని?"

"యెన్నిగంటల కెళ్ళిపోయారని."

"యేమనిచెప్పావు?"

"ఆరుగంటలకి శివరామ్ రాగానే యిద్దరూ కలిసి వెళ్ళిపోయారని చెప్పాను."

నాయర్ కప్పులు ప్లేట్లు తీసుకుని వెళ్ళిపోయాడు. జయంతి మొహం యెర్రబడింది. మొహంలోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. "ఛీ-ఛీ" అనుకుంది.

● ● ●

ఆ రోజు పుదయం అప్పుడేవచ్చి గదిలో కూర్చుని పోస్ట్ చూసుకుంటోంది జయంతి. శేఖరం వూరువెళ్ళి దాదాపు వారంరోజులవుతోంది. మరో నాలుగురోజుల వరకూ రాలేనని నిన్ననే వుత్తరంవచ్చింది. చెయ్యవలసిన పనిగూడా యేమంతగాలేదు. పోస్ట్లోవచ్చిన టపాగూడా చాలా కొద్దిగానేవుంది. అందులో ఒకటి రెండు వుత్తరాలు తప్పిస్తే మిగతావన్నీ శేఖరం తను స్వయంగా జవాబులు యివ్వవలసినవే. ఉన్నపనేదో అరగంటలో ముగించేసుకున్న జయంతి ఆరోజు పోస్ట్లో పత్రికలు ముందు వేసుకుని బొమ్మలు చూడసాగింది. శేఖరం పేరుమీద ఫారిన్నుంచి అనేకరకాల మాగజైన్స్ వస్తాయి. ఆ పత్రిక లన్నిటిని జయంతి బొమ్మలుచూసి ప్రక్కనపెడుతూ వుంటుంది. ఇన్నిపన్లమధ్య సతమతమౌతూ క్షణం వూపిరిలేకుండా తిరిగే శేఖరానికి యీ పత్రికలన్నీ చదివేందుకు టైమెక్కడ లభ్యం అవుతుందో అర్థంగాదు.

చేతిలోవున్న పత్రిక చూడటం అయిపోవటంతో దాన్ని ప్రక్కన పడేసి లేచి కిటికీ దగ్గరగావచ్చి నిలబడింది. బైటయెంత అందంగావుంది. శేఖరం యింటికి నాలుగు వైపులా విశాలంగా ఆవరణవుంది. ఇప్పుడు ఈ కిటికీలోంచి చూస్తే కన్పించే ఆవరణలో మాలతి, సన్నజాజి, బటానీపూలమొక్కలు మామిడి, సపోటా ఫలవృక్షాలు వున్నాయి. నిలువుగావున్న సపోటా చెట్టుని యెర్రటి చిన్నచిన్న పూలతో గుత్తులు గుత్తులుగా విరగబూసి పెనవేసుకుపోయిన బటానీ తీగె సన్నగా వీస్తున్నగాలికి వయ్యారంగా అదో పధమైన శీలితో తలూపుతోంది. దాని ప్రక్కనే వేసిన పందిరి చాలక క్రిందికల్లుకుని నేలమీద పాకిపోయిన రాధామాధవం మనుష్యులు చూడకుండా నడిస్తే కాళ్ళక్రింద పడి నలిగిపోయేటట్టు కాలిబాటమీదకు పాకి వుంది. పైకి వెళ్ళటానికి ఆధారంవున్న

బటాణీ తీగ సపోటా చెట్టుని పెనవేసుకుని పైకి పాకి హాయిగా ఆకాశంలోకి చూస్తూ అందంగా నవ్వుతోంది.

జయంతి కెందుకో పరీక్షగా ఆచెట్టువైపు చూస్తే-మనుష్యులుగూడా అంతే. ఆధారం వుంటే అలా పైకి రాగలరు. ఆడా మగా యెవరైనా సరే. సరైన ఆధారం లేకపోతే రాధా మాధవం లాగానే నేలమీదనే ప్రాకుతూ మనుష్యుల కాళ్ళక్రింద పడి నలిగిపోతుంటారు. అదృష్టవంతులెవరైనా వుంటే మాలిలాటి వాళ్ళెవరైనా జీవితంలో ప్రవేశించి సుతారంగా జీవిత లతను పైకెత్తి ఆధారంమీదకు అన్చి వెళ్ళిపోతారు. ఎవరి సంగతో యెందుకు? తన జీవితాన్ని తను పరికించి చూసుకుంటే అలాటి ఆధారం తనకేమయినా వుందా! ఏమీలేదు. అందుకే తను జాగ్రత్తపడాలి.

జయంతికి హఠాత్తుగా తన జీవితం అంతా వృధా అన్నట్టు, పొందవలసింది యింకేదీ లేదన్నట్టు అనిపించసాగింది. ఏముంటుంది తనకి? ఇలా యెక్కడో అక్కడ వుద్యోగం చేస్తూంటుంది. రోజులు గడిచిపోతుంటాయి వయసు మళ్ళిపోయే లోపల యెవరో ఒకరు పెళ్ళిచేసుకుంటారు. పిల్లలుపుడతారు. అప్పుడు ఈ ఆలోచనలకి గూడా అవకాశం వుండదేమో! అయిపోతుంది జీవితంకాస్తా. ముసలమ్మగా మారిపోయి, నెరిసిపోయిన జుట్టుతో, లావుగా మారిన శరీరంతో సంతానాన్నిగురించి మనుమలగురించి కబుర్లుచెప్పుకోవాలి. అంతకంటే యింకేం మిగులుతుంది! మనిషన్న ప్రతివాళ్ళకి బాల్యం సంతోషంగా గడిచినా గడవకపోయినా యౌవనంలో కొన్ని అనుభూతులు చిరస్మరణీయంగా మనస్సులో ముద్రవేసుకునేంతటి బలమైన సంఘటనలు లభించాలి. ఈ సంఘటనలు గుర్తొస్తే వెన్నెల్లో కూర్చున్నట్టు, సెలయేరు సంగీతం వింటున్నట్టు, వయసుమర్చిపోయి మళ్ళీ ఆక్షణాల్లో జీవిస్తున్నట్టు అనిపించేలా వుండాలిగాని, గుర్తొస్తేనే ఒళ్ళు జలదరించేటట్టు, మనసు యేవగింపుతో ముడుచుకుపోయేటట్టు వుండకూడదు. యౌవనంలో లభించిన అందమైన ఈ అనుభవాలతాలూకు స్మృతులు వార్ధక్యంలో మనిషికి 'జీవిత చరమాంకంలో ప్రవేశించాం, జీవితం ముగించుకుంటున్నాం' అనే సంగతి గుర్తుకురానీయకుండా, ఒకవేళ వచ్చినా 'అయిపోయినా చాలు. ఈ జన్మకి యీ అనుభూతులుచాలు. ఈ తృప్తిచాలునాకు' అనుకునేటట్టు వుండాలి. ఉండాలి, వుండితీరాలి అనేమాట అందరూ ఒప్పుకుంటారు. కానీ అందరి జీవితాలకి అలాటి అదృష్టం దొరుకుతుందా! రేపు తన జీవితం యెలా గడవబోతుందో! తను నడవబోయే జీవితపు బాట

● "మా ఆవిడ కెంత సేపూ డబ్బుపిచ్చి. ఆఫీసునుంచి ఇంటికి రావడం భయం. రూపాయి కావాలి, రెండు రూపాయలు కావాలి, మూడు రూపాయలు కావాలి అని ఒకటే వేధిస్తుంది."

"ఏం చేస్తుందోయ్ అంత డబ్బు?"

"ఏమో: నేనెప్పుడూ ఇవ్వలేదుమరి."

ప్రక్కన గులాబిపొదలే వుంటాయో మళ్ళ కంపలే మిగులుతాయో! ఇన్ని ఆలోచనలు అలా యెందుకొచ్చినట్టు! ఆ బటాని తీగెనిచూస్తే! ఇక్కడనుంచి చూస్తే కంటికింతబాగా అహ్లాదంగా కన్పిస్తుంది కాబట్టే శేఖరం గదిలో వున్నప్పుడు మాటిమాటికి కిటికీదగ్గిరకెళ్ళి నిలబడుతూవుంటాడు అనుకుంది.

శేఖరం అంటే మళ్ళీ యింకొకవిధంగా ఆలోచనలు గుర్తుకొస్తాయి. ఈఉద్యోగంలో చేరేటప్పుడు యిది చాలా తాత్కాలికం అని యింకో ఉద్యోగం వెంటనే చూసుకునేదాకా మాత్రమేఅనుకొంది. అసలా విషయం ఈ మధ్యతను మరీ బొత్తిగా మర్చిపోతోందే! ఏకళనున్నారో, అసలు రహస్యం యేమిటో తెలియదుగాని, వనితా విహార్‌వాళ్ళు తను వూహించినట్టుగా వరసగా నిలబడి కత్తులు దూయలేదు. ఆదొకరకంగా నయమే. ఈ లోపలే తను యింకో ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోతే మర్యాదగా వుంటుందేమో; ఒక వేళ తనకిచ్చిన యీ ఉద్యోగం చాలా తాత్కాలికం అని శేఖరం వాళ్ళకి నచ్చ చెప్పాడేమో కూడా!

వచ్చిన కొత్తలో శేఖరం ఒకటి రెండు చోట్ల తనచేత అప్లికేషన్లు పెట్టించాడు. ఆ ఆఫీసులనుంచి - అందులో ఒకటి ప్రయివేట్ కంపెనీలా వుంది - ప్రస్తుతం యేవీ ఖాళీలు లేవని చెప్పటానికి చాలా విచారిస్తున్నాం అంటూ సమాధానాలు వచ్చాయి.

మొన్నేదో మాటలమీద సునంద గరల్స్ స్కూలులో ఒక పోస్ట్ ఖాళీ వుందనీ ఆ హెడ్మిస్ట్రెస్ చాలా మంచిదనీ, తమ కుటుంబానికి బాగా తెలుసునని చెప్పింది. జయంతికెందుకో మొదటినుంచి టీచర్‌పోస్ట్ అంటే యిష్టంలేదు.

"నాకింకో సెక్రటరీ దొరికేవరకూ మీరు వెళ్ళటానికి వీల్లేదు" అన్న శేఖరం మాటలు గుర్తుకొచ్చాయి. అంటే దానర్థం?

"హలో!"

పరధ్యాసగా కిటికీ రెక్కకి తల ఆన్చి బైటకు చూస్తున్న జయంతి వులిక్కిపడి వెనక్కు తిరిగింది. ఎదురుగుండా శివరామ్. ఒక్కడూ గాదు. వెనకెవరో చాలామంది వున్నారు.

"రండి లోపలికి అంతా" శివరామ్ వెనక్కు తిరిగి పిలిచాడు. కిటికీరెక్క దగ్గర నిలబడి జయంతి అలా చూస్తుండగానే వరసన అరడజనుకి ఒకరు తక్కువగా అమ్మాయిల బృందం లోపలికి వచ్చింది. శివరామ్ వెనక నిలబడిన మగపిల్లలు లోపలికి రాలేదు.

"అంతా కలిసి గండిపేటకి పిక్నిక్ ప్రోగ్రాం వేసుకున్నాం. మీకేంపని లేక పోతే అభ్యంతరం గూడా లేకపోతే రండి. ఈ దోవనే వెళ్తూ బాస్ వూళ్ళోలేరని గుర్తొచ్చి ఆగాం. మీరొస్తే నేను, నాతోపాటు వాళ్ళంతాకూడా సంతోషంతో అమందానంద హృదయానందకందళితులై - హహ"

"తప్పు చెప్పావోయ్! అమందానంద కందళిత హృదయారవిందులై-" వెనక నిలబడ్డ యెవరో సరిదిద్దటంతో శివరామ్ గొంతు సవరించుకుని 'వెధవది. యిప్పుడిప్పుడే పెద్ద పెద్ద మాటలు నేర్చుకుంటున్నాను. మొత్తానికి అన్ని అక్షరాలూవున్నాయిగా అది చాలు-" అన్నాడు.

అంతా నవ్వారు. జయంతిగూడా నవ్వింది.

''మీకు ఈరోజు సెలవెలా దొరికింది'' అంది.

మనసులో వెళ్ళటమా మానటమా అని ఆలోచిస్తూ.

''మీకు అసలు వీళ్ళని పరిచయం చెయ్యనేలేదుగా. చెయ్యనివ్వండి ముందు" అంటూ లావుగా, పొడుగ్గా పక్కా బొంబాయి ఫేషన్‌లోవున్న ఓ అమ్మాయిని చూపిస్తూ ''ఈవిడ కుమారి నీరజాదేవిగారు. బొంబాయి నుంచి హైదరాబాదుని పావనం చెయ్యటానికి వేంచేసి ఆరురోజులవుతోంది. మళ్ళీ యెల్లుండి వెళ్ళిపోతున్నారు. వారి గౌరవార్థం యీ చిన్న విహారయాత్ర. ఇంతకీ అసలు యీ నీరజాదేవి యెవరో చెప్పనేలేదుగా. ఆడుగో - అరె కాస్తముందుకు రారా! ఆయన గోపాలం అని వాడి అక్కగారి స్వంత చెల్లెలు.

"స్వంత అక్కగారి చెల్లెలు" వెనక నుంచి మళ్ళీ యెవరో సరిదిద్దారు."

మగవాళ్ళంతా శివరామ్‌కి స్నేహితులు. ఆడపిల్లలు యేదోవిధంగా పరిచయం వున్న వాళ్ళు.

"కాని - ఆయన వూళ్ళో లేరే-" జయంతి నసిగింది. మనసులో వెళ్లాలని వుంది. కాని మళ్ళీ యెందుకో జంకుగా అన్పించింది.

"అది తెలిసే యింత ధైర్యంగా లోపలికి వచ్చింది."

మీకు యింట్లో చెప్పలేదే అనే భయం గూడా అక్ఖర్లేదు. సరీగ్గా అయిదు, మహా అయితే ఆరుగంటలకి యింటికి వచ్చెయ్యొచ్చు" శివరామ్ తటపటాయిస్తున్న జయంతికి హామీయిచ్చాడు.

"లేకపోతే ఓ చిన్న సెలవుచీటీ టేబిల్ మీదపెట్టివచ్చెయ్యండి. పనేదయినావుంటే" వెనకగా నిలబడిన ప్రకాశం అన్నాడు.

"ఆ-ఆ! నిజమే. ఇదుగో పెన్. రాసెయ్యండి."

శివరామ్ జేబులోంచి పెన్ తీసిఇచ్చాడు.

"అఖ్ఖర్లేదు. ఫర్వాలేదు. పనేం లేదనుకోండి."

జయంతికి కళ్ళముందు వెనక తను టైప్ చెయ్యకుండా శివరామ్‌తో వెళ్ళిపోవటం, శేఖరం చేసుకోవటం గుర్తొచ్చింది. ఆరోజు వేరు. అతను వూళ్ళోవున్నాడు. అతను చెప్పినపని చెయ్యలేదు తను. ఈ రోజు వూళ్ళోలేడు. చెయ్యవలసినపనిగూడాలేదు. అయినా వచ్చిన యిన్నాళ్ళలో ఒక్క పుట్టినరోజుకి తప్ప తనెప్పుడు సెలవు తీసుకుంది!

"సందేహించకండి. రండి. సరదాగా వెళ్ళొద్దాం" నీరజాదేవి గూడా చనువుగా బలవంతంచేసింది.

జయంతి కాగితాలన్నిసర్ది బైటకొచ్చింది. బైట రెండు కార్లున్నాయి. కార్లనిండా పళ్ళబుట్టలు, ఫ్లాస్కులు, వాటర్ బాటిల్స్, ట్రాన్సిస్టర్స్, కెమెరా కిక్కిరిసివున్నాయి. వెనకవున్న కారులో ముందు సీటులో ఒళ్లో కుక్కపిల్లతో ప్రమీల కూర్చునివుంది. జయంతి తెల్లబోయింది.

"మీరు ప్రకాశంకారులో కూర్చుంటారా? నా కారులో కూర్చుంటారా?" మెట్లు దిగుతూ అన్నాడు శివరామ్.

● "నువ్వూ వట్టి వెధవ్వి" అన్నాడు అన్నయ్య.

"ఆమాట మళ్ళీ అన్నావంటే గూబ్బగలగొడతాను" అన్నాడు తమ్ముడు.

"అన్నట్టే అనుకో" అన్నాడు అన్నయ్య.

"గూబ్బగలగొట్టినట్టే అనుకో" అన్నాడు తమ్ముడు.

"మీకారేది ?" శివరామ్ ప్రమీల కూర్చున్న కారుచూపించాడు. అది శివరామ్ కారుకాదు. బహుశా ప్రమీలదన్నా అయి వుండాలి. లేక ఇంకెవరిదైనా అయివుండాలి.

ప్రమీల జయంతివైపు తలెత్తిచూడలేదు. పలకరించలేదు. ఒళ్ళోవున్న కుక్కపిల్లని తల దువ్వుతూ కూర్చుండిపోయింది.

"నే నిందులో కూర్చుంటాను." జయంతి ప్రకాశం కారువైపు నడిచింది.

"నేనుగూడా యిందులోనే కూర్చుంటాను." నీరజాదేవిగూడా జయంతి వెనక నడిచింది.

గండీపేటకి కొద్దిదూరంలోవున్న రెస్ట్ హౌస్ రిజర్వుచేయించారు. అందరూ సరదాగావున్నారు. జయంతి ఎంత నిశితంగా పరిశీలించినా యెవరూ హద్దుమీరినట్టుగాని అసహ్యంగా ప్రవర్తించినట్టుగాని కన్పించలేదు. అంతా కబుర్లు - నవ్వులు - జోక్స్. ఒకళ్ళని ఒకళ్ళు వేళాకోళంపట్టించుకోవటం వెక్కిరించుకోవటం - యెవరైనా యేవైనా తమకు తెలిసిన వింతలు విశేషాలు చెప్పబోవటం. దాన్ని వెంటనే యింకోళ్ళు విడదీసి విమర్శించటం, ఇలాజరిగిపోయింది. మధ్యమధ్యలో టిఫిన్లుతిన్నారు. కాఫీలు తాగారు. వచ్చినవాళ్ళలో ఒకళ్ళిద్దరు పాటలుపాడారు. చివరికి అందరూకలిసి బలవంతం చెయ్యగా, గంట బ్రతిమలాడగా యిద్దరూ కలిసి డ్యూయెట్లు - విషాదగీతం ఒకటి, సంతోషగీతం ఒకటి పాడారు. విషాదం సూచించేపాట పాడేటప్పుడు ప్రక్కనున్నవాళ్ళెవరో వెక్కిళ్ళు పెట్టారు. సంతోషపు పాటపాడేటప్పుడు అందరూ చేతుల్తో హుషారుగా రెస్ట్ హౌస్ కప్పు యెగిరిపోయేలా తాళంవేశారు.

ఓప్రక్క ట్రాన్సిస్టర్లు సన్నని గొంతుతో మోగుతూనే వున్నాయి.

"ఎండపోతోంది ఫోటోలు, ఫోటోలు" అన్నారెవరో.

"అవునవును. అమాటే మర్చిపోయాం" అందరూ కెమెరాలమీద పడ్డారు.

"ప్రమీలా యిలారా ! నీ కుక్కపిల్లతో అక్కడ గార్డెన్ దగ్గిరనుంచి స్నాప్స్ తీస్తాను" కెమెరా సరిచూసుకుంటూ శివరామ్ పిలిచాడు. వచ్చినప్పటినుంచి ప్రమీల జయంతితో అంటీ ముట్టనట్టు యేదో మాట్లాడింది. ఒక్క జయంతితోనే కాదు. ప్రమీల అసలు మాట్లాడటమే చాలా తక్కువ అనిపించింది అందరికీ.

శివరామ్ మెళ్ళో కెమెరాతో, ప్రమీల చంకలో కుక్కపిల్లతో దూరంగా వెళ్ళిపోయారు

"మీరంతా ఓ గ్రూప్‌గా నిలబడండి" అన్నాడు ప్రకాశం కెమెరాలోనుంచి జయంతిని మంచి యాంగిల్ కోసం చూస్తూ.

అందరూ గ్రూప్‌గా నిలబడ్డారు.

"నాకొద్దు" జయంతి దూరంగావెళ్ళి కూర్చుంది.


"అదేం ? యెందుకని" అన్నాడు ప్రకాశం నిరుత్సాహంగా.

"నా కిష్టంలేదు." క్రిందవున్న పచ్చగడ్డిని చేత్తో తెంపుతూ దృఢంగా అంది జయంతి. జయంతి నెవరూ బలవంతం చెయ్యలేదు. బలవంతం చేసేంత చనువు యెవరికీలేదు. కాబట్టి అందరూ పూరుకున్నారు.

"పోనీ మిమ్మల్ని ఒక్కర్నీ విడిగా తీస్తాను అదీ యిష్టంలేదా ?" అన్నాడు ప్రకాశం.

"లేదు" అంది జయంతి ముక్తసరిగా.

మిగతా అందరూ అనేకరకాల పోజుల్లో కలిసి, విడిగా తీయించుకున్నారు.



జయంతికి తెలియకుండా ప్రకాశం మంచి యాంగిల్‌లో ఒక స్నాప్ తీసుకున్నాడన్న సంగతి యెవరూ గమనించలేదు.

"అయ్యో! చీకటిపడిపోతోంది" దూరంగా అరుణబింబం అస్తమించిన తర్వాత దాని తాలూకు కాంతిగూడా పలచబడటంచూసి పులిక్కిపడుతూ అంది జయంతి.

"అవును. వెళ్ళిపోదాం. ఈ శివరామ్. ప్రమీల అప్పుడనగా వెళ్ళినవాళ్ళేమైపోయారు? యేరి?" అన్నాడు ప్రకాశం ఫోటోలు తీసిన అలసటతో జయంతికి కొద్ది దూరంలో కూలబడ్తూ

"అదుగో" నీరజ చూపించింది.

దూరంగా యిద్దరూ ప్రక్కప్రక్కన నడుచుకుంటూ వస్తున్నారు. ఈసారి కెమేరా ప్రమీలచేతిలోవుంది. శివరామ్ కుక్కపిల్ల నెత్తుకుని నడుస్తున్నాడు. జయంతి వాళ్ళవైపే చూస్తుండిపోయింది చాలా సేపటివరకు.

అంతానర్దుకుని అందరూ మళ్ళీ బైలుదేరే సరికి ఏడు దాటిపోయింది. కార్లు స్టార్ట్అవుతూనే ముందు మాయిల్లంటే మాయిల్లని గోల బైలుదేరింది. సిటీ సమీపిస్తుండగా శివరామ్ కారు విడిపోయింది.

"బాబోయ్ చాలా ఆలస్యం అయింది. మా అత్తయ్య వాతలు పెట్టేస్తుంది. ప్రకాశంగారూ. ప్లీజ్ మొదట నేను." సుందరి అన్న అమ్మాయి వెనకసీటులోంచి బ్రతిమలాడసాగింది. అందరిళ్ళూ వరసగా అడిగి యెవరెవర్ని ముందు దింపాలో వరస తయారు చేశాడు ప్రకాశం. అందులో ఆ వరస ప్రకారం జయంతి ఆఖరికి వచ్చింది.

"అబ్బో ! ఇదంతా పూర్తయేసరికిచాలా సేపవుతుందిలా వుంది" అంది జయంతి.

"యెంత లేటయినా మీకు ఫర్వాలేదు. వెళ్ళగానే యింటి దగ్గర భోజనం రెడీగా

వుంటుంది. నాకిపూటపస్తే! హోటల్స్ కట్టేస్తారు." అన్నాడు ప్రకాశం.

మల్లేపల్లి ఒకళ్ళు, బంజారాహిల్స్ ఒకళ్ళు, సనత్‌నగర్ ఒకళ్ళు, సికింద్రాబాద్ ఒకళ్ళు - ఇట్లా అందర్నీ తలోమూలా దించుకుంటూ ఆఖరికి జయంతి యింటి మొహం వట్టేసరికి పదకొండు దాటింది.

కారు సికింద్రాబాద్‌నుంచి వస్తుండగా ప్రకాశం పెట్రోల్ అయిపోయింది అంటూ బంక్‌వైపు తిప్పాడు. అక్కడ వెంటనే యెవరూలేరు. ప్రకాశం వెళ్ళి పిలవగా కళ్లు నులుముకుంటున్న ఒకతను హడావుడిగా పరుగెత్తుకొచ్చి పెట్రోల్ నింపాడు. అక్కడోకొంత ఆలస్యం అయింది. జయంతికి ఒళ్ళంతా విరక్కొట్టినట్టు, నిద్రమత్తుగా నీరసంగావుంది.

"ముందు సీటులోకి వస్తారా?" అన్నాడు ప్రకాశం.

"అఖ్ఖర్లేదు. ఇక్కడబాగానేవుంది" అంది జయంతి.

ప్రకాశం యేం మాట్లాడలేదు.

కొద్దిసేపయిం తర్వాత ప్రకాశం తనే "మీరు ఫొటో ఎందుకు తీయించుకోలేదు?" అని అడిగాడు.

"చెప్పానుగా యిష్టంలేదని."

"కారణం వుండాలిగా."

"ముక్కూ మొహం తెలియనివాళ్ళతో ఫొటోలు తీయించుకోవటం నా కిష్టంలేదు. ఈరోజు యీ సరదా అదో అనుభూతిగా అందరి మనసులో వుంటుంది. అది వేరే సంగతి."

"శివరామ్ మీకెన్నాళ్ళనుంచి పరిచయం, చెప్పండి. వింటాను."

"శివరామ్ సంగతివేరు. కొంతమందిని చూస్తుంటేనే కొన్నివిషయాలు తెలుస్తాయి. క్వశ్చన్‌పేపర్‌లా యీ ప్రశ్నలేమిటి? ఈసారి అతనడిగిన ప్రశ్నకి జవాబు చెప్పకూడదనుకుంది జయంతి.

"ఓహో! మీకు మన స్తత్వశాస్త్రం తెలుసునన్నమాట" ప్రకాశం నవ్వుతూ అన్నాడు.

జయంతి మౌనందాల్చింది.

"పోనీమగవాళ్ళ సంగతివదిలేసెయ్యండి. ఆడపిల్లల్తో తీయించుకోడానికేం?" ప్రకాశం యింకా యేదో అనబోతూ వాక్యం పూర్తి కాకుండానే కారు కీచుమన్న శబ్దంతో సడన్ బ్రేక్స్‌తో ఆగిపోయింది. ఎదురుగుండావున్న రిక్షా అతను కారుకి రిక్షాని డాష్ యిచ్చి తన సీటుమీదనుంచి యెగిరి అవతలపడ్డాడు. ట్రాఫిక్ ఆగిపోయింది. చూస్తుండగానే జనం మూగిపోయారు. అంతా క్షణంలో జరిగిపోయింది. దూరంగావున్న ట్రాఫిక్ పోలీసు పెద్దగా యీలవేసుకుంటూ పరుగెత్తుకొచ్చాడు.

రోడ్డుకివతలగా పడిన రిక్షా అతనికి యెవరో పరుగెత్తికెళ్ళి సోడా తెచ్చిపెట్టారు. ప్రకాశం కారులోనుంచి దిగాడు.

అప్పటికే పోలీసు కారునంబరు - రిక్షా నంబరు నోట్‌చేసుకోటం జరిగిపోయింది.

"నా తప్పేంలేదు. అతను రాంగ్‌సైడు చూపించాడు" అన్నాడు ప్రకాశం.

"తప్పెవరిది అనికాదు నేను రాసుకుంటోంది. నంబర్లు నోట్‌చేసుకుంటున్నాను." నిదానంగా అన్నాడు పోలీసు. అతనిదగ్గర నుంచి తాగినవాసన గుప్పుమంటోంది. నిర్లక్ష్యంగా చెప్పిన అతని జవాబుకి ప్రకాశం ఒళ్ళుమండిపోయినా చేసేదిలేక వూరుకున్నాడు.

ఇంతలో పోలీస్‌కానిస్టేబులుకూడా అక్కడికి వచ్చాడు. అతను ప్రకాశాన్ని చూస్తూనే వెంటనే "తమరా మహానుభావా! హోదాలుపోయినా కళ్ళు క్రిందకు దిగలేదు కాబోలు" అన్నాడు వెక్కిరింతగా.

అతన్నిచూస్తూనే ప్రకాశం మొహం తిప్పుకున్నాడు.

"పదండి. స్టేషన్‌కి. దయచెయ్యండి?" అన్నాడతను

"నంబర్ నోటు చేసుకుని నీయిష్టం వచ్చింది చేసుకో. నేను పోలీస్‌స్టేషన్‌కు రాను." మొండిగా అన్నాడు ప్రకాశం

"స్టేషన్‌కు వచ్చి రిపోర్ట్ యిచ్చి వెళ్ళకపోతే యేం జరిగినా పర్వాలేదు అని నువ్వనుకుంటే మాకేం అభ్యంతరంలేదు. నిక్షేపంగావెళ్ళొచ్చు ఆ అమ్మాయి ఎవరు? పేరేమిటి?"

"స్టేషన్‌కి వస్తాను నడు." అన్నాడు ప్రకాశం కారులో కూర్చుని డోరు గట్టిగా వేస్తూ.

"ఏమయింది! మనం యింటికి వెళ్ళిపోవచ్చా." జయంతి ఆత్రంగా అడిగింది.

"ఇంటి కెళ్ళకపోతే ఎక్కడికి వెడతాం? కాకపోతే ఓ గంటో అరగంటో ఆలస్యం అవుతుంది. మీరేం భయపడకండి. ఏం కాదు. ఆ కానిస్టేబుల్ మా బావగారు మంత్రిగా వున్నప్పుడు యిలాగే యేదో యాక్సిడెంట్ అయితే దాన్ని పెద్దది చేసి కేసుపెట్టాడు. దానితో వాడి వుద్యోగం పోవటానికి సిద్ధం అయింది. ఆ అక్కసు వాడిమనస్సులో చాలా రోజులనుంచివుంది. మన ఖర్మకాకపోతే వీడే మళ్ళీ యిక్కడ తగలడాలి!" ప్రకాశం పళ్ళునూరాడు.

కారు దగ్గర్లోవున్న పోలీస్ స్టేషన్‌కి చేరుకుంది. ఇద్దరూ దిగి లోపలికి వెళ్ళారు.

జరిగిందంతా సబిన్‌స్పెక్టర్‌కి చెప్పి. అంతా- తు-చ తప్పకుండా నోట్‌చేసుకుంటున్న యింకోఅతన్ని చూస్తూ "మీరు కేసు పెట్టదలచుకుంటే నాకేం అభ్యంతరంలేదు. భయం అంతకంటేలేదు. కాని మీరిప్పుడు పేరు రాసుకున్న అమ్మాయి ఎవరో తెలుసుకున్నప్పుడన్నా కేసు వుపసంహరించుకుంటారు."

"అంటే?" అన్నాడు రాసుకుంటున్నతను జయంతిగూడా ఆదుర్దాగా ప్రకాశంవైపు చూసింది.

"అంటే, జయంతి అని మీరు ఇప్పుడు రాసుకుంటున్న ఈ అమ్మాయి రాజశేఖరం గారి సెక్రటరీ."

"కాదు-కాదు" జయంతి చేతులుచాపి వారించింది.

"చెప్పనీ జయంతీ. భయం యెందుకు?"

అని సబిన్‌స్పెక్టర్ వాళ్ళవైపు తిరిగి "ఆ అమ్మాయి సికింద్రాబాద్‌నుంచి తిరిగి వస్తూ బస్సు దొరక్క నిలబడితే నేనులిఫ్ట్ యిస్తున్నాను. అపైన మీయిష్టం" అన్నాడు నిర్లక్ష్యంగా జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

పోలీసు అధికారులిద్దరూ మొహాలు చూసుకున్నారు.

"నామాట అబద్ధం అనుకుంటే మీరు ఆయనింటికి ఫోన్‌చేసి కనుక్కోండి".

"వద్దు. వద్దు. కాదు. నేను. కాదుకాదు." జయంతి మాట్లాడలేకపోయింది.

పోలీసు అధికార్ల కళ్ళలో యీసారి అనుమానం కన్పించింది. కూర్చుని అంతా రాసుకుంటున్న అతను వెంటనే రిసీవర్ యెత్తి నంబర్ డయల్ చేయసాగాడు.

"హూష్. చెయ్యనీ జయంతీ, మనమీద కేసుపెట్టినవాడికి శేఖరంగారి మూలానే ఈ వుద్యోగం వచ్చింది" అన్నాడు మెల్లగా. ఏదో చెబుతున్న నెపంతో దగ్గరగా వచ్చి.

"భగవాన్ ! ఈ రోజు దురదృష్టంలో అదృష్టం. శేఖరం వూళ్ళో లేడు కాబట్టి సరిపోయింది. లేకపోతే యీ పరిస్థితిలో."

"హలో !"

"......"

"ఎవరూ శేఖరంగారేనా ? నేనండి సబిన్స్పెక్టర్ సత్యానందాన్ని మాట్లాడుతున్నాను. సారీ టుడిస్టర్బ్ యూసర్ !"

జయంతి చటుక్కున తలెత్తింది.


"ఇక్కడికో యాక్సిడెంట్ కేసు వచ్చిందండీ. ఆ యాక్సిడెంటు చేసిన కారులో ప్రకాశం అనే అతనితో జయంతి అనే అమ్మాయివుంది. ఆమె మీ సెక్రెటరీనని చెప్పుకొంటోంది."

"నేను చెప్పలేదు. నేను చెప్పలేదు" అదుర్దాగా అంది జయంతి.

"ఏ మి టీ. మాట్లాడించమంటారా ? అలాగే. ఒక్కనిమిషం"; అంటూ అరచేత్తో ఫోనుమూసి "మీరు మాట్లాడండి" అన్నాడు.

"వద్దు. నేను మాట్లాడను" దృఢంగా అంది జయంతి. జయంతికి హఠాత్తుగా తనెక్కడుందో, యేం చేస్తోందో స్పృహ పోయిందనిపించింది.

(స శే షం)



చలోకోక్తులు

తాళాలు వెయ్యడం పెద్దమనుష్యుల కోసమే-దొంగలెలాగా వాటి బద్దలు కొడతారు.

డబ్బు ఎరువు లాంటిది, జల్లితేగాని పనిచేయదు.

ఖాళీసంచి నిటారుగా నిలబడలేదు.

మీరు మేకపిల్లవేషం వేసుకొంటే-మిమ్మల్ని తోడేళ్ళు ఎత్తుకుపోతాయి.

వెంటనే పని జరగాలంటే వెళ్ళు. లేదంటే ఎవరినైనా పంపు.

అనాకారి ప్రియురాలు, అందమైన జైలూ ఉండవు.

పాలకుండకు పిల్లిని కాపలా పెట్టకూడదు.

ఆప్తమిత్రుణ్ణి కలుసుకోదలచుకుంటే-అద్దంలో చూసుకోండి.

గాడిద ఇంకోగాడిదనే ప్రేమిస్తుంది.


సత్ప్రవర్తన ముఖానికి అందం తేకపోయినా-దుష్ప్రవర్తన దాన్ని భీకరంగా చేస్తుంది.

బంగారం మోస్తున్న గాడిదకు ఎవరైనా ఆతిథ్యమిస్తారు.

చాపల్యాన్ని తప్ప అన్నింటిని నేను జయించగలను.

తాను గాడిదైనప్పుడు ఇతరులు సవారీచేస్తే బాధపడకూడదు.

పుట్టలోంచి పాముని ఎరువు చేతుల్తో తీయడం మంచిది.



కొడవటిగంటి కుటుంబరావు

రావి కొండలరావు

త్రిన్నది అరక్క భాషనుగురించి తర్జన భర్జనలు చేసేవాళ్ళ భాష అనేదాంట్లో చాలా రకాలు చెబుతారు - గ్రాంధికం, సులభ గ్రాంధికం, శిష్ట వ్యావహారికం, వ్యావహారికం, గ్రామ్యం ఇత్యాది. కాని యింకా భాషలున్నాయి..వాటిని నాటక కర్తలూ తదితర కళాకారులూ వాడుకుంటున్నారు. ఉదాహరణకు, సాయిబు తెలుగు, దొరలతెలుగు, బ్రాహ్మణ తెలుగు మొదలైన కులాలభాష; నెల్లూరు,పల్నాడు,విశాఖపట్నం,గుంటూరు, రాయలసీమ వగైరా ప్రాంతీయ భాషలు. ఓయబ్బ, భాషల్లో చాలారకాలున్నాయి.

ఎన్ని భాషలుంటే అన్ని యాసలూ, ఉచ్చారణలూ ఉండకతప్పదుగదా! అయితే ఉచ్చారణల దగ్గిర మరో మడతపేచీవుంది. ప్రతాపరుద్రీయంలో పిచ్చివాడు శిష్యులతో చెప్పినట్టు రాసిందల్లా ఉచ్చరించలేం. దేర్ ఫోర్ - వారి నాలుగు అనే అర్థంలో కాదు - ఈ అర్థాల గొడవగురించి మరెప్పుడన్నా రాయాలి - ఉచ్చరించిందల్లా రాయలేం కూడానూ. (ఏమిటన్నారూ? ఉచ్చారణ అనగూడదా? తొందరపడకండి. అంతా మనవిచేస్తాం.)

రాసింది ఉచ్చరించలేకపోవటం ఒక సంగతి; రాసింది ఉచ్చరించకపోవటం మరొక సంగతి - టూ డిఫరెంట్ థింగ్స్ ఆల్ టుగెదర్.

ఒకసారి "పశేష" అని దేవభాషలో రాసి ఒక బెంగాలీ మిత్రుణ్ణి చదవమన్నాం. "షాషేష్" అని అవలీలగా చదివేశాడు. అన్ని అక్షరాలూ ఒకటిగా చదువుతున్నావేమంటే పోట్లాడి, తాలవ్యషా, దంతవ్యషా మొదలైన "షో"లను గురించి గంటన్నర గ్రామరు మాట్లాడాడు.

ఒక బెంగాలీ ఏమిటి, హిందీ ఏమిటి? అన్నిభాషల వాళ్ళూ రాసినట్టు ఉచ్చరించకూడదని శపథాలు చేసుకున్న వాళ్ళే. హిందీవాళ్ళు శాలను షాలుగా మార్చటమేగాక ఇంకొన్ని శపథాలుకూడా చేశారు. ఉదాహరణకి, "తికమక" అనమంటే వాళ్ళనరు. కావాలిస్తే "తిక్ మక్" అంటారు.

దమిళ్ పాష

తమిళ సోదరులను తీసుకుంటే వాళ్ళది మరొక గొడవ. టైప్‌రైటరు రాబోతుందని వాళ్ళు "సంగం" కాలానికి ముందే ఎలాగో పసికట్టేసి చాలా అక్షరాలు అవతల పారేసి నాలుగక్షరాలకి ఒకటి చొప్పున మిగుల్చుకున్నారు — సముద్రంతో పడవమునిగిపోతుంటే వర్తకులు సరుకు పారేసినట్టుగా. ఆ తరవాతనుండి తమిళంలో మాటల ఉచ్చారణకు బ్రహ్మాండమైన నియమాలేర్పడ్డాయి. "రెడ్డి", "బుడ్డి", "ముద్దు", "బుద్ధి" లాటి మాటలకు తమిళంలో స్థానంలేదు. "రెడీ" అనే ఇంగ్లీషు మాట నైనావారు నిర్దుష్టంగా పలుకుతారుగాని రెడ్డి రెట్టి అవ్వలిసిందే. "బుడ్డి" మరీ అన్యాయం — ప్రొహిబిషన్ ప్రమేయంలేక పోయినాను; దాన్ని "పుట్టి" అనితప్ప వారు అనరు.

అదేవిధంగా ముద్దు "ముత్తు"అవుతుంది. బుద్ధి "పుత్తి" అవుతుంది. ఇలా ఉదాహరణలిచ్చుకుంటూ పోతే అవాచ్యాలుకూడా దొర్లవచ్చు. అందుచేత ఇది ఇంతటితో వదిలేద్దాం.

"గకారమును హకారముగాను, హకారమును గకారముగను పలుకునది" అని తమిళ వ్యాకరణ సూత్రం. అందుకే మహాత్మా అనటానికి తమిళ సోదరులు "మగాత్మా" అనీ, "వరుగిరదు" అనటానికి "వరుహిరదు" అనీ అంటారు. ఇది వాళ్ళ ఉచ్చారణానియమం.

ఇదేవిధంగా ఇంగ్లీషు, ఫ్రెంచి, రష్యను మొదలుగా గల భాషలన్నిటికీ రాసినట్టు ఉచ్చరించరాదనే నియమాలుండటం మనకు కనిపిస్తుంది. ఒక్కయు అక్షరాన్ని "పుట్" లో "ఉ"గానూ, "బట్" లో "అ" గానూ ఉచ్చరించటం ఇంగ్లీషు మొదటి తరగతి వాడికి కూడా తెలుసు. రాసినట్టు ఉచ్చరించవచ్చుననుకొని "థరో" అనటానికి "దొరగ్" అనీ, "పెన్‌నైఫ్" అనటానికి "పెంక్‌నైఫ్" అనీ, "ఫారిన్" అనటానికి "ఫరిగ్న్" అనీ — ఈ చివరది మరొకరి కాపీ రైట్ గనక ఎవరూ తస్కరించకండి — అనేకవిధాల ఉచ్చరించటం జరుగుతోంది.

ఇక ఫ్రెంచిలో అడగే అక్కర్లేదు. (చెప్పనక్కర్లేదు.) Peauxzbfhh అని రాసి "పో" అంటాడు ఫ్రెంచివాడు మనం చక్కా వెళ్ళిపోవటంతప్ప చేసేదేమీ లేదు.

రష్యన్ భాష మరీ దారుణం. ప్రతి హల్లునూ నాలుగేసివిధాల ఉచ్చరించవచ్చు. గుడ్డిలోమెల్ల — లేక కీడులో మేలు — ఏమిటంటే అచ్చుల్ని మూడుకన్న ఎక్కువ విధాలఉచ్చరించటానికి లేదు, అదీగాకదీర్ఘాక్షరాలేవో, హ్రస్వాక్షరాలేవో వాళ్ళు దాచిపెడతారు. ఒకచోట ఇవ్వవలిసిన దీర్ఘం మరోచోట ఇస్తే మాటకు అర్థం కాస్తా మారుతుంది. ఇలా విభాషీయులచేత తప్పుడు ఉచ్చారణలు చేయించి నవ్వుదామని రష్యనుల ఉద్దేశంగా కనబడుతుంది.

చీనావాళ్ళ ఉచార్చణ చెప్పకండి. వాళ్ళు ఏనాడో మనవేదాలు ఎత్తుకుపోయి అందులో ఉండే ఉదాత్తానుదాత్తాలను కాజేసి వాళ్ళ బొమ్మల భాషలో చేర్చేసుకున్నారు. "స - రీ" అనేట్టు ఉచ్చరిస్తే "మొయ్" అనేదానికికొనటమని అర్థం, అదే "స-రీ"గా ఉచ్చరిస్తే అమ్మటమని అర్థం - లేక అట్నుంచి ఇటో. తొమ్మిది అర్థాలు గల మాటలు కూడా ఉన్నాయిట చీనామాటల్లో. ఇవికూడా వాళ్ళు సంస్కృతంనుంచే కాజేసి ఉంటారు.

"తెలుగు అన్ని భాషల్లాకాదు. అందులో ఎలా రాస్తామో అచ్చు అలానే ఉచ్ఛరిస్తాం'' అని తెలుగు వాళ్ళకి చాలాగర్వం. కాని కొంతవరకు "జరుక్'' ఇది అబద్ధమని రుజువు చేశాడు. ''సూనాణ'' అని మనం పిలుస్తావే ఆ మాటని ఎలారాస్తాం? ''సూర్యనారాయణ'' అని కాదూ? సత్యన్నారాయణ''ని ''సచ్నాణ'' అనమా? సత్యాన్ని "సత్తెం'' అంటావా, అనవా? మకారాన్ని ఓష్ఠ్యంగా ఉచ్ఛరించే పాపాత్ముడెవడన్నా ఉన్నాడూ? కొద్దిమంది స్టేజి నటుల్ని మినహాయిస్తే? ''చెయ్యటమ్''అని తెలుగువాడనడు ''చెయ్యటం'' అంటాడు, లేదా ఇంకొంచెం శ్రద్ధాసక్తులుగల వాడైతే ''చెయ్యటంవ్'' అంటాడు.

కొందరికి రకారం పలకదు. ఒక బడి పంతులు పిల్లలకు తెలుగు డిక్టేషను ఇస్తూ "గుయ్యము" అనేవాట్ట; "గుర్రము" - మళ్ళీ మాట్లాడితే "గుఱ్ఱము" అని కుర్రాడెవడన్నా రాయకపోతే వీపు చీట్లగొట్టేవాట్ట.

స్పీకర్లూ - ఫిల్టర్లు

రకారం పలకలేనివాళ్ళలో మరోరకం కూడా ఉన్నారు. వాళ్ళు "ర" అనవలిసినప్పుడల్లా ఉర్దూలో ఉండే ప్రత్యేకమైన గకారం ("ఐన్" తరవాత వచ్చే "గైన్") పలుకుతారు. తరగతి అనవలిసొస్తే "తగగతి" అంటారు. అయితే రెండు గాలకు తేడా వినిపిస్తుంది గనక కొద్ది అనుభవంతో మనం వాళ్ళ మనోభావాన్ని గ్రహించవచ్చు. వీళ్ళది మైక్ డిఫెక్టు.

అలాంటి అవకాశంలేని ఉచ్చారణలు కూడా ఉంటాయి. వీళ్ళది లౌడ్ స్పీకరు డిఫెక్టనవచ్చు. ఒక్కొక్కళ్ళు మాట్లాడుతుంటే ప్రతి రెండో అక్షరంలోనూ సకారం ఉన్నట్టనిపించి ఒక అరడజనుపాములు బుసకొడుతున్నట్టుంటుంది. ఫొటోగ్రఫీలో కలర్ ఫిల్టర్లున్నట్టు వీళ్ళ లౌడ్ స్పీకర్లు కొన్ని ప్రత్యేకమైన అక్షరాలను వదిలి మిగిలినవాటిని ఫిల్టరు చేస్తాయనిపిస్తుంది.

ఈ ఫిల్టర్ల మూలకంగా వీళ్ళ అసలు ఉచ్చారణ ఎలా ఉండేదీ మనం వచ్చినా తెలుసుకోలేం. యాదాలాపంగా వినేవాడికి ఒక్కోసారి వాళ్ళు ఏభాష మాట్లాడుతున్నదీ కూడా తెలీదు.

ప్రత్యక్షానుభవంలో నన్ను కాల్చుకు తినేవాడు ఆలిండియా రేడియోలో ఇంగ్లీషు వార్తలు చెప్పేవారిలో ఒకడున్నాడు. అతనికి పెద్దబుగ్గలుంటాయో ఏంపాడో, అతను అనేదంతా అతని నోట్లోనే రివర్బరేటైపోయి బయటికి శుద్ధమైన ధ్వని వస్తుంది - మరలో గింజలు పోస్తే పిండి బయటి కొచ్చినట్లు. ఆ మహానుభావుడు తన భాషని తానే గానుగాడేస్తాడు!

తెలుగూస్

ఒక బడిలో ఒక ఇంగ్లీషు మాష్టారు కుర్రాణ్ణి ఇంగ్లీషుపాఠం చదవమని "సీ మొహంలా వుంది. ఏమిటా చదువు, చక్కగా దొరల్లాగా చదవాలి" అని చదివి చూపించాడు. దర్జాగా - అక్షరాలు వినిపించనీయకుండా. ఎక్కడికక్కడ తెగ్గొట్టేస్తూ "నాది యూరపియన్ ఇంగ్లీషు" అన్నాడాయన పైగా. అంతేగాని, ''దేరు ఈజు బుక్కు" అని చదవటం ఏడిసినట్టుంటుందని ఆయన నమ్మకం. అదే బడిలో మరో ఇంగ్లీషు మాష్టారుదగ్గర, ఈయన చెప్పిన పద్ధతిలో చదివితే ఒప్పుకునేవాడు కాడు. "అదేంటబ్బాయ్ ఆ చదువు? విదేశాల్లో చలి ఎక్కువగా వుంటుంది. ఆ చలికి తట్టుకోలేక ఇంగ్లీషువాడు, వణికిపోతూ 'హెహెహే' అని మాట్లాడతాడు. అట్లా మాట్లాడడానికి మనకేం ఖర్మం? మనం ఉష్ణదేశపువాళ్ళం. సుబ్బరంగా ప్రతీ మాటా ప్రతిముక్కా ప్రతి అక్షరం ఉచ్ఛరించవలసిందే!" అని ఈయన వాదం.

ఇంకో మాష్టారు ఇంగ్లీషు ఇంకో పద్ధతిలో ఉచ్ఛరించేవాడు. "యూ కెనాట్ అన్సరు దిస్పా?-సిట్టు. సెక్ట్వా" అని రాగం తీసేవాడు తెలుగులో. అయన పద్ధతి అది. ఆయనదే మరో సిద్ధాంతంవుంది. "ఇంగ్లీషులో MAN అంటే మాన్ (ఇంగ్లీషులో ఈ పదాన్ని ఉచ్ఛరించినట్టు తెలుగులో రాయలేము) అవుతుంది. దాన్ని నువ్వు రాయి. "మాన్" అని రాయగలవు. లేదా "మేన్" అని రాయగలవు అంతేగాని సరిగ్గా రాయలేవు. అందుకనే తెలుగువాళ్ళం ఈ మాటలు రాసినప్పుడు, దానికింద ఓ యకారం వడేసి "మ్యాను" అంటున్నాము. అని బోధచేసి. తాను పలకవలసి వచ్చినప్పుడు కూడా అట్లాగే పలికేవాడు. "ఏ మ్యాను ఈజు లుకింగు ఇంటూ ఏ మ్యాపు" అని. కుర్రాళ్ళు అట్లాగే చదవాలిగాని ఇంగ్లీషు ఉచ్చారణలో మాత్రం చదవకూడదనేవాడు. ఎవడి వెర్రి వాడికి ఆనందం అని వూరుకోవాలిగాని. ఎవరేం చెయ్యగలరు?

ఒక తెలుగు మాష్టారికి ఇంగ్లీషుమీద మహాచిరాకు. అంతచిరాకయినాసరే, ఆయన తప్పో ఒప్పో ఆ భాషే మాట్లాడేవాడు సమయం వచ్చినప్పుడల్లా. ఆయన చిరాకంతా ఇంగ్లీషువాడు ఒకటి రాసి, ఇంకోలా చదవమంటాడనే. "టైమ్ టేబిల్"అనేదాన్ని అయన అక్షరాలకేసి చూస్తూ "టిమేటాబ్లే" అని చదివి తర్వాత సర్దుకునేవాడు. అయనకు చిరాకొచ్చిందంటే రాదూ మరి? KNIFE లో K సైలెంట్ అని ఆయనకు తెలుసు. అది పట్టుగొని ఆయన ఇంగ్లీషును తెగతిట్టడం. "అక్కడ నువ్వు కె రాయటం ఎందుకు? మళ్ళీ అది సైలెంటూ సింగినాదమూ అనటం ఎందుకు? తీసిపారేయ్. ఏ బాధలేదు. వుంచావా, అను. తీరావుంచి చదవవద్దనే భాష ఏం భాషయ్యా అది? అక్షరాలు అట్లా వేస్టు చెయ్యడం ఎందుకు?" అని కోప్పడేవాడు. ఇంగ్లీషు ఉచ్చారణలో రాసినట్టుగా చదవము. అది ఒక్కో వేళావిశేషాన్నిబట్టి ఒక్కోలా చదవాలి. తెలుగులో రాసింది రాసినట్టుగా చదువుతాము. ఐతే కొందరు మాత్రం కాదన్నారు. "హృదయము" అన్నదాన్ని చాలామంది అచ్చితంగా "హ్రిదయము" అనే అంటారు — రెంటికీ తేడా వుందన్నాసరే. అట్లాగే "వహ్ని" అనే పదాన్ని "వన్హి" అనీ, "చిహ్నము" అనేదాన్ని "చిన్హము" అనీ చాలామంది ఉచ్చరిస్తారు. అందువల్ల రాసింది రాసినట్టుగా చదవకపోవటం అనేది మనకూ వుంది.

● లక్షాధికారి బిచ్చగాడితో:

"పోరా పో. పొమ్మంటే పోవేం?"

"సార్. మీరు నన్ను రా అనడం బావులేదు. మీకూ నాకూ తేడా ఏమిటి? మీరు రెండో లక్షకోసం ప్రయత్నిస్తున్నారు. నేను మొదటి లక్షకోసం ప్రయత్నిస్తున్నాను. అంతేగా."

మూసలో భాషలు

ఒక్కొక్క భాషవాళ్ళు ఇంకో భాషను ఉచ్చరిస్తే తమాషాగా వుంటుంది. 'కీ'లు ఎక్కువగా వాడే తెలుగు తెలియని మహమ్మదీయులు తెలుగు మాట్లాడుతూనే "మీకి హేమ్టి తెలుసూ, మాకీ తెల్సూ" అంటూ మాట్లాడతారు. "నువ్వుండుమీ, నాను దా సెప్పుతాను వాడికి నాకుండా కోపం సాస్తి. అని మాట్లాడేవారు మద్రాసు తెలుగువాళ్ళు. రెండూ తెలుగులే. ఏంచేస్తాం. ఉచ్చారణలో అట్లా ఐనై.

ఇంకో గమ్మత్తుంది. 'హిందూ' అనే పదం వుంది. దాన్ని ఇంగ్లీషులో రాయాలంటే HINDU' అని రాయాలి. కాని అది 'హిండూ' అన్న మాటే. ఐతే ముందుగానే మనమే దాన్ని "హిండూ" అని ఉచ్చరిస్తున్నాము అట్లాగే తమిళ్ అన్నదాన్ని 'టామిల్' అని, 'తెలుగు'ను టెలుగూ అని అంటున్నాము ఉన్నదున్నట్టుచ్చరించడమే సంప్రదాయం అన్నట్టుగా.

తెలుగువాళ్ళు ఇంగ్లీషును తెలుగులో మాట్లాడినట్లే హిందీ మొదలైన భాషలు కూడా అట్లాగే మాట్లాడతారు. మనం తెలుగులో హిందీని మాట్లాడినట్టే హిందీవాళ్ళూ హిందీలోనే తెలుగుమాట్లాడతారు. మలయాళవాళ్ళు ఏ భాష మాట్లాడినా మలయాళంలాగే వుంటుంది. తీరా జాగ్రత్తగా వింటే, అందులోంచి ఏ ఇంగ్లీషో-తమిళమో నిదానంగా తేలుతుంది. అది ఆ భాష వాళ్ళ ఉచ్చారణ. వాళ్ళకే భాషిచ్చినా దాని వాళ్ళ మూసలో పోసేస్తారు.

ఉచ్చారణ దోషాలవల్లనే వూరి పేర్లు మారిపోతూ వుంటాయి. "ముత్తరాసు చెన్నప్ప" అనే వ్యక్తి మొట్టమొదట మద్రాసులో స్థిరనివాసం ఏర్పరుచుకున్నాట్ట. అందుకని అతనిపేరుమీదనే, దానికి "ముత్తరాసు" అని పేరుపెట్టారు. కాలక్రమాన అది ఒక్కొక్కరినోట్లో ఒక్కొక్కలాగా నలిగి, తిరిగి, చివరకు "మద్రాసు" ఐంది. ఇంగ్లీషులో రాయటంవల్ల "మెడ్రాస్" ఐంది.

అట్లాగే శ్రీకాకుళం వూరిపేరుకూడా అది కాదన్నారు కొందరు. గురజాడ అప్పారావు గారు అవునని నిరూపించినా. (శ్రీకాకుళంలో శ్రీకాకుళేశ్వరుని దేవాలయం వుండేది. అందుకని దానికాపేరు వచ్చింది అని అప్పారావుగారన్నారు.) మొగలాయీలు పరిపాలిస్తున్న రోజుల్లో తపాలాసంచుల మూతలు అవూళ్ళో విప్పేవారట. ముద్రలు వేసేవారో, ఏంచేసేవారో మళ్ళా మూసేసేవారట. అందుకని, అవూరికి "శిఖాఖోల్" అని పేరొచ్చిందని. క్రమేణా చికాకోలు, శ్రీకాకుళమూ ఐందనీ కొందరివాదం.

సంవత్సరాలు గడుస్తూవుంటే ఉచ్చారణ మారుతూ వస్తుందని నమ్మకం వున్నది. కాబట్టి నమ్మేవాళ్ళు నమ్ముతూనేవున్నారు. అట్లాగే రాజమహేంద్రవరం, రాజమంద్రి ఐంది. విజయవాడే బెజవాడ ఐందని కొందఱు అంటూ వుంటే బెజవాడే విజయవాడ ఐందని మరికొందరంటున్నారు. అసలిదేమీకాదు. దొరలు అక్కడ వేడిని భరించలేక దానికి "బ్లేజ్‌వాడ" అని పేరు పెట్టారనీ అదే బెజవాడ ఐందనీ కొందరు ఆధునికులు అంటున్నారు.

కొన్ని వందల సంవత్సరాలు గడిచేటప్పటికి, నానాభాషలవాళ్ళ నోళ్ళల్లోనూ ఒక మాట నలిగి ఇంకోలా కూడా మారిపోవచ్చును. కాలాన్నిబట్టి ఉచ్చారణ మారుతుంది కాబట్టి.

హామిల్టన్ పేరుకు క్షురకర్మ ?

ఇలాంటి మార్పులలో అత్యద్భుతంగా రూపాంతరం పొందినది మద్రాసులోని హామిల్టన్ బ్రిడ్జి. అరవవాళ్ళ వాడకంలో అది అంబట్టన్ బ్రిడ్జిగా మారింది. (అంబట్టన్ అంటే మంగలి) మరికొంతకాలానికి చారిత్రక పరిశోధకులువచ్చి — ఇక్కడ క్షురకర్మలు విరివిగా జరిగేవనీ అందువల్ల ఈ పేరు వచ్చిందనీ ఖాయపరచారు తదువాతి తరంవారు, దానిని ఇంగ్లీషులోకి తర్జుమా చేసి బార్బర్స్ బ్రిడ్జి అని పేరు పెట్టారు. ఇటీవల ఆ బ్రిడ్జిని బాగుచేయడం సందర్భంగా ఒక గుమాస్తా దాని శంకుస్థాపన ఫలకంచూసి చెవ్వుమని — "దీనిపేరు హామిల్టన్ బ్రిడ్జి"అని వెల్లడి చేశాడట.

చిన్నపిల్లలకు ముందుగా "తా" అనే అక్షరం పట్టుపడుతుంది. అందుకనే వాళ్ళు "నాన్న" కంటే ముందు "తాత"ను పలుకుతారు. వాళ్ళ శబ్దోచ్చారణలో రాలూ సాలూ ఇవన్నీ ఎగిరిపోతాయి. "తూత్తాను" "ఉత్తలంలాయి" "నే తెత్తాను" లాంటివన్ని అవే. ఐతే, అది ముద్దుగావుండే ఉచ్చారణ కాబట్టి దోషంలేనిది.

పిల్లలకు టా పలకనట్టు కొందరు పెద్దలకు తా పలకదు. "టాగు టాను" "టమరు టాగండి" వంటివన్నీ అవే. అది ముద్దయితే ఇది ప్లయిలు. అది ఆనందిస్తాం, ఇది నోరు మూసుకుంటాం.

పెద్దవాళ్ళలో చాలమందికి 'ణ' 'ళ' 'ష' పలకవు. వాళ్ళ ప్రాణానికి బహు కష్టం, 'పెల్లి' 'ప్రానం' 'కస్టం'-ఇవే. కొందరికి ఒత్తులు పెట్టడం చాలా చిరాకుట అందుకని సాఫుగా హాయిగా ఏ బాదరబందీలు లేకుండా మాట్లాడేస్తారు - "నాకు ఏ బాదా, ఏ బయమూ లేవు"అని. కొందరికి ఒత్తులు పలకడం చిరాకయితే, మరికొందరికి ఆనందం. అడ్డమైనచోటల్లా గాఠ్ఠిగా ఒత్తేసి మాట్లాడేస్తారు వీళ్ళు. "ఏమోయ్, ఎఖ్ఖణ్ణుంచేమిఠి రావఠం? అంఠా ఖులాసాయేన్నా?" అని; వాళ్ళ వుద్దేశంలో వాళ్ళు "ఉచ్చారణోద్దండులం" అనీ ప్రతి అక్షరం చక్కగా, శుభ్రంగా మాట్లాడతాం అనీను.

పొడుంపట్టు పట్టేవాళ్ళ ఉచ్చారణ వేరు. వాళ్ళకు కొన్ని అక్షరాలు పలకవు. "బీరు బిడ్డ గడిబిచ్చలేదే" అని వాళ్ళంటే "మీరు నిన్న కనుపించలేదే" అని మనం అర్థం చేసుకోవాలి. ఉచ్చారణను మార్చగలిగే శక్తి ఒక్క కాలానికే కాదు. ముక్కుపొడుంకూ వుంది. అవులించేవాడూ తాంబూల సేవకుడూ ఇంకోలా మాట్లాడతారు. సందర్భాల్నిబట్టి, సమయాన్నిబట్టి యాక్షన్‌నుబట్టి మనం అర్థం చేసుకోవాలి. "శ్రద్ధకొస్తూఖ్" అని అవులించేవాడంటే "ద్రిడపో" అని తాంబూలసేవకుడంటాడు.

● అప్పుడే స్కూలునుంచి వానలో పూర్తిగా తడిసి ఇంట్లోకివస్తున్న కొడుకుతో తండ్రి :

"చెప్పులు విడు. లోపలంతా బురదవుతుంది."

కొడుకు : "ఏ చెప్పులు ?"

అసలు ఇంతకూ 'ఉచ్చారణ' అనే పదం ఎట్లా ఉచ్చరించాలో చాలామందికి తెలీదు. "నీ ఉచ్చారణ బాగులేదు బ్రదర్" అని ఎదుటివాళ్ళను సరిదిద్దడమేగాని, తనేం చేస్తున్నాడో తెలియదు. "అది వట్టి ఉచ్చారణ" మాత్రమే బ్రదర్ వత్తులేదు" అని ఎవరైనా వచ్చి అతన్ని సరిదిద్దాలి. ఆ మాటకు ఒత్తు లేదని తెలిస్తే తెలుగువాడు అరగంటసేపు ఆశ్చర్యపడక మానడు !

మరికొంత విగ్నానం

ఇలాగే జకార ఞకారాలను గకార నకారాలుగా ఉచ్చరించేవారిది తప్పు అనీ యజ్ఞము విజ్ఞానము కృతజ్ఞత వగైరాలను యగ్నము విగ్నానము కృతగ్నత అని పలకడం కేవలం అగ్నానమనీ అడిపోసుకునే దుర్మార్గులందరికీ కనువిప్పుగా వాఙ్మయ మహోధ్యక్ష వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు తమ "వ్యావహారిక భాషావ్యాకరణం"లో ఈవిషయమై సుదీర్ఘమైన చర్చ చేశారు.

ఇట్లా యజ్ఞంలో జ్ఞని రాసినప్రకారం జఞ అని పలికేవారేకాదు - పలక గలిగేవారు - కోటి కొకరు కూడా లేరని. సరిగ్గా లెక్కకడితే - ఆంధ్రులు నాలుగు కోట్లమంది ఉంటే రెండుకోట్లకి ఒక్కరు చొప్పున ఉన్నారని రుజూ చేశారు. వారిలో ఒకరు ఏలూరులో, మరొకరు విజయవాడలో ఉన్నారని కూడా వెల్లడించారు. తానుకూడా జకార ఞకారాలను గకార నకారాలుగానే పలుకుతానని. తొలిసారిగా ఆ యిద్దరూ విజ్ఞానం అజ్ఞానం అంటూ జ్ఞను శాస్త్రోక్తంగా - కాదు కాదు వర్ణక్రమం ప్రకారం పలకడంతో తాము చాలా సేపు ఆశ్చర్యపోయామనీ,శ్రీ గోపాలకృష్ణయ్యగారు ప్రకటించారు ; ఇంతకాలం జకార ఞకారాలను గ్నగా పలుకుతూ అది తప్పేమో అని బాధపడుతున్న అస్మదాది యాంధ్రులందరకూ ....ఈవిగ్నాన దీపం కనువిప్పై ఆనందమే కలిగించినది. ఇందుకు వ్యావహారిక వ్యాకరణ శాస్త్రగ్నులకు మేముకృతగ్నులము.

ఉచ్చారణమీద పరిశోధన విగ్నానమేకాదు వినోదంకూడా కలిగిస్తుంది.

కాళిదాసుగారు వెర్రిగొల్లడి అగ్నానవశంకంబళి వేసుకు రాజసభ కేగినపుడు రావణాసురుడి ఫొటోచూసి "రాభణాసురుడు" అని మహాకవి వాక్యం సెలవిచ్చాడు. కంగారుపడ్డ రాజుగారికి మంత్రిగారు మనోహరమైన వ్యాఖ్యానం చెప్పారు. అమ్మకన్న సంతానం ముగ్గురిలోనూ చిన్నవాళ్ల విభీషణ కుంభకర్ణులికి భకారాలుండగా రావణాసురుడికి లేక పోవటమేమిటీ అన్న తాత్పర్యంలా కవిగారలా సెలవిచ్చారని. ఇంతచక్కని స్వారస్యం ఉచ్చారణ ధర్మమే గదా.

భేదాబేధాభేదాలు

ఈ భకార బకారాలకి గల భేదం తమాషాగా ఉంటుంది. ఆమాటకొస్తే భేదానికీ బేధానికీ భేదం వుందని కొందరు గమనించరు. అలాటి పక్షపాతం తగదని వారి నమ్మిక. దీనిగురించి మాట్లాడినా కొందరు భాదపడతారు మరికొందరు బాధపడతారు.

ఒక నాటకంలో ఒక నటు డిలాగే చేశాడట. ఏదో పద్యం చదువుతూ యుద్దము నందున అన్నాడట - వెంటనే ప్రాంప్టరు "ఒత్తు గోయ్ వత్తు" అని వెనకనుంచి ఉసిగొలిపాడు. తక్షణం ఆ నటుడు ఆపద్యంలో తరువాత మాటలో చోటున్న చోటుచూసి "మదియుబ్భగ" అని సర్దుబాటు చేసేశాడు. రంగస్థల సమయస్ఫూర్తి కిదొక ఉదాహరణ అని శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుగారు చెబుతూవుంటారు.

ఉచ్చారణలో ఎదటి కవిపండితుని బెదరగొట్టిన తెనాలి రామకృష్ణుడి కథ మీకు తెలుసు. అయినా చెప్పక మానము. చెప్పినంత వేగంలో రాస్తానని పందెం వేసిన ఆ పండితుడికి, "తృవ్వటబాబా తలపై-"అన్న పద్యం చెప్పాడు రామకృష్ణకవి. అందులో తొలి అక్షరానికి - వత్రసుడో కరారావుడో తేల్చుకోలేక తికమకపడిపోయాడు వ్రాయసకాడు. బహుశా తెనాలిరాముడు తృ అని వుండదని - "ష్ఫర్" అని వుండాలని కొందరి వాదం వీరికి వత్రసుడికి, కరారావుడికి భేదంలేదు. కేవలం - తప్పుపట్టేరన్న కారణంతో పంతంపట్టి ఇప్పటికి మిత్రుడు, శత్రుడు అని, ధ్రువతారలనీ రాసే పాత్రికేయులున్నారు.

ఈ సందర్భంలో ఒక్కమాట. ఎవరూ "తప్పులు ఎరగని"వారు కారు. అందువల్ల ఈవాక్యాలు వ్యక్తుల్ని హేళన చెయ్యాలన్న దుర్బుద్ధితో మాట్లాడటంలేదు. కేవలం ధోరణులనే. విమర్శబడులు హేళన చెయ్యడం సంస్కార లక్షణం కాదని కూడా ఈ వాక్యాలు ఎరుగును.

ఒకసారి ఇవి ''ఇకనమిక్స్'' అంటే ''యు మీన్ ఎకనమిక్స్ అని ఎదటి మనిషి అర్జంటుగా తప్పుసర్దబోయాడు. నో ఐమీన్ ''ఇకనమిక్స్'' అన్నాయి యివి— నొచ్చుకున్నా - మొండిగా. ఇవి వింటున్నమూడో ఆయన భరించలేక ''దేరార్ 26 క్రైండ్స్ ఆఫ్ ప్రొనౌన్సియేషన్స ఫరెవ్వేరివర్డ్'' అంటూ తీర్పు చెప్పాడు

మొత్తంమీద ఉచ్చారణ చిన్న విషయం కాదు. ఒకళ్ళు నొచ్చుకుంటారని చర్చమానలేము. జనం ఒకలా అనేస్తున్నారని అన్నిటికీ సర్దుకుపోలేము. వ్యక్తులకు సమాజానికీ నీతి నియమాలు ఎంత అవసరమో, చాలమంది పాడుపన్లు చేస్తున్నారు గదా అని వాటిని నీతులుగా ఎట్లా అంగీకరించలేమో అట్లాగే భాషకీ''శాస్త్రం''నియమనిబంధనలు మన్నించడం అవసరం. అలాగనిఉరె య్యమనటంలేదు. ఎందుకంటే మనదేశంలో మొన్నటివరకూ వేదాలన్నీ - ఉచ్చారణే ప్రాణంగా, దేహంగా, తరతరాలుగా మనకి లభిస్తూ వచ్చాయి. బోధనలో ఎంతో పరిశోధన జరిగిన తరువాత పాశ్చాత్యులు (ఉచ్చారణ తప్పని తెలుసు. కాని తిరిగి చావటంలేదు) ఆడియోవిజువల్ (ఆ లిపి తప్పు - ఉచ్చారణకి తగ్గ అక్షరం లేదు) ఎజుకేషన్ (వ్యావహారికంగా చూస్తే డ్యూజులాగే వినబడుతుంది మరి) అంటూ తిరిగి శ్రవణేంద్రియం ప్రధానమని తేల్చారు.

అందువల్ల, ఉచ్చారణ శుద్ధంగా ఉండేట్లు చూడడానికే బాల్యంనుంచి (మనఖాదు: ఈతరం పిల్లలది) మనం శ్రద్ధతీసుకుంటే దేశాని కేవిధంగాను అపారనష్టం వాటిల్లదనీ, ఇందువల్ల చైనావాళ్ళు గెలవడానికి అవకాశాలు లేవనీ, కాశ్మీరు పాకిస్తాన్ పరంకాదనీ, జీవితావసర వస్తువుల ధరలు తగ్గడానికి ఆటంకాలు ఏర్పడవనీ, రైళ్ళలో రద్దీతగ్గే ప్రమాదం జరగదనీ, మద్యనిషేధం జయప్రదం అని చెప్పుకుండికి అభ్యంతరం ఉండదనీ, తెలుగుసినిమాలు బెంగాలీ పిక్చర్లస్థాయిని (వాళ్ళ కథలు కొనడంద్వారానే అయినా) అందుకోవడానికి అడ్డుండదనీ, బెజవాడలో మురుగుపారుదల అసౌకర్యాల పరిస్థితి మారదనీ, బహుమతి కథలు గొప్పవి రావడానికి ఆటంకం ఉండదనీ హామీయిస్తున్నాము. □□□



నేను విజయవాడ వెళ్ళేసరికి చీకటిపడిపోయింది. విజయవాడ గురించి నేను భయపడాల్సింది లేకపోయినా, రాజమండ్రీ ట్రెయిన్ దాటిపోవడంతో కంగారుపుట్టింది. తెల్లవారేసరికి నన్ను చూడాలని గుమ్మంలోనే కాచుకు నుంచుంటుంది శారద.

రాకపోవడానికి కారణం అడక్కుండా అలగడం. అపోహపడ్డం. పది సంవత్సరాల నా చర్యల్ని, తన కన్నీటినీ కావ్యాలుగా అల్లి చూపడం శారద ప్రత్యేకత. లేకపోతే రమణమూర్తి అన్నట్టు స్త్రీలవేరోప్పి!

ఏంచెయ్యాలి. యెక్కడకు వెళ్ళాలని ప్రశ్నించుకునేసరికి-జవాబుగా ప్రసాదరావు మామయ్య గుర్తొచ్చాడు. ప్రసాదరావు మామయ్యను నేను పెద్దయ్యాక చూడనే లేదు. ఆయన చిన్నతనంలో మా యింట్లో వుండి చదువుకున్నాట్ట తల్లీ తండ్రిపోయి ప్రేమలేని బంధువుల యింట్లో తిట్లూ, దీవెనలతో పెరుగుతూ వుంటే. అంతవరకూ సంతానంలేని అమ్మ, పోనీ ఆసరాగా వుంటాడని తనతో తీసుకువచ్చిందిట. అంటే అప్పటికి మా అమ్మకు మేం యెవరం కలగలేదు. ప్రసాదరావు మా అమ్మను అక్కయ్యఅనీ, మా నాన్నగారిని బావ అనీ పిల్చేవాడు. మాకు జ్ఞానంకలిగే నాటికి. ప్రసాదరావు మామయ్య తన క్లాస్ మేట్ అరుంధతిని ప్రేమించి. పెళ్ళిచేసుకుని, మా యింట్లోంచి వెళ్ళిపోయాడు. చాలామంది ప్రేమించిన వాళ్ళని పెళ్ళి చేసుకోవడం కుదరకా, పెళ్ళాడినవారిని ప్రేమించే నేర్పూ వోర్పూలేక, వాకరకమయిన యాంత్రిక జీవితానికి అలవాటుపడిపోతున్న యీ అధునాతన యుగంలో ప్రేమించిన మనిషిని పెళ్ళాడిన ప్రసాదరావు గారంటే యీర్ష్య కలగడంలో అసహజంలేదు.

అయితే ప్రసాదరావుగారిని అంతగా అభిమానించి, పెంచిన అమ్మ ఆయన్ని దారుణంగా తిట్టిపోస్తూంటే — నాకు అమ్మ బాధకు కారణాలు వెదకాలనిపిస్తే—వచ్చిన జవాబు యిది.

అమ్మ ప్రసాదరావును యింటికితెచ్చిన నాలుగేళ్ళకి కామాక్షి అక్కయ్య పుట్టడం. పుట్టిన ఆ అమ్మాయిని ప్రసాదానికి యివ్వాలనే వూహని అక్కయ్యతోపాటు, మనసులో పెంచి పెద్దచేసుకోవడం, జరిగిందిట. ప్రసాదరావు బి. ఏ. ప్యాస్ అయినరోజున అంతవరకూ దాచుకున్న వూహలు. పువ్వులుగా విచ్చుకుంటూంటే కూతురు భవిష్యత్తు పట్ల కన్న స్వప్నాలు—ఆ తల్లిలో చోటు లేనంతగా యెదిగిపోవడంతో, పెళ్ళిగురించి అతన్ని కదపడం. అతను నాల్గు రోజులు కదిలించినా, ప్రాధేయపడినా సారాంశం మొత్తానికి జవాబుగా అమ్మకు అతనినుంచి "కామాక్షి అంటే తనకు ఇష్టంలే"దనితప్ప మరో జవాబు అతనినుంచి అందుకోలేకపోయింది

పెంచి పోషించిన మొక్క ఆ విధంగా చేదుఫలాలు కాయడంతో అమ్మా, ప్రేమించిన అరుంధతికి చేతకానితనం వరంగా యివ్వలేక ప్రసాదరావూ, వాకళ్ళ కొకళ్ళు దూరమయిపోయారు.

ప్రసాదరావు వెళ్ళేరోజున అమ్మ తననే జయించిన అభిమానం ఆవేశంగా, ద్వేషంగా మారి నానా మాటలూ అని తిడితే, నవ్వుతూ వంగి అమ్మ కాళ్ళు పట్టుకోబోయిన తనకు ప్రతిఫలంగా నేలదక్కితే.... "అరుంధతిని ప్రేమిస్తున్నాను. నిజం. కానీయివాళ ఈరోజు మీ యింటినుంచి వెళ్ళిపోతున్నా. జీవితంలో నేను వెనక్కి తిరిగిన ప్రతిక్షణం మీరు కన్పిస్తారు .... మౌనంగా నేను నమస్కరించడం, మీరు కాదనడం జరగొచ్చు. మీరు రమ్మనకపోయినా వచ్చి, మీ తలుపు వెనుకనుంచి విడిచిన ,నిట్టూర్పులో భాషకందని ఆక్రందన - తలుపు తట్టలేని వ్రేళ్ళ మొనల స్పర్శా, నాదే అయ్యుంటుం"దని హెచ్చరించి వెళ్ళిపోయిన మామయ్య

గురించి, కథగా ఆయన జీవితం విన్న తరువాత క్షణంలో నాకు చూడాలనిపించిన ఆత్రుత - యిన్ని సంవత్సరాల అనంతరం నాకు మనోయవనికమీద కదలాడింది.

"మనకు సుఖం, సంతోషం లేకపోయినా యెదటివాళ్ళు ఆనందిస్తుంటే. ఆ ఆనందంలో నాకు భాగం వుందని అనగల్గిన వరం భగవంతుడు కొందరికే యిస్తాడు." నాకు భగవాన్ తక్కువ వరాలు యిచ్చాడని చీకటిరాత్రి బాధపడుతూంటే రమణమూర్తి పైమాట నాతో చెబుతూవుండేవాడు, మనకు దక్కింది అదేసుమా, అన్నట్లు నవ్వుతూ.

"మనం ఆశించినట్లు నలుగురూ సుఖపడుతుంటే చూడాలని ఆశపడ్డం - వాళ్ళు సుఖపడలేకపోతే మనదే ఆ కష్టం అయినట్లు యేక మథనపడిపోవడం కొందరిలో వీక్‌నెస్" అని నేనంటే కాదనీ వాడే అంటాడు.

విన్న రాత్రి కామాక్షిఅక్కయ్య బావగారితో ఘర్షణ పడుతూంటే, మధ్యలో నేను మాట్లాడానని కాదు, తనని వెనకేసుకురాలేదని ఆమె "చేతకానివాడివినువ్వు" అంది.... కోపంలో అన్నమాట అని తను సరిపెట్టుకున్నాడు ..కానీ బావని చూస్తే చాలా బాధపడుతున్నట్లుగా కన్పించాడు. "చూడవోయ్ నేనేమన్నా అంతే యిదీ దీని వరస. ఇన్నేళ్ళ సంసారంలో అది నా వాక్కు మాటైనా విందేమో చెప్పమను...."

"బావుంది....మీరు చెప్పినవన్నీ అంతే. మనకేం సంబంధం రాజుగారి కూతురు పెళ్ళికి వెళ్ళడం!" బావ చెప్పాడు. ఆ పెళ్ళికి వెళ్ళడం యెంత అవసరమో.... పైగా అక్కయ్యను తీసుకువచ్చి చూపించమని పెళ్ళి అయినప్పటినుంచి ఆయన పోరుతున్నాట్ట.... "నేను ప్రతీచోటికీ వెళ్ళలేనురా....యెప్పుడో ఆ య న గా రు — యీయనకేదో చేస్తే, దానికి నాకూ సంబంధమేమిటి...."

అక్కయ్య లోపలకు వెళ్ళిపోయింది.

"ఇదీ మీ అక్కయ్య ధోరణి. యే రోజైనా కనీసం నన్నర్థం చేసుకుని ప్రవర్తిస్తుందేమో అనుకుంటాను. వుహూ. ఇంత డబ్బు గణిస్తున్నాను. ముగ్గురు పిల్లలు పుట్టారు. మా యిద్దరికీ మాత్రం ఘర్షణ జరగని రోజు లేదు .... నా భయమేమిటంటే కుర్రాళ్ళకుకూడా మా మనస్తత్వమే పట్టుబడుతుందేమోనని. అనుమానం కాదులే. ఇప్పటికే వాళ్ళ నొకళ్ళు కొట్టుకుంటారు. పితూరీలు చెప్తారు. పిల్లలకోసమైనా మనం శాంతంగా ప్రవర్తించాలేమో...."

ప్రకాశం బావ అంతర్యంలో నాకు దాగిన రహస్యాలుగానీ, ఖుళ్ళుగానీ కన్పించలేదు, వాట్టి ఆవేదన తప్పించి. అక్కయ్యను మనసారా ప్రేమిస్తున్నాడనీ, ప్రాణంగా చూసుకుంటాడనీ మూడురోజులు వాళ్ళింట్లో వున్న నాకు రూఢిఅయింది. కానీ కామాక్షి అక్కయ్యకు - అంతగా ప్రేమించే భర్త పట్ల నిర్లిప్తతకు, ద్వేషానికి కారణం నాకు అంతు చిక్కలేదు. ఎంతో ఆలోచించాను. స్త్రీకి కావలసిన సరదాలు, నగలు, చీరల మీద మోజు; లంకంత యిల్లు - సామాన్య స్త్రీ కోరుకునేవన్నీ అందుబాటులో వున్నాయి అక్కయ్యకు మరీ లోటు లేకుండా చూసి - శాస్త్రయినా బెట్టు మిగుల్చుకోకుండా, ప్రేమించే మగవాణ్ణి స్త్రీ భరించలేదేమో అన్పించింది నాకు ఆఖరికి.

ఇన్ని ఆలోచనల బరువుతోవున్న నన్ను-ప్రసాదరావు మామయ్య యింటి ముందు రిక్షా ఆపి-దిగమన్నాడు రిక్షావాడు. తలుపులు మూసివున్నాయి. తీసివున్నట్లయితే సరాసరి లోపలకు వెళ్ళిపోయేవాణ్ణి.





ఏమని పిలవాలి?, ప్రసాదరావు మామయ్యకాక వేరెవరయినా తలుపుతెరిచి అడిగితే యేం చెప్పాలి. నన్ను నేను యెలా పరిచయం చేసుకోవాలి? ఇటువంటి అసందర్భపు ప్రశ్నలు లేచాయి. నిజానికి ప్రసాదరావు మామయ్య వచ్చినా తనని గుర్తుపట్టగలడా?

ఆయనకు చాలాభాగం తలనెరిసి.కళ్ళకింద నలుపు మొహంలో చీకటి వెలుతురుల ద్వైవిధీభావాల మిశ్రమంలా - పంచెమీద పొడుగుచేతుల కంచెమెడ లాల్చీవేసుకుని వుంటాడు-వృద్ధాప్యాన్ని అడ్డుకోలేని యవ్వనపు వోటమి మనిషి మొత్తంలో కన్పిస్తుందేమో.

దారితెలియని బాటసారి యోచనలా వూహలు ప్రయాణం చేస్తూంటే వో పదేళ్ళ అమ్మాయి తలుపుతెరిచింది.

"మీ నాన్నగారు వున్నారా యింట్లో" వెంటనే అడిగాడు తను.

"నాన్నంటే" అంది చప్పున ఆ చిన్నారి.

నాన్నంటే యెవరని చెప్పను? ఆ అమ్మాయి మొహంలోకిచూస్తే తండ్రి అనే వ్యక్తిని యెప్పుడూ చూడనట్లు-తనపుట్టా యిన్నియేళ్ళ అనుభవంలో అటువంటి మనిషి చలించిన గుర్తులు తెలియనట్టుగా చూసింది.

నా గుండె అనుమానంతో - రక్తపు వేగంతో నన్ను భయపెట్టింది. ఈ అమ్మాయి... నెమ్మదిగా అన్నాను.

"అమ్మగారిని పిలుస్తావా?"

లోపలికి వెళ్ళిందిపాప.

పిదిగుమ్మం దాటి .వాకిలి లోపలకు అడుగుపెట్టాను చొరవగా. ముప్పైయేళ్ళు దాటిన స్త్రీ వాకిట్లోకి వచ్చింది. ఆవిడ నుదుట తోపు కుంకుమబొట్టు నాకు మానసిక విశ్రాంతి యిచ్చింది. భయం అవిరిగా హరించుకుపోయింది. తెలియని ఆత్రుత ఆరాటపడుతోంది అదేస్థానంలో.

చాకచక్యం తెలిసిన మధ్యతరగతి యింటి వాతావరణంలా వుంది ఆవిడ రూపం. ఉప్పాడ జరీచీర శరీరంమీద. బుద్ధిమంతుడు తలెత్తకుండా బలపం పట్టుకుని పలకవైపు చూస్తోన్నంత నిశ్చలంగా అతుక్కుపోయింది.

ప్రసాదరావు మామయ్యచేత, కామాక్షి అక్కయ్యనూ, పెంచిన అమ్మ ప్రేమను, ఆర్ద్రితను తనకోసం వ్యతిరేకింపజేయగల ఆకర్షణ, అందం పదేళ్ళనాడు తనస్వంతం చేసుకుని వుంటుందన్న ఆనవాళ్ళు లీలగా కదులాడి కన్పించసాగాయి ఆవిడలో.

"నేను ప్రసాదరావుగారి కోసం వచ్చాను...."

"ఇంట్లో లేరు....మీరెవరు...."

నేను ఫలానా అని చెప్పాను....ఆవిడ గుర్తుగా కళ్ళు పైకెత్తి చూసింది. నేచెప్పింది అర్థమయినట్టుగా, మాటకన్నా ముందు నోరు చిన్నగా తెరిచింది.

"ఉహూ" అనుకుంది....తనలో....

● "ఆహారానికి కోళ్ళంత ఉపయోగకరమైనవి మరి లేవు."

"ఎందుకనో?"

"వాటిని పుట్టకముందు, పుట్టినతరవాత కూడా తినవచ్చు.

"మళ్ళీ వస్తానులెండి" అన్నాను.... నిశ్శబ్దాన్ని భరించలేక....

"వచ్చే టైమయింది....అలాకూర్చోండి"

నెమ్మదిగా సోఫా లో కూలబడ్డాను.... ఆవిడ లోపలకు వెడుతూంటే - పాప "అత్తా" అంటూ వెంటపడింది....

నాకు ఆ వాకిట్లో స్నేహితులుగా మనిషి లాంటి గడియారం. గుమ్మానికి తాజ్‌మహల్ అల్లికం అల్లిన తెర ...గోడలకు పటాలు మిగిలాయి. వొంటిగా కూర్చుని గడియారం చప్పుడు వినడం నాకు సరదా. ప్రతీక్షణం తను పడే కష్టాల్ని విప్పి చెప్పుకునే ఆప్త మిత్రుడి లాంటిది. మధ్యమధ్యలో నవ్వు తుంది అంతబాధలోనూ

ఇంతలో — లోపలినుంచి కాఫీ గ్లాసు తెస్తున్న పాప నన్ను చేరకుండానే దాన్ని కింద పడవెయ్యడం, నేను లేచి వెళ్ళే లోపున, అరుంధతిగారు లోపలినుంచి వచ్చి "పాడునానా" అంటూ ఆ పిల్లదాన్ని లేవ దీసి లోపలకు తీసుకువెళ్ళి కొట్టడం జరి గాయి. అవతలినుంచి దెబ్బలు. జవాబుగా ఆ అమ్మాయి యేడుపు. "వూరుకుంటావా, లేదా" అన్న ఆవిడ మాటలూ విన్పిస్తు న్నాయి.

"పోనీలెండి" అందామనుకున్నా....

బయటనుంచి యెవరో వచ్చిన అలికిడి విన్పించి వెనకు తిరిగాను. నేను వూహించిన ఆకారం ప్రాణం పోసుకున్నట్టుగా నలభై యేళ్ళ మనిషి. నా వూహలో లేని జరీ కండువా గోడ కొయ్యను తగిలిస్తూ ఆయన నావైపు చూశారు. అప్పటికే నేను లేచి నుంచున్నాను.

"పాపా" అని యేడుస్తున్న ఆ అమ్మా యిని పిల్చి "యెవరండీ మీరు?" అన్నాడు తిరిగి ఆయన. నేను చెప్పాను. మాటల

కోసం తడుముకోవాల్సివచ్చింది. నాకు తెలి యని కొత్త నాలో నాకు కన్పించింది.

ఆయనలో సంవత్సరాలనాడు నిద్ర పోయిన ఆనంద తరంగాలు లేచినట్టు, మొహంలో, మొత్తం ఇంద్రియాలు వుత్సాహ పడుతోన్నట్టు అన్పించింది. ఆ తాకిడికి తట్టుకుంటూనే ఆయన ..... "అరుం ధతీ చూశావా యెవరు వచ్చారో...." అని కేకేసి...."కూర్చోవోయ్ అంతాబావున్నారా, అక్కా బావా....ఎంతవాడివయ్యావు ?"

నేను అన్నిటికీ బుర్ర వూపాను. ఆయ నలో తన్మయత్వపు ఛాయలు నన్ను బంధి స్తున్నాయి. నాలో చాలా శక్తులు. నన్ను, చాలామందిని ఆకట్టుకోగలనేర్పు ఆయనలో వున్నట్టుగా అనిపించింది.

"నన్ను పసాది మామయ్యా అని పిలిచే వాడివి జ్ఞాపకం వుందా...."

ప్రసాదరావు మా కుటుంబాన్ని, మనుష్యుల్ని పేరు పేరునా అడు గుతూ భోజనం చేస్తున్నంతసేపూ తన్మయత్వం పొందుతూనే వున్నాడు. మధ్యలో అరుంధతిగారికి, గుర్తొచ్చే సంగతులూ, మేంచేసే అల్లరీ వివరించి కళ్ళ ముందు చిత్రిస్తూంటే నాకే ఆశ్చర్యం వేసింది....

కొందరు తెచ్చిపెట్టుకుని మాట్లాడుతారు నవ్వితే యెరువు తెచ్చుకుని నవ్వినట్టుగానే వుంటుంది....ఇటువంటి మామయ్య నేనా అమ్మ ఆపార్థం చేసుకున్నదీ !!

అన్నీ గుర్తొచాయి తిరిగి ...ఆలోచిస్తూంటే.

పదకొండు గంటలవరకూ నాతో కబుర్లు చెప్పి ప్రసాదరావుగారు లోపలకు వెళ్ళి పడుకున్నారు. వాకిట్లో వంటిగా పడు కున్నాను. కొత్తచోటేమో నిద్రపట్టలేదు.



కిటికీగుండా ఆకాశం మీద నైట్‌వాచ్‌మెన్ లా వున్న పిండు చంద్రుడు కన్పించాడు.

"నక్షత్రాలకు మాట్లాడ్డం నేర్పి మీకేం కావాలని అడిగితే ప్రతీ నక్షత్రం తనకో చందమామ కావాలంటుంది తెలుసా...." అన్న రమణమూర్తి మాటలు గుర్తొచ్చాయి .... వాడెప్పుడూ అంతే. ఏకాంతం, వియోగం తను భరించలేడు. ఎవరూ భరించకూడదంటాడు. పదును దేరితే మంచి రచయిత అవుతాడనుకుంటూ వుంటాను నేను.

మెలుకువలోంచి మగతలోకి, ఆపైన నిద్రలోకి నాకు తెలియకుండానే యే శక్తో తీసుకువెళ్ళి జారవిడిచింది. కలలోకూడా నాకు కావల్సిన విశ్రాంతి లభించలేదు. అమ్మ, నాన్నగారితో పోట్లాడుతోంది. పెద్దగా అరుస్తోంది. నాకు కోపం వచ్చి అరి చాను. లేచి వెళ్ళబోయాను అంతే....కల

లోంచి జారి వాస్తవంలోకి కన్ను తెరిచేసరికి నిశ్శబ్దం వడిలో వుండవల్సిన నేను, వాకిలి వెనుక గదిలోంచి ప్రసాదరావు మామయ్య మాటలు, వాటిని సాంతం పూర్తికాకుండానే కటువుగా యెదుర్కొంటున్న అరుంధతిగారి వాగ్వివాద ధోరణి వినవల్సి వచ్చింది.

"వూరుకో...."

"అవును.... మీరు చేసే చాలా పనులు సహించి వూరుకున్నాను. ఈ పాపను నేను యిక పెంచలేను. దరిద్రగొట్టువిల్ల. ఇది యింటి కొచ్చినప్పటినుంచీ అన్నీ కష్టాలే...."

"మీ నాన్నగారు పోడానికీ, ఆ పసిదానికీ సంబంధమేమిటి...."

"మీకు లేకపోయినా నాకుంది. అయినా మీరెప్పుడూ యింతే. ప్రేమించి పెళ్ళి చేసుకుంటే — ఆ తరువాతకూడా మగ వాడు తనని ప్రేమిస్తాడని ఆడది అనుకోడం

అవివేకం అని తెలిసింది. నామాట వొక్కటైనా చెల్లించనప్పుడు దేనికి ? మీదారి మీది....''

''ఏమిటి చెల్లించేది. పెళ్ళిచేసుకున్న మొదలు మా పిన్ని అంటే. పడలేదు. నీ మూలంగా కదూ ఆవిడ మనింట్లోంచి వెళ్ళిపోయింది. మీ తమ్ముడికి చదువు చెప్పిస్తానని తీసుకువచ్చావు. వాడు చెడు తిరుగుళ్ళు తిరుగుతూవుంటే పాడయిపోతున్నాడని యింటికి పంపించేశాను. అది నాతప్పంటే నే నేంచెయ్యను...."

"నన్నేం నమ్మించ నక్కరలేదు. అసలు మీకు సీతారామయ్యగారి సంతానంమీద వున్న ప్రేమ, నామీద లేదు ..."

"ఏమిటి నువ్వు మాట్లాడేది...."

"నిజమే అంటున్నాను. మీరు వారం క్రితం చెప్పా పెట్టకుండా యెక్కడకు వెళ్ళిందీ. ఆరోజు తెలియకపోయినా యివాళ తెలిసింది. ఈ అబ్బాయి యెందుకువచ్చాడో నాకు తెలుసు ! ఆ కామాక్షే కదూ మీ దగ్గరకు పంపింది !

"అరుంధతీ...."

"అంతగా అవిడ్నే పెళ్ళాడాలనుకుంటే నే నేం కాదనేదాన్నా. యిన్నేళ్ళ వచ్చి.... ఛీ...."

''నోరు మూస్తావాలేదా. అతనికి వినబడితే యెంత బాధపడతాడో తెలుసా ?"

"నా కేం భయంలేదు. మీ రీ వూరు నుంచి యెందుకు ట్రాన్స్‌ఫర్...."

ఆయన భరించలేక కొట్టినట్టున్నాడు. ఆవిడ యేడుస్తోంది. మాటలు స్పష్టత కోల్పోయి అర్ధరహితంగా వినబడుతున్నాయి.

నాకు లేచి పారిపోదామనిపించింది. నేను వెళ్ళిపోవడం అన్నది జరిగితే యెందుకు వెళ్ళిపోయిందీ ప్రసాదరావు మామయ్య వూహిస్తాడు.

మనలో రేగే అవమానపు ఛాయల్ని యెదుటివాళ్ళు గుర్తుపట్టలేనప్పుడు కలిగే ధైర్యం - ఆ నిజం నలుగురి నోటా పడ్డప్పుడు మరింత చిన్నతనంగా మారి దుఃఖితుల్ని చేస్తుంది.

కళ్ళు మూసుకొని నాకేం తెలియని అవస్థలో ఆలోచనల్లోని మనుష్యులందరికీ చోటివ్వడం చేతకాక కళ్ళు మూసుకొని పడుకున్నాను. అరుంధతిగారి యేడుపు చాలాసేపు జోలపాడుతూనేవుంది నాకు.

తెల్లవారింది. కాఫీ తాగడం అయిన తరువాత "నేవెడతాను మామయ్యా" అన్నాను రాత్రి జరిగిన సంఘటన నేను వినివుండనని ఆయన నమ్మాలనీ నా భావాల్ని, చర్యల్ని యెంతో అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించాను అది ఎంతవరకు నెరవేరిందో నాకు తెలియలేదు. ఆయన మాత్రం మరేమనకుండా కండువా వేసుకొని పద అన్నాడు. ఇంతలో గుమ్మం తెర వెనకనుంచి.

"భోజనానికి వస్తారా. ఎక్కడైనా భోజనం చేస్తారా?"

"కొంచెం పనుంది ...రాను...."

ప్లాట్‌ఫారంమీద యిద్దరం మౌనంగా నడుస్తున్నాం....అలంకారాలన్నీ తీసేసి పడుకుని, అప్పుడే లేచి బద్ధకంతో ఆవలిస్తున్న అందగత్తెలావుంది, పగటి పూట విజయవాడ రైల్వేస్టేషన్.

"నాన్నగారికి యేం చెప్పమంటారు ?"

"నమస్కారాలు చెప్పు....ఆయన్ని చూడాలనివుంది...."

"అమ్మ యేం అనదు. పోనీ వొకసారి రాకూడదా. మామయ్యా'' అన్నాను.

"నీకు తెలియదోయ్. నే వచ్చానంటే వాళ్ళ మెదడేకాదు నామనసుకూడా పాడవుతుంది....'' ఆగి అన్నాడు.

"ఆరోజు అక్కయ్య మాట తేలిగ్గా కొట్టిపారవేసిన నేను, యీరోజు బ్రతుకులో సుఖపడ్డం లేదని, తొందరపాటుతో యిద్దరి హృదయాలూకూడా వెలితిపడ్డాయని అక్కకు తెలిస్తే మరింతకృంగిపోతుంది.... అక్కయ్యముందు నాబాధను యేనాడూ దాచుకున్నవాణ్ణి కాను. కానీ ఆవిడని బాధపెట్టడం యిష్టంలేక రావడం లేదంటే ... వొకవేళ వచ్చినా నాకు ఆత్మశాంతి దొరకొచ్చు... కానీ అక్కకు విశ్రాంతి కరువవుతుంది....అంతే....''

ఓదార్పుగల్గిన హృదయం వున్నా, ప్రయత్నంమీద మాటలు కంఠంనుంచి తెచ్చుకోగల సమయమయినా, అందుకు తగిన వయస్సు లేనందున మౌనంగా వుండిపోయాను సుఖపడ్డానికి దుఃఖించడానికి అన్నిటికీ వయసుతో సంబంధ మున్నట్టే - వోదార్పు అందివ్వడానికి కూడా వో వయసు అవసరమని నాకా క్షణాన్నే తెలిసింది,

ఇంతలో రైలొచ్చింది. ''వుత్తరాలు వ్రాస్తూండు'' అని నన్ను రైలెక్కించి వెళ్ళిపోతున్న ప్రసాదరావు మామయ్య గుండె బరువుగా దిగులుపడ్డం నాకు కన్పించింది.

ఏ శాపం మూలంగా ప్రసాదరావు మామయ్య చవులూరిన బ్రతుకులో రుచిని

● పిచ్చాసుపత్రినిచూడ్డానికి ఒక పెద్దమనిషి వెళ్లాడు. ఒకచోట ఒకడు తన గుప్పిట్లోకి మాటిమాటికీ చూసుకుంటూ వూరికే మురిసిపోతున్నాడు.

"నీ చేతులో ఏముందేమిటి ?" అడిగాడు పెద్దమనిషి.

"చెప్పుకోండి."

"సైకిలు"

"కాదు"

"కారు"

పిచ్చివాడు ఒకసారి గుప్పిలి కొద్దిగాతెరిచి చూసుకుని "ఊహు" అన్నాడు.

"రైలా ?"

మళ్ళీచూసుకుని "కాదు."

"ఆ. తెలిసింది. గుర్రం !"

మళ్ళీ జాగ్రత్తగా గుప్పిలి చూసుకుని పిచ్చివాడు "తెల్లదా, నల్లదా ?" అని అడిగాడు.

అందుకోలేకపోయాడో నాకర్థంకాలేదు. తన కోసం సర్వస్వాన్నీ త్యాగంచేసిన, చేస్తున్న భర్త అంటే, భార్యకున్న తృప్తి గౌరవం వుండవని అక్కయ్యలాగే అరుంధతిగారు కూడా నిరూపించుకుంది.

అయితే అరుంధతి వూహకు మూలలు లేవు. కేంద్ర బిందువులేదు. తనకు జరగని అన్యాయాన్ని వూహించుకుని — వాటినే పెద్దగా చిత్రించుకుంటోంది. అనే సంగతి ప్రసాదరావు మామయ్యతో పరిచయంవున్న యెవరైనా వప్పుకుంటారు.

అయితే అరుంధతి వేదనకు కారణం ? ప్రసాదరావు మామయ్య కళ్ళల్లో. మాటల వెనుక. బలమైనకోరిక. యేనాడో పోగొట్టుకున్నదానికి పశ్చాత్తాపం నాకు లీలగా కన్పించాయి. అమ్మమాటను కాదన్నదానికే బాధ పడుతున్నాడో. లేక అరుంధతి ప్రవర్తనతో విసిగి. కామాక్షిఅక్కయ్య తలపుల్లో జీవిస్తున్నాడో భేదించగల్గితేగాని తెలియదు.

ఈ విధంగా చెయ్యగలిగితే బావుంటుందని ప్రతిమనిషీ. వాస్తవంలో చీకటి యెదురయినప్పుడు అనుకుంటాడు. అదో తృప్తి. ఆ తృప్తిలోనయినా యీ భయంకర వాతావరణంనుంచి దూరంగా వెళ్ళి కలల లహరిలో వూగిసలాడతాడు....

అయితే - అయితే....నాకు తెలియకుండానే కామాక్షి అక్కయ్యమీదకూడా జాలి పుట్టుకొచ్చింది ప్రేమించిన మనిషి తనకు కాకుండాపోతే. కాదు. తననికాదని తిరస్కరించిపోతే. ఆ మనిషిలో కలల యెత్తు పల్లాలు తలక్రిందులయితే....యిలాగే ప్రవర్తన ప్రతిధ్వనిస్తూ వుంటుందా ? ఆ మనుష్యుల్ని మనం యేదృష్టితో కొలవాలి ? వాళ్ళకు మన హృదయాల్లో యివ్వగల్గిన స్థానం యెంతటిది ? ఈప్రశ్నకు నాకు సరియైన జవాబు దొరకలేదు. ఆలోచనలకు ప్రతిగా అర్థంకాని ఆవేదన, వరంగా నన్ను ప్రయాణం పొడుగునా వేధించింది.

నేను యింటికి వెళ్ళేసరికి అమ్మ-తమ్ముడిచేత వుత్తరం వ్రాయిస్తోంది. వాడు నన్నుచూసి

"అమ్మా-అన్నయ్యవచ్చాడే" అన్నాడు.

"మొన్న నే, వస్తానన్నావు. ఇంత ఆలస్యంచేశావేం? అక్కయ్య యెలావుంది" అంది అమ్మ.

"బాగానేవుంది."

అమ్మ తిరిగి తనపనిలో మునిగిపోయింది. అమ్మకు ప్రసాదరావు మామయ్యగురించి చెప్పాలా వద్దా అని క్షణం తటపటాయించాను. నా ఆలోచనలకు. అనుమానాలకు సరియైన జవాబు అమ్మదగ్గర దొరుకుతుందనిపించింది.

"అమ్మా" అంటూ మొదలుపెట్టి ఆవిడ వైపు చూస్తూ అంతాచెప్పాను. అమ్మ అంతర్యంలో యెటువంటి తరంగాలు కదులాడతాయో వెదుకుతూ

''నీ గురించి. నిన్ను చూడాలని అనుకుంటున్నాడు" అన్నాను చివరికి.

''ఎందుకు. చేసింది చాల్లేదా. వాడి మొహం ఈ జన్మలో నేను చూడదల్చుకోలేదు. బాగాజరిగింది శాస్తి" అనేసి ఆపైన స్వగతంగా గొణుక్కుంటోంది.

''అమ్మా.''

''నువ్వు నోరుమూసు కూరుకో వారేయ్. అసలు వాడింటికి నువ్వెందుకు వెళ్లావు."

నాకు ఆశాభంగమే జరిగింది. అమ్మ లోపల యీ నాటికీ కన్పించని ద్వేషం రాజుకుంటూ వుందన్నమాట. ఈ రోజైనా అది కరిగి కరుణగా మారకూడదా. నిరాశగా లోపలి గదిలోకి వెళ్ళాను-

గది విడిచి వెళ్ళిపోతున్న వూగుతున్న జడ. తలలో పువ్వుల భాగం. జరీ అంచున్న పమిటచెంగు. అన్నీ గడపదాటి మాయమవుతున్నాయి. శారదతో జరిగిందంతా చెప్పాలి.

''యేవోయ్‌మాట'' అన్నాను.

చాలా ఆలస్యంగా విసుగ్గా. నెమ్మదిగా వచ్చింది. నా మెదడులో భయం పరుగు తీసింది.

''వంట్లో బాగోలేదా ?"

''వుంది...."

''మరి అలా వున్నావేం ?''

''ఎలా వుండాలి ?"

"నే వుండమన్నట్టు వుంటావని నాకు తెలుసుగానీ. మొదట అలా కూర్చుని నే చెప్పేది విను....నిన్నరాత్రేమోనేం....'' శారద చటుక్కున అంది:

"మీరేం చెప్పనక్కర్లేదు. నాకు తెలుసు...." అంది. ఆమాట వెనుక వర్షించబోయే మేఘం. పట్టుకునే కటుత్వం తెలియని చిరాకు. అన్నీ వున్నాయి.

''ఏం తెలుసు" అన్నాను నెమ్మదిగా....

''తిరిగి నే చెప్పాలేమిటి ? ..."

వెళిపోతున్న మనిషిని అందుకోవాలనుకుంటే మెత్తని జడలో చివరిపాయలు అందినట్టే అందితే - అయిష్టంగా శారద నావైపు తిరిగిందనిపించింది.

"వదలండి"

దేనికైనా కారణం వుండాలిగా. పైగా చిన్న కారణాలని సిల్లీగా తీసుకుని...."

"రాజలక్ష్మి మిమ్మల్ని విజయవాడలో ఆపేసింది....అతిధిగా రెండురోజులు వుండమంది....పాపం మీరు కాదనలేకపోయారు" ఆగి అంది....'' పీటికి నగిషీలు చెక్కిగా మీరు చెప్పేది''

''హాహా. అదేంలేదు. ఆ అమ్మాయి మన రమణమూర్తి భార్య కాబోతోంది తెలుసా ?''

''నన్ను వదలండి చాలు''

''అసలింతకీ నేను ..."

''మిమ్మల్ని నమ్మకూడదు....యిన్ని చెప్పి....''

నా ఆవేశం. శరీరంలో భూతంలా యెదిగిపోతూంటే - వెళ్ళి గట్టిగా భుజాలు పట్టుకుని అన్నాను.

"అసలు. మిమ్మల్ని. ఆడవాళ్ళని నమ్మకూడదు. మీకు ప్రేమించడం చేతకాదు. ప్రేమించబడ్డం తప్పించి.''

శారద నా చేతుల్లోంచి తప్పించుకుంది. నాచేతిమీద రెండు కన్నీటి బిందువులు మాత్రం వున్నాయి.

● *ఇంటియజమాని : "ఏమండీ, మూడునెల్ల అద్దె బకాయి పడ్డారు. ఎప్పుడిద్దామని ?"*

యువరచయిత: "ఇచ్చేస్తాసార్! మంచి ప్లాటొకటి ఆలోచిస్తున్నాను. అదేదన్నా కుదిరి, నేను రాయదలచిన నవలరాసి, నవలల పోటీకి పంపించి వాళ్ళు బహుమతి ఇచ్చి, చెక్కు పంపించగానే, బ్యాంకికెళ్ళి మార్చి మార్చి డబ్బు తీసుకోగానే, మీ బాకీ పూర్తిగా చెల్లించేస్తాం."



వారంరోజులుగా మనుష్యులచుట్టూ పరిభ్రమించి చాలా మనసుల్ని పసిగట్టగల్గి, వాళ్ళ వ్యధలకు మొదలు తెలుసుకోలేక పోయాననిపించింది.

ఎక్కడా అభిమానంలేదు. ఉన్న అభిమానం చుట్టూద్వేషం పూత. మీటితే బ్రద్ధలయి సర్వనాశనం చేసేశక్తిగల అశాంతి — పల్చటి పొరలతో శాంతిని కాపాడుతోంది. నవ్వు వెనుక శబ్దంలో తీరనితనం. మనిషి లోపల కన్పించకుండా జీవిస్తున్న రాక్షసుల హాహాకారాలు.


నాల్గురోజులు అలాగే గడిచాయి. నా సంశయాలు, భయాలు, బయటకు వెళ్ళి స్వేచ్ఛగా జీవించే శక్తిలేని ప్రాణుల్లా నాలోనేవుండి వేధిస్తూ, వోదారుస్తూ రకరకాల అనుభూతుల్ని కల్గిస్తున్నాయి. ఇటు వాస్తవంలో అటు కలలో.

మరునాడు బుచ్చిబాబుగారి "కసత్వం" చదువుతూంటే, ఆయన ఉదహరించిన "లారాషిఫోకాడ్"అనే ఫ్రెంచి సాహితీవేత్త మాటలు "మరీ యెక్కువగా ప్రేమించే వాళ్ళపట్లకంటే, ద్వేషించేవారిపట్లే యిష్టం యేర్పడుతుంది" నన్ను ఆకర్షించాయి. నా మెదడుపై తాకిడితెచ్చాయి. నన్ను కుదిపి క్రిందా మీదా పడేశాయి.

తికమకపెట్టే లెక్కచేస్తున్న విద్యార్థి మెదడు వో విధమైన చిరాకుతో వుంటుంది. ఆ చిరాకు భరించలేక చటుక్కున ఆఖరి పేజీలో ఆన్సర్ చూస్తే లెక్కమీద 'యింతేనా' అనే తేలిక అభిప్రాయంతో పాటు, తను చేసినవిధానంలో తప్పుకూడా ముల్లులా గుచ్చుతోనే వుంటుంది అమ్మ మాటను కాదని, అమెకు దూరంగా జరిగి, తనని ద్వేషిస్తోందని తెలిసీకూడా, అమ్మ పట్ల గౌరవభావం చంపుకోలేని ప్రసాదరావు మామయ్య అంతర్యం నిజరూపం దొరికింది. తమకోసం ఆస్తుల్నీ, పెంచినవాళ్ళనీ వొదులుకుని తామే సర్వస్వం అని నమ్మిన భర్తల్ని, అనుమానంపేర దూరం చేసుకుంటూ, ద్వేషాగ్నితో కాల్చుకుంటూన్న అరుంధతి, కామాక్షి అక్కయ్యలరూపం వెనుకదాగిన అర్థంకాని, విధి విధిపినకన్నీటి బొట్లూ కన్పించాయి.

ఊరునుంచి వచ్చినరోజు శారద నన్ను అనుమానించడంలో, అమెకే కన్పించని లోతులు వున్నాయని తెలిసి నా ప్రేమకు గర్వపడాలో, అమెలో మొదలయ్యే ద్వేషానికి మంగళహారతి పాడాలో తెలియలేదు. ఎన్నో యిబ్బందుల్ని, చుట్టూ మనుష్యుల నుంచి ఈర్ష్యాసూయలను భరించిగానీ 'లారాషిఫోకాడ్' ఆ మాట అనివుండడు. చుట్టూ మనుష్యుల్లో చెలరేగే మానసిక సంక్షోభాన్ని తట్టుకోలేక, నిభాయించుకోలేక కన్నీటిని దాచుకుని ఆమాట రాసివుంటాడు.

ఆయనకు మనసులో మౌనంగా నమస్కరిస్తూ, మెదడులో వెలిగే శాంతిని శారదకు చూపించడంకోసం లోపలికి పరిగెత్తాను. □□□



పరాభి పంచాంగము

ఆగస్టు

1. ప్రజానీకములో మానాలు పోయి
సమానాలు రావాలంటుంది
సోషలిజం.

2. అపనమ్మకములోనే అనంద
ముండేది
అందుకనే, తాంత్రికుని కన్న
మాంత్రికుడన్న మనకంత సరదా.

3. ఈనాటి కళలో
కళాయి ఎక్కువగా కనుపిస్తుంది.

4. చదువు సాము లేకున్న మానెగాని
సాము చదువుమాత్రం
చాలా అపాయకారి.

5. ప్రతిసతి కోరేది
పతినేగాదు, వనస్
పతిని గూడాను.

6. మది, రసహితంబగుట మదిర
అంటాడు భోగి
మదిరహితంబగుట మదిర
అంటాడు యోగి
ఇద్దరిదీ నిజమేననుకుంటాను నేను

7. జగన్మాత యనగా పరాశక్తి
ఆమెయే అందరికీ తొల్లి.

8. ఖయాం రుబాయత్‌ను
సీరాతోకాదు సారాతో వ్రాశాడు.

9. నిమోనియాకన్న అపాయకారి
సినిమోనియా.

10. సులోచనలన్న ఇష్టం నాకు.
అయిష్టం గ్లాసు లోచనలన్న.

11. అజాద్ హింద్ సమరానికి
అహింస సాంకేతిక సూత్రం
మహాత్మునికి.

12. మంచివదనం కన్నా మంచిదనం
మహిళకు ముఖ్యావసరం.

13. బుర్రల చెక్కించేది అటాక్రసి
బుర్రల లెక్కించేది డెమోక్రసి.

14. అరికి లోబడుటకన్న
ఉరికి లోబడవచ్చు.

15. యూన్సీదళంలోని
కురంగి నేత్రలంతా
ఫిరంగి నేత్రలుగా మారారు.

పరాభి పంచాంగము

16. పికస్వరముకన్ననూ ఓపికస్వరము
మృదుల మంజులము.

17. శాసనసభ్యులలో చాలామంది
ఆసన సభ్యులు మాత్రమేను.

18. పడతి గడుసరే కానిమ్ము:
నగలన్నచో కడుంగడుసరే
అంటుంది.

19. ఏదీ అనుదానికి ఆదిలేదు.

20. మతాలవల్ల భజనేకాదు
విభజనకూడా సంభ
విస్తుందా, ఏమి?

21. క్షత్రశక్తికన్ననూ బలవత్తరమగు
నట్టిది
నక్షత్రశక్తి.

22. గీతను నేర్చుకోమన్నాడు
తిరిగి తానే గీతను మానమన్నాడు
గాంధీమహాత్ముడు.

23. ఎన్నికలలో అన్ని కల్లలు.

24. ఆటంకాలు విడిపోవుటకు
టంకాలు అవసరము.

25. ఏర్పాటువల్ల విద్యుచ్ఛక్తిపుడుతుంది.

26. కొనకొమ్మకాయలు కోయుటకు
ఎత్తుగడ కావాలి.

27. దక్షిణాఫ్రికాలో బంటూలు బంటులు

28. "హౌరా" అని ఆశ్చర్యం కలిగిం
చేది హౌరావంతెన!

29. అతగాడికి చింతలు చిత్తూరంత.

30. టాకీ గావాలి నేటి టాకీ.

31. నాయంత లేడనుకుంటాడు
నియంత

— పరాభి



బ్రతుకు బాటలో

అరవింద

రమణి ఆ సాయంత్రం శంకర్ రాకకి ఎదురుచూస్తోంది. తను ఒంటరిగాఉండే ఆ ఆలోచనలే వస్తుంటాయి రమణికి. ఆ సాయంత్రంచల్లగాకూడా ఉంది. వాన పడవచ్చు అనిపిస్తోంది. ఆకాశంలో మబ్బులు, చల్లగాలులు చూస్తుంటే, చినుకులు ప్రారంభించకుండా అతడు ఇంటికివస్తే బాగుండు ననిపిస్తోంది.

పోనీ ఇవేళ అతడిని ఆ సంగతి అడిగితే. అసలు శంకర్‌ని ఆ విషయం అడగవచ్చా. సమాధానపడగల తెలివితేటలు తనకు లేవా !

ఇతరుల విషయంలో ఎన్ని కబురు. సలహాలు. నీతులు అయినా చెప్పవచ్చు. స్వవిషయం వస్తేనే పేటికి లొంగదుమనసు. ఆలోచన చాలదు. అతడిని అడిగి, అతడి సమాధానం ఏమిటో తెలుసుకోవాలి.

రమణి భర్త శంకర్ ఇంకా రాలేదు. ఆ సంగతులే. తన వివాహానికి ముందర జీవితం, అతనితో తనకి వివాహమవటం ఇవన్నీ మెదడుమీద సజీవంగా తిరుగుతున్నాయి. అతడు చాలా మంచివాడు. శంకర్‌కి భార్య కావటం తన అదృష్టమే. కాని, ఆ ప్రశ్న - ఆ ప్రశ్న మనసులో ఉండి తనకి శాంతిని దూరం చేస్తోంది. తను శంకర్‌కి కోరుకున్నంత దగ్గిర కాలేకపోతున్నది.

అసలు దీనికి మూలం తను టీచర్‌గా ఉద్యోగంలో ప్రవేశించగానే అరుంధతిని చూడటానికి వెళ్ళటం, అరుంధతి చాలా అమాయకంగా మనసులో అంతా మంచితో ఉండేది. కొన్నాళ్ళు స్కూల్లో పిల్లలందరూ గాంధీగారి శిష్యురాలని పిలిచేవారు. కానీ, తరువాత స్కూలు లీడరయి, సత్యం, అహింస, ధర్మం మొదలయిన విషయాలలో నిష్కల్మషంగా ప్రవర్తిస్తూ స్కూలు పిల్లలమధ్య చూపించే ఓర్మి, దీక్ష అవమానాలు సహితం సహించడం చూసి స్నేహితులంతా అపర గాంధీ అనేవారు. కొంతమంది యెగతాళి చేసేవారు. రోషం, ధైర్యం లేవని. అయినా సహించేది.

ఆ అరుంధతి చాలా మారి పోయిందని. తోటికోడలు, ఆడబిడ్డలతో మాటలు అనుకుని వేరే వెళ్ళిందని, కొన్ని సంగతులు విని ఆశ్చర్యపడింది రమణి. మనుషులు అట్లా మారిపోతుంటారా అనుకుంది. అరుంధతిని చూడాలనిపించింది. అరుంధతి కూడా రమ్మనే రాస్తోంది. అన్నయ్యని అడిగితే వెళ్ళమన్నాడు. దగ్గరే. మూడుగంటల రైలు ప్రయాణం. అదే తను ఒంటరిగా ప్రయాణం చెయ్యటం.

అరుంధతి స్టేషన్‌కు వచ్చింది. అరుంధతిలో ముందుగా తను గమనించిన మార్పు ఎక్కువ మాట్లాడటం. అరుంధతి ఏవో సంగతులు చెప్తూనే ఉంది. అరుంధతికి ఒక కూతురు. ఏడాది పాప.

కాఫీ త్రాగాక అరుంధతి తన మొహంలోకి చూస్తూ,

"నువ్వేమీ మారలేదే, రమణీ" అంది.

"మారాలని ఎక్కడైనా ఉందా ?" అంది రమణి.

"నీకు మారాల్సిన అవసరం రాలేదు. ఊహు, నువ్వు ఇట్లాగే ఉంటే నీకసలు పెళ్ళే కాదు." అంది నవ్వుతూ. రమణి మాట్లాడలేదు.

"మారాలి రమణీ. అసలు మారనిది ఏమిటి చైతన్యవంతమైన ఈ ప్రపంచంలో, వయసుతోబాటు ఎదుగుతాము. ఎదగటంతోబాటు మన ఆలోచనలూ ఎదగాలి, నిత్యం ప్రపంచం మారుతూనే ఉంది. కాలంతోబాటు ఆ ప్రపంచంతో మనమూ మారాలి.

"నేను చాలా మారానుతెలుసా ?" అంది కప్పు టేబుల్‌మీదపెట్టి.

"విన్నాను" అంది రమణి. తనూ కప్పు టేబుల్‌మీద ఉంచి.

అరుంధతి గట్టిగా గలగలా నవ్వింది.

"విన్నావా ? చూడటంలేదన్నమాట. నువ్వూ మారాలే. లాభంలేదు. ఇరవైయేళ్ళనిండి, చిన్నప్పటినుంచి నన్ను చూస్తున్నావు — నాలో వచ్చిన మార్పు నీకు తెలియకపోతే - నీ అమాయకత్వం లాభం లేదే రమణీ ! నాలో చాలా మార్పు వచ్చింది చెబుతా విను.

ఈ రెండేళ్ళలో నేనెప్పుడూ నమ్మని పరమ సత్యాలు అనేకం తెలుసుకున్నా రమణీ. ముందర నేనెంత మథనపడ్డానో, బాధననుభవించానో అది కేవలం అనుభవైకవేద్యం. కానీ నేను తెలుసుకున్న

పరమ సత్యం "ఆనందంగా ఉండు దానికి ప్రయత్నించు"అని. ఈ సత్యమే క్రమంగా నా బాధను తగ్గించింది. వింటున్నావా? మీరంతా నన్ను గాంధీ అని పిలిచేవారు. అంత చిన్న వయసులోనే నేను నా మనసు మీద అంత సాధన చేశాను. సాధించాను కూడా. నాకనిపించేది — ప్రపంచంలో దేనినైనాసరే, నేను నవ్వుతూ సహించగలనని. కాని, పెళ్ళి అయి, తోటికోడలు, ఆడబిడ్డలమధ్య ఉన్నప్పుడు నాకు అదృష్టవశాత్తు ఒక పరమసత్యం బోధపడింది. ఈ సహించటమనే సాధించిన గొప్ప గుణం గృహస్థుల సాంసారిక జీవనానికి వర్తింపజేయటం అవివేకం అని. నన్ను మీరు గాంధీఅంటే, మా అత్తవారింట్లో నన్ను "అమాయకురాలు" అన్నారు. దానికి పర్యాయపదమే తెలివితక్కువదని. అది సహిస్తే అనర్థమేకాని ఎవరికీకూడా లాభం నాకు కనిపించలేదు. పైగా రమణీ! మన చుట్టూ వున్న వ్యక్తుల్ని మరింత స్వార్థపరులుగా చెయ్యటానికి, ఎక్కువ అన్యాయాలకి అవకాశం యివ్వటానికి తోడ్పడుతుందని అర్థమయింది.

అప్పుడే ఆస్తి పంపకాలు జరిగాయి అందరం పెద్ద హాలులోనే ఉన్నాము.

"చిన్నప్పటినుంచి ఆ టేబుల్, కుర్చీ నేను వాడుకుంటున్నా"నని మరిది.

"సూయింగ్ మిషన్ నాకోసమే నాన్న కొన్నా"రని మా ఆడబిడ్డ.

"నేను పెద్ద అబ్బాయిదగ్గరే ఉంటాను కనక, ఆ డబుల్‌కాట్, అద్దం అన్నీ నాతో బాటే ఉండా"లని అత్తగారు.

"అసలు ఆ బీరువాని ఎప్పుడూ నీకేరా ఇది అని ఆయనతో అంటూండేవారుట మావగారు" అని తోటికోడలు అంటుంటే నాకు వినోదంగాఉండి వింటూ నుంచున్నా.

"ఆ సోఫాసెట్ నీతో తీసుకువెడతావేమిటిరా?" అని మా బావగారు అంటుంటే

"ఎందు కా శ్రమ, కావాలంటే అక్కడే కొనుక్కోవచ్చుగా" అంటూ మావారివైపు చూశాను. అసలే ఆయన కోపం మింగుతున్నట్లున్నారు అదంతా నామీద ఉమ్మేసినట్లు చూశారు.

"నిన్నెవరూ కల్పించుకోమనలేదు. అవతలికి వెళ్ళు" అన్నారు. హాల్లోవాళ్ళంతా ముఖాల్లో నవ్వు దాచుకుంటున్నారు. భార్య తెలివితక్కువ తనానికి మావారు కోపం మింగుతున్నారు. మెల్లిగా హాలువిడిచి వెళ్ళిపోయాను.

"ఈ వివాహం, సంసార జీవితంవుందే, చాలా సంకుచితమైంది. పెద్దసూత్రాలు దీనికి వర్తించవు. పెద్దగుడ్డతో చిన్నమనిషికి అకారం కుట్టాల్సివస్తే గుడ్డ చాలా వేస్టవుతుంది.

దాంపత్యం అంటే ఇంకొక వ్యక్తి ఇష్టా ఇష్టాలు, అభిప్రాయాల ప్రసక్తికి వస్తుంది. నువ్వు నమ్మిన మార్గంలో పయనించటం సాధ్యంకాదు.

నువ్వు నీనమ్మకాలు వదులుకోవాలి, లేదా వివాహానికి సంబంధించిన ధర్మాన్ని తిరస్కరించాలి. ధర్మాన్ని తిరస్కరించటానికి సంస్కరింపబడిన మనసు ఒప్పుకోదుగా. నీ నమ్మకాలు వదులుకోవటం అనేదిత్యాగం అనే భావంద్వారా జరుగుతుంది. ఓహో! ఈ గృహిణి జీవితంలో ఆదర్శాలకి తావేది? చిత్రమేమంటే అసలు వాటిని నేను ఆదర్శాలుగా అందరానివిగాభావించలేను. పుస్తకాలు, మహాత్ములు, మేష్టర్లు కలిసి ఏకకంఠంతో బోధిస్తుంటే అది మానవ సామాన్యమనుకున్నాను కానీ, ఈ ప్రపంచంలో యిది మానవాతీతంగా ఉందని నేననుకోలేదు.

మేష్టర్ చిన్నపిల్లవాడిని దండిస్తాడు.

"అబద్ధం ఎందుకుచెప్పావురా? ఎందుకు దొంగతనం చేశావురా? సిగరెట్ ఎందుకు కాల్చావురా?" అని.

ఆ మేష్టరులో ఆ గుణాలు, బుద్ధులు అన్నీ ఉంటాయి. మరి ఎందుకా దండన. మంచివారిలాగ నటించడం నేర్చుకోమని. అంతే. ఒకవేళ ఆ పిల్లవాడు అవన్నీ నమ్మితే, అతడు వాటిని సాధించేవేళకి అతడికి ఎదురయ్యేది ఒక నిస్పృహ - ఒక వేరే ప్రపంచం. ఆ ప్రపంచంలో మంచి ఎప్పుడూ ఒక ఆదర్శమేకాని అనుభవనీయం కాదు. ఆ మంచిని సాధించినవారు ఆ ప్రపంచంలో ఉండటానికి అనర్హులు. అసమర్థులు. ప్రపంచం అతడిని అపహసిస్తుంది. అతడికి ప్రశ్న వస్తుంది - ఈ మంచిని సాధించటంలో నేను జీవితకాలం వృథా చేసుకున్నానా? ఈ ప్రపంచంలో ఆనందంగా బ్రతికే యోగ్యత నాకు లేదా? అని. లేదు.

ఒకిమెట్టు బనాదిగి రావాలి. మంచితనం తొంభయిపాళ్ళే అయితే మంచిది. బంగారంలో కొంత రాగి కలిస్తేకాని నగమెరుపు దిద్దుకోదు. నీలోమంచి ఉంటే ఉంచుకో, కానీ అది పూర్తిగా మంచి ముద్ద అయితే అది ఈ లోకంలో ప్రకాశించదు. మనం బ్రతికేది ఈ లోకంలోనే మరి. ఆ మంచితనానికి కొంత వివేకం. కొంత స్వార్థం. కొంత చమత్కారం చేర్చు. ఇవి మెరుగు పెడతాయేకానీ. నీ వ్యక్తిత్వానికి వన్నె తగ్గించవు.

ఆ మరునాడు మళ్ళీ మా కుటుంబం హాలులో సమావేశం అయ్యాము. మేము రెండు రోజులలో ఈ ఊరి ఉద్యోగంలో చేరాల్సిఉన్నాము. "కొత్త ఊరు ఇంటిఅద్దె ఇచ్చుకోవటమేగాక, బియ్యంకొనుక్కోవటం చాకలి, పనిచేసేది మొదలైన ఖర్చులు వేరే ఉండనే ఉంటాయి. వస్తువుల ధరలూ అట్లాగే మండిపోతున్నాయికదా. బావగారు సోఫాసెట్ తీసికెళ్ళమన్నారు. సరే, మీ చిన్నబ్బాయికి రేడియోలేకపోతే ఒకనిమిషం తోచదుకదా. కొత్తగా గిన్నెలవీ ఏం కొనుక్కుంటాము! ఇక్కడివే ఏవోచూసి మీరే ఏర్పాటుచెయ్యండి. వాటిసంగతి కొనటం నాకంతగా తెలియదు అత్తయ్యా" అని నేనూ అందుకుని అంటుంటే వరుసగా అందరినీ చూడాలి. మావారు మొదలుకుని అంతా నన్ను చూస్తూ అట్లాఉండిపోయారు. ఆ తరవాత మా అత్తగారు ఊరగాయలు, చారుపొడితోసహా అన్నీ అమర్చి మమ్మల్ని పంపించారు. తరవాత నాగురించి చెప్పుకున్నారు.

"పైకి అట్లా ఉంటుందికానీ చాలా గడుసుది"అని. ఆ మాట విని నేను చాలా సంతోషించాను" అంది.

● రాము : "మరీ ఎక్కువగా నవ్వితే ఏడుపుగా మారుతుందట, నిజమేనా?"

సోము : "నిజమే."

రాము : "నీకెల్లాతెలుసు?"

సోము : "మొన్న మానాన్న అరటితొక్కమీద కాలేసి జారిపడ్డాడు, నేను నవ్వాను, ఆ తరవాత ఏడ్చాను."

ఆక్కడికి అరుంధతి తన కథ చెప్పుకుంది. అరుంధతి భర్తకూడా అనుకూలుడే, ఒక పాప, చక్కటి ఇల్లు. అరుంధతి సంసారం హాయిగానే ఉంది. అవును అరుంధతి మారింది. అట్లా దిద్దుకుంది తన సంసారాన్ని.

భోటనాలు అయ్యాక రాత్రి వరండాలో పక్కలు వేసుకొని పడుకున్నారు. గేటు పక్కగా ఉన్న నైట్‌క్వీన్ చెట్లనుంచి సువాసనలు వీస్తున్నాయి. లైటు ఆర్పి, ఆకాశం అందించే కాంతిలో తామిద్దరూ దగ్గరగాచేరి మాట్లాడుకున్నారు.

"ఇంకా నీ శుభలేఖ వస్తుందని నేను ఎదురుచూస్తున్నాను. నువ్వేమో పంతులమ్మవయ్యావు. మరి పెళ్ళి మాటేమిటి?" అంది అరుంధతి.

"పెళ్ళిని నేనేమీ వెనక్కి పెట్టలేదు. నా అభిప్రాయం నీకు తెలుసు" అంది తను అరుంధతి నవ్వింది.

"అందుకనే నేను అనేది నువ్వుమారాలి రమణీ అని. ఆలోచించు మీ అన్నయ్యకి అంతమంది స్నేహితులున్నారు. బంధువులున్నారు. చదువుకున్నారు. ఉద్యోగస్తులయ్యారు. అందరూ ఆదర్శభావాలు వల్లిస్తూనే ఉంటారు. నీకు మాత్రం చదువు తక్కువా, రూపంతక్కువా ? కట్నం సంగతి వదలిపెట్టు. ప్రేమ కలగాలి అంటావుకదా, ఎప్పుడైనా ఎవరినైనా ఆకర్షించడానికి ప్రయత్నం చేశావా ? ఊహూ. నీ మొహమే చెబుతోంది. మగవాడిలా కబుర్లుచెప్తే, నీ ఆదర్శాలు వల్లిస్తే ఎవరూ నిన్ను ప్రేమించరు. నీ కంటి చూపులు, నీ గాజుల గలగలలూ గుండెల్ని కదలించాలి కానీ అమ్మాయ్ ఎప్పుడైనా ప్రయత్నించావా ?" అంది నవ్వుతూ.

"నేనా ! ఛీ అంది తను.

"అందుకేనే, నిన్నెవరూ కోరిరావటం లేదు. మరి ప్రేమ వివాహం ఎట్లాగవుతుంది. నీ మనసులో వుండే కోరికలూ, లోతులూ, వాంఛలూ ఎవరికి తెలుస్తాయి. పిలుపులై వినిపిస్తాయి నేను చెబుతున్నాను. ఒకసారి అవకాశం చూసుకొని నీ స్త్రీత్వాన్ని ప్రదర్శించు. నీకు పెళ్ళెందుకు కాదోచూస్తాను. ఒక్క చూపు చాలని చెప్పానుకదా."

"ఛీ, పోవే. చస్తే అట్లా జరగదు, తరువాత పెళ్ళి కాకపోతే."

"అహ, ఒక్కచూపుకూడా పరులెవరికీ దక్కకూడదా ! అంత అకళంక పవిత్ర ప్రేమా ఆ కాబోయేవాడికోసం ! అనుభవించే ఆ అదృష్టవంతుడు ఎక్కడున్నాడో" అంది అరుంధతి అపహసిస్తున్నట్లు.

రమణి అక్కడ రెండు రోజులు మాత్రమేఉండి ఇంటికివచ్చింది. వచ్చి చాలా రోజులు గడుస్తున్నాయి. కానీ అరుంధతి మాటలే ఎప్పుడూ గుర్తువచ్చేవి. ఔను. తనకెందుకు పెళ్ళికాలేదు ? అన్నయ్యదీ, తనదీ ఒకటే కోరిక. కట్నంలేకుండా, మనసులు కలిసిన పెళ్ళిజరగాలి. అన్నయ్య నాలుగువేలు ఇవ్వకపోడు. కానీ అన్నయ్య ఆదర్శం అది అన్నయ్యకి ఆ విషయం అంతపట్టింపుకూడాలేదు. కానీ తనమనసులో ఆ కోర్కె బలంగాఉంది. అన్నయ్య స్నేహితుడి తమ్ముడు వాసు ప్రతి సాయంత్రం వచ్చేవాడు-తను ఇంటర్ పాసయిన వేసంగిలో. అతడికికూడా ఎం. ఎస్‌సి పూర్తయింది.

అన్నయ్య ఇంట్లో ఉన్నా లేకపోయినా వదినతో చనువుగా మాట్లాడి, తనతో గంటల తరబడి కబుర్లు చెప్పేవాడు. ఆ వాసు తనను ప్రేమిస్తాడని, అన్నయ్యతో చెప్పి

పెళ్ళి చేసుకుంటాడని రెండేళ్ళ ఎదురు చూసింది. తను. ఒకరోజున అతడి పెళ్ళి శుభలేఖ వచ్చింది.

చిన్నన్నయ్య వచ్చినప్పుడు.

"ఇట్లాగయితే దీనికి పెళ్ళి అయినట్టే నాలుగో, అయిదో పడేసి పెళ్ళి చెయ్యి. అందం, చదువు ఉంటే మాత్రం ? మగవాడిలాగ ధీమాగా తిరగటం, ఉద్యోగం వెలగబెట్టడం - ఎవరు చేసుకుంటారు ? కాస్త ఆడపిల్లలాగ ఉండవే. రమణీ" అంటుంటాడు.

ఆడపిల్లలాగ ఉండటమేమిటి," అనుకునేది రమణి. ఔను, కొంతమంది ఆడపిల్లలు తనలాగ కాక, మాట్లాడుతూ సిగ్గుపడటం, ఓరగా చూడటం, ఏదో అనవసరంగా కల్పించుకొని మాట్లాడటం మొదలైనవి చేస్తుంటారు.

"నేను అట్లాగ చెయ్యలేను. అవన్నీ నాకు అసహ్యమే. ఎవడూ ప్రేమించకపోయినా సరే." అనుకునేది మొండిగా.

అట్లాగే ఆ ఊరికి కొత్తగా వచ్చి అన్నయ్య స్నేహితుడైన ఇంజనీర్ రామగోపాల్. తమ బంధువుగా పరిచయమైన డాక్టర్ మాధవరావ్‌కి పెళ్ళిళ్ళ అయ్యాయి. వాళ్ళ భార్యలుకూడా రమణికి స్నేహితులయ్యారు. వదిన అడిగింది - "నీకు జెలసీ లేదా రమణీ?" అని.

"నాకా ! జెలసీ ఎందుకు ?" అంది తను. వదిన మొహంలో ఆశ్చర్యార్థకం.

"అడవానివి కాదా ?" అని అడుగుతున్నట్లనిపించింది.

"నువ్వు మారాలి ?" అంది అరుంధతి. అంటే—

తను నటించాలి. నటించగలనా ? అనుకుంటుండేది. రమణిలో తనకి పెళ్ళిఎందుక్కాలేదు. అనే ప్రశ్నతోబాటు ఒక కుతూహలం కూడా బయలుదేరింది.

ఒకరోజు సాయంత్రం రమణి అన్నయ్య వదినతో అంటున్నాడు :

"శంకరరావ్ అనే అతడు ఎగ్జామినర్‌గా వస్తున్నాడు. ఒకవారం అంతా మనింట్లోనే ఉంటాడు" అని. అతడు వచ్చాక—

"ఈ శంకరరావ్‌కి పెళ్ళయిందా" అని అడిగింది వదిన అన్నయ్యని.

అన్నయ్య నవ్వి "అప్పుడే నీ దృష్టి పడిందీ" అన్నాడు.

"అవును తప్పేముంది. మనిషి బాగున్నాడు. మాటతీరు, పద్ధతికూడా బాగానే కనిపిస్తున్నాయి. ఎక్కడో చుట్టరికంకూడా కలవకపోదు. ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళయినట్టు కనిపించలేదు" అంది రమణివైపు చూస్తూ.

● *రచయిత : "ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, నాలుగు నవలలు రాశాక గాని, నాకు తెలుగురాదని, నా భాష బొత్తిగా బావుండదని నాకు తెలియలేదు."*

స్నేహితుడు : "అయినా మరి రాస్తూనే వున్నావేం ?"

రచయిత : "ఏం చెయ్యను, అప్పటికే నాకు గొప్ప రచయితగా పేరొచ్చేసింది."

"నేనూ ఆలోచిస్తున్నాను" అన్నాడు అన్నయ్య.

"నేను నటించాల్సిన సమయం వచ్చిందా? ఇప్పుడు నటిస్తే" అనుకుంది రమణి. ఆ ఊహే రమణిలో సాగింది. ఆ రెండు రోజులూ, అందరూ హాల్లో కాఫీ త్రాగుతూ, ఒకేసారి భోజనాలుచేసి తయారయి ఎవరి పనిమీద వాళ్ళు వెడుతుండేవారు. రమణి ఏ సంకోచం లేకుండా శంకర్‌తో మాట్లాడుతుండేది. ఆ రోజు సాయంత్రం శంకర్ రమణి కంటె ఆలస్యంగా వచ్చాడు. వదిన వంటచేస్తుంటే, కాఫీ కలిపి అతడికోసం బల్లమీద పెట్టింది.

"నటించాలి, నటించాలి" అనుకుంటోంది రమణి.

"మీరు తీసుకోరూ" అన్నాడతను. శశ్రైత్తి.

"నేను త్రాగటం అయింది" అంది రమణి. తనలో సిగ్గు, సంకోచం ఏమీకలగ లేదు.

"ఊహూ నేను నటించలేను. సిగ్గుపడటం నాకు చేతకాదు" అనుకుంది రమణి. తరవాత కొంచెంసేపు అవీ-ఇవీ విషయాలమీద మాట్లాడుకున్నారు.

ఆ రాత్రి పడుకున్నాక

"రేపెట్లాగయినా ప్రయత్నం చెయ్యాలి. శంకర్ అందంగా ఉన్నాడు. అన్నీ నాకు నచ్చుతూనే ఉన్నాయి. ఈసారి అన్నయ్యకి 'నో' అన్న సమాధానం రాకూడదు. ఎట్లాగయినా రేపు...." అనుకుంది. ఆ మరునాడు పొద్దున్న భోజనంచేసి రమణి స్కూల్‌కి వెళ్ళటానికి తయారయి హాలులో కూర్చుంది. శంకర్ కూడా భోజనంచేసి, అతనికిచ్చిన గదిలో దుస్తులు ధరిస్తున్నాడు. పూర్తయ్యాక అతడుకూడా కాగితాలు పుస్తకాలు పట్టుకుని హాలులోకి వచ్చాడు. రమణి అతడిని పైనుంచి క్రిందదాకా చూసి చూపులు త్రిప్పుకుంది. ఎందుకో వస్తున్న చిరునవ్వును పెదవులమధ్య బంధించింది

"ఏమిటలాగ చూస్తున్నారు నవ్వుకుంటున్నారు?" అన్నాడతను కొంచెం అనుమానంగా. రమణి తననుచూసి ఎందుకైనా నవ్వుతున్నదేమోనని. నిజంగా శంకర్ ఆరోజు అదుస్తులలో ప్రత్యేకంగా అందంగా ఉన్నాడు. టేబుల్ దగ్గర నిలబడిన అతడిని చూస్తూ.

"మీ డ్రెస్ ఈవేళ కొత్తగా కనిపించింది. ఆ షర్ట్ చాలా బాగుంది" అంది.

"ఇదా. ఇది టెరిలిన్" అన్నాడతను సంతృప్తిగా చేయి బల్లమీద వేస్తూ.

"టెరిలినా. చాలా బాగుంది. అన్నయ్య ఎప్పుడూ వేసుకోడు ఖరీదైన బట్టలు" అని అప్రయత్నంగా చేసినట్లు రిస్టుదగ్గర స్లీవ్‌ని చేతితో పట్టుకొని చూసింది. చూస్తూ అనుకోకుండా తలయెత్తింది. పొడవుగా ఉండే శంకర్ తలవంచి తననే చూస్తున్నాడు. అతడి చూపులతో ఆమె చూపులు కలుసుకున్నాయి. రమణికి గుండెలు తీవ్రంగా కొట్టుకున్నాయి. తనలో ఏదో అలజడి రేగింది. అతడి చూపులు భరించలేననిపించింది. కుర్చీలోనించి లేచి తలవంచుకు నిలబడింది. పెదవులు సన్నగా వణుకుతున్నాయి. అతనికి దూరంగా వెళ్ళి పుస్తకాలు గుండెలమీద ఉంచుకుని కిటికీకి దగ్గరగా నిలబడింది. గుండెల తీవ్రతరస్పందనం తగ్గాక, అతనివైపయినా చూడకుండా బయటకు వెళ్ళి రిక్షా ఎక్కింది.

చూపులు కలుసుకోవటంలో అంతటి ఆకర్షణ, అలజడి వుంటాయా? ఆ క్షణాలలో తనేమైపోయింది? తనకే అర్థం



కాలేదు. మళ్ళీ తను సూటిగా అతడి ముఖంలోకి చూడగలదా. సంకోచం లేకుండా మాట్లాడగలదా! తననుగురించి అతడేమనుకున్నాడో." ఎన్నో ఆలోచనలు వచ్చాయి రమణికి.

"తను నటించాలనుకుంది; కానీ నటన మరిచిపోయి పాత్రలో లీనమయిపోయింది" అనుకుని నవ్వుకుంది.

ఆ సాయంత్రం కాఫీ తాగుతూ హాలులో కూర్చుంటే, శంకర్ వచ్చి కుర్చీలో ఆసీనుడయ్యాడు. రమణి గుండె దడదడలాడింది. అతడు నవ్వుతూ అన్నయ్యతో ఏదో మాట్లాడుతున్నాడు. అతడిలో ఏమీ కలవరం లేదా? కళ్ళెత్తి అతడిని చూడాలంటేనే, కనురెప్పలు బరువెక్కిపోతున్నాయి. అనుకుంది. ప్రయత్నంచేసి తలయెత్తి అన్నయ్యతో మాటలు కలుపుతూ అతడిని చూసింది. అతడు తనని చూడటంలో ఒక కుతూహలం కనిపించింది రమణికి. వెంటనే చూపులు తిప్పుకుంది.

ఆ తర్వాత అతడితో మాట్లాడుతుంటే, కళ్ళు వాల్చుకోవటం, పరధ్యానంగా మాటలనటం, తల ఒంచుకోవటం అప్రయత్నంగానే వచ్చాయి. అతడు వెళ్ళిపోతుంటే విచిత్రమైన బాధకూడా కలిగింది.

"నేను అట్లా ప్రవర్తించానేమిటి? ఆరోజు అతడి షర్ట్‌ను తాకకుండా ఉండాల్సింది" అనుకుంది.

శంకర్ వెళ్ళిన కొద్దిరోజులకే అతడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది రమణి జాతకం పంపమని. జాతకాలు కుదిరితే వెంటనే ముహూర్తం పెట్టుకోవచ్చునని. రమణికి, అన్నయ్యకికూడా కొంచెం ఆశ్చర్యం కలిగిందనే చెప్పాలి. శంకర్‌తో తన చెల్లెల్ని పెళ్ళిచేసుకుంటే బాగుంటుందని మాటవరుసకు అన్నట్లుగా చెప్పాడు రమణి అన్నయ్య. శంకర్ ఆ విషయాన్ని కుతూహలంతో తీసుకుని వెంటనే ఉత్తరం వ్రాసి అంగీకారాన్ని తెలపటం ఆశ్చర్యమే గాక, ఆనందం అధికంగా కలిగించింది. రమణికి అపరిమితానందం కలిగింది. తన కోరిక నెరవేరింది. శంకర్ తనకి నచ్చినవాడు, తనను కదలించినవాడు. తనంటే అతనికిష్టమని తెలుస్తూనే వుంది. ఆ సంతోషంలోనే రమణి పెళ్ళి అయింది. పెళ్ళయి శంకర్‌తో సంసారంలోకి దిగాక - ఆ సంతోషానికి అలవాటు పడ్డాక ఒకరోజు రమణిమనసులో ఒకప్రశ్న వచ్చి దిగబడింది.

"శంకర్ తనతో పెళ్ళికి వప్పుకోటానికి కారణం ఆ సంఘటనేనా?" అని. పనిలేని తీరిక సమయంలో ఈప్రశ్న మెదడు నాక్రమించి వేధించేది. క్రమంగా ఆ ఆలోచనే యెక్కువయి, శంకర్‌కి తానెంతో దూరంగా ఉన్నట్లు, దగ్గర కాలేకపోతున్నట్లు బాధకలిగేది. ఆ ఆలోచనలు ఆమెని వదిలిపెట్టేవి కావు.

ఆ సంఘటనే తమ పెళ్ళికి కారణమా? శంకర్ చాలా మంచివాడు. ఉన్నతమైన అభిప్రాయాలు కలవాడు. అటువంటి శంకర్ తనను అంగీకరించడానికి ఆ చిన్న సంఘటనే కారణమా? ఆనాడు తను శంకర్ షర్టు పట్టుకుని అతడి కన్నులలోకి చూసి ఉండకపోతే అతడికి తానేమీ కాదా. ఓహ్ తను తన విలువలను ఎందుకు నిలబెట్టుకోలేకపోయింది? నటించి, అతడేమి చేస్తాడో చూడాలన్న కుతూహలానికి లోబడి తన వ్యక్తిత్వాన్ని ఎందుకు కుంటుబరచుకుంది. అతడు తనను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకోవటం తనకిప్పుడు సంతృప్తి కలిగించటం లేదు. ఏనాటికైనా తనను మెచ్చే వ్యక్తి వస్తాడనీ. అతడిని పెళ్ళిచేసుకోవాలనీ తను

ఆశించింది. ఇప్పుడు దానికి భిన్నంగా జరిగింది. తననుగురించిన సత్యం తెలుసుకోలేకపోతున్నది. తనగుణం, వ్యక్తిత్వం గుర్తించే వ్యక్తి తనకి లభించదని, తనకి పెళ్ళికాదనీ భయపడిందా? ఏనాటికైనా వచ్చేవాడేమో, తను నిరీక్షించిఉంటే. తను సత్యం తెలుసుకోలేకపోతోంది - ఆ రోజు ఆవిధంగా ప్రవర్తించటంవలన తనను తను మోసగించుకున్నట్లయింది.

శంకర్ తనని పెళ్ళిచేసుకోటానికి కారణం ఆ చిన్న సంఘటనే అయితే-అతడంత దుర్బల హృదయుడా! అయితే అతడంతకుపూర్వం, ఎన్నిసార్లు ఆ బలహీనతకు లొంగిపోయాడో. ఇకముందర అతడికి అటువంటి ఆకర్షణలు కలుగవని, అతడు నిగ్రహించుకుంటాడని నమ్మకం ఏమిటి? అప్పుడు తన ప్రేమవివాహం పరిణామం ఏమయినట్లు? ఛీ-తను ఆ నిమిషాల్లో ఎంత నీచంగా, అనాలోచితంగా ప్రవర్తించింది? దానివలన తనను గురించిన సత్యం, శంకర్‌ను గురించిన సత్యం-తనకు అందకుండా మరుగునపడి పోతున్నాయి. అతడి వ్యక్తిత్వాన్ని తను చూడలేకపోతున్నది. ఎప్పుడూ అచంచలంగా ఉండే తను — పరికించి ఫలితం చూడాలనే కుతూహలానికి లోబడి-ఆ నిమిషాల్లో ఎందుకు చలించాలి?

మనసునిండా అశాంతి. దీనికి కారణం ఆ ఒక్క-ప్రశ్న —

శంకర్ తనను పెళ్ళిచేసుకోటాని కారణం ఆ సంఘటనేనా? అని. అదే ప్రశ్న- అశాంతి రేకెత్తించి తనను శంకర్‌కి అనుకున్నంత దగ్గరగా చేరనివ్వటంలేదు. అతడిని అడిగితే, అతడి సమాధానంవింటే. అది తనకి తృప్తినిస్తుందా! లేక తప్పు చేశానన్న వేదనే అధికమౌతుందా! ఏమైనా ఇవేళ అతడిని అడగాలి.

రమణి ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చింది — ఇన్నాళ్ళకి ఒక నిశ్చయానికి వచ్చింది! ఈనాడు. ఆకాశంలో మబ్బులు దట్టమై చినుకులు పడటం మొదలు పెట్టాయి శంకర్ ఇంటికి వచ్చాడు. రమణి ఎదురుగా వెళ్ళి.

"తడిశారా?" అని అడిగింది.

"ఇప్పుడే కదా చినుకులు మొదలు" అన్నాడతడు. దుస్తులుమార్చుకున్నాక అతడికి రమణి కాఫీ అందించింది. కిటికీలోనుంచి వర్షాన్ని చూస్తూ మంచం మీద కూర్చున్నాడతడు.

"వాన పడుతుంటే, అందులో సంజవేళ చాలా హాయిగా ఉంటుంది కదూ" అన్నాడతను. అతడిని అడగాలి అనుకుంటోంది రమణి.

"అట్లాగున్నావేం రమణీ" అంటూ అతడు తనచేతిని రమణి భుజంమీద వేశాడు.

● "మా ఆవిడ కాపరానికొచ్చిన కొత్తలో పాటలు పాడేది. తరవాత్తరవాత పిల్లలు పుట్టుకురావడంతో మానేసింది."

"పిల్లలవల్ల కొన్నిసుఖాలు లేకపోలేదు మరి."

రమణి ఆ చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుంటూ ఎంతో ప్రయత్న పూర్వకంగా అంది

"మీరు నన్ను పెళ్ళి చేసుకోడానికి కారణం ఆ సంఘటనేనా !" అని.

"ఏ సంఘటన !" అన్నాడు శంకర్ రమణి ముఖంలోకి చూస్తూ.

నిజంగా అతడికి గుర్తులేదా ! పరీక్షగా అతడి కళ్ళలోకి నిజంకోసం వెతుకుతూ.

"పెళ్ళిముందర మీరు మా యింటికి వచ్చారు. హాలులో, పెరిలిన్‌షర్ట్ వేసుకున్న మీ చేతిని నేను—"

"ఎంత పెద్ద సందేహం !" అతడి నవ్వు రమణిని ఆశ్చర్యపరచింది

"అందుకని నిన్ను పెళ్ళిచేసుకున్నాననుకున్నావా ? అడిగాడతడు.

"అనుకోవటమే కాదు, బాధపడుతున్నాను" అంది రమణి.

ఒక నిముషం ఊరుకుని అతను చెప్పాడు

"ఒకసారి నేను రైలు ఎక్కుతున్నాను. తలుపు దగ్గర చాలా రష్‌గా ఉంది. నాముందర ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఉంది. మెట్టుమీద అడుగువేసి ఆ తోపిడికి వెనక్కి తూలింది. ఆ అమ్మాయిని నా రెండు చేతుల్లోనూ పట్టుకున్నాను. రైలు ఎక్కాక, ఆ అమ్మాయి నా ఎదురుగా కూర్చుని ఉండగా నలభైమైళ్ళ ప్రయాణం చేశాము. ఆ అమ్మాయి అందమైనది. కళ్ళు అంతకంటెచక్కనివి. కానీ ఆ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకోవాలనుకోలేదు. ప్రేమిస్తున్నానన్న ఊహ అసలే రాలేదు.

యూనివర్సిటీలో ఒకఅమ్మాయి ఉండేది. బాగుండేది. పాడేది బాగా చదివేది. కబుర్లు చెప్పేది. స్నేహంగా ఉండేది. రిసెర్చిచేస్తానేది కులంకూడావేరు. ఆ అమ్మాయితో స్నేహంగా ఉన్నా. పెళ్ళిచేసుకుందామని పించలేదు.

ఎన్నో అవకాశాలు ఉంటాయి.ఆలోచనలు ఆ పంథాలో సాగనిస్తే. కానీ పెళ్ళి చేసుకోటానికి ఎన్ని అనుకూల్యాలు చూసుకుంటాము మంచి కుటుంబం. మంచిపిల్ల తల్లిదండ్రులకు నచ్చటం, తనకు నచ్చటం- ఇవన్నీ ఆలోచించకుండా పెళ్ళికి సిద్ధపడతాననుకున్నావా ?

అతడు మనసారా నవ్వుతున్నాడు.

ఆ నవ్వు "ఎంత అమాయకురాలివి రమణీ" అంటున్నట్లనిపించింది రమణికి ఐనా ఆమె మనసులోకి చల్లని కాంతి పాకింది. తను అడగటమే మంచిదైంది. అతని సమాధానం తనకి సరిపోయింది.

అరుంధతి అన్నట్లు తనూ మారిందన్న మాట. ఆనందంగా ఉండటం. ఆనందపరచటమే తన సిద్ధాంతం. అతడిని అడగవచ్చా కూడదా అన్న సంధిగ్ధావస్థలో పడి తను శంకర్‌కు దూరంగా ఉండిపోలేదు. తను తెలివైనదో, అమాయకురాలో కానీ తనూ మారింది, అతడిని అడగటంవలన తనకి సమాధానం, తృప్తిపడటానికి ఒక ఆధారం దొరికాయి. సంశయ నివృత్తి అయితే కలిగేది ఆనందమే కదా. ఆనందంగా ఉండటం తనూ నేర్చుకుంది. తనకు ఆనందంగా ఉంటే శంకర్‌కు దూరంగా, అతడిని ఆనందపరచకుండా ఉండగలదా ?

రమణి — శంకర్ భుజాన్ని ఆనుకుంటూ అతడి ప్రక్కనే కూర్చుని తను కూడా వానలోకి చూస్తూ - "ఔను, ఎంత హాయిగా ఉందీ వాన !" అంది. □□□

కథాసంగ్రహమ్

అసాధారణ నిర్మాత. సూత్మ్రలమోహనరావు తాజాచిత్రం పూర్తైపోయింది. తదుపరి చిత్రానికి కథ వెంటనే కావాల్సి వచ్చింది. నగరంలోని ప్రాచ్య, అప్రాచ్య, మ్లేచ్ఛ చిత్రాలు అన్నీ అదేపనిగా చూస్తున్నాడు కాని, తెలుగైజ్ చేయడానికి పనికొచ్చే నాన్‌తెలుగు చిత్రం యెక్కడా తగలేదు. ఒకటో అరో తగిలినా, వాటిని అప్పుడే కొందరు సాధారణ నిర్మాతలు తమ చిత్రాల్లో గుచ్చేస్తున్నారని తెల్సింది. ఇక ఈ మదరాస్ లాభంలేదనుకున్నాడు. కలకత్తాయే శరణ్యం అనుకున్నాడు. (కళ, కథ కలిసే కలకత్తా అయిందంటాడాయన) వెంటనే వెళ్ళిపోవాలని నిర్ణయించుకుని, వెంట దర్శకుడిని తీసుకెళ్దామనుకుని, ఆయన ఎందుకులే, ఆయనకి బెంగాలిరాదు. ఏమీ రాదు అనుకున్నాడు. (ఆమాటకొస్తే ఈయనకీ రాదు బెంగాలీ. కానీ, నిర్మాత విశేషించి దర్శక దర్శకుడూను.) విమానంలో వెళ్తే ఎవరేనా పసిగట్టేస్తారని స్వగ్రామం వెళ్తున్నానని అందరితోనూ చెప్పి కలకత్తా మెయిల్ యెక్కి, కలకత్తాలోనే దిగాడు.


దిగీ దిగ్గానే, ఒక నవలారచయితను కలిశాడు. ఆయనతో తెలుగు ఇంగ్లీషులో మాట్లాడాడు. ఆయన ఇంగ్లీషు బెంగాలీలో మాట్లాడాడు. ఆయన మరీ అశకి పోయాడు. ఆయన అడిగిన మొత్తమే చేతిలోవుంచే, కానీ అరువు పెట్టకుండా బ్రహ్మాండమైన తెలుగుచిత్రం హైద్రాబాదులోనే తీయొచ్చనుకున్నాడు. ఇంతఖర్చుపెట్టి ఎలాగూవచ్చాం కదా అని మహానగరంలోని వంగచిత్రాలు అతి పాతవి (శతదినోత్సవాలు అయిపోయిం తర్వాత కూడా ఆడుతున్నవి) చూశాడు. కథాసంగ్రహంకోసం పాటల పుస్తకాలు కొన్నాడు. వాటి నిర్మాతలతో మాట్లాడాడు. "మీకు ఒక్క తెలుగు ఏం లాభం ? దక్షిణ భారత భాషలన్నీ కొనుక్కోండి. కాస్త తగ్గించి యిస్తాం. మీవూరువెళ్ళి మిగతా భాషలు అమ్ముకోండి." అన్నారు. ఇతనెంతబతిమాలినా వాళ్ళేం కొరకబడలేదు. అంచేత వాళ్ళని అలాగే ఒదిలేసి బయటికి వచ్చేశాడు. వచ్చిం తర్వాత ఏం చెయ్యడానికి తోచలేదు. తోచడంకోసం ఆయన అప్పుడప్పుడు నడవడం కద్దు. అలాంటి పాదయాత్రలోనే ఓనుదినాన వాళ్ళ స్వగ్రామంలో కల్గిన ఒక ఆలోచన ఫలితమే ఈనాటికి ఆయన తీయగల్గిన ద్వాదశ చిత్రమాల.

నడుస్తూన్న వాడల్లా అమాంతం ఆగిపోయాడు.ఎదురుగాపోతున్న బెంగాలీఅమ్మాయిల గుంపును చూసి. "వీళ్ళలోఒక్కరైనా తెలుగుమాట్లాడగలిగితేఎంతబావుణ్ణు ! హీరోయిన్ ఛాన్స్ యిచ్చేద్దునుకదా !" అనుకుని అంతలోనే మళ్ళీ—" ఆ....వాళ్ళు మెద్రాసెక్కడొస్తారు ?" అనుకుంటూపోతున్నాడు. అమ్మాయిలు అలాదూరంగావెళ్ళి పోయారు. ఉన్నట్టుండి, ఎందుకు నడుస్తున్నాడో జ్ఞాపకం రాలేదు. బుర్ర గోక్కున్నాడు. అయినా జ్ఞాపకం రాలేదు. మర్చిపోయినవి జ్ఞాపకం చేసుకుందుకు చుట్టకాల్చడం ఆయనకి చిన్నప్పట్నించీ అలవాటు. అందుకే ఎప్పుడూ ఆయన జుబ్బా కుడి జేబులో సిద్ధంగా వుంటాయి. ప్రశస్తమైన

లంకపుగాకు చుట్టలు. వాటిల్లోమేటినొకదాన్ని తీసి వెలిగించాడు. రెండుగుప్పులు పీల్చాడో లేదో, బుర్రశుభ్రమైపోయి బాగాపనిచేయడం మొదలెట్టింది. ఓ తెలుగు సినిమాకి- స్వంత సినిమాక్కాదు - కథ రాసెయ్యొచ్చనిపించింది. వెంటనే జేబులో చెయ్యిపెట్టుకు చూసుకున్నాడు. కాగితాలుంటేఅయిడియాలు రానేసి దాచుకోవచ్చని - అన్ని వచ్చకాగితాలేగాని, తెల్లకాగితాల్లేవు. పోనీ. పెధవకథ పోతే పోయిందని ముందుకు సాగిపోతున్నాడు.

పక్కనే ఓ పాతపుస్తకాల దుకాణం కనబడింది. ప్రాణం లేచివచ్చినట్టయింది. కాళ్ళు రెండూ అమాంతం ఆగిపోయాయి కళ్ళు ముఖమంత అయ్యాయి. ఒక్కసారి వెలిగి ఆరిపోయింది చుట్ట-తనజన్మ సార్థకమైనట్టు. దాన్ని అవతల పడేసి దుకాణం ముందుకూచున్నాడు. కళ్ళు మాత్రం పరీక్షగా, అట్టలు బాగా చిరిగిపోయిన వాటికోసం చూస్తున్నాయి. చేతులు మాత్రం అప్పుడే కొన్ని తీసేశాయి. వాటినన్నిటినీ అంగడివాని కిచ్చాడు. వాడీసారి వాటినన్నింటినీ మళ్ళీ చూసుకుని. "అత్ రూపయ్యా బారణా" అన్నాడు. ఎంతోతెలియక ఎందుకేనా మంచిదని. ఓ వచ్చ కాగితం యిచ్చాడు. "చిల్లర్ నై సాబ్" అని తమాపణగా చెప్పి. "తైరీయే" అని పరుగెత్తాడు. "జల్దీ దేనా" అనిమాత్రం అనేశాడు. వచ్చీరాని హిందీలో. ఇవైనా అప్పుడప్పుడు అతన్ని బెదిరించడానికి వచ్చిన కాబూలీవాడు అతనిదగ్గర మిగిలిన వాటిలో జ్ఞాపకం వున్నవి. ఒక్కతృటిలో వచ్చిన అంగడి కుర్రాడు రు. 91=25 పైసలూ మోహనరావు చేతిలో పెట్టాడు. అదంతా భద్రంగా పక్కజేబులో పెట్టుకున్నాడు. పుస్తకాలు మళ్ళీ ఓసారి లెక్కపెట్టుకున్నాడు. పెధవ్వి. పదమూడు. అపదమూడంత మంచి నంబరు కాదతనికి. ఆ పదమూడో చిత్రం కథకోసమే తానింత కష్టపడుతున్నాడు. అతని పదమూడోఏటనే తల్లి పోయింది. 13 నెంబరింట్లోవున్నప్పుడు భార్యకి చచ్చేజబ్బు చేసింది. 13 తారీకున రిలీజ్ చేసిన ఆరోపిక్చర్ సోదిలోకిలేకుండా పోయింది. అందుకే చాలామంది శ్రేయోభిలాషులు "ప్రొడక్షన్ నెం. 13 ప్రారంభోత్సవం అని చెప్పి. ఏదేవుడు ఫొటోనో షూట్‌చేసి మాట్లాడక వూరుకుని, మెల్లిగా 14 నంబర్ ప్రారంభించమన్నారు. అయనకూడా అలాగే చేయాలి. అనుకున్నాడు. కాని చాలామంది "పోవయ్యా నీపిచ్చినమ్మకాలునువ్వూను-"అని హేళన చేశారు. ఎందుకేనా మంచిదని, ఇంకో పుస్తకం తీసుకుని రూపాయి పావలా యిచ్చాడు అంగడి కుర్రాడికి. వాడు దీని ఖరీదు య-పాయేనన్నా వినకుండా- "మొత్తం పుస్తకాలు పధ్నాలుగు అంటే, నాలుగూ ఒకటి అయిదు. వాడికిచ్చిన మొత్తం పది. అంటే ఒకటి వహ్వా! ఏం ఫ్రెండ్లీ కాంబినేషన్ !" అని ఆయనలో ఆయనే మురిసిపోతూ ముందుకు పోతున్నాడు. మూడోకంటివాడికి తెలియకూడదని, ఆ పధ్నాలుగు పుస్తకాల్ని పైపంచలో చుట్టబెట్టి తీసుకెళ్ళాలనుకుంటూ వుండగా, మెరుపులా ఒక ఆలోచన చెప్పింది మనసు – "ఇది కలకత్తా—మన తెలుగు వాళ్ళెవరూ సినిమాలకోసం యిక్కడికి రాలేదు" అని- పుస్తకాల్ని బహిరంగంగానే పుచ్చుకుని మధ్యమధ్య ఒక్కొక్కదాన్ని తీసి ఆప్యాయంగా, ఆనందంగా చూసుకుంటూ పోతున్నాడు.

ఆదారిన పోతున్న ఓ టాక్సీని ఆపుచేసి ఎక్కికూచున్నాడు. మళ్ళీ ఆ పుస్తకాల్ని వరసగా సీట్లోపెట్టుకుని మళ్ళీ చూసుకుంటున్నాడు. నల్లద్దాలు తీసి తెల్లద్దాలతో– "ఒరే!



మోహనరావూ! ఈ పధ్నాలుగు పుస్తకాల్లోంచీ. పుస్తకానికి కనీసం రెండు చొప్పున 28 కథలు అల్లుకోవచ్చు- కథకి రెండు చొప్పున ఏభైఅరు పిచ్చర్లు తియ్యొచ్చు- అందులో ఒక్కటి- ఒక్కటంటే ఒక్కటి- జూబిలీ అయితే చాలు. నే ఛస్తే మళ్ళీ సినిమా తియ్యను- మా వూరెళ్ళి మామూలుగా వ్యవసాయం చేసుకుంటాను." అని అనుకుంటూ. తన చెప్పుచేతుల్లో వుండే దర్శకుల పేర్లన్నీ ఓ జాబితా రాసుకున్నాడు. ఎవరి తర్వాత ఎవరికి ఛాన్సివ్వాలో వాళ్ళ పేర్లపక్కనే నంబర్లు వేసుకున్నాడు. ఆ కాగితం అతిభద్రంగా పచ్చకాగితాల్తో పాటు పెట్టుకున్నాడు. ఆరోజు కారోజే కలకత్తాలో మదరాస్ మెయిల్ ఎక్కాడు.

మదరాస్‌లో దిగాడు - స్టేషన్‌కి కారు తీసుకుని, అసిస్టెంట్ డైరెక్టరూ, ప్రొడక్షన్ మేనేజరూ, డ్రయివరూ వచ్చారు. "మీ టెలిగ్రాం రాత్రి చాలా పొద్దుపోయి అందింది. దండలు కొనడానికి టైమ్ లేక పోయింది" అన్నారు కోరస్‌లో ముగ్గురూ.

"సర్లేండి. కారుతాళాలు నాచేతికిచ్చి మీరు బస్సులో పొండి-" అన్నాడు. మోహనరావు కారు తీసుకుని నేరుగా బెంగాలీ వచ్చిన ఒక రచయిత దగ్గరకి వెళ్ళారు. గుమ్మం ముందు కారు ఆపి హారన్ కొట్టాడు. అ హారన్ విన్న రచయిత అలాగే నిద్రలోంచి బయటికి వచ్చి గబగబా కారు వెనక సీటుకు నమస్కరించాడు."నేనిక్కడున్నానన్నాడు" మోహనరావు "మీరు స్వయంగా డ్రయివ్ చేసుకుంటూ వస్తారని నే వూహించలేక పోయాను. దానికితోడు కళ్ళజోడుకూడా పెట్టుకోలేదు కంగారులో" అని క్షమాపణ చెప్పాడు. "ఒక్క నిమిషం - ముఖం కడుక్కువచ్చేస్తా" అని యింకా ఏమో చెప్పబోతూంటే, నిర్మాత ఆయనకి అడ్డువచ్చి - "అదేం అక్కర్లేదు. ఈకట్టలో

14 పుస్తకాలున్నాయి. అవి మీరు బాగా అర్ధమయ్యేలా చదవండి. ఇది అతిరహస్యం-చదివింది ఏరోజు కారోజు సినాప్సిస్ రాసి తీసుకురండి-" అన్నాడు "అంతకన్నానా?" అని ఆ కట్టను అందుకుని. మనసులో కళ్ళకి అద్దుకున్నాడు "మిగతా విషయాలు మంచి రోజు చూసి మాట్లాడదాం"అని మోహనరావు కారు స్టార్ట్‌చేశాడు కారు కదలగానే కారుకన్న వేగంగా లోపలకు వెళ్ళాడు రచయిత.

ఆ సాయంత్రమే రచయిత నిర్మాత దగ్గరకు వచ్చాడు. హాల్లోవున్న ఆఫీస్ బాయ్. "అరువూర్నుంచి పొద్దున్నే ఒచ్చారు. రెస్ట్‌కావాలన్నారు." "నే ఒచ్చానని చెప్పవోయ్ -" అని రచయిత ఎంత బతిమాలినా "నే చెబుతున్నాకదండీ- అదంతే"అన్నాడు ఆఫీస్‌బాయ్. ఈ మాటలు లోపల్నుంచి విన్న నిర్మాత హడావిడిగా బయటికివచ్చి - "రండి, కవిగారూ! రండి- వెధవది వేషాల కోసం ప్రాణాలు తీస్తున్నారని - నేనలాగే చెప్పామన్నాలెండి-" అని గదిలోకి తీసుకు వెళ్ళాడు. "ఏమిటి, అప్పుడే వచ్చేశారు? కట్టకూడా తెచ్చినట్టున్నారు. అన్నీ చదివారా! లేక మన ఆఫీసులో చదువుదామని వచ్చారా!" అని ఆతృతగా ఏకబిగిని చదివేశాడు- "అంత ఇంటరస్టన్నమాట!" అన్నాడు నిర్మాత. "అవునండి - ఇది చూశారూ- రామేర్ సుమతి - అంటే దీక్ష. ఇది వైకుంఠేర్‌వుయిల్- సవతికొడుకు. ఇది క్రిషన్ కాంతేర్‌వుయిల్- రోహిణి. ఇది అగ్నిపరీక్ష మాంగల్యబలం. ఇది జోగ్ బియోగ్-ఆత్మబంధువు; ఇది తాషేర్‌ఘర్, ఇద్దరు మిత్రులు; ఇది బిందూర్‌చెలే - ముద్దుబిడ్డ; ఇది స్వయంసిద్ధ, అర్ధాంగి - ఇది బడదీది - బాటసారి. ఇది మాయామృగ్ పెంచినప్రేమ. ఇది మాన్మయిల్ గరల్‌స్కూలు.మిస్సమ్మ. ఇది జోమాలయ్ జీబంతమానుష్ దేవాంతకుడు.

"అయితే అన్నీతీసేసినవే."

"అవునండి- కాని, ఇదిమాత్రం'అమొర్ బాబు- అంటే మాబాబూ" "అదీ తీసేశారు. కదయ్యా!" "ఆ మాబుబాకాదండి - ఇది విశ్వనాధ వారిదండి - అది తీయలేదు-" "అయితే దీన్ని తియ్యమంటావా? బలేవాడివే! ఎంత బెంగాలీలోకిట్రాన్స్లేట్ అయితే మాత్రం తెలుగు కథ ఎవడు తీస్తాడయ్యా? పోనీ, అన్నింట్లోంచి కాస్తకాస్త కలిపి కథ రాయగలరా?"

"అంటే మీకు కథా సంగ్రహమ్ కావాలన్నమాట - దానికన్న మీరు పూనా పోవటంమేలు-"


"పోతా-పోతా పూనాయే పోతా- అక్కడెన్ని మరాఠీ పిక్చర్లు! పైగాఅవి చవక్కూడాను-"


"అయితే నే వస్తా-మీరు పూనావెళ్ళడం ఖాయమేనా-"

"ఖాయమే".

000

— స్వామి చిత్రానంద





ఉత్తరాయణం

పి. రామగోపాల్


గంగాధర్

బ్రహుళ ప్రచారంగల ఒకానొక పత్రిక ఒక కథలపోటీ నడిపింది. ఓ అందమైన అబ్బాయికి అందులో మొదటిబహుమతి లభించింది.

ఆ అబ్బాయి అందమైన ఫొటో పత్రికలో వేస్తూ "ఈ అబ్బాయి ఈ మధ్యనే విదేశాలలో చదువు పూర్తిచేసి కొని వచ్చాడు. ఓ కంపెనీలో ఓ పెద్ద ఉద్యోగం నిర్వహిస్తున్నాడు. చక్కని రచయిత కాగల లక్షణాలు ఇతనిలో చాలా ఉన్నాయి. చక్కని భవిష్యత్తుగల ఇతని జీవితం ఓ నందనవనం కావాలని మా అభిలాష" అంటూ క్లుప్తంగా ముగించారు ఆ పత్రికా సంపాదకులు. అందమైన ఆ అబ్బాయి ఫొటో చూసి, దాని క్రింద రాసినది చదివిన చాలామంది అమ్మాయిలకు నోరూరిన మాట నిజం.

స్వతంత్ర భావాలు, వాటి నాచరణలో పెట్టగల స్వేచ్ఛగల అమ్మాయిలు అతనికి ఉత్తరాలు రాసేశారు. తలిదండ్రుల చాటునున్న అమ్మాయిలు, చాటుగానే, ఆ అబ్బాయిని ప్రశంసిస్తూ ఉత్తరాలు రాశారు. ఏది ఏమైనా ఆ అబ్బాయి "ఫాన్ మేల్" మాత్రం బ్రహ్మాండంగా పెరిగిపోయింది.

ఒకరోజు, ఆ అబ్బాయికి వచ్చిన ఈ రెండు ఉత్తరాలు మాత్రం మీరు చదువుకోవటంకోసం ఇక్కడ పొందు



పరుస్తున్నాను అతడు చదివిన మొదటి ఉత్తరం ఇది :

హైదరాబాదు,
23 జూన్, 64
సంధ్యా సమయం

.............గారికి,

మీ కథ చదివి తన్మయులైపోయిన వారిలో నేనొకర్తెను. కాని నా కన్నా మిమ్మల్ని శ్లాఘించేవారు మరొకరు న్నారు. ఆమె నా స్నేహితురాలు శైలూ. అదే శైలజ. మీకథ చదివినప్పటినుంచి (అందులో ఇంకా మీ ఫోటో చూసి నప్పటినుంచి) అది ఈ లోకంలో ఉంటటంలేదు. దాని తరహా చూచి, అనుమానంవేసి సూటిగానే అడిగాను. నాతో చెప్పుకొని సిగ్గుపడింది. ఇంకా మీ దగ్గర ఏం దాచకుండా ఉండాలంటే అది మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించిందనే చెప్పాలి. అది అడగకపోయినా దాని బాధ అర్థం చేసుకుని, ధైర్యంచేసి నేనీ ఉత్తరం రాస్తున్నాను.

మా "శైలూ" అందం వర్ణించడం కంటే ఆమె "బాపూబొమ్మ" అంటే మీరే అర్థంచేసుకుంటారు. పచ్చని పసిమిఛాయతో, చలాకీగా, చిలిపిగా మెరిసేకళ్ళతో ఎప్పుడూ హాయిగా తిరిగే శైలూ మా కాలేజీకే "ఆయస్కాంతం". మేమిద్దరం బి. ఎ. ఫైనలు వెలిగిస్తున్నాము. నాకు మాత్రం చదువంటే బోరు. శైలూ కలా కాదు.- తెలుగు సాహిత్యం, అందులో ఆధునిక సాహిత్యం (శవసాహిత్యం కాదుసుమా) మీద దానికి వల్లమాలిన అభిమానం. దాని గది ఓ పెద్ద లైబ్రరీ. వ్యాసరచన, వక్తృత్వం పోటీలలో దానికి మొదటి బహుమతి రాకుండా చేయాలని ప్రయత్నించి ఎందరో చిత్తుగా ఓడిపోయారు. మా శైలూ సంగీత విశారద కూడాను. వీణ బాగా వాయించగలదు. హిందుస్తాని సంగీతం కమ్మగా, హాయిగా పాడుతుంది.

మా శైలూ కుటుంబంకూడా గొప్ప దేను. వాళ్ళ నాన్న గవర్నమెంటులో సెక్రటరీ. ఆమె అన్నయ్య అందరూ వరుసగా ఇంజినీర్లే. ఇంకా చెప్పా లంటే, మా శైలూది చాలా 'సెన్సిటివ్ నేచర్.' దాన్ని కాస్తగట్టిగా మందలించినా. దాని కళ్ళు వర్షిస్తాయి. చాలా అమాయకురాలని నా కనిపిస్తుంది.

ఇంతకన్నా ఓ వధువులో వరుడు కోరదగ్గ లక్షణాలు మరే ముంటాయి.

ఇంక మీ అభిప్రాయం తెలుసుకోవడమే నా విధి. తీరికలభిస్తే, మా ఊరు నొకసారి పావనంచేయండి. శైలజను పరిచయం చేస్తాను.

జవాబు రాస్తారు కదూ !

ఇట్లు,
రాధ

● ● ●

ఇంక రెండవది.

విజయవాడ
26 జూన్ 64
ఉదయం.

............గారికి,

పొరబాటున ఈ ఉత్తరం నాదగ్గరకు వచ్చింది. నేను దాన్ని చదివేశానుకూడా. ఇందుకు మీరు నన్ను క్షమించాలి. ఈ ఉత్తరాన్ని భద్రంగా మీకు పంపిస్తున్నాను. ఇంక మీరు నా గొడవకూడా కాస్త వినాలి.

నేను 'శైలజ' అంత అందమైన దాన్ని కాదనుకుంటాను. పొట్టిగా, బొద్దుగా ఉంటానని అంటారు. "ముద్ద బంతిపూవు" అంటే మీకర్థం అవుతుందనుకుంటా. నేను "పచ్చని పసిమి చాయ"లో ఉండను. నాది చామనచాయ. నా కళ్ళు కాంతులీనవు. కొట్టొచ్చినట్లు కనపడతాయి నేనేమంత గొప్పగా చదువుకోలేదు. అసలు నా జన్మలో కాలేజీలో అడుగుపెట్టనేలేదు. కాని సంసార నిర్వహణ మాత్రం చేయగలను. కమ్మగా వండి పెట్టడం నాకు బాగా చేతనవును.

సంగీతం అంటే చెవులు కోసుకుంటాను కాని నాకు సంగీతం అసలురాదు. మా కుటుంబం అన్ని మధ్యతరగతి కుటుంబాల లాంటిదే. తెలుగు సాహిత్యం గూర్చి గూడా నాకు పెద్దగా తెలియదు. ఉబుసుపోక, ఏదో పత్రికల్లో కథలు మాత్రం చదువుతూ ఉంటాను. మీకథలంటే నాకు చాలాగౌరవం. ఇష్టం.

ఇక పోతే నా వ్యక్తిత్వంగూర్చి. దానికి నేను ప్రాధాన్యం ఇవ్వడం మరిచి పోయాను నా జీవితాన్ని నేను నమ్మిన వారిచేతిలో పెట్టి. వారికోసమే జీవించడం నా లక్ష్యం.

మీ ఫొటో. చాలా అందంగా ఉంది. మిమ్మల్ని నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను.

ఇంకో ముఖ్య విషయం, ఇంకో నెలలో. దేవుడు మేలుచేస్తే చక్కని పండంటి అబ్బాయినో, అమ్మాయినో, కనబోతున్నాను.

నేను మీకు సరిపోతానా ?
జవాబుకోసం ఎదురుచూస్తూ....

మీ ప్రియమైన భార్య,
సీత.

□□□



శ్రీ సుసర్ల దక్షిణామూర్తి

గంభీరాకృతి, విచిత్రమైన ప్రకృతి గల శ్రీ దక్షిణామూర్తి ప్రత్యేకమైన వ్యక్తిత్వంగల వ్యక్తి. సలక్షణాలైన రాగాలలో విలక్షణాలైన ప్రయోగాలతో వరసలు కట్టడంలో వీరిది అపారమైన శక్తి. ఘన గాంధర్వ విద్యాదక్షులైన తంద్రి తాతలంటే వీరి కెనలేని భక్తి. సంగీత వంశోద్భవులు గనుకనే వీరికి శైశవంనుండీ పాటలయం దమితానురక్తి. వీరి ఒక్కొక్క మాటలోనూ స్ఫురిస్తుంది చక్కని యుక్తి. ఎన్నడూ లోటులేని భుక్తిగల వీరికి, బీదసాదలకు శక్త్యానుసారం దానంచేయడంలో మెండైన ఆసక్తి.

వీరిది బృహచ్ఛరీరమూ, మహచ్ఛారీరమూను. బలిష్ఠమైన కాయం పటిష్ఠమైన ధ్యేయం-గరిష్ఠమైన గేయం. మనిషి చాలా సింపుల్. గడ్డంమధ్య కలదొక-సొంపుకి సొంపుల్ అనదగిన డింపుల్, వయస్సుతో మేదస్సు ముదిరిందేకాని మనస్సుమాత్రం ముదరలేదు. ఖదురుగా బాల్యావస్థలోనేవుంది. కనకనే, బుల్లిపిల్లాడికి మల్లే మాటాడతారు నిర్మలంగా, నిర్మొగమాటంగా.

మెల్లిగా మాటాడినా-కంఠం తారాపథాన్నంటుకుంటుంది. మరి పాడితే చెప్పేదేముంది ? ఓ రోజుని రిహార్సల్సులో నాకు వీరు పాటనేర్పే సమయంలో గళంవిప్పి అనర్గళంగా అవిళంగా చారుకేశి రాగాలాపన చేస్తూండగా ఆ గది దద్దరిల్లింది. గోడలు వణక సాగాయి. వీరి ప్రచండ కంఠ స్వరోద్గత స్వర తరంగాల తాకిడికి తట్టుకోలేక. ఈ వాతావరణంలో నేను పాడి చూసుకున్నా - నా పాట నాకే వినిపించలేదు. నాకు నా నాజూకైన గొంతు తల్చుకునేసరికి సిగ్గేసింది.

ఇంత గొంతుగల ఈయన మైకు ముందెలా పాడతారూ అనే సిల్లీ సందేహం కలిగింది. మెద్రాసులో పాడితే ఢిల్లీ ప్రజలకు సైతం విస్పష్టంగా వినబడేంత ఘన ధ్వని పరిమాణంగల గళం వీరిది వీరు

పి. బి. శ్రీనివాస్

ప్లేబాక్ సింగర్‌గాకూడా పేరు పొందారు. అనేక చిత్రాలలో హిట్‌సాంగ్స్ పాడారు.

ఒకింత వేదాంతి, జీవితపుటొడుదుడుకుల కొడబడినా, ఓర్పుతో ఒడ్డు చేరుకోగలిగే శక్తిగలిగి, కాలాకాల పరిగణనా విచక్షణా దక్షులీ దక్షిణామూర్తి. ఏకక్షికి చెందరు. కక్షతో ఎవరిపైనా కచ్చ బిగించరు. ఎవరి మనసు నొప్పించడానికి యిచ్చగింపరు.


శ్రీ సుసర్ల 1921 నవంబరు వదకొండున మచిలీపట్నంలో, శ్రీ కృష్ణబ్రహ్మశాస్త్రి గారి యింటి నోముల పంటగా వెలిశారు. వీరి తండ్రిగారు వీరికి తన తండ్రిగారి పేరే పెట్టుకున్నారు. వీరి పితామహులైన శ్రీ దక్షిణామూర్తిగారు సంగీత పండితులు. నేటి మేటి గాయక కళాకారుల గురువుల గురువులు, సరస్వతికే పరువులు, శ్రీ హరినాగభూషణం, శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య ప్రభృతులెందరో వారి శిష్య ప్రశిష్యులు.

ఇంటావంటా వంట బట్టిన సంగీత కళ మన దక్షిణామూర్తిగారికి పుట్టుకతోనే అబ్బింది. వీరికి గురువులు జనకులే. చదువు ఎనిమిదవ తరగతివరకూ నిరాఘాటంగా సాగింది. ఆ వెనక నిరభ్యంతరంగా ఆగింది.

చిన్నప్పణ్ణుంచే బ్రహ్మాండంగా పాట కచ్చేరీ లిచ్చేవారు వీరు — తనకు తనే వయొలిన్ వాయించుకుంటూ పాడేవారు. తెనాలిలో శ్రీరామనవమి ప్రోగ్రాంలో వీరి గంధర్వ గానం విని ముగ్ధులైన శ్రీ బియన్నార్ వీరి ఒడ్డూ పొడుగూ అదీ చూసి మొదట్లో వీరికి యాక్టింగ్ యిప్పిద్దామనుకున్నా, పిదప గ్రేట్ వయొలినిస్టుకమ్మని, కమ్మని సలహాయిచ్చారు. 1938 లో నవ్యకళా ఫిలింస్ తీస్తున్న "మీరాబాయి" చిత్రానికి, తనకు సహాయకులుగా నియమించుకున్న శ్రీ భీమవరపు నరసింహారావుగారి వద్ద శ్రీ సుసర్ల చాలా చిత్రాలవరకూ పని చేశారు. ఫిడేలు వాయించారు.

పిమ్మటకొన్నాళ్ళు శ్రీ కొప్పరపు సుబ్బారావుగారివద్ద "భక్తిమాల", "తారాశశాంకం" మొదలైన చిత్రాలకు పనిచేశారు. మరి కొన్నాళ్ళు హిజ్‌మాస్టర్స్ వాయిస్‌లో వయొలిన్ వాదకుడుగా వృత్తి సాగించారు. ఆరోజుల్లోనే అక్కడ హార్మోనిష్టుగా వుంటూవున్న కీర్తిశేషులు శ్రీ సుబ్బరామన్ గారితో ఈ వయొలినిష్టుగారికి ఒత్తుగా పొత్తు కుదిరింది. అనంతరం, "లైలామజ్ను", "శ్రీ లక్ష్మమ్మకథ" "స్త్రీసాహసం" వగైరా చిత్రాలకు శ్రీ సుబ్బరామన్‌గారితో పనిచేసి పాటలుకూడా పాడారు. "మనుచుగాతా ఖుదా తోడై"; "హాయిగా వీనుల విందుగా" (లీల గారితో); "పూవులవాన, లేనవ్వుల వాన" (శ్రీ అక్కినేనికి) మున్నగు నవెన్నో గీతాలు పాడిశ్రోతల ఆదరానికి పాత్రులయ్యారు. "స్త్రీసాహసం" చిత్రానికని సుసర్ల జిక్కిగారలు ఒకచక్కని గళద్వయ గేయం రికార్డు చేస్తున్న సమయాన, "రాణీ" హిందీ చిత్రానికి పాడడానికని వచ్చిన శ్రీ ముఖేష్ (ప్రఖ్యాత ఉత్తర భారత నేపథ్యగాయకుడు) సరదాగా వీరి రికార్డింగు కార్యక్రమంలో పాల్గొని; మంచివూపుగల ఆ గీతాని కనుగుణ్యంగా తాళం వేయకుండా వుండలేక, రిథిం ప్లేయరుగా సహకరించారట.

"నారద సంసారం", "సేతుబంధన్" చిత్రాలకు కొత్తలో స్వతంత్రంగా పని చేసినా, "పరమానందయ్య శిష్యులు", "సంసారం" చిత్రాలకు రెండింటికీ శ్రీమతి లక్ష్మిరాజ్యంగారి దోహదంతో ఒకేసారి బుక్కయిన తరవాతనే వీరికి తన ప్రతిభను ప్రభావంతంగా ప్రదర్శించెందుకు సువర్ణతరుణం సమకూరింది.



సుసర్ల దక్షిణామూర్తితో: శ్రీనివాస్

సాధనావారి "సంసారం" సాధించిన ఘనవిజయం వీరిని ప్రజాదృష్టిలో పడేసి, నిర్మాతలచే వీరిపై కాంట్రాక్ట్ల వృష్టిని కురిపింపజేసింది. మోడరన్ థియేటర్సు అధిపతి శ్రీ టి. ఆర్. సుందరం వీరిని సేలం పిలిపించుకున్నారు. వీరక్కడ తెలుగు, తమిళ, కన్నడ, సింహళ భాషలలో ఇరవై రెండు చిత్రాలకుపైగా మ్యూజిక్ యిచ్చారు. దక్షిణదేశంలో మొదటి పూర్తి గేవాకలర్ పిక్చరైన "ఆలీబాబా 40 దొంగలు"కి సంగీతం అందించిన కీర్తి వీరిదే. అంతేకాక "విలియంబర్కు" అనే పాశ్చాత్య దర్శకుడు ఇండియాలో తీసిన "జంగిల్" అనే ఇంగ్లీషుచిత్రానికికూడా వీరు నేర్పుతో సంగీతం అంగ్లపద్ధతిలో అద్భుతంగా అమర్చారు.

వీరు సంగీత మమర్చిన ప్రతీ చిత్రంలోనూ అనేకంగా, అథమం ఒక్కటైనా సూపర్ పాప్యులర్ హిట్ అయే ప్రథమ శ్రేణికి చెందే బాణీవుండితీరుతుంది. "సంసారం సంసారం", "నిదురపోరా తమ్ముడా", "చల్లనిరాజా ఓ చందమామా", "అందంలో పందెంవేస్తా", "తళతళా మిల మిలా", "మల్లెపూల రంగయ్యా", "ఎవరికోసం ఈ మందహాసం" వంటివి మచ్చుకి మాత్రమే. "సంసారం"లోని "సంసారం" గీతం పొందిన సర్వజన సన్మానం అనుపమానం.

"సంసారం" చిత్రం రిలీజై హోరుగా జోరుగా సాగుతున్న రోజులవి. పరిస్థితి వశాన, వీసు రైల్లో గాంధీ క్లాసులో పయనం చేయడం తటస్థించినది. అందరికన్నా ముందుగావచ్చి కూచోడంవల్ల వీరికి మంచి సదుపాయమైన సీటే చిక్కింది. కాని, కొంతసేపట్లోనే తన కంపార్టుమెంటు — పుష్పక విమానంవలె — ఎంతమంది ఎక్కినా మరొక్కడికి చోటీయగల ప్రత్యేక శక్తిగలదిగా తోచింది వీరికి. ఇసక రేణువు గూడా ఇరుక్కోలేనంతగా, పెట్టెనిండా కిక్కిరిసిన జనం వున్నా, ఎక్కేవాళ్ళెక్కుతూనే వున్నారు- మాటాముల్లె పుచ్చుకుని మరీ - అయినా మన సుసర్ల తన సీటు నంటిపెట్టుకుని, కదిలితే కాజేస్తారేమోననే శంకవల్ల - శంకానివృత్తి కూడా కావించుకోడానికి వీలులేక యిబ్బంది పడుతూనే - పంచప్రాణాలూ ఉగ్గబట్టుక్కూచున్నారు - క్షణమొక యుగంగా ఫీలవుతూ - ఇంతలో బండి కదిలింది. "పీడవదిలించిరా బాబూ - యిహ యెవరూ యెక్కరని - యెక్కిన జనం అంతా నమ్మకంగా నిట్టూర్పు పుచ్చే లోపుగా బిచ్చగాడొక్కడు వెనకవైపునుంచి కిటికీ కమ్మల నాధారంచేసుకుని - లోపలివాళ్ళు కేకలేసి తనని బైటికి నెట్టుతున్నా వినిపించుకోకుండా, లవలేశమైనా లక్ష్యం చేయకుండా, పట్టుతప్పకుండా, హెచ్చుస్థాయిలో "సంసారం సంసారం ప్రేమ సుధాపూరం" అని అందుకుని, లోపలికెలాగో తన కళేబరాన్ని చేరేశాడు. అంతటి సమ్మర్దంలోకూడా అందరూ ఆపాట అత్యంతాసక్తితో వినసాగారు మైమరచి - దానికితోడు అతగాడి గాత్రం బహుశ్రావ్యంగా వుందేమో - తల లన్నీ పాము పడగల్లా ఆడసాగాయి ఆనందంతో. శ్రీ సుసర్ల శరీరం ఉప్పొంగింది ఉల్లాసంతో, "సంసారం" పాట పిమ్మట "అమ్మా ఆకలీ-బాబూ ఆకలీ" అని వినిపించేసరికి.

వీరి ప్రక్కనే చోటులేక బిక్కమొగంతో నిలబడున్న ఓ ఆసామి ఈ పాటలనీ, పాటకి వరసకట్టిన సంగీత విధాతనీ బాహాటంగా మెచ్చుకోసాగాడు తనెవరో తెలియకుండానే తననీ తన పాటలనీ మెచ్చుకుంటున్న తన అభిమాని, నిలుచునే వుండడం ఇహ సహించలేకపోయారు. "సంసారం" గీత సంగీతకర్త వున్న సీటులో సగంచోటులోనే తను సగమై సర్దుకుని, మిగతా సగం జాగా ఆతని కానందంగా దానంచేసేశారు. నిజంచెప్పాలంటే కర్ణుడానాడు సహస్రాక్షుడికితెలిసే చేసిన స్వరక్షా కవచకుండలాలి దానంవీరి ఔదార్యంతో చేసిన స్థలదానం ముందు దిగదుడుపని అనాలిసిందే. శ్రీ రావి కొండలరావుగారి "కంపార్టుమెంటాలిటీ" చదివితే, కలికాలంలో రైలు ప్రయాణంలో, ముఖ్యంగా మూడవతరగతి పెట్టెలో, దొరికినచోటులో కొంతైనా వదులుకొనిదానం చేయడంలోగల త్యాగం మహిమ అవగతమవుతుంది ఈ అపూర్వత్యాగానికి అబ్బురపడి, చోటుదొరికిందే చాలని ఉబ్బితబ్బిబ్బయిన ఆ అబ్బి పీ రొసగిన అర్థాసనాన్ని అధిష్ఠించి, ఈ దానం ద్వారా, బలిచక్రవర్తి కీర్తిని కొల్లగొన్న మహానుభావుని వూరూ పేరూ వగైరా వివరాల నరయగోరేసరికి, ఉండబట్టలేక అడిగినదే తడవని "ప్రస్తుతం ఆ యాచక గాయకు డాలపిస్తూ వున్న గీతానికి సంగీతకర్తని నేనే" నని త్వరగా తెలియజేశారు సగర్వంగా, తోడనే లంఘించుకున్నా డాయన మితి మించిన ప్రశంసా హింసాకాండను. అంతతో ఆగక, అప్పటికే, పెట్టెలోని తతిమ్మా ప్రయాణీకు లందరివద్దా దక్షిణ బాగా బోగుచేసుకున్న భిక్షాధిపతి - స్వరలక్షాధిపతియైన మన దక్షిణామూర్తిని చేయిచాచి యాచించబోగానే - ప్రక్కనున్న మనపెద్దమనిషి ఆ అబ్బాయితో "ఒరేయ్, సుబ్బాయ్ నువ్విప్పుడే పెట్టెలో సంపాయించిన డబ్బంతా ఈయన చలవేనురా! ఇంకా ఆయన్నడుగుతావేంరా?" అని ముద్దుగా గదమాయించేసరికి, అర్థంకాని ఆ అర్భకుడు అంతా అడిగి తెలుసుకుని, పక్కవారిని బలంగా పక్కకి తోసేసి, సుసర్లగారి పాదాలంటి సలాంచేసి, చాటంత ముఖం చేసుకుని - "బాబుగోరూ! మీదరమవాం అనే మీ పాటలు పాడుకుంటానే, రోజూ పదిరూపాయిలకి తక్కువ గాకుండా సంపాదిస్తన్నా. మీరు పదికాలాలపాటు సల్లగా వుండాలండయ్యగోరూ - మాలాటోళ్ళంతా మీ పాటలు పాడుకుంటా - బతకడానికి" అన్నాడు సంతోషం ఒలకబోస్తూ, రూపందాల్చి వచ్చి నిలిచిన కృతజ్ఞతలా, ఆ ఒక్కముక్కకే ఐసైపోయిన మన దక్షిణామూర్తిగారి దక్షిణహస్తం జేబులోదూరి, రెండు హస్తాల నోటొకటి తీసి వాడి హస్తంలో పడేసింది. పరిచయం చేసిన పెద్దమనిషి వెంటనే - "అరి (కాలిన తర్వాతకాదు) - పీయిల్లు బంగారంగానూ! పాట మాట చెప్పే అరనిముషంలో పదిరూపాయలు లాగేశావు గదరా? మరి యిచ్చెయ్యి ఒక చెయ్యి (అయిదు) నా కమిషన్" అన్నాడు కొంటెగా సుసర్లకేసి చూసి కన్నుగీటుతూ, ఇదంతారాయడానికి అవసరమేమొచ్చిందంటే - ఒకపాట ప్రజలలో ఆదరణ పొందిందో లేవో తెలుసుకోవాలంటే ఇదే కరెక్టయిన టెస్టు టెస్టు. రైలుపెట్టెల్లోనూ, లెవల్ క్రాసింగు గేట్లవద్దనూ, ఇతరత్రానూ బోగయిన బిచ్చగాళ్ళజట్టు ఏ పాటతో ప్రయాణీకుల చెవుల తుప్పు వదలగొడుతున్నదో అదేపాట ఆనాటి సెన్సేషనల్ హిట్టన్న మాట. ఈ టెస్టులో మన సుసర్లగారి గేయా లనేకాలు విజయముని నిర్ధారించాయి

శ్రీ సుసర్లవారి స్వర సురతరువొసగిన స్వాదిష్టాలైన పాటల - పాటల ఫలాలలోని కొన్నింటి రసాన్నాస్వాదిద్దాం. —

శ్రీ భావనారాయణ నిర్మించిన "రమాసుందరి" చిత్రానికి సుసర్ల సంగీతం మెరుగుతో గూడిన బంగారపు ముడుగు. కన్నడ కవి శ్రీ హూన్సూరి కృష్ణమూర్తిగారి సుసంస్కృత సంస్కృత పద భరిత భక్తిరస పూరిత గీతం "జయజయ గంగాధరా" వర స్వర సంహితం. వరలక్ష్మి సుశీలా సంకీర్తితం. (వరలక్ష్మి యనగా యస్వర లక్ష్మి అనుకునేరు — శ్రీమతి సుశీలగారి అనుంగు సహోదరి). శ్రీ వద్దాది దొడ్డగా రచించిన "అమృతమే మనస్నేహం" సుశీలా జానకిగారలు కృష్ణకుమారి గిరిజల నృత్య సన్నివేశానికి రససిద్ధి చేకూర్చారు. వద్దాదిగారే విరచించిన "అందాల బాలా అనురాగమాలా" అన్న గేయం'చారుశీల'లో శ్రీరామకృష్ణగారికి శ్రీనివాస్ పాడిన ప్రణయరాగం; శృంగారానికే సింగారం! రాజశ్రీ (నటికాదు- నవయువ కవి) సృజించిన "ఓహో రాజకుమారి, విధి పగబూని ఎదురాయెనా" అని కృష్ణకుమారిగారికి శ్రీ ఘంటసాల (నేపథ్యంలో) పాడిన గీతం శోకం నిండిన లోకం. వద్దాది గేయం "నచ్చావురా చక్కనోడా" అని మనసిచ్చిన చిన్నవాడికి మనసు తెలిపే వైనంలో జానకిగారి గానం, మీనాకుమారి (తెలుగు) నృత్యానికి ప్రాణం. ఆరుద్ర వ్రాసిన "పాహి పరమేశా మమదేహి పతిరూపం" అనే శివస్తోత్రంలో సుశీలగారిగాత్రం విజితసర్వజన

శ్రోత్రం. భక్తిప్రపూరితపాత్రం. శ్రీ శ్రీ కృతాలై సుశీలాలాపితాలైన గీతాలలో, "మేలుకోరాజా" అనేది గిరిజాముఖంగా రాజైన రామకృష్ణను నిదురలేపే మేలైన మేలుకొలుపు; "జోజో రాజకుమారా" అనేది అలించినవారిని లాలించి అలరించి జోకొట్టే లాలి.

"వీరకంకణం" చిత్రంలో ఆరుద్ర రచన సుసర్ల సంగీతంతో చేతులు కలిపి వీర విజయ విహారం చేసింది. దొంగలడెందాన్ని తన రంగైన అంగవిశేషాలతో దొంగిలించ దలచిన వయ్యారి ఇ. వి. సరోజ ఆడుతూ పాడిన "సొగసరికులుకు సొంపారు బెళుకు" ఆదిగాగల పలుకుల హొయలు జవాబులేని సవాలు. వీర నటులైన ఎన్. టి. రామారావు వీరావేశంతో సైన్యాన్ని తయారుచేసి పోగు చేసే రసవత్తర సన్నివేశానికి రాజా పాడిన "కట్టండి వీరకంకణం" అనే మోహనరాగ యుత గేయం గుర్తుపెట్టుకోదగినది.

"సిగ్గులు చిగురించెనే, బుగ్గలు ఎరుపెక్కెనే" అని జమునగారికి, బాలసరస్వతి గారి గానం విషాకలిగించి హుషారెక్కించే సిగ్గైనపెగ్గు. "అన్నంతిన్న యింటికే కన్నం వేయాలని" అని పిఠాపురం బోధించే నీతి సూటిగా కుమతులమతిని తాకి సుమతుల నొనరిస్తుంది. "ఆత్మబలి చేసినావు - అమర జీవివమ్మా" అని దేశంకోసం త్యాగంచేసిన జమున శిలావిగ్రహానికి అంజలి ఘటించి కృష్ణకుమారి సన్నుతించే సన్నివేశానికి లీలగారాలపించిన భావమయ గేయం అవిస్మరణీయం. ఘంటసాల, పిఠాపురాల "హంసబలే రాంచిలక" పంచదార చిలక.

"సంతానం" సంగీతం అంతా, నవీన విధానంలో గమనం సాగించింది అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన సంగీత దేవత లత (మంగేష్కర్) చేత ప్రప్రథమంగా తెలుగు సింహళ భాషలలో పాడించిన ఘనత సుసర్లకే దక్కింది. "నిదురపోరా తమ్ముడా" అని లత తీయని గొంతు బేహాగ్‌రాగ మార్గంలో లతలాగసాగి, రాల్గరుగురీతిగా రాగించింది. ఈ గీతంలో మొదట నిదురపో నిదురపో నిదురపో అని మూడుసార్లు అనిపించడం అనవసరం అనిపించిందెందరికో. ఎందుచేతంటే ఎల్లరికీ తెలుసు పల్లవంలా, కోమలమై, మృదుమధురమైన లత కంఠం "ఊఁ" అంటేనే వింటే చాలు అర్ధలిప్తలో సుషుప్తిలో మునిగి మైమరవని వారుండరని. అల్లాంటప్పుడు ఆమె "నిదురపో" అని ఒక్కసారంటే చాలదూ? యుగయుగాలుగా నిదుర మొగమెరుగని వ్యథామథిత మానసుడైన రాకాసి మానిసికి సైతం ఇట్టే కునుకు పట్టేయదూ? ఈ గీతంలో ఆనిసెట్టి రచనలోని సహజలాలిత్యం మార్దవం, సారళ్యం, లత కెంతయినా సహకరించి ఉపకరించాయి. జూనియర్ శ్రీరంజనికి లీలపాడిన పూజాగీతం "అమ్మా మాయమ్మా యిలవేల్పులమ్మా" అమూల్యమైన వసంత, హిందోళ, షణ్ముఖప్రియా రాగసుమమాలిక నాస్తికుల నాస్తికులుగాచేయ గలిగిన భక్తిపూజ మూలిక. "కనుమూసినా కనిపించే నిజమిదేరా ఇలలేదురా నీతి" అని విచారసాగరంలో స్వరాలని ముంచి యెత్తి, శ్రీ సుసర్ల యెంచి తయారించిన, మంచి భూపాల రాగాన్వితమైన నేపథ్య విషాదమయగేయం ఘంటసాలరుద్ధకంఠంతో రోదిస్తూ కరుణారసభరితంగా ఆలపించగా విని హృదయం బద్దలౌతుంది. "ఇలలోన జీవిత సాధనా" అని స్వయంగా సంగీత దర్శకులు సుసర్లే సత్యవతితో కలిసి అసావేరి రాగచ్ఛాయలో పయనించారు. అమర గానం సలిపారు. అక్కినేని, చిత్రంలో సావిత్రి రూపాన్ని తలపోయడంతో, తమి

దీరక తమకమున మునిగి, గీతం సహాయంతో తేలే సన్నివేశానికి, షణ్ముఖప్రియలో ఘంటసాల చక్కని కర్ణాటక బాణీలో వినిపించిన "దేవి శ్రీదేవి" తేనెలూరేబావి. సుధారసాన్నందించే ప్రియురాలిమోవి. అన్నట్టు సుసర్ల - షణ్ముఖప్రియా ప్రియులు. చల్లని వెన్నెలలో, చక్కని కన్నె సమీపములో మన ఘంటసాల పేటెంటైన కళ్యాణిలో కమ్మనిగానం వినడం సమకూడితే వేరేకావలసినదేముంది? చలం, కుసుమ మాలినులకు, కోదండపాణీ జమునారాణులు దివ్యంగా పాడిన "సంతోష మేలా, సంగీతమేలా" శంకరాభరణం మేళంలో త్రిశ్రతాళంలో తిరిగే ప్రణయ భూగోళం.

అలీబాబా 40 దొంగలు డబ్బింగు చిత్రమైనా ఆ చిత్రం విచిత్రంగా డబ్బుచేసుకుందంటే సంగీతం ఒక ముఖ్యకారణమనాలి. ప్రతి పాటా ప్రతీనోటా పలికేటంత పాప్యులర్ హిట్ అయింది. "అందంలో పందెంవేస్తా అందర్నీ ఓడిస్తా" అని వీధినాట్యంచేస్తూ భానుమతికి భానుమతే పాడిన అరబ్బీయ గేయం మిశ్రరాగాలలో అక్రమంగా సాగి వక్రమైన బిరకాలతో ఆ కోవకు చెందిన గీతాలన్నింటినీ పందెం వేసి ఓడించింది. "రావేరావే తారాజువ్వ" అని ఎం. ఎస్. రాజం, సారంగపాణులకు జిక్కి పిఠాపురాలు పాడిన హాస్యగేయం ఏ రాగం అని అడిగిన ప్రశ్నకు శ్రీ సుసర్ల యిచ్చిన విట్టీ జవాబు "సినీమా పాటలకి ఒకరాగమనేం చెప్పగలం! అట్టే పట్టుపట్టి అడిగితే విరాగమనాలి. అయినా ఈ పాటని ప్రస్తుతం మనం "తారాజువ్వ" రాగమని అనుకుందాం. ఎక్కడో నృత్యాది సన్నివేశాలకి తప్ప రాగాలని శుద్ధంగా సక్రమంగా వాడాలనుకోడం సినీమా సంగీతానికి సంబంధించినంతవరకూ అక్రమం. మడిగట్టుక్కూచుంటే వెరైటీలు రావు" అని. మినిమం గ్యారంటీ (ఎం. జి) రామచంద్రన్, భానుమతిగారలకు, ఏ. ఎం. రాజా, భానుమతి గారలాలపించిన యుగళగీతం "ప్రియతమా మనసుమారునా" ఎంతవిన్నా తనివి తీరునా? ఊఁహూఁ, నృత్యంలోకూడా తనది పైచెయ్యే అనిపించుకునే రీతిగా దర్బారులో హొయలు కురిపిస్తూ మురిపిస్తూ శ్రీమతి భానుమతి ఆడుతూ పాడిన "నిను విడబోను" యువ హృదయాల పాలిటి ఇనపబోను - తంగివేలు తనలో తనే పాడుకునేపాట "ఖుశీ ప్రపంచం నీకేసొంతం - నువుజల్సా సెయ్యర సెయ్యరా" అని రాజాగారు హుషారుగా పాడగా విన్న అయ్యలందరూ నవ్వినవ్వి కొయ్యబారి నిలిచిపోతారు.

"ఇలవేలుపు" చిత్రంలో-అక్షరక్రమాను సారం అనిసెట్టి, కొసరాజు, వడ్డాది శ్రీ శ్రీ ప్రభృతుల కవనం దవనంలాను వాసనలీనుతూ సుసర్ల స్వరస్వైర విహారాని కుపయుక్తమైన బృందావనంగా విరాజిల్లింది.

జనగణ మంగళదాయక ("మన"తో కూడని జాతీయగీతం అనుకునేరు.) అనే అంజలీదేవి ప్రార్థనాగీతం శాంతియుత సువర్ణారుణ ప్రభాతం. "ఏనాడు కనలేదు ఈవింత సుందరిని "అని అక్కినేనికి రఘునాథ పాణిగ్రహి కళ్యాణిలో కమ్మగా ఆలపించిన రాగం ఆహ్లాదకరమైన సంధ్యారాగం జమునాంజలీ నాగేశ్వరరావుగారలకు, లీలా సుశీలా పాణిగ్రాహు లాలపించిన "చల్లని రాజా ఓచందమామా" వింటే సుఖాంతమైన చక్కని డ్రామా చూసినంత హాయిగా ఉంటుంది. చల్లని చక్కని పున్నమివెన్నెలలో ఒళ్ళుదహించేవేడి యెందుకో "అనిల రేలంగికృష్ణకుమారిగారలకు సుసర్ల సుశీలలాలపించిన హాస్యగీతం మదికి వెచ్చని

చల్లదనాన్ని కలిగిస్తుంది. పలికిన బంగారమవే" అని పలికిన సుశీలగారి గళం శంకరాభరణం మేళంలో కమ్మని పరిమళం చిలికింది.

"ఇలేబావ"లో రేలంగికి, బాలనటుడు వర్మకీ, పిఠాపురం సత్యవతి పాడిన గోరా శర్మగారి "హాయ్ చిన్నదానా" రోడ్ సైడ్ రోమియోలకు చక్కనిదాణ. "కడు పాచూస్తే జానెడుసరిగా" అనే మరో గోరా శర్మగేయం సుసర్ల చదలవాడకు పాడిన పాట, అడపాతడపా "తింది పోతుల మండలి"లోని సభ్యులు కొందరు ఆబగా ఆలపించడం నే నెన్నోసార్లు విన్నాను. జానకిగారికి లీలగారు పాడిన "ఓ సాయి బాబా ప్రభో" బాబాభక్తుల ప్రియతమగీతం.

సాధనావారి "సంసారం"లో సంగీతం స్వరపారావారం. "సంసారం ప్రేమసుధాపూరం" అన్న సింధుభైరవిలోని ఘంటసాల నేపథ్యగీతం ప్రచండ బ్రహ్మచర్యవ్రతధారులకు సంసారంలోని మాధుర్యాన్ని చవిచూపి, బ్రహ్మచర్యంలో ఆనందం అనుస్వారసదృశం అన్న విషయ విశేషం తెలిపి, ఆకర్షించే నవజీవనద్వారం. ఘంటసాల ఆలపించిన "అందాల చందమామ" ఆకసాన సాగే శశాంకుని బింబానికే బల్లకట్టుపైన నాయకుని సరసన నిలిచిన సుందరి సుందరవదనారవిందానికీగల సౌందర్య సాదృశ్యాన్ని విస్పష్టంగా విశదీకరిస్తుంది. పుష్పలతకు జిక్కి పాడిన "కల నిజమాయెగా" రసవర్షం కురిసింది.

శివరంజని రాగంలో, శివుడిసృష్టిలో విధి యెంతటి బలీయమైనదన్న విషయం విపులీకరిస్తూ "చిత్రమైనది విధినడక" అని శ్రీ సుసర్ల త్రిపుటతాళంలో హృదయాంతరాళం కదిలించివేసేవిధాన పాడి ప్రజలచే గొప్ప మెప్పుబడశారు.

"సొగసైన క్రాపు పోయె, నగుమోము చిన్నబోయె" అని శ్రీ సుసర్లే రేలంగి నవ్వుల రామయ్యగారికి పాడిన కోణంగి పాట– వీరు శోకగీతంపాడి జనులనెంతగా ఏడిపించగలరో, అంతగా, హాస్యగీతంపాడి ప్రజలను నవ్వించి రంజింపజేయగల సమర్థులని నిరూపిస్తుంది. పసిపిల్లలిద్దరూ పసి (అరవంలో ఆకలి అని అర్థం) తో పాడిన "అమ్మా ఆకలీ, బాబూ ఆకలీ" అని మిశ్ర కాళింగడలో ఉడతా (సరోజిని) మనోహరీ హృదయ విదారకంగా విలపిస్తూ ఆలపించగా వినగా, దేశంలో దారిద్ర్యబాధను నివారింపజాలని దుస్థితికి కారభూతులైన వారిపైన పెరుగుతుంది కసి. లీల మధ్యమావతిలో సీ సి యర్ లక్ష్మీరాజ్యంగారికి పాడిన "జోజో ఏడవకు ఏడవకు" భావి భారత వీరులకు ధైర్యాన్ని ఉగ్గుపాలతో కలబోసి త్రాగించి. పిరికితనం అనే నిద్ర నుండి మేల్కొలిపే జోల. రంజని, హిందోళం, షణ్ముఖప్రియ రాగాలమాలికలో లీలగారాలపించిన "అమ్మా శ్రీతులసీ దయారాశివమ్మా" పెరటిలోని తులసికోట చుట్టూ ప్రదక్షిణచేస్తూ పాడుకొనె మహిళలెవరంటే ఆ పాట పొందిన ప్రజాదరణ వ్యక్తమౌతుంది.

జగపతివారి "అన్నపూర్ణ" చిత్రంలో "ఓ రత్తమ్మో, రమణీ ముద్దులగుమ్మ, మామయ్యో మారాజో" రమణారెడ్డి రీటాలకు పిఠాపురం స్వర్ణలతలు పాడిన హాస్య ద్విగళగీతం నవ్వుల గనులను కొల్లగొట్టి అందరికీ ఆనందం పంచిపెట్టింది. జిక్కిగారి "కులాసా రాదోయ్ రమ్మంటే, మజాకా కాదోయ్ వలపంటే" మెచ్చుకోకుండా వుండగలగాలంటే ఖలేజా వుండాలి రేలంగి గిరిజలకు జిక్కి ఘంటసాల లాలపించిన "వగలాడి వయ్యారం బలేజోరు" పాట

విని "వన్సుమోరు" (అని సినిమా అన్న మాట మరిచిపోయి) ఈలలు వేసిన తెర దగ్గరి తరగతి ప్రేక్షక శ్రోతలే సాక్షులు.

జమునగారికిసుశీలగారి "తళతళ మిలమిలా, వగటిపూట వెన్నెలా" పదహారేళ్ళ పడుచు కన్నెలా వన్నెల చిన్నెలతో కనుసన్నలు చెసి మనసు దోచేసింది. జమునా జగ్గయ్యలకు, సుశీలా శ్రీనివాసుల "మనసేమిటో తెలిసిందిలే" శంకరాభరణం మేళంలో శంకరాభరణం (వన్నగం)లా వంపులు తిరియింపుగా సొంపారింది.

"సంకల్పం"లో సుసర్ల స్వరకల్పన నిర్వికల్పంగా సాగింది. "నావికా నడువరా నావ" అని - ఆపగరాని "రాగావగ"లందు (నదులందు) కాపేరితో పోల్చదగిన "శుద్ధసావేరి" రాగంలో నిజమధుర కంఠ స్వర స్వర నౌకాసహాయంతో విహారం సలిపారు, సుసర్ల. అనిశెట్టి కలం చుక్కాని కాగా, "తప్పుడు పనులెప్పుడూ మనకొద్దురబాబూ" అని అనిశెట్టిగేయం సాయించిన నీతిని శ్రీ పిఠాపురం మిఠాయిలా అందించారు అందరికీ.

"హరిశ్చంద్ర" చిత్రంలో – "ఓ రస పిపాసీ, కళా వికాసీ, మధురం మధురం మదవతి హృదయం" అని తెలిపిన సత్యవతి స్వర్ణలతల గానం దేవకన్నెలనోట వెలువడి రసజ్ఞుల రసపిపాసను తృప్తిపరచింది. "చక్కదనాల చుక్కలం - చందమామ రెక్కలం" అని జంపనగారి గీతం మాతంగకన్నెల నోట వెలువరించిన సుశీల, జిక్కిగారల గానం నిక్కంగా భావ మణిమయ స్వర రత్నావళి నిండిన బొక్కసం, ఎన్నిసార్లువిన్నా ఆనిపించదు వెక్కసం.

"కృష్ణలీలలు" చిత్రానికి సుసర్ల సంగీతం వెన్నెముక. జగన్మోహినిగా నటించిన ఇ. వి. సరోజ దేవదానవులమధ్య నృత్యం చేస్తూ అందించిన అమృతం. "అందుముందు అమృతమన్నది ఏ సాటిది" అనే ఆరుద్ర గీతంలో హిందోళం రాగంతో సుశీల నింపిన అమృతానికి మారురూపం. "ధిక్కారమును జేయుడీ" అన్న ఆరుద్ర గీతాన్ని కంసుని పాత్రలో ప్రశంసా పాత్రంగా జీవించిన యస్. వి. రంగారావుగారి నోట వినిపించిన మాధవపెద్ది సత్యం గళం పరధ్యానంగా విన్నవారి కకస్మాత్తుగా కలిగించింది, గుండెలలో కలవరం.

ఇటీవలే రిలీజై, ఖండాంతరాలలోగూడా అఖండ సన్మానాలందుకున్న రాజ్యం పిక్చర్సువారి "నర్తనశాల" జరుపుకున్న రజతోత్సవాలూ, పొందిన పతకాలూ, ఎవార్డులూ, శ్రీ సుసర్ల సంగీతానికూడా రివార్డులనాలి. జానకి అసమానంగా ఉదయ రవిచంద్రిక రాగంలో ఆలపించిన సముద్రాల దివ్యరచన "సరవరా-కురువరా" పద్మినీ ప్రియదర్శిని నాట్యానికి జీవం. "జననీ శివకామినీ" అని అభినేత్రి సావిత్రి గారికి పాడిన సుశీల భవానీ పదపద్మయుగ్మానికి భక్త్యంజలి ఘటించి అర్పించిన "నట భైరవి" రాగ నీరాజనం. ఘంటసాల, జానకి, రామారావు - విజయలక్ష్మిగారలకు, నాట్యశిక్షణారంభ సందర్భ సన్నివేశంలో "జయగణనాయక విఘ్నవినాయక" అని వినిపించిన "నాట"రాగం సంగీతయాగం. వినువారి వీనులకి సుయోగం.

ఈవిధంగా శతాధిక చిత్రాలలో సహస్రాధిక గీతాలకు, సరసమై హృదయంగమమైన సంగీతం, అందిస్తూ, అందరినీ ఆనందం చెందిస్తూ గానసుధారసం చిందిస్తూ సర్వేశ్వరుని శుభాశీస్సులను సంపాదిస్తూ సార్థకజన్ములవాలని మన సుసర్లగారికి మనమందరం నిండు మనంతో శుభాకాంక్షలనందజేద్దాం!

□□□

చిత్రరధుని

చైత్రయాత్ర

అక్కినేని నాగేశ్వరరావు అమెరికా పర్యటన విశేషాలు

సినిమా సాధన సామగ్రిలో మనం ఎంతో కొత్తది అనుకుంటున్నది. అమెరికాలో ఎంతో పాతబడింది మనం అనుకొన్న "కొత్త" సాధనంకోసం అమెరికాలో అన్వేషించదలచితే మార్కెట్‌లలో అది లభ్యంకాదు. బహుశా ఏ మ్యూజియమ్‌లోనైనా, ప్రాచీన వస్తుశాలలోనైనా విక్రయశాలలోనైనా లభించవచ్చు.

అమెరికాలో తనకు కలిగిన ఈ విచిత్రానుభూతి గురించి అక్కినేని నాగేశ్వరరావు "జ్యోతి" ప్రతినిధితో జరిపిన ప్రత్యేక గోష్ఠిలో వెల్లడించారు.

అమెరికాకు బయలుదేరేముందు "అమెరికాకు వెడుతున్నారు. మాకేం తెస్తారు?" అని సన్నిహితులు అడగడం సహజమే కదా.

అలా అడిగిన వారందరి తీరు ఒకయెత్తు; అన్నపూర్ణ పిక్చర్స్ సినిమటోగ్రాఫర్ సెల్వరాజ్ అడిగిన తీరు ఒకయెత్తు.


"డిఫ్యూజన్ లెన్స్ ఒకటి బ్రహ్మాండమైనది మనకు కావాలి. ఈ లేటెస్ట్‌మోడల్ మన యూనిట్‌కని ఒకటి అమెరికానుంచి తప్పక తీసుకోనిరండి" అంటూ సెల్వరాజ్ అమెరికా వెడుతున్న నాగేశ్వరరావును అడిగివున్నారు. ఇక్కడ అనుకొంటున్న లేటెస్ట్‌మోడల్ లెన్స్ ఏమిటో వర్ణించి చీటీ ముక్క వ్రాసియిచ్చారు.

నాగేశ్వరరావు ఆచీటీని అమెరికావెళ్ళాక ధీమాగా చూపించి ఆ సాధనం ఇవ్వమన్నారు. చీటీచూసిన సాంకేతికులు "అర్యా, ఇది మేమువాడి చాలాచాలా యేళ్ళయింది. ఇది మీరు చూడాలంటే మార్కెట్‌లకంటె మ్యూజియమ్‌లకు వెళ్ళడం మంచిది" అని సలహాయిచ్చారట.

నాగేశ్వరరావు "జ్యోతి" ప్రతినిధికి పై విషయాలను వెల్లడిస్తూ సినిమా సాంకేతిక రంగంలో అమెరికనులు ఇతర విజ్ఞాన శాస్త్ర పురోగతితో సమానంగా ముందుకు పోతున్నారని, మనం చాలాచాలా వెనుకపడి వున్నామని చెప్పారు.

డిఫ్యూజన్‌లలో వాళ్ళకు లెక్కకు మించిన సాధన సదుపాయాలు వున్నందువల్ల లాంగ్ షాట్ నుంచి క్లోజప్‌కు అతి సున్నితంగా రాగలుగుతున్నారన్నారు.

అమెరికన్ స్టూడియోలలో ఎక్విప్‌మెంట్, సిబ్బంది, తర్ఫీదు, శాస్త్రపురోగతిని సినిమాటిక్ ఎఫెక్ట్సుకు వినియోగిస్తున్న తీరు మన



విదేశ పర్యటన తరవాత మద్రాసు తిరిగివచ్చిన నాగేశ్వరరావుకు తెలుగు ఫిలిమ్ జర్నలిస్టులు సన్మానం చేసినప్పటి ఫోటో

వాటితో పోల్చిచూస్తే ఓ మహానగరానికి ఓ కుగ్రామానికి వున్నంత వ్యత్యాసం కలదన్నారు.

హాలీవుడ్‌లో అక్కినేనికి అద్భుతానుభూతి కలిగింది.

ఎమ్. జి. ఎమ్. ట్వెన్‌టియత్ సెంచరీ ఫాక్స్, యునైటెడ్ ఆర్టిస్ట్స్, యూనివర్సల్, డిస్నీ స్టూడియోలలో వారి వారి అతిధిగా ఒక్కొక్కరోజు అక్కినేని గడిపారు.

వాళ్ళకూ మనకూ సాధన సంపదలలో వ్యత్యాసానికి ఒక ఉదాహరణ పేర్కొంటూ 380 ఎకరాల విస్తీర్ణం కల ప్రాంతంలో ఎమ్. జి. ఎమ్. స్టుడియోస్ వున్నవని, వాటిలో 82 ఫ్లోర్‌లు వున్నవని, ఇక మన సంగతి వేరే చెప్పడమెందుకనీ అన్నారు.

స్టుడియోలలోనే పర్మనెంట్‌గా పారిస్ పురవీధుల సెట్లు, బెర్లిన్, న్యూయార్క్, లండన్ నగరాల సెట్లు వుంటారని, ఆ "డమ్మీ"లు సాక్షాత్తూ ఆయా నగరాలవలెనే వున్నవన్నారు.

అక్కడ స్టుడియో ఆవరణలోనే అడవులు పెంచారు. ఆ అడవులలోకి రైళ్ళు వేశారు. కృత్రిమ సరస్సులు, యింకాఎన్నో నిర్మించారు. మరీ అవసరమైతేతప్ప బైటకు పోవలసిన అవసరమే వుండదు.

తుపానులో నౌక మునిగిందీ అంటే జలప్రళయం చిత్రీకరించడానికి మనం తలక్రిందులుగా తపస్సు చేస్తాము. అక్కడి స్టుడియోలలోని కృత్రిమ సరస్సులలోపల ప్రొపెల్లర్లు పెట్టారు. వాటిని తిప్పితే జలం జలదరించి తుపానూ, ప్రళయం ఎఫెక్టు వస్తుంది.

అలాగే విమాన పతన దృశ్యం చిత్రీకరించాలంటే "మినియేచర్ల"తో పని కానిస్తారు. గొప్పగొప్ప యంత్రాలు వున్నందు

వల్ల బొమ్మ విమానాన్ని ఎగురవేసి ప్రేల్చి ఆ మీనియేచర్‌ను పెద్దసైజుకు 'బ్లో అప్' చేస్తారు.

సాధన సామగ్రి అయితే అమెరికాకు అంతంవుంది. మరి వారి టెక్నిషియనులూ ఉద్దండులేనా? మన టెక్నిషియనులకూ అంత వసతివుంటే పొడిచెయ్యరా? అని జ్యోతి" ప్రతినిధి ప్రశ్నించారు.

దక్షిణ భారత సినీటెక్నిషియనుల సంఘం నుంచి 'స్క్రోల్' బహూకృతి పొందిన అక్కినేని ఓ చిరునవ్వు విరిసి "మన టెక్నిషియనులకు అంత సాధన సంపత్తి లేకపోయినా వారికి తీసిపోరని చెప్పటానికి ఆనందిస్తున్నాను. మన టెక్నిషియనులను చూచి నేను గర్విస్తున్నాను; అమితంగా గర్విస్తున్నాను.

ఈ సందర్భంగా ఒక్క ఉదాహరణ యివ్వదలచాను. బ్రహ్మాండమైన సెట్లు అక్కడా వున్నాయి. అంతో యింతో ఇక్కడా వున్నాయి. మరి వారికి సదుపాయాలు సమృద్ధికదా. శిక్షణ హెచ్చుకదా. అంతా యాంత్రికంగా జరుగుతుంది కదా. అయినా సెట్‌ను లైట్ చేయటానికి వారు తీసుకొనే వ్యవధికంటె మనవారు ఎక్కువ తీసుకోరు. అంచేత మనవారిని అల్పకులను కోరాదు. అర్జునులనడం మంచిది" అని అన్నారు.

అయినా, అంతా యాంత్రికంగా జరిగిపోయి మీటలతో పని సాగిపోతే మనవారికి బద్ధకం పెరుగుతుందని, బుద్ధిబలం తగ్గుతుందని, సృజనాత్మక దృష్టి క్షీణిస్తుందని, అన్నింటికి మించి నిరుద్యోగం పెరుగుతుందని, ప్రస్తుతానికి అంతవురోగతి మనకు అవసరంలేదని చెప్పారు.

మనకున్న పరిమిత సామగ్రితో, సంపత్తితో, విజ్ఞానంతో మనటెక్నిషియన్లు సాధించింది భారతదేశానికే గర్వకారణమన్నారు.

డిస్నీ స్టూడియోస్, డిస్నీల్యాండ్ వేర్వేరు అని చెబుతూ, పెద్ద వాళ్ళను చిన్న వాళ్ళను చేసే మాయలోకమే డిస్నీల్యాండ్ అని అన్నారు.

అమెరికా పత్రికలు

ఏవో పత్రికలవాళ్ళం. భారత పత్రికల రచనలు చూశారు. మరి అమెరికా పత్రికలు ఏమన్నాయి? ఫిలిం పత్రికలవాళ్ళు ఏమన్నారు? మన జర్నలిజం గొప్పదా? వాళ్ళ జర్నలిజం ఘనమైనదా?" అని "జ్యోతి" ప్రతినిధి ప్రశ్నించారు.

తన పర్యటనలో ఫిలిం పత్రికలూ, ఇతర పత్రికలు, ఫిలిం జర్నలిస్టులూ ఇతర జర్నలిస్టులు అనే తరగతులుగా ఇంటర్వ్యూలు జరుగలేదన్నారు అందరితో కలసే ఇంటర్వ్యూలు జరిగినవన్నారు. అయితే తన అభిప్రాయాలను ఫిలిం పత్రికలేకాక ఇతర పత్రికలుకూడా ప్రముఖంగా ప్రకటించినవని, భారతదేశపు దృక్పథంతో ఫీచరింగ్ జరిగిందని చెప్పారు.

ఉదాహరణగా ఒకటి యిలా పేర్కొన్నారు.

"భారతీయ చిత్రాలలో ముద్దులు ఎందుకు వుండవు? అని విలేఖరులుకూడా ప్రశ్నించారు. ప్రేమే దైవం అన్నది మా మతం. ప్రేమ దైవికం. దైవికమును (డివైన్ థింగ్) దాచుకొంటాము పూజించుకొంటాము. బజారులో పెట్టము హృదయంలో పెట్టి పూజించుకొంటాము భారతదేశంలో ప్రేమను భక్తి, తత్త్వ దృక్పథంతో ఆరాధిస్తారు" అని నేను సమాధానమిచ్చాను. అమెరికన్ పత్రికలు దీన్ని ప్రముఖంగా ఫీచర్ చేశాయి. గోష్ఠిలో ఎన్నో అంశాలు వస్తే దీనిని పైకితీసి హెడ్డింగులు పెట్టాయి. "రొమాన్స్" విషయంలో భారత దృక్పథాన్ని అమెరికా అనుసరించవలసిన సమయ మాసన్నమైనదని వ్యాఖ్యానించాయి కూడా" అన్నారు ఇంచుక విజయగర్వంతో అక్కినేని.



డి. బి. ఎన్. వారి "దాగుడు మూతలు"లో బి. సరోజాదేవి.

మరి మీ పర్యటనలో మీవలె చిన్నప్పుడు నాటకాల్లో ఆడవేషాలువేసి సినిమాల్లో హీరోలయినవారు ఎవరైనా తారసిల్లారా? అని కుతూహలంతో అడగ్గా అమెరికాలో అటువంటి నటన వున్నట్లు తనకేమీ తెలియరాలేదన్నారు.

మీ వెంట మీరు నటించిన చిత్రాల భాగాలు ఏమైనా తీసుకొనివెళ్ళారా? అన్నది తదుపరి ప్రశ్న.

లేదనే జవాబు వచ్చింది.

మన టెక్నిషియనులకు అమెరికాలో వున్నన్ని సదుపాయాలువుంటే మన చిత్రాలలో అంతటి సాంకేతిక స్థాయిని ఇట్టే సాధిస్తారన్నారు మీరు. మరి మన నటులు గూడా అమెరికాలో వున్నటువంటి తర్ఫీదు ఇతర హంగులు పొందివుంటే ఇంకా గొప్పగా నటించగలరనే చెప్పవచ్చునాఅన్న తదుపరి ప్రశ్న - జటిలమైనది. అక్కినేని దీర్ఘంగా జవాబుకోసమై ఆలోచిస్తూవుంటే ఇంతలో ఏదో డిస్టర్బెన్స్ వచ్చి కాన్సెన్ట్రేషన్ తప్పింది ఆ ప్రశ్న పాస్ అన్ అయిపోయింది.

అమెరికా చిత్రాలలో నటించేందుకు ఈ "బాటసారి"కి ఏమైనా ఆఫర్లు వచ్చాయా? అని అడిగాను.

"అబ్బో! అది మరీ పెద్ద ఆశ" అన్నారు అక్కినేని.

అమెరికా నాటక శాలలను అక్కినేని శుద్ధాంధ్ర వేషంలో పంచెలూ ఖద్దరు ధరించి చూచారు. కాని అమెరికా, యూరోపా, ప్రాచ్య దేశాలలో పర్యటించి 103 రోజుల తరవాత మద్రాసు వచ్చినప్పుడు, మద్రాసులో 113 గంటలు గడిపినప్పుడు, ఒక్కొక్కప్పుడు "సూట్"లోనే వున్నారు. విమానాశ్రయంలో దిగినప్పుడే నిగనిగలాడే సిల్కు ఆకుపచ్చ మధ్యస్థం రంగు సూటులో వున్నారు.

ఈ విషయాన్ని నాగేశ్వరరావుతో ప్రస్తావించి "అమెరికాలో మీకు మన డ్రెస్సా? ఇక్కడ అమెరికా డ్రెస్సా? తప్పాదియ్యా ఏమియుక్తి అండీ" అన్నాను.

ఇచ్చట పూలదండల తడికి, గులాబీ రేకలకు కాటన్ తెల్లదుస్తులు దెబ్బతింటవని పరిస్థితికి అనుగుణమైన డ్రెస్సు వేశామే కాని వేరే షో ఈ షో మాన్‌కు లేదని ఛలోక్తిగా జవాబిచ్చారు.

ప్రిపరేషన్‌లో వున్న అమెరికన్ చిత్రం

పేపర్‌వర్కు, ఇతర ప్రిపరేటరీ, ప్రిలిమినరీ దశలోవున్న అమెరికా చిత్ర సందర్భాలేమైనా చూచారా? వాటిపై మీ అభిప్రాయమేమిటి అని "జ్యోతి" ప్రతినిధి అడిగాడు.

అద్వితీయ అమిత వ్యయ చిత్రం "క్లియోపాత్రా" ఆర్ట్ డైరెక్టర్ పనిచూసి ఆతనితో సంభాషించే అవకాశం తనకు కలిగిందన్నారాయన.

ఆయన "క్లియోపాత్రా" సెట్లకు ఉపయోగించిన మోల్డులను చూపించారని, రబ్బరుతో అవి తయారైనవని అద్భుతంగా మూసలు సులభంగా డాబుగా తయారుచేసి, అవసరం తీరిపోయాక కరిగించి వాళ్ళు వేరే పనులకు ఉపయోగించే వీలున్నదని అన్నారు.

ఆయన ఇప్పుడు పనిచేస్తున్న చిత్రంలో దాదాపు 60 మంది ఆయనకు సహాయకులుగా పనిచేస్తున్నారన్నారు. ఒక్కొక్క షాట్‌లో దృశ్యం ఎలా వుండాలో వారు బొమ్మగా గీస్తున్నారని, అవి ఒక రూపానికి వచ్చిన మీదట కెమెరామన్, డైరెక్టర్, ఆర్ట్‌డైరెక్టర్ కలిసి చర్చించి అంతిమరూపం నిర్ధారిస్తారని చెప్పారు.

సెట్‌యొక్క బ్లాకులుకూడా తయారుచేసి వుంచడం అమెరికాలో కద్దు అని అన్నారు. ఒక్కొక్క బ్లాకు మన మిద్దెలలో చేపలు వుంచే నీటి గాజుపేటిక అంత వుంటుందన్నారు.

నరాలలోకి ఇంజక్షన్ యిచ్చే సన్నివేశం షూట్‌చేయవలసివుండగా ఒక్కొక్క షాటు బ్లాక్ ఎలావుండాలో, నరం ఇంజక్షన్ సాధన గతి వేర్వేరు షాట్‌లలో తీయదలచారని, ఒక్కొక్క షాట్ నమూనాగా బ్లాక్ తయారుచేసి వుంచారని చెప్పారు. చిత్ర నిర్మాణంలో అడుగడుగునా ఎంతటి శ్రద్ధ, శ్రమ, పర్ఫెక్షన్‌కు యత్నం చూపుతారో తెలుసుకొనడానికిది గొప్ప నిదర్శనమన్నారు.

అమెరికాలో నైట్ క్లబ్‌లు అందంగా వున్నాయా? చిత్రంగా వున్నాయా? అని ప్రశ్నించాను.

నైట్ క్లబ్‌లలో ప్రదర్శనలుకూడా కళాత్మకంగా, కళదృష్టితో జరుగుతవని, అమేరకు అందంగా వున్నాయని అన్నారు.



శ్రీ సాహితీ ఫిలిమ్స్‌వారి "నవరత్న ఖడ్గ రహస్యం" లో దేవిక

భారీ ఎత్తులో వినోద ప్రదర్శనలు దాదాపు సినిమా అంత ఆడంబరంతో జరుగుతవని. సీల్ జంతువులు సరస్సులోనుంచి పైకెగరడం, జలకన్యలు, గగన సుందరులు అగ్ని, తుఫాను. ఇతర ప్రళయాలు క్లబ్ ప్రదర్శనలలోకూడా వున్నవని. సర్కస్ అంత హంగామా వాటికి వుటుందని. కళను ఆరాధించే తన కళ్ళకు అవి కళతోనే కళకళలాడినవన్నారు.

నైట్ క్లబ్‌లు చూచి కొందరు ముక్కుమీద వేలు వేసుకున్నారే? అని "జ్యోతి" ప్రతినిధి అంటే దేవుడి గుడిలో గుంజీలు తీసి లెంపలు ధడధడమని వేసుకొంటే అమెరికనులు నవ్వుతారు. అది వాళ్ళకు చిత్రం. మనకునిజం. అలానే నైట్ క్లబ్బులు మనలో కొందరికి చిత్రం. వారికి సహజం అన్నారు అక్కినేని.

థియేటర్లు

మన సినిమా థియేటర్లలో లేని గొప్పతనం అమెరికా థియేటర్లలో ఏమైనా కానవచ్చిందా? అని అడుగగా కొన్ని సందర్భాలలోనే కానవచ్చిందన్నారు. అచ్చట కొన్నిచోట్ల నాలుగైదంతస్తుల థియేటర్లున్నవని 7000 మంది ప్రేక్షకులకు వసతి వుండేవి కూడా వున్నావని చెప్పారు.

కాలేజీ చదువులేనియాక్టర్లున్నారా? అని ప్రశ్నించగా అమెరికాలో కాలేజీ చదువు లేకపోయినా పరవాలేదని. అభినయకళకు సంబంధించినంతవరకు ఆసక్తి. టాలెంట్ ముఖ్యమని. కళాశాలల ముఖమెరుగనివారు యాక్టింగ్ స్కూల్స్‌లో, వర్క్‌షాప్‌లలో, స్టుడియోలలో రాణించి దేశానికి పేరుతెచ్చారని అన్నారు. అమెరికాలో వైద్యంకంటె అభినయకళను తక్కువగా చూడరు. న్యాయశాస్త్రం, విజ్ఞానశాస్త్రం; నటనాశాస్త్రం ఒక్క ప్రమాణ్యంలోనే వున్నాయి. జైళ్ళల్లో నాటకాలు ప్రదర్శించ కటికనేరస్తులను యాక్టర్లుగా తయారు చేశారు. కళ సంస్కరణాస్త్రం. కళపై జీవిస్తున్న నేను ఇయిదీ కళతో మారాదూ అంటే దాని మహత్వం ఇంతటిదా అనుకొన్నాను అని గంభీరంగా పలికారు.

ఇంకో ప్రశ్నకు జవాబిస్తూ కెనెడీకి దుబాసీగావున్న వ్యక్తి తనతో ఇంటర్‌ప్రెటర్‌గా వచ్చారన్నారు. ఆయన సినిమాలలో నటించి వున్నారన్నారు.

అమెరికాలో ఒక్కొక్క నాటకానికి 400 మొదలు 800 షోలు వుంటాయి కాబట్టి సెట్లు, బ్లాకులు పర్మెనెంట్ పద్ధతిలో తయారు చెయ్యబడుతాయన్నారు.

టెలివిజన్ వృద్ధికి ఉదాహరణయిస్తూ టెలివిజన్ స్టుడియోలో కెమెరా ట్రాలీమన్ బెల్టుకుకూడా టెలివిజన్ సెట్ వుంటుందని. అందులో ఫీల్డు చూచుకొంటూ ట్రాలీ నడుపుతారని చెప్పారు.

ఇంకొక ప్రశ్నకు జవాబిస్తూ అమెరికాలో తాను మొత్తం విమానంలో 15 వేల మైళ్ళు, రైళ్ళలో 6 వేల మైళ్ళు, బస్సులలో రెండువేల మైళ్ళు ప్రయాణించి వుంటానన్నారు. బొంబాయినుంచి బయలుదేరాక న్యూయార్క్ చేరేవరకు దాదాపు 26 గంటలూ సూర్యుణ్ణిచూస్తూనేవున్నానన్నారు. దేశానికి, దేశానికి టైములు. భోజనవేళలు మారినందువల్ల గడియారాలు త్రిప్పుకోలేక భోజనాలవేళకు టిఫినులు మాత్రం లభ్యమయి గమ్మత్తు యిబ్బందులు పడ్డానన్నారు.

ఉత్తర ధ్రువంమీదుగా జపాను వెళ్ళినప్పటి యాత్రానుభూతి వర్ణనాతీతమన్నారు.

బ్యాంగ్‌కాక్‌లో ఒక ముస్లిం సోదరుడు చేసిన సహాయంవల్ల మలేసియాలో సతీసమేత పర్యటన చాలా హాయిగా సాగినట్లు ఇంకో ప్రశ్నకు జవాబిచ్చారు.



నాగప్రసాద్ ప్రొడక్షన్స్‌వారి "దైవనిర్ణయం" తెలుగు చిత్రంలో రాజశ్రీ

జపాన్ స్టుడియోల గురించి గొప్పగా చెప్పతగ్గదిలేదని, జపాన్ చిత్రాలలో నగ్న దృశ్యాలు సర్వసాధారణమని అన్నారు.

ఏమి తెచ్చారు?

ఎవరైనా ఏదేశాలకైనా వెళ్ళేముందు "మాకేం తెస్తారు?" అని అడగడం సహజం.

విదేశ పర్యటన ముగించుకొని వచ్చిన వారిని "మీరేం తెచ్చారు?" అని అడగటం కూడా కద్దు.

నాగేశ్వరరావు తనకోసమని నిజానికి ఏమీ తేలేదు. తెచ్చుకొన్నదల్లా విజ్ఞానం. పిల్లలకు టాయిస్ తెచ్చారు. భార్యకు గడియారం తెచ్చారు. రైతులకు "వేషభాషలు తప్ప అమెరికన్ రైతులు, భారతీయరైతులు ఒకేరకంగా వుంటా"రన్నవార్త తెచ్చారు.

అందరికీ తెచ్చిన ఒకధైర్యం ఎంతో శ్రమకుఓర్చుకుని అదృష్టం జోరయితే పల్లె "బాలుడు" ప్రపంచ పర్యటనా "చక్రవర్తి" కావచ్చునని.

"డాక్టర్ చక్రవర్తి"

అమెరికాలోకాని, రష్యాలో కాని, జపాన్‌లోకాని తాతేలు. అపెరాలు వున్నవి వున్నట్లు చిత్రీకరించడం ఒక కళ. మూలానికి దూరంకాకుండా, కవి (అనగా కృతి కర్త) కల్పనను, ఉద్దేశాలను దాదాపు యథాతథంగా చిత్రీకరించడమే నిర్మాతల పరమోద్దేశం.

రచయిత లేక రచయిత్రి ఆ యా పాత్రలద్వారా సన్నివేశాలద్వారా చెప్పిందీ చెప్పదలచిందీ తెరపై నిరూపించడమే నిర్మాత, దర్శకుడు, సినీ అనుకరణకర్త, ఛాయాగ్రహణ దర్శకుడు, నటీనటులు మొదలైనవారి కర్తవ్యం.

కలానికి కన్నులేదు కాబట్టి, కర్ణములేదు కాబట్టి, సినిమాకు ప్రధానమైనవే కన్ను (దృశ్యము). కర్ణము (శబ్దము) కాబట్టి కలంతో వ్రాసినదానిని సినిమాలో చూపడానికి దృశ్యం, శబ్దాల విలువలను కవి హృదయ పరిమితులలో వినియోగిస్తారు.

ఈదృష్ట్యా చూస్తే కుమారి కోడూరి కౌసల్యాదేవి నవల "చక్రభ్రమణం"ను "డాక్టర్ చక్రవర్తి" సినిమాగా రూపొందించడంలో అన్నపూర్ణా పిక్చర్స్ నిర్మాత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు, దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు, నటీనటులు, సాంకేతికవర్గం సంపూర్ణంగా కృతకృత్యులైనారనే చెప్పక తప్పదు.

ప్రేక్షకుల అభిరుచులు, సమకాలికచిత్ర సన్నివేశాలు పేరిట రణగొణ ధ్వనులకు, కృత్రిమ అడంబరాలకు, కల్పనలకు పోకుండా మంచి అభిరుచులను పెంపొందించే చిత్రాలు తీయాలి అనే ఉత్తమ, ఉన్నత విశిష్ట సంకల్పం ఈ హైదరాబాద్ నిర్మిత చిత్రంలో అడుగడుగునా కన్పిస్తుంది.

"చక్రభ్రమణం" బహుళ ప్రచారం పొందిన కథే కాబట్టి, దాన్నిగురించి విపులంగా ప్రస్తావించవలసిన అగత్యంలేదు.

"చక్రభ్రమణం"లో కేవలం ఛాయా చిత్రమే అయిన సుధ "డాక్టర్ చక్రవర్తి"లో చలన పాత్ర అయి మంచి వీణ పాటకు (పాడమని నన్నడగవలెనా పరవశించి పాడనా). శ్రీదేవి త్యాగం అద్భుత చిత్రీకరణకు, దరిమిలా ఒకటి రెండు పాటలలో సూపర్ ఇంపోజిషన్‌లకు బ్రహ్మాండంగా పనికి వచ్చింది. అక్కడే వున్నది సినీ అనుకరణశిల్పి శక్తికి పరీక్ష. శేఖర్ (మురళీకృష్ణ) రవీంద్ర తండ్రి (సంగమేశం), వంటలక్క (సూర్యకాంతం), పద్మ (జయంతి), వెంకటస్వామి (పద్మనాభం), వెంకటరమణ (చలం) మున్నగు భూమికలను మన వాతావరణంలో త్రిప్పి ఇటు ప్రేక్షకులను రంజింపచేస్తూ అటు కథను దాని హృదయాన్ని గాయపరచకుండా వెళ్ళారు.

డాక్టర్ చక్రవర్తి (నాగేశ్వరరావు), డాక్టర్ శ్రీదేవిని (కృష్ణకుమారి) ప్రేమించి కూడా సోదరి సుధ (గీతాంజలి) కోరికబట్టి శ్రీదేవి ఒత్తిడిబట్టి దబ్బుకు, పటాటోపానికి ప్రాధాన్యమిచ్చేటటువంటి, సవ్యమైన నిర్వచనంలేని "హృదయం" కలిగివున్నటువంటి మలిన మనస్సుకల నిర్మలను (జానకి) వివాహమాడి, సుధకు ప్రతిబింబమైన మాధవిని (సావిత్రి) ఆ రీతి మధురానురాగంతో చూచి నిర్మలచేత, నిర్మల ప్రేరేపణపై మాధవి భర్త రవీంద్ర (జగ్గయ్య)



విశ్వశాంతివారి "హంతకుడెవరు?"లో బి. సరోజాదేవి

చేత అనుమానింపబడి, అవమానింపబడి, రెచ్చగొట్టబడి, తెలుపు నలుపులు తెలిశాక వారందరి సుఖ సౌఖ్యాలకోసం సముద్రాలు దాటివెళ్ళిన మనసుల చికిత్సా నిపుణుని గాథ బాధే డాక్టర్ చక్రవర్తి. ఈ డాక్టర్‌కు సవ్యమైన నిర్వచనంకల "హృదయం" వుంది. అందుచేతనే చెడ్డనెత్తురుకల హృదయాలను బాగుపరచి తిరిగి స్వదేశానికి వస్తాడు..

ఉన్నతస్థాయిలోమనస్సంఘర్షణ, కవితా ధోరణిలో వ్యథల చిత్రీకరణ, ఘాటైన వంట "పోపు" వాతావరణంలోకాక కళా ఘుమఘుమలిచ్చే సన్నిహిత వాతావరణంలో విభేద, విచ్ఛేదాల చిత్రీకరణ "చక్రవర్తి" సొత్తు. వాటిలోనే దర్శకునియొక్క, నిర్మాతయొక్క, ఆర్టిస్టులయొక్క విన్నాణం కానవస్తుంది. సాఫ్ సినిమాలకు అభిమానులను మళ్ళించే కళాఔషధమే "డాక్టర్ చక్రవర్తి."

రచయిత్రి కల్పనను కళ్ళకు కట్టినట్లు చూపించడంలో నాగేశ్వరరావు, జగ్గయ్య, సావిత్రి, జానకి, కృష్ణకుమారి కృతకృత్యులైనారు. రచయిత్రి బొమ్మగా ఊహించినా బంగారుబొమ్మగా కన్పించింది గీతాంజలి.

ఇతర సాంకేతిక ప్రవీణుల వివరమిది:

సినీ అనుసరణ : గొల్లపూడి మారుతీరావు.

అదనపు సంభాషణలు : ఆత్రేయ.

పాటలు : దాశరథి, ఆత్రేయ, ఆరుద్ర, శ్రీ శ్రీ, కొసరాజు.

సంగీతం ; ఎస్. రాజేశ్వరరావు.

సినిమా వార్తలు

"హరిశ్చంద్ర"లో రంగుల దృశ్యాలు

విజయా ప్రొడక్షన్స్‌వారి "హరిశ్చంద్ర" తెలుగు, కన్నడ చిత్ర నిర్మాణం జులైలో ప్రారంభమై అప్పుడే రెండుసెట్లపైషూటింగ్ పూర్తి అయింది. కవి శ్రీ పింగళి నాగేంద్రరావు దీర్ఘపరిశోధనలు జరిపి కథను- ముఖ్యంగా హరిశ్చంద్రుని భూమికను కొత్త ఫక్కీలో నడిపించారు. పూర్వపు రచనలలో వర్ణ, వర్గ విచక్షణలు వున్నవి. వాటి నన్నింటిని సంస్కరించి ఈకాలంలోనే కాక మరేకాలంలో చూచినా మెచ్చేటట్లు నచ్చేటట్లు కలాన్ని పరుగులెత్తించారు.

నాగిరెడ్డి, చక్రపాణిగార్లు కలర్ చిత్రాల నిర్మాణానికి పథకాలు తయారుచేసి తదనుగుణంగా వాహినీ స్టుడియోను తీర్చి దిద్దుతున్నారు. అయితే ఈ పథకాలు ఒక రూపంలోకి రాకముందే "హరిశ్చంద్ర"ను తెలుపు నలుపు చిత్రంగా ఊహించి దుస్తులు, సెట్‌లు, దృశ్యాలు నిర్ణయించినందువల్ల తెలుపు నలుపులోనే చిత్ర నిర్మాణం సాగుతున్నది. కాని లేకపోతే రంగులోనే తయారు కావలసింది. మున్ముందు కొంత వ్యవధి వున్నందున కొన్ని ఘట్టాలను, భయోత్పాతం బాగా కలిగేందుకు రంగులు అవసరమైన సన్నివేశములను కలర్‌లోనే తీయదలచారని రూఢిగా తెలియవచ్చింది. దర్శకులు శ్రీ కె. వి. రెడ్డి ఒకసారి ఒక నిర్ణయానికివస్తే మారే మనిషికాదు. అందువల్లనే తెలుపు నలుపులోనే నూతన హరిశ్చంద్రను కళకు కానుకగా యివ్వదలచారు. కొంచెం ఆగదలచితే సంపూర్ణ వర్ణచిత్రమే అయ్యేది.

మొదటి పూజా దృశ్యంలో హరిశ్చంద్రుడు (రామారావు), చంద్రమతి (ఎస్. వరలక్ష్మి) భూమికలు వున్నవి. రెండవ సెట్టులో మాతంగి కన్యల చిత్ర సృష్టి- వారి విచిత్రమైన చేష్టలు చిత్రీకరించబడినవి. విశ్వామిత్రుడు (ముక్కామల) సృష్టించిన వెంటనే మాతంగి కన్యలు (రాజశ్రీ, మీనాకుమారి) ఏమన్నారు? అన్నది సినిమా సాహితీరంగానికే, త్రికాల త్రిలోకానికే దిగ్భ్రాంతి కలిగిస్తుంది. శ్రీ రమణారెడ్డి నక్షత్రకుడు, వీరబాహుడు రాజనాల, సంగీతం పెండ్యాల. తెలుగు వెర్షన్ ఛాయాగ్రహణ దర్శకుడు కమల్ ఘోష్.

దుర్యోధనుడిపై శకుని విజయం

మాధవీ పిక్చర్స్‌వారు "పాండవ వనవాసం"లో మరొకపాటను జులై మూడవ వారంలో సిద్ధపరిచారు. జులైలో జరిగిన షూటింగ్ షెడ్యూలులో ముఖ్యమైనది దుర్యోధన శిబిరం సెట్టు, వాహినీలో.

దుర్యోధనుడు (రంగారావు) ఘోషయాత్రలో పరాభవంపొంది, భీమార్జునుల చేత బంధవిముక్తుడై, వారి అనునయ వాక్యాలను సహించలేక శిబిరానికివచ్చి ప్రాయోపవేశం ఆరంభిస్తాడు. దుశ్శాసనుడు (మిక్కిలినేని), కర్ణుడు (ప్రభాకరరెడ్డి) ఎంత వారించినా, వాదించినా వినడు. ఇక శకుని (ముదిగొండ లింగమూర్తి) మామే తగినవాడని శకునిచేత చెప్పించి ఒప్పిస్తారు. శకుని ఉపాయమునకు అది పరీక్షవంటిది. శశిరేఖ, లక్ష్మణకుమారుల వివాహం జరిపించి పాండవ వర్గాన్ని ఛేదించాలని శకుని శక్తివంతమైన యుక్తి చెప్పేసరికి దుర్యోధనుడు తిరిగి పగసాధనకు ఉద్యమిస్తాడు.

లోగడ నాగరాజారావు, సి. ఎస్. ఆర్., ఆంజనేయులు శకునిగా నటించి కీర్తి గడించారు. అభినయంలోనే ఆ కుయుక్తుల తీవ్రత చూపించారు. ఇప్పుడు లింగమూర్తి సంభాషణనుకూడా దానికి జతపరిచారు. మాట విరుపులోనే శకుని దుశ్శక్తి వ్యక్తమయ్యేటట్లు చేశారు.

దుర్యోధనుడుగా రంగారావు నర్తనశాల కీచకుడిని మరపింపజేసేటట్టు నటిస్తున్నారు.

రచన సముద్రాల రాఘవాచార్య, దర్శకుడు కమలాకర కామేశ్వరరావు, నిర్మాత ఆంజనేయులు.

ఆంధ్ర ఫిలిం జర్నలిస్టుల సంఘం

జులై 16 వ తేదీన జరిగిన ఆంధ్రఫిలిం జర్నలిస్టులసంఘం సర్వసభ్యసమావేశంలో క్రింది నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది:

అధ్యక్షుడు: ఇంటూరి వెంకటేశ్వరరావు; ఉపాధ్యక్షుడు: టి. వి. చలపతిరావు; కార్యదర్శి: కొలను బ్రహ్మానందరావు; కోశాధికారి: రమణమూర్తి; సభ్యులు: బొమ్మకంటి సుబ్బారావు, గోటేటి శ్రీరామారావు, భూషణ్. వారు నలుగురిని కోఆప్ట్ చేసుకొంటారు.

సభా ప్రారంభంలో శ్రీ చెరుకువాడ నరసింహం మృతికి సంతాపం తెలుపుతూ రెండునిమిషాలసేపు నిశ్శబ్దం పాటించారు.

"దాగుడుమూతలు"

డి. బి. ఎన్. ప్రొడక్షన్స్‌వారి "దాగుడుమూతలు" రీ రికార్డింగ్‌కూడా పూర్తిఅయి విడుదలకు సిద్ధంచెయ్యబడుతున్నది. రామారావు పాత్రసృష్టి, నటన మరపురానివని, రష్‌సెస్ చూసిన వారంటున్నారు. నాయిక బి. సరోజాదేవి. ఛాయాగ్రహణం: పి. ఎల్. రాయ్, సంగీతం: మహదేవన్, దర్శకత్వం ఆదుర్తి సుబ్బారావు. రచన: ముళ్ళపూడి.



"మంచిమనిషి"లో తుంగభద్ర డామ్‌వద్ద జమున, రామారావు.

"సుమంగళి"

అశోకావారి "సుమంగళి" షూటింగ్ జులై మూడవ,నాల్గవ వారాలలో హైదరాబాద్ శ్రీ సారథి స్టుడియోస్‌లో కొనసాగింది. నాగేశ్వరరావు, సావిత్రి, గుమ్మడి మొదలైనవారు పాల్గొన్నారు. అగస్టు మధ్యలో చిత్రం సర్వసిద్ధం కాగలదు. దర్శకుడు: ఆదుర్తి, రచన: ఆత్రేయ, ఛాయాగ్రహణం: పి. ఎల్. రాయ్, అపరేటివ్ కెమెరామన్: కె. ఎస్. రామకృష్ణారావు, సంగీతం: కె. వి. మహదేవన్.

"మంచిమనిషి"

ఛాయాచిత్రావారు తమ తొలి తెలుగు చిత్రానికి "మంచి మనిషి" అని పేరు పెట్టారు. జులైలో ప్యాచ్‌వర్క్, ఔట్‌డోర్‌లో ఒక పాట చిత్రీకరణ జరిగింది. మరికొంత ప్యాచ్‌వర్క్ పూర్తిచేసి సెప్టెంబర్‌లోగా విడుదల చెయ్యగలరు. రామారావు, జమున ప్రధాన పాత్రలు ధరిస్తున్న ఈ చిత్రానికి ప్రత్యగాత్మ దర్శకుడు. రచన: పినిశెట్టి, సంగీతం: ఎస్. రాజేశ్వరరావు, టి. వి. చలపతిరావు, ఛాయాగ్రహణం: ఎమ్. కె. రాజు.

వాహినీలో వైడ్ స్క్రీన్ ఫ్లోర్

శ్రీ బి. నాగిరెడ్డిగారు వాహినీస్టుడియోలో వైడ్‌స్క్రీన్ చిత్రనిర్మాణానికని ఓ బ్రహ్మాండమైన ఫ్లోర్ నిర్మింపదలచారు. వేరొకవైపు కలర్‌చిత్రాలకు ప్రత్యేకంగా ఒక ఫ్లోర్ నిర్మించారు.

"రాముడు-భీముడు"ను తమిళంలో రంగులలో తీస్తున్నారు. ఎమ్. జి. ఆర్. నాయకుడు. మరికొన్ని తెలుగు చిత్రాలు కూడా తీయ తలపెట్టినట్లు తెలుస్తున్నది.

విజయగార్డెన్స్‌లోని థియేటర్‌లో తగు మార్పులుచేసి రీరికార్డింగ్‌కు గొప్ప మందిరం చెయ్యాలనికూడా సంకల్పించారు.

"నవరత్నఖడ్గ రహస్యం"

శ్రీ సాహితి ఫిలిమ్స్‌వారు "నవరత్న ఖడ్గ రహస్యం" అనే తెలుగు చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇందులో దేవిక, రాజశ్రీ, రాజనాల, నాగయ్య, పండరీబాయి, ఆనంద్, అశోకన్ మొదలగువారు నటించారు.

సంగీతం: మాస్టర్ వేణు. దర్శకత్వం: విశ్వనాథ్.

పెద్ద సెట్టింగులు, చక్కని ఔట్‌డోర్ దృశ్యాలు, కత్తియుద్ధాలుకాక పెద్దపులి-ఎలుగుబంటి పోరాటం దీనిలో ప్రత్యేకాకర్షణ.

ఈ చిత్రాన్ని ఆగష్టు మొదటివారంలో విడుదలచేయడానికి ఇంటర్నేషనల్ పిక్చర్సువారు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రాక్పశ్చిమ "సంగం"

ప్రతిచిత్రంలోను ఏదో ఒక సమకాలిక సమస్యను వ్యంగ్యధోరణిలో చిత్రీకరించే ఆర్. కె. ఫిలిమ్స్ రాజకపూర్ యీసారి సార్వజనీనమైన ప్రేమ - మైత్రి అనే సమస్యపై "సంగం" అనే హిందీచిత్రం తీశారు.

ఆర్. కె. సంప్రదాయానికి అలవాటుపడ్డ కళాభిమానులు ఒక సమస్యాచిత్రం చూడలేక పోయినందుకు చింతించవచ్చు. అయితే, ఈరోజు భారత టెక్నీషియనులు



విజయవాడ అగ్నిబాధితుల సహాయార్థం ఎన్. టి. రామారావు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డికి లక్షరూపాయల విరాళం చెక్కురూపంలో అందచేసినప్పటి చిత్రం

కూడ మరే ప్రపంచ రాజ్యంతో అయినా సరే సరితూగే టెక్నికల్ స్టాండర్డు చిత్రం తీయగలరని ఆర్. కె. చాటి చెప్పినందుకు, చూపినందుకు గర్వించని కళాభిమాని మాత్రం వుండడు. రొమాన్స్ అండ్ ఫ్రండ్‌షిప్, కథలో ప్రధానమైనందున ప్రేమకు సంబంధించినంతవరకు దాదాపు పాశ్చాత్య ఫక్కీలో పోయి, మైత్రికి సంబంధించినంతవరకు త్యాగము అనే ప్రాచ్య సంప్రదాయాన్ని పల్లకీయెక్కించి ప్రాచ్య, పాశ్చాత్యరీతులమేటిసమ్మేళనంగా "సంగం"ను రూపొందించగలిగిన రాజకపూర్ మేధకిదే మా జోహారు.

క్రీస్తుశకము 1964 ప్రథమార్థంలో భారత్ మడిగట్టుకు కూర్చొనలేదని, పాశ్చాత్యుల ఫక్కీలో భారతదేశమూ "రొమాంటిక్ సబ్జక్టుల"ను తీయగలదని ప్రపంచ సినిమాకు మన రాజకపూర్ నిరూపించారు. అయితే దురదృష్టవశాత్తు మన సెన్సార్ వారు చుంబనం వద్దంటారు కాబట్టి అది "సంగం"లో ఓ విదేశీయ జంటపై చిత్రించారు.

నవయువజంట ఏ ఆగ్రా "తాజ్"కో పోనవసరంలేదు; "సంగం"కు పోతేచాలు అన్నంతబాగా "లవ్" సీన్సును చిత్రించారు రాజకపూర్. ఆల్ప్స మంచుకొండలపై జంటను దొర్లించారుకూడా. ఇది కొంత హెచ్చుమోతాదే. భారతీయ చిత్రాలే చూచే వారికిది ఒకించుక ఎబ్బెట్టు కాగలదు కూడా.

ఇంగ్లండు, ఇటలీ, ఫ్రాన్సు, స్విట్జర్లెండులలో షూట్ చేసిన "సంగం"లో ఆర్. కె. (మున్నే భారతీయ చిత్రంలోను ఇటువంటి

ఆకర్షణలేదు) క్లయిమాక్స్ కూడా ఒక విదేశీ లొకేషన్‌లో సృష్టించి వుంటే చిత్రం యింకా రక్తికట్టేది.

పతాక సన్నివేశంలో ఒక మిత్రుడు ఇంకో మిత్రుడికోసం ఆత్మబలిదానం చేసుకొంటాడు. ఇది భారతీయ చిత్రాలలో సర్వసామాన్యమైనది. ఆర్. కె. చిత్రంలోనూ అదే వచ్చింది అంటే - అందులో బొంబాయిలో ఒక మేడగదిలో అది జరిగింది అంటే పిక్టోరియల్‌గా రంజులేదు. విదేశీ లొకేషన్‌లు కల ఆర్. కె. చిత్రంలో ఇది జరిగితే రంజు మరింత తగ్గినట్లుంటుంది. అందుచేత పతాక సన్నివేశాన్ని యెవ్వరూ ఊహించని విదేశ ప్రదేశంలో గొప్ప సినిమాటిక్ వాల్యూస్ కల స్థలంలో తీసివుంటే కథాసన్నివేశం మరింత బలపడేది.

నాలుగు గంటలసేపు చిత్రంచూచి బైటకు వచ్చినవారు ఆద్యంతం శహబాస్ అని వుండేవారు.

6346 మీటర్ల నిడివికల ఈ 24 రీళ్ళ చిత్రం రెండు విరామాలతో మొత్తం మూడు భాగాలుగా ఒకే "షో"లో ప్రదర్శించబడుతుంది మొదటి రెండుభాగాలు సర్వరంజకమైనవి.

మూడవ భాగంలో క్లయిమాక్స్ పైన పేర్కొన్న విధంగా వుండి వుంటే మొదటి రెండింటి అంతమనోజ్ఞంగానూ (మూడవ భాగం) వుండి వుండేది.

మనసులోని మాటను వెంటనే వెళ్ళగ్రక్కే స్వభావం సుందర్‌ది (రాజకపూర్). మనసులో మాటను దిగమ్రింగుకొనే స్వభావం సుందర్ ప్రాణమిత్రుడు గోపాల్‌ది (రాజేంద్రకుమార్). ఆ భావాలమధ్య నలిగిన భామ రాధ (వైజంతిమాల). గోపాల్‌ను ప్రేమించింది, అతని ప్రేమపాటను ప్రాణప్రదంగా భద్రపరచింది. గోపాల్‌ను రాధ ప్రేమించినట్లు తెలియని సుందర్ రాధను ప్రేమించాడు. ఆ సంగతి తెలిసిన గోపాల్ రాధను ప్రేరేపించి సుందర్ సతి చేస్తాడు. మరో ప్రపంచంలో మోహయాత్ర జరిపి బొంబాయికి తిరిగివచ్చిన జంటలో ఆ గోపాల్ ప్రేమపాట విభేదజ్వాలరేపింది. గోపాల్ రాధను ప్రేమించినట్లు తెలుసుకొన్న సుందర్ ఈసంగతి ముందే నాకు తెలిస్తే నేను వైదొలగివుండేవాణ్ణికదా అంటాడు. మరుక్షణంలో గోపాల్ రివాల్వర్ ప్రేల్చుకొని ఆ జంట గతుకుల ప్రేమ బాటనుంచి శాశ్వతంగా తప్పుకుంటాడు.

టూకీగా రంగుల "సంగం" కథ అది. ఇన్‌డోర్‌కంటె ఔట్‌డోర్ రంగులు బాగున్నాయి.

ప్రతి చిత్రంలో క్లైమ్‌లాప్స్ ఒకవిధంగా ఉంటుంది. సంగంలో "టాయ్‌ప్లేన్" "ఏరోప్లేన్" కావడం చూస్తారు.

ప్రతి చిత్రంతో లవ్ ట్రయాంగల్ మూడు లొకేషన్‌లుకలిపిచూస్తే కానికంటికి అంటదు. "సంగం"లో రాజకపూర్ "అకార్డియన్" వాయిస్తున్న విందు సన్నివేశంలో పాత్రలను త్రికోణంలో నిలబెట్టే ఎస్టాబ్లిష్ చెయ్యడం చూస్తారు.

భారతీయుల దృష్టిలో ఫ్రెంచి ఫాలీస్ నృత్యం ఎలా వుంటుందో వైజయంతి నిరూపించిన తీరు విశేషం. ఇలా వర్ణించుకుపోతే భారత మౌతుంది. ఒక్కముక్కలో, సాధారణ కథపై అసాధారణ కల్పనే "సంగం" అంటే బాబు. 000

JYOTI AUGUST '64 Regd. No. A.368

